

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 139

శుక్రవారం 3-2-2023



ఆస్ట్రేలియా సాధన షురూ

ఈ నెల 9న ఆసీస్‌తో తొలి టెస్టు ఆడనున్న టీమిండియా - 13లో



'మాలీ' కాలింగ్

మలయాళ సినీ బాట పట్టిన పాపులర్ నటీమణులు - 12లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'హిండెన్‌బర్గ్' ప్రకంపనలు

అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికపై తక్షణమే చర్చించాలంటూ పార్లమెంట్‌లో విపక్షాలు డిమాండ్ చేశాయి.

వివరాలు 6లో ▶



సుదీర్ఘ పోరాటం చేశా

ఉత్తరప్రదేశ్ జైల్లో రెండేళ్లకు పైగా ఉన్న కేరళ జర్నలిస్టు సిద్దిఖ కప్పన్ ఎట్టకేలకు బెయిల్‌పై బయటకు వచ్చారు.

వివరాలు 6లో ▶



బైడెన్ సర్కార్‌లో ఎన్నారైల హవా

ఇండియన్ అమెరికన్లు ప్రమీలా జయపాల్, అమి బేరా, రాజాకృష్ణమూర్తి, రో ఖన్నాలకు అమెరికా హౌస్ కమిటీల్లో పదవులు దక్కాయి.

వివరాలు 6లో ▶



అవమానాలు.. నిరాదరణ

విశ్వసుందరి పోటీలప్పుడు తనను అందరూ దూరం పెట్టారని, ఉక్రెయిన్ భామకే ప్రాధాన్యమిచ్చారని అన్నాలిన్నికోవా(రష్యా) ఆరోపించారు.

వివరాలు 6లో ▶



ఈడీ చార్జిషీట్‌లో

కేజ్రీవాల్

- లిక్కర్ స్కామ్ అనుబంధ చార్జిషీట్‌లో ఢిల్లీ ముఖ్యమంత్రి పేరు చేర్చిన ఈడీ
- ఎమ్మెల్సీ కవిత, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్లు ప్రస్తావన

6 లో

ఈడీ కేసులన్నీ ఫేక్: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఈడీ తనపై నకిలీ కేసు నమోదు చేసిందని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆక్షేపించారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాల్లో ప్రభుత్వాలను అప్రతిష్టపాలు చేయడానికి, కొత్త ప్రభుత్వాలను ఏర్పాటు చేయడానికి దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటున్నారని మండిపడ్డారు. బీజేపీ హయాంలో ఈడీ 5,000 చార్జిషీట్లు దాఖలు చేసిందని, ఇవన్నీ నకిలీవేనని దుయ్యబట్టారు.

ఓ శంకరాభరణం, ఓ సిరిసిరి మువ్వ, ఓ సిరివెన్నెల, ఓ స్వాతి ముత్యం, ఓ శుభసంకల్పం.. తెలుగు సినీరంగానికి ఇలాంటి ఎన్నో ఆణిముత్యాల్లాంటి చిత్రాలనిచ్చిన దర్శక దిగ్గజం, రచయిత, నటుడు, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, కళా తపస్వి కె.విశ్వనాథ్‌గా ప్రఖ్యాతిగాంచిన కాశీనాథుని విశ్వనాథ్ (92) కన్నుమూశారు. ఆయనకు విశ్వవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టిన శంకరాభరణం సినిమా విడుదలయినది కూడా ఇదే రోజు... ఫిబ్రవరి 2. 1930 ఫిబ్రవరి 19న జన్మించిన విశ్వనాథ్.. 50కి పైగా సినిమాలకు దర్శకత్వం వహించారు.



వినువీధికి విశ్వనాథుడు

అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన కళా తపస్వి

- ఆస్పత్రి నుంచి హైదరాబాద్ ఫిలింనగర్‌లోని స్వగృహానికి భౌతికకాయం తరలింపు
- సినీ, రాజకీయరంగ ప్రముఖుల దిగ్భ్రాంతి
- విశ్వనాథ్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె
- స్వస్థలం ఉమ్మడి గుంటూరు జిల్లా పెద్దపులివర్రు
- శంకరాభరణం విడుదల రోజే తుదిశ్వాస

సాక్షి, హైదరాబాద్: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సినీ దర్శక దిగ్గజం కె. విశ్వనాథ్ హైదరాబాద్‌లో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి 11 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. వయోభారం వల్ల ఆయన ఈ మధ్య కాలంలో పలుమార్లు ఆస్పత్రిలో చేరినా కోలుకుని తిరిగి వచ్చారు. అయితే 2 రోజుల క్రితం ఆయన తిరిగి అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. ఎప్పటిలాగే తిరిగొస్తారని కుటుంబసభ్యులు, అభిమానులు, చిత్ర పరిశ్రమకు

మిగతా 2వ పేజీలో ▶

2 లో

సినీ రంగానికి

తీరని లోటు

కళాతపస్వి మృతిపై సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

తెలుగు సినిమా 'ఆత్మగౌరవం'!

ఆ కథ.. తీరని వ్యథ

ఇనుమడించిన పల్లెటూరు ప్రతిష్ట

విద్యాకానుక కింద ఇచ్చే బ్యాగ్‌ను పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్



శ్రద్ధ వహిస్తేనే.. సత్ఫలితాలు

పాఠశాల విద్యపై సమీక్షలో సీఎం జగన్

- విద్యా కానుక వస్తువుల్లో నాణ్యతపై రాజీ పడొద్దు
- విద్యా సంవత్సరం మొదలయ్యే నాటికే కిట్లు స్కూళ్లకు చేరాలి
- నాడు–నేడు పూర్తయిన స్కూళ్లలో డిజిటల్ తరగతులు
- 3వ తరగతి నుంచి అన్ని క్లాసులు, సెక్షన్లలో ఐఎఫ్‌పీలు
- సబ్జెక్టు టీచర్లతో బోధనపై మరింత శ్రద్ధ
- ప్రపంచంతో పోటీ పడేలా విద్యార్థుల్లో ఇంగ్లిష్ ప్రావీణ్యం
- టోఫెల్ (ఈటీఎస్), కేంబ్రిడ్జి లాంటి సంస్థల సహకారంతో శిక్షణ
- ఇంగ్లిష్ సామర్థ్యాన్ని పెంచేందుకు టీచర్లకూ తగిన ట్రెయినింగ్
- మార్చి 2 నుంచి వారంలో 3 రోజులు బ్రేక్‌ఫాస్ట్‌గా రాగి మాల్ట్

10 లో

మేడారంలో ప్రత్యేక పూజలు

ఎస్‌ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్‌ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క, సారలమ్మ మినీ జాతర గురువారం రెండో రోజుకు చేరింది. బుధవారం మండమెలిగె పండుగతో జాతర ప్రారంభం కాగా.. రెండో రోజు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మేడారం, కన్నెపల్లి ఆదివాసీలు, గ్రామస్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క సారలమ్మ పూజారులు వారి ఇళ్లలో కూడా అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి జంపన్నవాగు వద్ద స్నానాలు ఆచరించారు. గద్దెల ప్రాంగణంలో మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి మొదలైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది.



సైబర్ ఉచ్చు.. సరికొత్త చిక్కు!

రోజురోజుకూ పెరిగిపోతున్న ఆన్‌లైన్ మోసాలు	కొంగొత్త పద్ధతుల్లో కొల్లగొడుతున్న నేరగాళ్లు	అత్యాశ, బలహీనతల ఆధారంగా బురిడీ
సెక్స్‌టార్షన్‌కు చిక్కి కొందరు విలవిల..	టూర్ ప్యాకేజీలు, ఆఫర్ల వలలో మరికొందరు	అవగాహన, అప్రమత్తతే ముఖ్యమంటున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ తర్వాత ఇంటర్నెట్ వాడకం, అన్ని రకాల సేవలు ఆన్‌లైన్‌లోనే పొందడం పెరిగినట్టుగానే, వాటిని ఆధారంగా చేసుకుని జరిగే సైబర్ నేరాలూ గణనీయంగా పెరిగాయి. ఎప్పటికప్పుడు కొత్త పద్ధతుల్లో నేరగాళ్లు బురిడీ కొట్టిస్తున్నారు. ఈ ఏడాదిలో మరికొన్ని కొత్త సైబర్ నేరాలు తెరపైకి రావచ్చని సైబర్ సెక్యూరిటీ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే సైబర్ నేరాలు కేవలం ఆర్థిక నష్టాన్ని కలిగించడమే కాకుండా సామాజిక జీవితంపై కూడా ప్రభావం చూపుతున్నాయి. దేశ ఆర్థిక, సామాజిక భద్రతకూ ముప్పుగా పరిణమిస్తున్నాయి. గతంలో ఐటీ, బ్యాంకింగ్, ఎయిర్‌లైన్స్, పవర్‌గ్రిడ్ వంటి వ్యవస్థల్లో గమనించగా..ఇప్పుడు అన్ని రంగాలనూ ప్రభావితం చేసే స్థాయికి వెళ్లాయి. నిత్యజీవితంలో ప్రతి అంశానికి ఇప్పుడు సైబర్ దాడుల ముప్పు ఉందని నిపుణులు చెబుతున్నారు. కాస్త అవగాహన, అప్రమత్తతతో వ్యవహరిస్తే వీటికి కళ్లెం వేయొచ్చునని అంటున్నారు. ప్రస్తుతం తెలంగాణ, ఏపీల్లో ముఖ్యంగా మూడు రకాలైన మోసాలు జరుగుతున్నాయి. అవేంటో ఓసారి చూద్దాం..

2022లో నమోదైన కొన్ని నేరాలు పరిశీలిస్తే..


- కొన్ని ఈ మెయిల్స్‌పై క్లిక్ చేయగానే అవి ఫిషింగ్ వెబ్‌సైట్ల (సైబర్ నేరగాళ్లవి)లోకి వెళ్లేలా చేస్తాయి. వెబ్‌సైట్లలో ఫేక్ కస్టమర్ కేర్ నంబర్లు పెడతారు. ఏదైనా సాయం కోసం వాటికి కాల్ చేసిన వారిని ఎనీడెస్క్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకునేలా చేసి డేటాను చోరీ చేస్తారు.
- పలు ప్రముఖ ఫాస్ట్ ఫుడ్ ఫ్రాంచైజీల పేరిట ఫేక్ వెబ్‌సైట్లను పెట్టి, వాటిలో భారీ డిస్కౌంట్లపై ఫుడ్ అందజేసే పేరిట మోసగిస్తారు.
- ఆదాయ పన్ను ఫైల్ చేయాలంటూ నకిలీ ఇన్‌కమ్ ట్యాక్స్ వెబ్‌సైట్ లింకులను పంపుతారు. వాటి నుంచి కస్టమర్ల డేటాను, అవతలి వాళ్లు అమాయకులైతే డబ్బులు కొల్లగొడతారు.
- ఉచితంగా కోవిడ్ పరీక్షల పేరిట ముందుగా కొంత మొత్తం చెల్లించాలని చెప్పి, తర్వాత రిమోట్ యాక్సెస్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుంటే మీ డబ్బు మీకు వాపస్ అంటూ మోసగిస్తారు.
- ఓఎల్‌ఎక్స్ వంటి వెబ్‌సైట్లలో మిలిటరీ, ఇతర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల్లా నకిలీ ఐడీ కార్డులు అప్‌లోడ్ చేసి వస్తువుల కొనుగోలు, అమ్మకాల పేరిట బురిడీ కొట్టిస్తున్నారు.
- ఎక్కువ విదేశీ ఖాతాలకు పెద్ద మొత్తాలు పంపే వ్యాపార కంపెనీలు, వ్యాపారవేత్తలను టార్గెట్‌గా చేసుకుని మోసాలు (బిజినెస్ ఈ–మెయిల్ కాంప్రమైజ్ (బీఈసీ) చేస్తున్నారు. సోషల్ ఇంజనీరింగ్ టెక్నిక్‌లు లేదా కంప్యూటర్ ఇన్‌స్ట్రక్షన్ టెక్నిక్‌లు వాడి బిజినెస్ ఈ మెయిల్స్‌ను హ్యాక్ చేస్తున్నారు.

సెక్స్‌టార్షన్

నేర విధానం: నగ్నంగా ఉండి (ముఖ్యంగా యువతులు) వీడియోకాల్స్ చేస్తారు. మాటల్లోకి దించి రెచ్చగొడతారు. వీడియో సంభాషణలన్నీ రికార్డ్ చేస్తారు. మనం వారి వలల్లో చిక్కుకున్నామని భావించిన తర్వాత వాటిని సోషల్ మీడియాలో పెడతామంటూ బెదిరింపులకు దిగి, ఆన్‌లైన్‌లో డబ్బులు కొల్లగొడతారు. చాలామంది ఈ విధమైన మోసాల్లో చిక్కుకుంటున్నారు.

ఏం చేయాలి:

- అపరిచిత నంబర్ల నుంచి వచ్చే వీడియోకాల్స్‌ను లిఫ్ట్ చేయకూడదు.
- సోషల్ మీడియా ఖాతాల్లో ప్రొఫైల్, ఫొటోలను లాక్ (కన్పించకుండా) చేయాలి. మ్యూచువల్ ఫ్రెండ్స్ పేర్లు కూడా కన్పించకుండా చేయాలి.
- ఏదైనా పరిస్థితుల్లో సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నా, బాధితులుగా మారినా భయపడొద్దు. వెంటనే మీ సోషల్ మీడియా ఖాతాను తాత్కాలికంగా డీ యాక్టివేట్ చేయాలి.



తక్షణమే ఫిర్యాదు చేయాలి

సైబర్ నేరగాళ్ల చేతిలో ఏ విధంగా మోసపోయినా, వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో, టోల్‌ఫ్రీ నంబర్ 155260 లేదా 1930లో, 'www.cybercrime.gov.in' వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలి.

పర్యాటకం పేరిట..

నేర విధానం: జంగిల్ సఫారీ, పుణ్యక్షేత్రాల సందర్శనకు హెలికాప్టర్ ప్రయాణాల పేరిట మోసస్తారు. కోవిడ్ తగ్గిన తర్వాత పుణ్యక్షేత్రాల సందర్శన, విహారయాత్రలు పెరిగాయి. దీన్ని అవకాశంగా తీసుకుని పర్యాటకుల్ని సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేస్తున్నారు. వివిధ ఆకర్షణీయమైన టూర్ ప్యాకేజీలు, ఆఫర్ల పేరిట ఆకర్షిస్తున్నారు. ఆన్‌లైన్‌లో డబ్బులు కాజేసిన తర్వాత కానీ అలాంటి సంస్థలేవీ లేవని తెలియడం లేదు.

ఏం చేయాలి:

- బ్యాంకు లావాదేవీలైనా సరే ఆన్‌లైన్‌లో చేసేటప్పుడు ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలి.
- అనుమానాస్పద వెబ్‌సైట్ల జోలికి అస్సలు వెళ్లకూడదు. ఊరూపేరూ లేని వెబ్‌సైట్లలో యాత్రలు బుక్ చేసుకోకూడదు. అన్నీ ఖచ్చితంగా నిర్ధారించుకున్నాకే ముందుకెళ్లాలి. రాష్ట్ర ప్రభుత్వాల అధికారిక టూరిజం వెబ్‌సైట్లలో బుక్ చేసుకోవడం ఉత్తమం.
- ఒకవేళ సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్టు గుర్తిస్తే.. 24గంటల లోపే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అలాచేస్తే నేరగాళ్లు కొట్టేసిన సొమ్మును బ్యాంకులు ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుంది.

కోవిడ్ వ్యాక్సిన్, ఎన్నికల సర్వేలు, రివార్డ్‌లు

నేర విధానం: ఇటీవలి కాలంలో నేరగాళ్లు కోవిడ్ వ్యాక్సిన్ సర్వే, ఎన్నికల సర్వేలో పాల్గొని రివార్డులు గెలుచుకోండి అంటూ కొన్ని లింక్‌లను పంపుతున్నారు. రివార్డులనగానే చాలామంది ఆకర్షితులవుతున్నారు. వాటిపై క్లిక్ చేస్తే మన సమాచారం అంతా వారికి చేరిపోయేలా, లేదంటే మన మొబైల్ ఫోన్లలో రిమోట్ యాక్సెస్ యాప్‌లు ఇన్‌స్టాల్ అయ్యేలా చేస్తున్నారు.

అవగాహన:

- అనుమానాస్పద ఎస్ఎంఎస్ లింక్‌లను (దీనిని స్మిషింగ్ అంటాం) క్లిక్ చేయకూడదు.
- వాయిస్ కాల్స్ (విషింగ్) అటెండ్ చేయవద్దు. అనుమానాస్పద నంబర్లను వెంటనే బ్లాక్ చేయాలి.



2,37,658 ఫిర్యాదులు

కేంద్ర హోంశాఖ అధికారిక మ్యాగజైన్ ‘సైబర్ ప్రవాహ్’ ప్రకారం సైబర్ నేరాలకు సంబంధించి కొన్ని ప్రధాన అంశాలు ఇలా ఉన్నాయి.

- నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ) సమాచారం ప్రకారం 2022 ఏడాది రెండో త్రైమాసికం వరకు సైబర్ నేరాలపై 2,37,658 ఫిర్యాదులు అందాయి.
- ఎన్‌సీఆర్‌పీలో ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు 7.08 లక్షల మంది సైబర్ నేరగాళ్ల వివరాలను సేకరించి డేటాబేస్ రూపొందించారు.
- సైబర్ నేరగాళ్లు కొట్టేసిన రూ.95 కోట్లను వారి ఖాతాల్లోకి చేరకుండా సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్స్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీఎఫ్‌సీఎఫ్ఆర్ఎంఎస్) కింద బ్యాంకులు ఆ డబ్బును నిలిపివేసాయి.
- సైబర్ దోస్త్ ట్విట్టర్ ఖాతా ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పించేలా ఇప్పటి వరకు 1,263 ట్వీట్లను అధికారులు షేర్ చేశారు. ఈ ట్విట్టర్ ఖాతాను 3.97 లక్షల మంది ఫాలో అవుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి..

- డబ్బులపై ఆశ, బలహీనతల కారణంగానే ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ముఖ్యంగా యువత అందునా విద్యార్థులు మోసపోతున్నారు. మనం లాటరీలో పాల్గొనకుండా, ఎలాంటి బహుమతీ రాదని గుర్తించాలి.
- ఈమెయిల్స్, సోషల్ మీడియా ఖాతాలకు ‘టూ ఫ్యాక్టర్ అథంటికేషన్’(పాస్‌వర్డ్‌తో పాటు ఓటీపీ వచ్చేలా) పెట్టుకోవాలి.
- వెబ్‌సైట్లలో మీ యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌లు సేవ్ చేసుకోవద్దు.
- మీ పిల్లల సోషల్ మీడియా ఖాతాల్లో మీరు కూడా ఫ్రెండ్‌గా ఉండడం ఉత్తమం. ఆన్‌లైన్‌లో పిల్లలు ఎవరితో స్నేహాలు చేస్తున్నారో గమనిస్తుండాలి.


క్లిక్ చేయొద్దు.. డౌన్‌లోడ్ వద్దు

మనకు వచ్చే ఎస్ఎంఎస్‌లు, ఈ మెయిల్స్‌లో అనుమానాస్పద యూఆర్ఎల్, వెబ్ యూఆర్ఎల్ ఉంటే వాటిపై క్లిక్ చేయవద్దు. అలాగే మనకు తెలియని ఈమెయిల్ ఐడీల నుంచి వచ్చే లింక్‌లు, అటాచ్‌మెంట్లు డౌన్‌లోడ్ చేయవద్దు. సోషల్ మీడియాలో వచ్చే యాడ్స్‌ను నమ్మకండి.

– ప్రసాద్ పాటిబండ్ల, సైబర్ ఇంటెలిజెన్స్ నిపుణులు, న్యూఢిల్లీ







1. తేనెమనసులు సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా కె. విశ్వనాథ్
2. 'స్వాతిముత్యం' సినిమా షూటింగ్‌లో కమల్‌హాసన్‌కు సూచనలిస్తూ..
3. విశ్వనాథ్ దర్శకత్వం వహించిన శంకరాభరణంలోని ఓ సన్నివేశం

తెలుగు సినిమా 'ఆత్మగౌరవం'!

సౌండ్ రికార్డిస్టుగా మొదలై కళా తపస్విగా కె.విశ్వనాథ్ ప్రస్థానం

- 1965లో 'ఆత్మగౌరవం'తో దర్శకుడిగా..
- ఆదుర్తి సుబ్బారావు శిష్యరికంలో మెళకువలు
- శంకరాభరణం సినిమాతో విశ్వవ్యాప్త కీర్తి
- ఎన్నో వెండితెర కళాఖండాలను చెక్కిన దర్శక ధీరుడు
- నంది నుంచి దాదాసాహెబ్ ఫాల్కే దాకా ఎన్నో అవార్డులు, రివార్డులు

ఎంతటి గంగా ప్రవాహమైనా గంగోత్రి లాంటి ఓ పవిత్ర స్థానంలో చిన్నగా, ఓ పాయలా మొదలవుతుంది. వెండితెరపై శంకరాభరణం, సాగర సంగమం వంటి ఎన్నో కళాఖండాలను సృజించిన కళాతపస్వి కె.విశ్వనాథ్ దర్శకత్వ ప్రయాణం కూడా అలాగే ఓ చిన్న పాయలా మొదలైంది. సౌండ్ రికార్డిస్టుగా మొదలై.. దర్శకత్వ శాఖకు విస్తరించిన విశ్వనాథ్ 1965లో తొలిసారిగా 'ఆత్మగౌరవం' సినిమాతో మెగాఫోన్ పట్టుకున్నారు. నాటి నుంచి ఐదున్నర దశాబ్దాలకుపైగా వెండితెర అద్భుతాలను అందించారు. తొలితరంలో గూడవల్లి రామబ్రహ్మం, బీఎన్ రెడ్డి, కేవీ రెడ్డి, మలితరంలో ఆదుర్తి సుబ్బారావు తదితరుల తర్వాత మూడో తరంలో తెలుగు సినిమాకు 'ఆత్మగౌరవం' తెచ్చిన దర్శక కళాతపస్వి కాశీనాథుని విశ్వనాథ్.

వాహినీ స్టూడియోలో సౌండ్ రికార్డింగ్ విభాగంలో కెరీర్‌ను ప్రారంభించి బీఎన్ రెడ్డి, కేవీ రెడ్డి, ఆదుర్తి సుబ్బారావు వంటి వారి పనితీరును దగ్గరగా పరిశీలిస్తూ వచ్చిన కె.విశ్వనాథ్ స్క్రిప్టులో తోచిన సలహాలు, సూచనలు ఇస్తుండేవారు. ఈ క్రమంలో ఆదుర్తి తన సినిమాలకు స్క్రిప్ట్ అసిస్టెంట్‌గా, అసోసియేట్‌గా పనిచేసే అవకాశం ఇచ్చారు. అలా కథా విస్తరణ, స్క్రీన్ ప్లే రచనలో విశ్వనాథ్‌కు ఉన్న ప్రతిభను గుర్తించి తమ అన్నపూర్ణా పిక్చర్స్ సంస్థలో దర్శకత్వ శాఖలోకి రమ్మని హీరో అక్కినేని నాగేశ్వరరావు ప్రోత్సహించారు. మొదట తటపటాయించినా, తర్వాత అన్నపూర్ణా పిక్చర్స్‌లో చేరారు. ఇలా కె.విశ్వనాథ్ సినీ జీవితం ఊహించని మలుపు తిరిగింది.

ఆ పాటల పల్లవులు విశ్వనాథ్‌వే

విశ్వనాథ్‌లో బాహ్య ప్రపంచానికి తెలియని ఓ అద్భుత సినీ గీత రచయిత ఉన్నారు. ఆదుర్తి దగ్గర సహాయకుడిగా ఉన్న రోజుల్లో గీత రచయితలతో పాటలు రాయించుకుంటున్నప్పుడు సైతం వారికి తన ఇన్‌పుట్స్‌గా పాటల పల్లవులు అందించేవారు. 'డమ్మీ లిరిక్స్.. అబద్ధపు సాహిత్యం' అంటూ ఆయన ఇచ్చిన పల్లవులే.. తలమానికమైన ఎన్నో సినీ గీతాలకు కిరీటాలయ్యాయి. 'ఆత్మగౌరవం'లో 'మా రాజులొచ్చారు..', 'అందెను నేడే..' పాటల పల్లవులు విశ్వనాథ్ రాసినవే. ఆ పదాలకు మరింత సొబగులద్దీ రచయితలు మిగతా పాటంతా అద్భుతంగా అల్లడం విశేషం.



నాటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతుల మీదుగా దాదాసాహెబ్‌ఫాల్కే అవార్డు అందుకుంటున్న కె.విశ్వనాథ్

అవకాశం కోసం వేచి చూస్తూ..



స్వతహాగా సృజనశీలి అయిన విశ్వనాథ్.. ఆదుర్తి శిష్యరికంలో మరిన్ని మెరుగులు దిద్దుకున్నారు. కథ, స్క్రీన్‌ప్లే రచన, సెకండ్ యూనిట్ డైరెక్షన్.. ఇలా విశ్వనాథ్ చేయనిది లేదు. నిజానికి ''అన్నపూర్ణాలో రెండు సినిమాలకు ఆదుర్తి గారి దగ్గర దర్శకత్వ శాఖలో వర్క్ చేసిన తర్వాత నాకు రెండు సినిమాలకు డైరెక్షన్ చాన్స్ ఇస్తామని మాటిచ్చారు. కానీ నాలుగు చిత్రాలకు (వెలుగు నీడలు, ఇద్దరు మిత్రులు -1961; 'చదువుకున్న అమ్మాయిలు -63; 'డాక్టర్ చక్రవర్తి'-64) వర్క్ చేశాకే ఐదో సినిమా దుక్కిపాటి మధుసూదనరావు నిర్మించిన 'ఆత్మగౌరవం'తో మెగాఫోన్ నా చేతికిచ్చారు. 'పూలరంగడు' సినిమాకూ నేనే దర్శకత్వం వహించాల్సింది. మొదట నాతో స్క్రిప్టు వర్క్ వగైరా చేయించారు. అనుకోని కారణాల వల్ల మా గురువు ఆదుర్తి గారే డైరెక్ట్ చేస్తున్నారన్నారు. ఏమైతేనేం 'ఆత్మగౌరవం'తో దర్శకుడినయ్యా'' అని కె.విశ్వనాథ్ ఒక సందర్భంలో గుర్తుచేసుకున్నారు. 'ఆత్మగౌరవం'కి డైరెక్షన్ ఛాన్స్ ఇచ్చే ముందు.. దుక్కిపాటి గట్టిగా పట్టుబట్టడంతో కె.విశ్వనాథ్ కాపురాన్ని హైదరాబాద్‌కు మార్చాల్సి వచ్చింది. ట్యాంక్ బండ్ దగ్గర గగన్ మహల్ కాలనీలో రెండేళ్లు చిన్న అద్దె ఇంట్లో గడిపారు.

పబ్లిక్ గార్డెన్స్ చెట్ల నీడలో.. ఖాళీ అద్దం షాట్‌లో..

అన్నపూర్ణా వారి అన్ని సినిమాలలానే 'ఆత్మగౌరవం' సినిమా కథ కోసం పలువురు రచయితలతో కలసి దర్శక, నిర్మాతలు మేధోమథనం జరిపారు. నాటక రచయిత గొల్లపూడి మారుతీరావు, నవలా రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి, మరికొందరు కలసి హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్ చెట్ల నీడల్లో పచ్చిక బయళ్లలో కూర్చొని కథా చర్చలు, ఆలోచనలు చేశారు. సంగీతాభిరుచి ఉన్న విశ్వనాథ్ మద్రాసు వర్క్ బిజీకి దూరంగా రచయితలు, సంగీత దర్శకుడిని హైదరాబాద్ రప్పించి, ఇక్కడ మ్యూజిక్ సిట్టింగ్స్ జరిపారు. హైదరాబాద్ సారథీ స్టూడియోలో షూటింగ్ ముహూర్తం. తొలి షాట్ చిత్రీకరణ తమాషాగా సాగింది. సంప్రదాయ శైవ కుటుంబంలో పుట్టిన విశ్వనాథ్ ఇంట్లో అంతా పరమ దైవభక్తులు. నిర్మాత దుక్కిపాటి నాస్తికుడు. తొలి షాట్ దేవుడి పటాల మీద తీసే అవకాశం లేదు. చివరకు అద్దం సాక్షాత్తూ లక్ష్మీదేవి స్వరూపమని విశ్వనాథ్ తెలివిగా ఫస్ట్ షాట్ ఖాళీగా ఉన్న అద్దం మీద పెట్టారు. క్షణమాగి అద్దంలో ప్రతిబింబంగా అక్కినేని ఫ్రేములోకి వచ్చి డ్రెస్ సర్దుకుంటారు. ఇలా అద్దం మీద నుంచి హీరో అక్కినేని మీదకు వచ్చేలా కెమెరామ్యాన్ సెల్వరాజ్‌తో కలసి విశ్వనాథ్ వేసిన ప్లాన్ అద్భుతంగా ఫలించింది. విశ్వనాథ్ సెంటిమెంట్ నిలిచింది. నిర్మాతకూ ఇబ్బంది లేకుండా పోయింది. అద్దం మీద మొదలైన విశ్వనాథ్ దర్శకత్వ ప్రస్థానం అపూర్వంగా ముందుకు సాగింది.

'మెరిసే మెరుపులు మురిసే పెదవుల చిరుచిరు నవ్వులు కాబోలు.. ఉరిమే ఉరుములు సరిసరి నటనల సిరిసిరి మువ్వలు కాబోలు..' అంటూ శంకరుడిని ప్రార్థించిన తీరు ప్రేక్షకుల ఆనంద వృష్టిని తడిపింది. 'పంచ భూతములు ముఖ పంచకమై.. ఆరు రుతువులు ఆహార్యములై.. నీ దృక్కులే అటు అష్ట దిక్కులై.. నీ వాక్కులే నవరసమ్ములై..' అంటూ ఉగ్రూతలూగించిన తీరు అజరామరం. 'కనుల కొలనులో ప్రతిబింబించిన విశ్వరూప విన్యాసం..' చూపడంలో మీ శైలికి సెల్యూట్. తెలుగు సినిమా ఉత్తుంగ తరంగంలా ఎగిసి పడేలా చేయడంలో మీ తర్వాతే ఎవరైనా. మీ గురించి మేమెంత చెప్పినా, అవి మీకు కొత్తగా కిరీటాలేమీ పెట్టవు. ఆకాశమంత మీ నిబద్ధతకు అరచెయ్యంత అద్దం ఈ మాటలు. మీరు నింగికెగిసినా మా కళ్లముందుంచిన ఆ అపురూప దృశ్యకావ్యాల్లో అనునిత్యం మీరు కనిపిస్తూనే ఉంటారన్నది అక్షర సత్యం.

అవార్డులకు కేరాఫ్ అడ్రస్

మునుపెన్నడూ రామప్ప గుడికి వెళ్ళకపోయినా, ఆ పరిసరాలు బాగుంటాయని దుక్కిపాటి, గొల్లపూడి, సెవన్ స్టార్స్ సిండికేట్ సాంస్కృతిక సంస్థ శాండిల్య బృందం చూసొచ్చి చెప్పడంతో, అక్కడకు వెళ్ళి మరీ షూటింగ్ చేసినట్టు విశ్వనాథ్ చెప్పారు. రామప్ప గుడిలోనే దాశరథి రాసిన 'ఒక పూలబాణం..' చిత్రీకరించారు. 1965 చివరలో సెన్సార్ జరుపుకొన్న 'ఆత్మగౌరవం' ఆ మరుసటేడు రిలీజైంది. ప్రజాదరణ పొందింది, విజయవాడ లాంటి చోట్ల శత దినోత్సవం చేసుకుంది. దర్శకుడిగా విశ్వనాథ్ ప్రతిభా సామర్థ్యాలు ధ్రువపడిపోయాయి. తొలి చిత్రం నుంచి ఇప్పటి దాకా ఓ నాలుగైదు మినహా విశ్వనాథ్ రూపొందించిన చిత్రాలన్నీ నందులో, జాతీయ అవార్డులో ఏవో ఒకటి అందుకున్నవే! స్వయంగా కె. విశ్వనాథ్ సైతం కళాప్రపూర్ణ, రఘుపతి వెంకయ్య అవార్డు, పద్మశ్రీ పురస్కారం, సినీరంగంలో ఇచ్చే అత్యున్నత దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు – ఇలా ఎన్నో శిఖరాలు అధిరోహించారు. ఈ 55 ఏళ్ళ దర్శకత్వ ప్రస్థానంలో తెలుగుతెరకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో అమితమైన ఆత్మగౌరవం తెచ్చారు.

తొలి చిత్రంతోనే అవార్డుల వేట


కె.విశ్వనాథ్ నిర్మించిన తొలి చిత్రం 'ఆత్మ గౌరవం' 1965లో ఉత్తమ తృతీయ చిత్రంగా కాంస్య నంది అవార్డును గెల్చుకుంది. ఇదే చిత్రానికి ఉత్తమ నటుడిగా అక్కినేని నాగేశ్వరరావు, ఉత్తమ కథా రచయితలుగా గొల్లపూడి, యద్దనపూడి నంది అవార్డులు అందుకున్నారు. ఇలా తొలి చిత్రంతోనే విశ్వనాథ్ అవార్డు చిత్రాల దర్శకుడిగా తన అప్రతిహత ప్రయాణానికి నాంది పలికారు. అప్పటి అగ్ర హీరోలు ఎన్టీఆర్‌తో నాలుగు, ఏఎన్నార్‌తో రెండు సినిమాలు తీశారు. 'శంకరాభరణం' సినిమాతో శిఖరాగ్రానికి చేరుకున్నారు. తెలుగులో తొలి మహిళా కొరియోగ్రాఫర్‌గా సుమతీ కౌశల్‌కు కె.విశ్వనాథ్ అవకాశం ఇచ్చారు.



గురువు ఆదుర్తి సుబ్బారావుతో...



సాగర సంగమం షూటింగ్‌లో...



స్వయంకృషి చిత్రీకరణ సమయంలో నిర్మాత ఏడిద నాగేశ్వరరావు, చిరంజీవితో...

సినీ రంగానికి తీరని లోటు

కళాతపస్వి విశ్వనాథ్ మృతిపై సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి: ప్రముఖ సినీ దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్ మహాభినిష్క్రమణం తెలుగు సినీ రంగానికి తీరని లోటు అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలుగు సినీ దర్శకుల్లో విశ్వనాథ్ అగ్రగణ్యుడని కొనియాడారు. తెలుగు సంస్కృతికి, భారతీయ కళలకు తన సినిమాల ద్వారా గొప్ప గుర్తింపు తీసుకొచ్చారన్నారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన సినిమాలు సినీ సాహిత్యానికి, సంప్రదాయ సంగీతానికి, కళలకు.. ముఖ్యంగా తెలుగు చలనచిత్ర రంగానికి ఎనలేని ప్రతిష్ఠను తెచ్చాయని చెప్పారు. సామాజిక అంశాలను ఇతివృత్తంగా తీసుకుని విశ్వనాథ్ చేసిన సినిమాలు గొప్ప మార్పునకు దారితీశాయన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ పేరుపై రాష్ట్ర ప్రభుత్వం లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును విశ్వనాథ్‌కి ఇచ్చిన అంశాన్ని సీఎం జగన్ గుర్తు చేసుకున్నారు. విశ్వనాథ్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ మేరకు గురువారం రాత్రి సీఎం కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

వినువీధికి విశ్వనాథుడు



కె విశ్వనాథ్ పార్థివ దేహం

▶ మొదటి పేజీ తరువాయి
చెందినవారు ఆశించారు. కానీ ఆయన ఇక సెలవంటూ వెళ్లిపోయారు. రాత్రి 12 గంటల ప్రాంతంలో విశ్వనాథ్ భౌతికకాయాన్ని అపోలో ఆస్పత్రి నుంచి ఆయన స్వగృహానికి తరలించారు. గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పెద్దపులివర్రు గ్రామంలో జన్మించిన విశ్వనాథ్ ఫిలింనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయనకు విశ్వవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టిన శంకరాభరణం సినిమా విడుదల రోజైన ఫిబ్రవరి 2వ తేదీనే కె.విశ్వనాథ్ కన్ను మూయడం విశేషం. 1930 ఫిబ్రవరి 19న జన్మించిన విశ్వనాథ్..50కి పైగా సినిమాలకు దర్శకత్వం వహించారు. మొదటిసారిగా 1965లో ఆత్మ గౌరవం సినిమాకు దర్శకత్వం వహించారు. చివరిసారిగా శుభప్రదం సినిమాకు దర్శకత్వం వహించారు. 1992లో పద్మశ్రీ, 2016లో దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు పొందారు. ఆయన మరణంతో తెలుగు చిత్ర పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యింది. పలువురు సినీ రాజకీయ ప్రముఖులు ఆయన మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

వాహినీ పిక్చర్స్ జీఎంగా మొదలుపెట్టి..


కాశీనాథుని సుబ్రమణ్యం, సరస్వతమ్మ దంపతులకు కె. విశ్వనాథ్ జన్మించారు. ప్రాథమిక విద్య గుంటూరు జిల్లాలోనే సాగినా ఆ తర్వాత ఆయన కుటుంబం విజయవాడకు మకాం మార్చింది. అయితే కాలేజీ చదువు మాత్రం గుంటూరులో సాగింది. బీఎన్‌రెడ్డి, నాగిరెడ్డి ఆరంభించిన వాహినీ పిక్చర్స్‌లో విజయవాడ బ్రాంచ్‌కి జనరల్ మేనేజర్‌గా పనిచేశారు. బీఎస్సీ పూర్తి చేశాక చెన్నై వాహినీ స్టూడియోలో సౌండ్ రికార్డిస్ట్‌గా కెరీర్ ఆరంభించారు. అన్నపూర్ణ పిక్చర్స్ సంస్థ నిర్మించిన 'తోడికోడళ్ళు' సినిమాకు పనిచేస్తున్నపుడు ప్రముఖ దర్శకుడు ఆదుర్తి సుబ్బారావుతో పరిచయం ఏర్పడింది. ఆయన వద్ద సహాయకుడిగా చేరారు. ఆదుర్తి దర్శకత్వంలో 'ఇద్దరు మిత్రులు', 'డాక్టర్ చక్రవర్తి' వంటి చిత్రాలకు సహాయ దర్శకుడిగా చేశారు. కె. విశ్వనాథ్ ప్రతిభను గుర్తించిన అక్కినేని నాగేశ్వరరావు తన సంస్థ నిర్మించిన 'ఆత్మ గౌరవం' (1965) సినిమాతో దర్శకుడిగా పరిచయం చేశారు. 'సిరిసిరిమువ్వ' సినిమాతో కె. విశ్వనాథ్ ప్రతిభ వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి చివరి సినిమా 'శుభప్రదం' (2010) వరకూ విశ్వనాథ్ 50కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించారు. సాగరసంగమం, శ్రుతిలయలు, సిరివెన్నెల, స్వర్ణకమలం, స్వాతికిరణం, స్వయంకృషి తదితర అద్భుత చిత్రాలను తెరకెక్కించారు. విశ్వనాథ్ చిత్రాలన్నీ సంగీత ప్రాధాన్యంగా సాగడం ఓ విశేషం. నటుడిగానూ వెండితెరపై తనదైన ముద్రవేశారు. శుభసంకల్పం, నరసింహనాయుడు, కలిసుందాం రా, ఆడవారి మాటలకు అర్థాలే వేరులే, సీతారామయ్యగారి మనవరాలు, ఠాగూర్, అతడు, మిస్టర్ పర్‌ఫెక్ట్ తదితర చిత్రాల్లో నటించారు. దర్శకుడిగా ఏ సినిమా తీసినా అది ఆరంభించి, ముగించేవరకూ షూటింగ్‌కి ఖాకీ బట్టలు ధరించడం విశ్వనాథ్ అలవాటు. తనను తాను కార్మికుడిలా భావిస్తానని, అందుకే ఖాకీ తొడుక్కుంటానని పలు సందర్భాల్లో విశ్వనాథ్ పేర్కొన్నారు. తాను దర్శకత్వం వహించిన కొన్ని తెలుగు చిత్రాలను హిందీలో రీమేక్ చేశారు. వాటిలో సరగమ్ (సిరిసిరిమువ్వ), సుర్‌సంగమ్ (శంకరాభరణం), కామ్‌చోర్ (శుభోదయం), శుభ్‌కామ్నా (శుభలేఖ), సమ్‌జోగ్ (జీవనజ్యోతి) ఉన్నాయి.

ఐదు జాతీయ అవార్డులు

విశ్వనాథ్ దర్శకత్వం వహించిన 'శంకరాభరణం' సినిమాకు జాతీయ పురస్కారంతో పాటు 'సప్తపది'కి జాతీయ సమగ్రతా పురస్కారం లభించింది. 'స్వాతిముత్యం' సినిమా 1986లో ఆస్కార్ అవార్డుల నామినేషన్లకు అధికారిక ప్రవేశం పొందింది. మొత్తం ఐదు జాతీయ అవార్డులు లభించాయి. భారతీయ సినిమాకు చేసిన సేవకు గాను విశ్వనాథ్‌కు భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారమిచ్చి గౌరవించింది. 1992లో రఘుపతి వెంకయ్య పురస్కారం అందుకున్నారు. ఐదు నంది అవార్డులు, 10 ఫిలింఫేర్ అవార్డులతో పాటు 'సాక్షి' లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు కూడా అందుకున్నారు.

ఆ కథ.. తీరని వ్యథ

'సిరివెన్నెల'పై కళాతపస్వి మానసిక సంఘర్షణ



భారతీయ సంస్కృతికి చిహ్నమైన శాస్త్రీయ కళలను తన కథలుగా మలుచుకుని, అద్భుతమైన చిత్ర కావ్యాలను తెరకెక్కించి కె. విశ్వనాథ్ కళాతపస్వి అనిపించుకున్నారు అయన ఆవిష్కరించిన శంకరాభరణం సినిమా జాతీయ పురస్కారాన్ని అందుకుని తెలుగుతెరపై ఒక కళాఖండంగా మిగిలిపోయింది. అలాగే, స్వాతిముత్యం, సాగరసంగమం, స్వయంకృషి, స్వర్ణకమలం, సిరివెన్నెల.. ఇలా ఆయన ప్రతి చిత్రం తెలుగు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి. ఇంతటి గొప్ప చిత్రాలు అందించినందుకు కేంద్ర ప్రభుత్వం కూడా ఆయన్ని పద్మశ్రీ, దాదాసాహెబ్ ఫాల్కే తదితర అవార్డులతో సత్కరించింది. కానీ, తన సినిమాలతో ప్రేక్షకుల మనసుని తేలికపరిచే విశ్వనాథ్ మనసుని మాత్రం ఒక సినిమా చిత్రవధ చేసిందట. అదే 'సిరివెన్నెల' సినిమా. ఆ మధ్య ఒక ఇంటర్వ్యూలో ఆయనే స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. 'మిమ్మల్ని బాగా తృప్తిపరిచిన సినిమా ఏది' అని ప్రశ్నించగా.. విశ్వనాథ్ బదులిస్తూ, 'కళాకారుడు అనేవాడు జీవితాంతం తృప్తి పొందడు. ఇంకా ఏదో చేయాలి, సాధించాలనే అసంతృప్తితోనే బతుకుతాడు. నేను అంతే. కానీ, నన్ను మానసికంగా చాలా సంఘర్షణకు గురిచేసిన సినిమా మాత్రం 'సిరివెన్నెల'. అసలు ఒక మాటలు రాని అమ్మాయి ఏంటి.. కళ్లు కనబడని అబ్బాయి ఏంటి.. వారిద్దరి మధ్య సన్నివేశాలు సృష్టించడానికి నేను రాత్రి పగలు కష్టపడడం ఎందుకు? ఆ కథ ఎందుకు మొదలుపెట్టానా అని ఎంతో బాధపడ్డా. చిత్రీకరణ మధ్యలో సినిమాను ముగించలేను, ఆపేయలేను.. ఆ సమయంలో మానసికంగా ఎంతో చిత్రవధ అనుభవించా'.. అంటూ విశ్వనాథ్ తన అనుభవాన్ని పంచుకున్నారు. కట్ చేస్తే.. సిరివెన్నెల సినిమా తెలుగుతెరపై మరో కళాఖండమైంది.

ఇనుమడించిన పల్లెటూరు ప్రతిష్ట

విశ్వనాథ్ స్వగ్రామం ఉమ్మడి గుంటూరు జిల్లా పెదపులివర్రు

- సొంతూరిపై మమకారం.. ఇక్కడి ప్రజలంటే ప్రేమ

తెనాలి : కల్మషం లేని పల్లె జీవితాలు.. పాడి పంటలతో భాసిల్లుతుండే పల్లెటూళ్లకు కళాతపస్వి కాశీనాథుని విశ్వనాథ్ తన సినిమాల్లో పెద్దపీట వేశారు. మనవైన సంస్కృతీ సంప్రదాయాల ప్రస్తావన తప్పనిసరి. వీటన్నిటి మేళవింపుతో వినోదాత్మకమైన సినిమాతో చక్కని సందేశాన్ని ఇచ్చారు. అది కూడా కళాత్మకంగా, షడ్రుచుల సమ్మేళన విందు భోజనం అనిపించిన సంతృప్తితో ప్రేక్షకులు తెరబాట నుంచి ఇంటిబాట పట్టేలా ఉంటుంది. జనం మెచ్చిన ఈ సినీపరి'శ్రమ'ను గుర్తించి ఎన్నో అవార్డులు అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వైఎస్సార్ జీవితకాల పురస్కారంతో ఇటీవలే సత్కరించింది. అంతలోనే ఆయన ఇకలేరన్న వార్త వినాల్సి రావటం దురదృష్టకరం. ఉమ్మడి గుంటూరు జిల్లా రేపల్లె సమీపంలో భట్టిప్రోలు మండలంలోని పెదపులివర్రు కె.విశ్వనాథ్ స్వస్థలం. కృష్ణాతీరంలో ఒకప్పుడు వాఘ్రపురంగా చారిత్రక ప్రసిద్ధి చెందిన ఈ గ్రామం చోళరాజులు, విజయనగర రాజులు, జమీందారుల పాలనలో విలసిల్లింది. 19వ శతాబ్ది మొదటిపాదం వరకు లలిత కళాకారులు, వేద, ఆగమశాస్త్ర పండితులు, సాహిత్య కోవిదులు, సంగీత విద్వాంసులు, ఆయుర్వేద వైద్యులు, భరతనాట్య కోవిదులు, చిత్రకారులు, శిల్పులు, మంత్రద్రష్టలు, స్వాతంత్ర్య యోధులకు నిలయం ఈ గ్రామం. సినీ సంభాషణలు, పాటల రచనలో వెండితెరను ఏలిన సముద్రాల రాఘవాచారి (సీనియర్ సముద్రాల), సముద్రాల రామానుజాచారి (జూనియర్ సముద్రాల), సినీతార హలం ఈ ఊరి బిడ్డలు. సుప్రసిద్ధ సంగీత దర్శకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు బాల్యం ఇక్కడే గడచింది. ఇదే ఊరి బిడ్డ, సినీదర్శకుడు కె.విశ్వనాథ్ తన సృజనతో ప్రతిష్టాత్మక గౌరవాలను పొందటం ద్వారా మాతృభూమి పెదపులివర్రును పులకరింపజేశారు.

'సూపర్ స్టార్'కు శిక్షణ

అప్పట్లో అంటే 53 ఏళ్ల క్రితం బాబూ మూవీస్ కొత్త తారలతో ప్రయోగాత్మకంగా తీసిన తొలి సాంఘిక ఈస్ట్‌మన్ కలర్ చిత్రం 'తేనె మనసులు'. ఆదుర్తి సుబ్బారావు దర్శకుడు. కె.విశ్వనాథ్ సహ దర్శకుడు. తెనాలి సమీపంలోని బుర్రిపాలెం యువకుడు ఘట్టమనేని కృష్ణ తొలి సినిమా అది. సినిమా కోసమని కృష్ణకు నడకలో, వాచకంలో శిక్షణ ఇచ్చింది విశ్వనాథ్ కావటం విశేషం. ఆ అనుబంధం తర్వాత కూడా కొనసాగింది. కృష్ణతో 'కన్నె మనసులు' తీశారు. మళ్లీ 'ప్రైవేట్ మాస్టర్'లో కృష్ణను నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రకు ఉపయోగించారు. 'ఉండమ్మా బొట్టుపెడతా', 'నేరము-శిక్ష' సినిమాలను కృష్ణతో చేశారాయన. ఆ తర్వాత దర్శకత్వ రంగంలో విశ్వనాథ్ తనదైన 'కళాతపస్వి'గా చరిత్రను సృష్టించుకొంటే, కృష్ణ సూపర్‌స్టార్‌గా ఎదగడం తెలిసిందే.



విశ్వనాథ్‌కు బొల్లిముంత అవార్డు ప్రదానం (ఫైల్)

తెనాలితో అనుబంధం

హీరో కృష్ణతోనే కాదు. ఊర్వశి శారద హీరోయిన్‌గా తీసిన అవార్డు సినిమా 'శారద'కు దర్శకుడు విశ్వనాథే. ఇదే సినిమాకు తెనాలికి చెందిన అభ్యుదయ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ సంభాషణలు సమకూర్చారు. బొల్లిముంత కన్నుమూశాక, ఏటా ఆయన పేరుతో ఇస్తున్న పురస్కారాన్ని 2012లో కె.విశ్వనాథ్ తెనాలిలో అందుకున్నారు. ఈ సందర్భంగా సమీపంలోని అంగలకుదురులో కళాకారుడు, రచయిత రావినూతల శ్రీరామమూర్తి, విశ్వనాథ్‌కు స్వర్ణ కంకణ ధారణ చేశారు. అంతకు ముందు 1974లో తెనాలిలో కల్చరల్ ఫిలిం సొసైటి తరఫున విశ్వనాథ్‌ను సత్కరించారు. సినిమాల మంచి చెడ్డలను బేరీజు వేస్తూ, ఉత్తమ చిత్రాలను ప్రోత్సహిస్తున్న ఫిలిం సొసైటి నిర్వాహకుడు డాక్టర్ పి.దక్షిణామూర్తి అంటే ఆపేక్షగా ఉండేవారు.

సొంతూరుపై తరగని మమకారం

ఎంతగా ఎదిగినా, నగరంతో జీవితం ముడిపడినా.. విశ్వనాథ్‌కు సొంతూరు అంటే అమితమైన మమకారం. ఇక్కడి ప్రజలన్నా ప్రేమ. గ్రామంలోని శివాలయం అంటే ఎంతో ఇష్టం. తాను తీసిన ప్రతి సినిమాలో భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పేరు వినిపిస్తుంది. సొంత గ్రామంలో నిర్వహించే దసరా, మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయాల్లో పూజలు నిర్వహించేవారు. పండగ వస్తే చిన్ననాటి స్నేహితుడు కొడమంచిలి వెంకట సుబ్బారావుకు పట్టువస్త్రాలు పంపేవారు. ఇప్పుడు విశ్వనాథ్ కన్ను మూశారని తెలిసి ఆయనతో పరిచయం ఉన్న వారంతా శోకసంద్రంలో మునిగిపోయారు.

స్వాతంత్ర్యయోధుని కుటుంబం



పెదపులివర్రులో విశ్వనాథ్ జన్మించిన గృహం

విశ్వనాథ్ తాత కాళహస్తిలింగం స్వాతంత్ర్యయోధుడు, పండితుడు. 1930లో కాంగ్రెస్ కార్యకర్తకు ఆతిథ్యం ఇచ్చినందుకు ఆరునెలలు జైలుశిక్ష అనుభవించారు. జైలు భోజనం నిరాకరించినందుకు ఆలీపురం క్యాంపు జైలుకు పంపారు. అక్కడ కూడా భోజనం లేకుండా నిత్యసంధ్యానుష్ఠానాలు జరుపుకున్నారు. జైలు డాక్టర్ వీరి గురించి తెలుసుకుని గోధుమపిండి, పాలు, నూనె వంటివి ఏర్పాటు చేశారు. విశ్వనాథ్ తండ్రి కాశీనాథుని సుబ్రహ్మణ్యం పెదపులివర్రు శివాలయంలో ప్రధాన అర్చకులుగా 1956 వరకు పని చేశారు. తల్లి సరస్వతి. సినీ నిర్మాణ సంస్థ వాహినిలో ఉద్యోగం రావటంతో సుబ్రహ్మణ్యం మకాం చెన్నైకి మారింది. విశ్వనాథ్ నాలుగో తరగతి వరకు గ్రామంలోని పాఠశాలలో చదువుకున్నారు. తర్వాత గుంటూరులో హిందూ, ఏసీ కాలేజీల్లో చదివారు. బీఎస్సీ పూర్తి చేశారు. చెన్నైలోని వాహిని స్టూడియోలో సౌండ్ ఇంజినీరుగా కెరీర్ ఆరంభించారు.

క్లుప్తంగా...

ఏపీ, కర్ణాటక మధ్య మరిన్ని బస్ సర్వీసులు

కేఎస్ ఆర్టీసీతో ఏపీఎస్ ఆర్టీసీ ఒప్పందం



ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న ద్వారకా తిరుమలరావు, అంబుకుమార్

సాక్షి, అమరావతి : కర్ణాటకకు మరిన్ని బస్ సర్వీసులను నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర బస్ సర్వీసుల నిర్వహణ అంశంపై కర్ణాటక ఆర్టీసీతో ఏపీఎస్ ఆర్టీసీ గురువారం ఒప్పందం చేసుకుంది. విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, కేఎస్ ఆర్టీసీ ఎండీ వి అంబుకుమార్‌లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం కేఎస్ ఆర్టీసీతో ఏపీఎస్ ఆర్టీసీ తొలిసారిగా గురువారం ఈ ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందం ప్రకారం ఏపీఎస్ ఆర్టీసీ కర్ణాటకలో అదనంగా రోజూ 327 బస్ సర్వీసులను 69,284 కి.మీ. మేర నడుపుతుంది. దీంతో మొత్తమ్మీద ఏపీఎస్ ఆర్టీసీకి చెందిన 1,322 బస్సులు కర్ణాటకలో రోజూ 2,34,762 కి.మీ. మేర నడుస్తాయి. ఇక కేఎస్ ఆర్టీసీ ఏపీలో అదనంగా రోజూ 496 బస్ సర్వీసులను 69,372 కి.మీ. మేర నడపాలని నిర్ణయించారు. దీంతో మొత్తమ్మీద కేఎస్ ఆర్టీసీకి చెందిన 1,489 బస్సులు ఏపీలో రోజూ 2,26,044 కి.మీ. నడుస్తాయి. ఆర్టీసీ భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీలు కేఎస్ బ్రహ్మానందరెడ్డి, ఎ.కోటేశ్వరరావు, పి.కృష్ణమోహన్, కేఎస్ ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రశాంత్‌కుమార్ మిశ్రా, ఆంథోని జార్జ్, ఎస్.రాజేశ్ పాల్గొన్నారు.

బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం నిర్మాణం వేగవంతం

పనులు పరిశీలించిన మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులు పరిశీలిస్తున్న శ్రీలక్ష్మి

సాక్షి,అమరావతి/పటమట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విజయవాడ స్వరాజ్య మైదానంలో చేపట్టిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం, 125 అడుగుల కాంస్య విగ్రహ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం పరిశీలించినట్లు ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశామన్నారు. నగరంలోని పోలీస్ కంట్రోల్ రూమ్ సమీపంలో ఉన్న వైఎస్సార్ విగ్రహం నుంచి అంబేడ్కర్ స్మృతివనం వరకు బందరు రోడ్డుకు ఇరువైపులా సుందరీకరణ చేస్తామని వివరించారు. ఏపీఐఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సృజన, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొన్నారు.

అసమానతల్లేని సమాజం కోసమే 3 రాజధానులు

858వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు



దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం మూడు రాజధానులు తప్పనిసరని బహుజన పరిరక్షణ సమితి నేతలు చెప్పారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారం 858వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా వికేంద్రీకరణకు శ్రీకారం చుడుతుంటే.. దానిని అడ్డుకుని అమరావతి పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు బాబు అండ్ కో పడుతున్న తాపత్రయం అంతా ఇంతా కాదన్నారు. అమరావతి ఉద్యమం పూర్తిగా పతనమైనప్పటికీ బాబు తన స్వప్రయోజనాల కోసం ఎల్లో మీడియాలో లేనిది ఉన్నట్లు ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబుకు నిజంగా పేదలపై ప్రేమ ఉంటే రాజధాని ప్రాంతంలో పేదల ఇళ్ల పట్టాలను అడ్డుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పేదలకు అందించే విద్యకు ప్రాధాన్యతనిస్తూ విద్యాశాఖను బలోపేతం చేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ మాత్రమేనని, ఆయనను ఇతర రాష్ట్రాలు సైతం ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. బహుజన పరిరక్షణ సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు పాల్గొన్నారు.

యాప్.. ట్రాప్..



అత్యధిక యాప్‌లతో వ్యక్తిగత గోప్యతకు భంగం

- ఉన్న ప్రదేశం, కాంటాక్ట్ నంబర్లు ఇట్టే తెలిసిపోతున్నాయి
- ఫోన్‌లోని ఫొటోలూ తీసుకుంటాయి
- కెమెరా, మైక్రోఫోన్‌లతో కూడా యాక్సెస్
- ఎస్ఎంఎస్‌లు చదివేస్తారు.. వేలిముద్రలు తెలుసుకుంటారు
- గూగుల్‌తోనే అత్యధికంగా డాటా లీకేజీ
- అర్కా సంస్థ 'స్టేట్ ఆఫ్ డాటా ప్రైవసీ' నివేదిక వెల్లడి

విజయనగరానికి చెందిన రమేశ్ కొన్ని రోజుల క్రితం తమ బంధువుల గృహప్రవేశం కోసం హైదరాబాద్‌లోని కోకాపేటకు వెళ్లారు. అక్కడ కాలక్షేపం కోసం ఫోన్లో ఫేస్‌బుక్ చూడసాగారు. అంతే.. హైదరాబాద్‌లోని కోకాపేట, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లోని రియల్ ఎస్టేట్ ప్రకటనలు వరుసగా వచ్చేస్తున్నాయి. ఏనాడూ తన ఫేస్‌బుక్‌లో కనిపించని ఈ ప్రకటనలను చూసి ఆయన ఆశ్చర్యపోయారు. తాను హైదరాబాద్ వచ్చిన విషయం, కోకాపేట ప్రాంతంలో ఉన్న విషయం తనకు సంబంధం లేని వారికి తెలిసిపోయిందని గుర్తించారు.

లోన్‌యాప్ కంపెనీల ఆగడాలు మరీ దుర్మార్గం. అప్పు తీసుకున్న వ్యక్తి ఫోన్‌లో ఉన్న కాంటాక్ట్ నంబర్లు, ఫొటోలు అన్నీ ఆ కంపెనీలు తీసుకుంటాయి. అత్యధిక వడ్డీలు వేసి ఇచ్చిన రుణానికి నాలుగు, ఐదింతలు ఎక్కువ డిమాండ్ చేస్తాయి. అడిగినంత చెల్లించకపోతే ఫోన్ నుంచి తీసుకున్న రుణ గ్రహీత ఫొటోలను మార్ఫింగ్ చేసి, కాంటాక్ట్ నంబర్లలో ఉన్న బంధువులు, మిత్రులకు పంపించి వేధిస్తుంటాయి.

సాక్షి, అమరావతి: మన ఫోన్‌లోని కాంటాక్ట్ నంబర్లు, ఫొటోలు, ఇతర సమాచారం తెలియాల్సింది మనకు ఒక్కరికే కదా! బయటకు ఎలా వెళ్తోంది? ఇదెలా సాధ్యం అంటే.. మొబైల్ యాప్‌లే ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. వ్యక్తుల ప్రమేయం లేకుండానే వారి కదలికలు, లావాదేవీలు, ఇతర సమాచారం మొత్తం గుర్తుతెలియని వ్యవస్థలకు యాప్‌ల ద్వారా చేరిపోతున్నాయి. మన అవసరాల కోసం స్మార్ట్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకొనే ఈ యాప్‌లతో సౌలభ్యం ఎంతుందో.. వ్యక్తిగత గోప్యతకు ప్రమాదం కూడా అంతే ఉంది. వ్యక్తులు ఉన్న ప్రదేశం, వారి కదలికలు, సామాజిక మాధ్యమాల్లో చూసే వివిధ అంశాలు.. ఇలా అన్నీ యాప్‌లు నిరంతరం పరిశీలిస్తూనే ఉంటాయి. ఫోన్ కాంటాక్ట్ నంబర్లు, ఫోన్‌లోని ఫొటోలతో పాటు చివరికి వేలి ముద్రలు, ఎస్ఎంఎస్‌లు వేరెవరికో వెళ్లిపోతుంటాయి.

అర్కా సంస్థ అధ్యయనం..

ప్రముఖ ప్రైవసీ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫాం అర్కా కంపెనీ 'స్టేట్ ఆఫ్ డాటా ప్రైవసీ' పేరిట నిర్వహించిన సర్వేలో ఆందోళన కలిగించే ఇటువంటి పలు అంశాలు వెల్లడయ్యాయి. అర్కా సంస్థ 200 మొబైల్ యాప్‌లు, వెబ్‌సైట్లను అధ్యయనం చేసింది. వాటిలో మన దేశంలోని 25 రంగాలకు చెందిన 100 యాప్‌లు, వెబ్‌సైట్లు ఉన్నాయి. అమెరికాకు చెందినవి 76, యూరోపియన్ యూనియన్‌లకు చెందినవి 24 ఉన్నాయి. పిల్లలకు సంబంధించిన 30 యాప్‌ల గురించి కూడా ఈ సంస్థ ప్రత్యేకంగా అధ్యయనం చేసింది. ఆ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడు మనం ఇచ్చే అనుమతులు, ట్రాకర్లు, కుకీలతో వ్యక్తిగత సమాచారం ఇతర సంస్థలకు చేరిపోతున్నాయి. వ్యక్తిగత గోప్యతకు అత్యధికంగా గూగుల్ కంపెనీ భంగం కలిగిస్తోందని ఈ నివేదిక వెల్లడించింది. ఆండ్రాయిడ్, ఐవోఎస్ మొబైల్ యాప్‌లకు సంబంధించి ఈ సంస్థ అధ్యయనం చేసింది. ఆ అధ్యయనంలో ప్రధాన అంశాలను వెల్లడించింది.

అప్రమత్తతే శ్రీరామరక్ష..

- యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే ముందు దాని గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలి
- మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడు వివిధ అనుమతులు అడుగుతుంది. వాటిని నిశితంగా చదివిన తరువాతే అనుమతించాలి. డౌన్‌లోడ్ చేసుకునే తొందర్లో నిబంధనలను చదవకుండా అనుమతిస్తే తరువాత సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది
- మనమున్న ప్రదేశం తెలుసుకోవాల్సిన అవసరం ఉన్న యాప్‌లకే లొకేషన్ యాక్సెస్ ఇవ్వాలి. యాప్ వినియోగించేటప్పుడు మాత్రమే యాక్సెస్ అనుమతించేలా చూసుకోవాలి
- ప్రజల భద్రత కోసం పోలీసు శాఖ ప్రవేశపెట్టే యాప్‌లకు అన్నింటినీ యాక్సెస్ ఇవ్వాలి. అది అత్యవసర సమయాల్లో పోలీసులు మనకు సహకరించేందుకు ఉపయోగపడుతుంది
- నిషేధిత సంస్థలు, అనుమతి లేని ఆర్థిక సంస్థలు, నాన్ బ్యాంకింగ్ సంస్థల యాప్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ డౌన్‌లోడ్ చేసుకోకూడదు
- ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ సందేశాలు చదివేందుకు, వేలిముద్రను తెలుసుకునేందుకు యాప్‌లకు అనుమతించకూడదు

ఆండ్రాయిడ్ యాప్‌లు

- 75 శాతం ఇండియన్ ఆండ్రాయిడ్ యాప్‌లతో ఆ ఫోన్ యజమాని ఉన్న ప్రదేశం తెలిసిపోతోంది
- 59 శాతం యాప్‌లు వాటిని ఉపయోగించని సమయంలో కూడా మనం ఉన్న ప్రదేశాన్ని వెల్లడిస్తున్నాయి
- 57 శాతం యాప్‌లు ఫోన్‌లోని మైక్రోఫోన్‌ను వాడుకుంటున్నాయి
- 76 % యాప్‌లకు కెమెరా యాక్సెస్ ఉంది
- 43 శాతం యాప్‌లతో ఫోన్‌లోని కాంటాక్ట్ నంబర్లు తెలిసిపోతాయి
- 32 శాతం యాప్‌లతో ఫోన్‌కు వచ్చిన ఎస్ఎంఎస్‌లు కూడా తెలుసుకోవచ్చు
- 25 శాతం యాప్‌లతో ఫోన్‌ను అన్‌లాక్ చేసేందుకు వేసే వేలిముద్ర తెలిసిపోతుంది

ఐవోఎస్ యాప్‌లు...

- 83 శాతం ఐవోఎస్ యాప్‌లతో మీరు ఉన్న ప్రదేశం తెలిసిపోతుంది
- 81 శాతం యాప్‌లను ఉపయోగిస్తున్నప్పుడు కెమెరాతో యాక్సెస్ లభిస్తుంది
- 90 శాతం యాప్‌లతో ఫోన్ గేలరీలో ఉన్న ఫొటోలు బట్టబయలైపోతాయి
- 64 శాతం యాప్‌లతో ఫోన్‌లోని మైక్రోఫోన్‌తో యాక్సెస్ వస్తుంది
- 49 శాతం యాప్‌లతో ఫోన్‌లోని కాంటాక్ట్ నంబర్లు తెలిసిపోతాయి
- 36 శాతం యాప్‌లతో ఫోన్‌లోని క్యాలెండర్‌తో యాక్సెస్ లభిస్తుంది.

ప్రభుత్వ ఉద్యోగుల కోసం 'ప్రత్యేక ఓపీ'

రాష్ట్రంలోనే తొలిసారిగా విజయవాడ జీజీహెచ్‌లో ప్రారంభం



ఓపీడీని ప్రారంభించిన అనంతరం బీపీ చెక్ చేయించుకుంటున్న కలెక్టర్ డిల్లీరావు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీం(ఈహెచ్ఎస్) ద్వారా మెరుగైన వైద్యం అందించేందుకు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలోని సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో ప్రత్యేక ఓపీ కౌంటర్ ఏర్పాటుచేశారు. ఈ కౌంటర్‌ను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోనే తొలిసారిగా విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక ఓపీ సేవలు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి సోమవారం గ్యాస్ట్రో ఎంట్రాలజీ, మంగళవారం మానసిక వ్యాధులు, జనరల్ మెడిసిన్, బుధవారం గుండె, కిడ్నీ వ్యాధులు, గురువారం ఆర్థోపెడిక్, న్యూరాలజీ, జనరల్ మెడిసిన్, శుక్రవారం చర్మ వ్యాధులు, జనరల్ మెడిసిన్, శనివారం ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేసి మందులు అందజేస్తారని తెలియజేశారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. రక్తపోటు, హైపో థైరాయిడ్, రుమటాయిడ్ ఆర్థరైటీస్, నెఫ్రోటిక్ సిండ్రోమ్, క్రానిక్ కిడ్నీ వ్యాధులు వంటి వాటికి పరీక్షలు చేసి మందులు అందిస్తారని తెలిపారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ విఠల్‌రావు, జిల్లా ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ జె.సుమన్, ఆర్ఎంఓలు శోభ, మంగాదేవి, ఎన్జీవో నాయకులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన ఆరోగ్య సంరక్షణ

- పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు సిద్ధమవ్వాలి
- ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- అధికారులతో సమావేశంలో మంత్రి విడదల రజిని



సాక్షి, అమరావతి: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ కల్పించాలన్న సీఎం వైఎస్ జగన్ ఆలోచనల నుంచి ఈ కార్యక్రమం పుట్టిందని తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తన కార్యాలయంలో ఆమె గురువారం ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. మంత్రి మాట్లాడుతూ మార్చి నెలలో పూర్తి స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అధికారికంగా ప్రారంభించాలని సీఎం జగన్ నిర్దేశించారని చెప్పారు. ఇందుకు అనుగుణంగా పూర్తిస్థాయిలో అమలుకు అన్ని వనరులను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని అన్ని వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. క్లినిక్‌లలో సిబ్బంది పోస్టులు ఎక్కడైనా ఖాళీగా ఉంటే వెంటనే భర్తీ చేయాలని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గిరిజన ప్రాంతాల్లోని ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవ్వాలని ప్రభుత్వం కోరుకుంటోందని చెప్పారు. సికిల్ సెల్‌తో బాధపడే వారిని గుర్తించి.. వారి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు కృషి చేయాలన్నారు. ఐదు కొత్త మెడికల్ కాలేజీల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్ పాల్గొన్నారు.

సలహాదారుల నియామకాన్ని తప్పుబట్టడం లేదు

- ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వబోమన్న హైకోర్టు ధర్మాసనం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ సలహాదారుల నియామకంపై ప్రభుత్వాన్ని తప్పుబట్టడం లేదని హైకోర్టు పేర్కొంది. సలహాదారుల నియామకాలకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు జారీచేయబోమని స్పష్టంచేసింది. సలహాదారుల నియామకాలపై దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం గురువారం ఈ విధంగా వ్యాఖ్యానించింది. సలహాదారులను నియమిస్తూ వెళితే సంఖ్య పరిమితం ఉండదని, ఎవరంటే వారిని నియమిస్తే సున్నితమైన సమాచారం బయటకు వెళ్లే అవకాశం ఉంటుందని పేర్కొంది. సలహాదారుల నియామకంపై రాజ్యాంగ బాధ్యతను తేలుస్తామని తెలిపింది. తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది.

టీడీపీ మండలాధ్యక్షుడిపై అదే పార్టీ నేత తుపాకీతో కాల్పులు

- ఆస్పత్రికి చేర్చిన కుటుంబ సభ్యులు
- పల్నాడు జిల్లాలో ఘటన



రొంపిచర్ల : పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం తుపాకీ కాల్పులతో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. టీడీపీలో వర్గపోరు తుపాకీ కాల్పులకు దారితీయడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రొంపిచర్ల మండలం అలవాల గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెన్నా బాలకోటిరెడ్డిపై అదే గ్రామానికి చెందిన పమ్మి వెంకటేశ్వరరెడ్డి మరి కొందరితో కలిసి తుపాకీతో కాల్పులు జరిపారు. బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న బాలకోటిరెడ్డిని టీడీపీకి చెందిన పమ్మి వెంకటేశ్వరరెడ్డి మరికొందరు వచ్చి తలుపు తట్టి లేపగా బాలకోటిరెడ్డి బయటకొచ్చారు. అతనిపై తుపాకీతో కాల్పులు జరపగా అపస్మారకస్థితికి వెళ్లారు. ఇంట్లో వాళ్లు కేకలు వేయడంతో నిందితులు పరారయ్యారు. బాలకోటిరెడ్డిని నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. గతేడాది కూడా బాలకోటిరెడ్డిపై పమ్మి వెంకటేశ్వరరెడ్డి దాడి చేసి గాయపరిచారు. నరసరావుపేట డీఎస్పీ విజయభాస్కరరావు, రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, ఎస్ఐ సురేష్‌కుమార్‌లు ఘటన స్థలానికి చేరుకున్నారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్‌కుమార్ చెప్పారు. బాలకోటిరెడ్డి కోలుకుంటున్నట్టు పోలీసులు తెలిపారు.

ఇంధన సామర్థ్యంలో ఫ్రంట్ రన్నర్‌గా ఏపీ

- ఆంధ్రాలో 30 ఎనర్జీ ఎఫిషియన్సీ ఫైనాన్సింగ్ ప్రాజెక్టులు
- బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ భక్రే
- విశాఖలో 8 రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు



ఏపీ ఇంధన సామర్థ్య నివేదికను బీఈఈ సెక్రటరీ రాయ్‌కి అందిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్ ప్రసాద్, అభిషేక్ శర్మ

సాక్షి, విశాఖపట్నం: ఇంధన సామర్థ్యం కోసం బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) ఆధ్వర్యాన దేశంలో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ సెంటర్ల ద్వారా 73 ఎనర్జీ ఎఫిషియన్సీ ఫైనాన్సింగ్ ప్రాజెక్టులను గుర్తించగా, వీటిలో రూ.400 కోట్ల విలువైన 30 ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉండటం శుభపరిణామమని బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ భక్రే అన్నారు. ఇంధన సామర్థ్యం విషయంలో ఏపీ ఫ్రంట్ రన్నర్ స్టేట్‌గా ముందుందని ఆయన ప్రశంసించారు. ఇంధన సామర్థ్యంపై వివిధ రాష్ట్రాలు నియమించిన ఏజెన్సీ(ఎస్‌డీఏ)లతో గురువారం విశాఖపట్నంలో బీఈఈ ఆధ్వర్యాన ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఏపీతోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఒడిశా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు చెందిన ఎస్‌డీఏ ప్రతినిధులు పాల్గొన్నారు. వర్చువల్‌గా సదస్సును ప్రారంభించిన అనంతరం భక్రే మాట్లాడుతూ ఇంధన సామర్థ్యంపై కేంద్రం దృష్టి సారించిందన్నారు. దేశంలో 2031 నాటికి ఇంధన సామర్థ్య రంగంలో పెట్టుబడులు రూ.10 లక్షల కోట్లకు చేరేలా అన్ని రాష్ట్రాలు గట్టి ప్రయత్నాలు చేయాలని సూచించారు. అన్ని రంగాల్లోనూ 2030 నాటికి 150 మిలియన్ టన్నుల చమురుకు సమానమైన ఇంధనాన్ని ఆదా చేయాలని బీఈఈ లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు. ఏపీలో 6.68 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. బీఈఈ కార్యదర్శి ఆర్‌కే రాయ్ మాట్లాడుతూ ఎస్‌డీఏలకు ఇచ్చిన నిధులను సక్రమంగా వినియోగించాలని ఆదేశించారు. ఏపీ ఎస్ఈసీఎం సీఈవో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీలో 60వేల విద్యాసంస్థలను భాగస్వామ్యం చేస్తూ 12 వేల ఎనర్జీ క్లబ్‌ల ఏర్పాటుకు బీఈఈ ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఏపీలోని ఎనర్జీ ఎఫిషియన్సీ ఇన్వెస్ట్‌మెంట్ ప్రాజెక్టుల నివేదికను సెక్రటరీ రాయ్‌కు చంద్రశేఖర్‌రెడ్డి, ఈపీడీసీఎల్ డైరెక్టర్ రమేష్ ప్రసాద్, బీఈఈ జాయింట్ డైరెక్టర్ అభిషేక్ శర్మ అందించారు.

తెలంగాణ

జూలై 1న టీఎస్‌పీఎస్సీ గ్రూప్–4 పరీక్షలు!

- ఉదయం జనరల్ స్టడీస్.. మధ్యాహ్నం సెక్రటేరియల్ ఎబిలిటీ పరీక్షలు
- ఓఎంఆర్ విధానంలో నిర్వహిస్తామని టీఎస్‌పీఎస్సీ ప్రకటన
- ఇంగ్లిష్–తెలుగు, ఇంగ్లిష్–ఉర్దూలలో ప్రశ్నపత్రాలు
- నేడు సాయంత్రం ముగుస్తున్న దరఖాస్తు గడువు
- ఒక్కో పోస్టుకు 110 మందికిపైగా పోటీ



సాక్షి, హైదరాబాద్: వరుసగా ఉద్యోగ భర్తీ ప్రకటనలతో రెండు నెలలపాటు హడావుడి చేసిన తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఇక పరీక్షల నిర్వహణకు ఉపక్రమించింది. ఇటీవలే గ్రూప్–1 మెయిన్ పరీక్ష తేదీలను ఖరారు చేయగా.. అత్యధిక పోస్టులున్న గ్రూప్–4 పరీక్షల తేదీలను గురువారం ప్రకటించింది. ఈ ఏడాది జూలై ఒకటో తేదీన రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో గ్రూప్–4 పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపింది. ఓఎంఆర్ విధానంలో పరీక్ష నిర్వహిస్తామని.. ప్రశ్నపత్రాలు ఇంగ్లిష్–తెలుగు, ఇంగ్లిష్–ఉర్దూలలో ఉంటాయని పేర్కొంది.

ఎక్కువ పోస్టులు చూపి.. కొన్ని తగ్గించి..

వివిధ ప్రభుత్వ శాఖల్లో 9,168 గ్రూప్–4 పోస్టులను భర్తీ చేస్తామని గత ఏడాది డిసెంబర్ 1న టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. దీనికి సంబంధించి డిసెంబర్ 30న పూర్తిస్థాయి నోటిఫికేషన్ విడుదల చేసినా.. 8,039 ఖాళీ పోస్టులను మాత్రమే చూపింది. అదే రోజు నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది. తర్వాత ఈ ఏడాది జనవరి 28న విడుదల చేసిన అనుబంధ నోటిఫికేషన్‌తో మరో 141 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను జత చేసింది. వీటితో కలిపి మొత్తంగా భర్తీ చేసే గ్రూప్–4 పోస్టుల సంఖ్య 8,180కి చేరింది.

నేటితో గడువు పూర్తి

గ్రూప్–4 పోస్టులకు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు దరఖాస్తు గడువు ముగియనుంది. గురువారం సాయంత్రం వరకు దాదాపు 9 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే దాదాపు ఒక్కో పోస్టుకు 110 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు.

రెండు పేపర్లు.. 300 మార్కులు..

గ్రూప్–4 పోస్టుల భర్తీకి రెండు పరీక్షలు ఉంటాయి. ఇందులో జూలై 1న ఉదయం జనరల్ స్టడీస్ పరీక్ష, మధ్యాహ్నం సెక్రటేరియల్ ఎబిలిటీ పరీక్షను నిర్వహించనున్నారు. ఒక్కో పరీక్షకు రెండున్నర గంటలు సమయం ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున ప్రతి పేపర్‌కు 150 మార్కులు.. రెండు పరీక్షలు కలిపి మొత్తం 300 మార్కులు ఉంటాయి. పరీక్షలకు సంబంధించిన సిలబస్ వివరాలను టీఎస్‌పీఎస్సీ తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

ట్యాపింగ్ కాదది.. రికార్డింగే

జరగని ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లుగా చిత్రీకరిస్తూ చంద్రబాబు కుట్ర

- జాతీయ సమస్యగా దానిపై పోరాటం చేసే స్థాయికి దిగజారిన వైనం
- ఈ కుట్రలో కోటంరెడ్డి పాత్రధారి : వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- వైఎస్సార్‌సీపీ లేకుంటే ఎమ్మెల్యే అయ్యేవాడివా? : మంత్రి పెద్దిరెడ్డి
- ఇది నమ్మకద్రోహం : మాజీ మంత్రి పేర్ని నాని

సాక్షి, అమరావతి : 'రాష్ట్రంలో రాజకీయం చేయడానికి ఏ సమస్యా లేకపోవడంతో జరగనే జరగని ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు చిత్రీకరించి.. దానిని జాతీయ సమస్యగా సృష్టించి, పోరాటం చేసే స్థాయికి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు దిగజారారు. ఈ కుట్రలో కోటంరెడ్డి పాత్రధారి. ఇందులో భాగంగా కోటంరెడ్డి ప్రభుత్వంపై బురద చల్లి పార్టీ వీడాలనుకోవడం దారుణం. ఇంతకూ రికార్డ్ చేసింది కోటంరెడ్డి మిత్రుడే' అని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, విద్యుత్, అటవీ, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) మండిపడ్డారు. గురువారం వారు వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు.

టీడీపీలో చేరే వారు బావిలో దూకినట్లే



'ఇష్టం లేనివారు టీడీపీలోకి వెళ్లాలనుకుంటే వెళ్లొచ్చు. కానీ ప్రభుత్వంపై, వైఎస్సార్‌సీపీపై బురదజల్లాలనుకోవడం సమంజసం కాదు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీని స్థాపించకపోతే నీలాంటి వాళ్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యేవారా? కోటంరెడ్డి ఆరోపిస్తున్నట్లుగా అది ఫోన్ ట్యాపింగ్ కానే కాదు. ఆయన మిత్రుడే రికార్డ్ చేశారన్న విషయం కోటంరెడ్డికి కూడా తెలుసు. ఇదంతా చంద్రబాబు కుట్ర. ఇలాంటి కుట్రలు, కుతంత్రాలకు సీఎం వైఎస్ జగన్ భయపడరు. టీడీపీలో చేరే ఎమ్మెల్యేలు బావిలో దూకినట్టే. కోటంరెడ్డిలాంటి వాళ్లు వెళ్లినా వైఎస్సార్‌సీపీకి వచ్చే నష్టమేమీ ఉండదు. లోకేశ్ పాదయాత్ర టీడీపీకి గుదిబండగా మారుతుంది.' – పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యుత్, అటవీ, గనుల శాఖ మంత్రి

టీడీపీ రాజకీయ లబ్ధి కోసమే..



'నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఫోన్ సంభాషణను ఆయన మిత్రుడే రికార్డింగ్ చేసి.. అందరికీ పంపారు. బయట సర్క్యులేట్ అవుతున్న ఆ ఆడియో క్లిప్‌ను ఇంటెలిజెన్స్ అధికారి కోటంరెడ్డికి పంపి, సరి చూసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ తరఫున రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.... టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుతో సమావేశమయ్యాక.. 2024లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని చెప్పిన మాటల ఆడియో కూడా సర్క్యులేట్ అవుతోంది. చంద్రబాబుతోనూ లోకేశ్‌తోనూ కోటంరెడ్డి ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారని టీడీపీ నేతలే చెబుతున్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసి ఉంటే.. చంద్రబాబుతో కోటంరెడ్డి సంప్రదింపులు జరుపుతున్నట్లుగా మేం అప్పుడే గుర్తించేవాళ్లం కాదా? టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏబీ వెంకటేశ్వరరావు ద్వారా చంద్రబాబు.. మా ఫోన్లను ట్యాపింగ్ చేశారని.. దానిపై న్యాయస్థానంలో కేసు కూడా వేశాం. వాళ్లలాగే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నట్లు రాజకీయ లబ్ధి కోసం టీడీపీ కుట్ర పూరితంగా చిత్రీకరిస్తోంది.' – సజ్జల రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు

డిసెంబర్ 25న బాబును కలిశారు



'నీ ఫోన్ సంభాషణను నీ మిత్రుడు రామశివారెడ్డి రికార్డ్ చేసి, అందరికీ పంపారు. అది బయట సర్క్యులేట్ అవుతుంటే.. ఇంటెలిజెన్స్ అధికారి దాన్ని నీకు వాట్సాప్‌లో పంపి.. సరి చూసుకోవాలని సూచించడంలో తప్పేముంది? ఇది వాస్తవం కాదంటే.. నీ ఫోన్‌కు సంబంధించి గత ఆర్నెల్ల వాట్సాప్ డేటాను బహిర్గతం చేయగలవా? కోటంరెడ్డిని సీఎం జగన్ ఎంతగానో నమ్మితే.. ఇలా నమ్మక ద్రోహానికి పాల్పడటం తగదు. డిసెంబర్ 25న బ్లూ కలర్ బెంజ్ కారులో చంద్రబాబు ఇంటికి కోటంరెడ్డి వచ్చి.. రెండు గంటలపాటు మాట్లాడి వెళ్లారు. ఇదివరకటిలాగే మాజీ మంత్రి నారాయణతో సంబంధాలు కొనసాగించాలని బాబు చెప్పారు. లోకేశ్‌తో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నారు. పాదయాత్రకు ముందు లోకేశ్ సలహాలు కూడా అడిగారు. కోటంరెడ్డి ఆస్పత్రిలో ఉన్నప్పుడు లోకేశ్ ఫోన్ ద్వారా పరామర్శించారు అని టీడీపీ నేతలు, కోటంరెడ్డి పక్కనున్న వారే చెబుతున్నారు.' – పేర్ని నాని, మాజీ మంత్రి

వజ్రంలా ఉండండి. అది విలువైనది, అరుదైనది. రాయిలా కాదు. అది ప్రతిచోటా కనిపిస్తుంది.
– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, ఫిబ్రవరి, 3

కటకటాల నుంచి స్వేచ్ఛ

రెండేళ్లకుపైగా ఉత్తరప్రదేశ్ జైల్లో మగ్గిన కేరళ పాత్రికేయుడు సిద్దిఖీ కప్పన్ బెయిల్ మంజూరై ఎట్టకేలకు స్వేచ్ఛా ప్రపంచంలోకి అడుగుపెట్టారు. 2020 అక్టోబర్‌లో దుండగుల అమానుషత్వానికి బలైపోయిన పందొమ్మిదేళ్ల దళిత యువతి భౌతికకాయాన్ని పోలీసులు ఆమె తల్లిదండ్రుల అభీష్టానికి విరుద్ధంగా తరలించుకుపోయి, తామే అంత్యక్రియలు పూర్తిచేసేందుకు ప్రయత్ని స్తున్నారన్న సంగతి తెలిసి వెళ్తున్న కప్పన్‌ను యూపీ పోలీసులు మార్గమధ్యంలో అరెస్టు చేశారు. పాత్రికేయ వృత్తిలో ఉండేవారికి ఇలాంటి అనుభవాలు కొత్తేమీ కాదు. ఉద్యమకారులకూ, పోలీసులకూ మధ్య ఘర్షణలు తలెత్తినప్పుడైనా...అవినీతి, మాఫియా సామ్రాజ్యాల గుట్టు రట్టు చేసేందుకు ప్రయత్నించినప్పుడైనా వారికి సమస్యలు ఎదురవుతుంటాయి. సిద్దిఖీ కప్పన్‌ను పోలీసులు అరెస్టు చేసినప్పుడు అంత్యక్రియల ప్రాంతానికి వెళ్లకుండా ఆయన్ను అడ్డుకోవడానికేనని అందరూ అనుకున్నారు. కానీ జరిగిందంతా అందుకు విరుద్ధం. ఒక సాధారణ పాత్రికేయుడని అందరూ అనుకుంటున్న కప్పన్‌ను పోలీసులు ఉగ్రవాద సమర్థకుడిగా చిత్రిస్తూ వరస కేసులు పెట్టారు. అప్పటికింకా నిషేధానికి గురికాని పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ)కు సలహాదారుగా చిత్రించి చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(యూఏపీఏ)కింద కేసు పెట్టారు. కేసును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) స్వీకరించింది. ఆ తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా రంగంలోకొచ్చి నేరారోపణలు చేసింది. ఆయనతోపాటు మరో అయిదుగురు కూడా ఈ కేసులన్నిటా సహ నిందితులుగా ఉన్నారు. ఈ ఆరోపణలు ఏమేరకు నిలబడతాయో, కప్పన్, ఆయన సహచరులు నిర్దోషులుగా బయటికొస్తారో లేదో ముందుముందు తేలుతుంది.

అయితే నిరుడు సెప్టెంబర్‌లో కప్పన్‌కు బెయిల్ మంజూరు చేస్తూ అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యూ యూ లలిత్ లేవనెత్తిన ప్రశ్న కీలకమైనది. 'ప్రతి పౌరుడికీ తన అభిప్రాయాలు వ్యక్తంచేసే స్వేచ్ఛ ఉంది. హథ్రాస్ బాధితురాలికి న్యాయం జరగాలని ఆయన కోరుకుంటే అది చట్టం దృష్టిలో నేరమెలా అవుతుంది?' అని ఆయన నిలదీశారు. అదుపులోనికి తీసుకున్న సమయంలో కప్పన్ వాహనం నుంచి స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు చెబుతున్న కొన్ని కాగితాలు జస్టిస్ లలిత్‌కు అభ్యంతరకరమైనవిగా కనబడలేదు. అప్పటికే దీర్ఘకాలం జైల్లో ఉన్నందువల్ల, అరెస్టు చేసినప్పుడున్న పరిస్థితులను, ఈ కేసులోని ప్రత్యేకతలనూ పరిగణనలోకి తీసుకుని బెయిల్ ఇస్తున్నట్టు ప్రకటించారు. అయితే ఈడీ కేసులో బెయిల్ లభించడానికి మరో నాలుగు నెలలు పట్టింది. ఈడీ పెట్టిన మనీ లాండరింగ్ కేసు చిత్రమైనది. తన బ్యాంకు ఖాతా నుంచి సహ నిందితుడి ఖాతాకు కప్పన్ రూ. 5,000 బదిలీ చేయటం దీని సారాంశం. యూఏపీఏ కేసులో బెయిల్ లభించినవారు సమర్పించే పూచీకత్తులు సరిచూడటానికి 90 రోజులు తీసుకోవచ్చు గనుక కప్పన్ బయటికొచ్చేందుకు ఇంత సమయం పట్టింది. కప్పన్ ఒక్కరే కాదు... దేశంలో ఇదే మాదిరి యూఏపీఏ కేసుల్లో ఇరుక్కొని జైలుపాలైనవారు మరో అయిదుగురున్నారని నిరుడు డిసెంబర్‌లో పాత్రికేయుల పరిరక్షణ సంఘం(సీపీజే) తెలిపింది. మణిపూర్ పాత్రికేయుడు కిషోర్‌చంద్ర వాంఖెమ్‌ను 2019లో జాతీయ భద్రతా చట్టం(నాసా) కింద అరెస్టు చేశారు. నిజానికి కప్పన్ యూపీ నివాసి కాదు. ఆయన ఢిల్లీ కేంద్రంగా ఒక మలయాళ మీడియా సంస్థకు పనిచేస్తున్నారు. అందువల్ల కప్పన్‌పై యూపీ పోలీసులకైనా, అక్కడి రాజకీయ నాయకత్వానికైనా వ్యక్తిగత కక్ష ఉండే అవకాశం లేదు. మరైతే ఏ ప్రయోజనాన్ని ఆశించి, ఎవరు కప్పన్‌పై కేసులు పెట్టడానికి పూనుకున్నట్టు? హథ్రాస్ అమానుషం చుట్టూ అలుముకున్న పరిస్థితులనూ, ఈ ఉదంతంవల్ల ప్రభుత్వానికి కలగబోయే అప్రదిష్టనూ పరిగణనలోకి తీసుకుని మీడియా కథనాలను నియంత్రించాలన్న లక్ష్యంతో, పాత్రికేయులను భయభ్రాంతుల్ని చేసే ఉద్దేశంతో యూపీ సర్కారు ఈ చర్యకు దిగిందని పాత్రికేయ సంఘాలు అప్పట్లో ఆరోపించాయి.

ఈమాదిరి కేసులు విచారణకు రావాలంటే కింది స్థాయి కోర్టుల్లోనే ఏళ్ల తరబడి సమయం పడుతుంది. ఈలోగా బెయిల్ కోసం ఉన్నత స్థాయి న్యాయస్థానాలను ఆశ్రయించాల్సివస్తుంది. అక్కడ వెంటనే ఉపశమనం లభించటం సులభం కాదు. అప్పటికే పెండింగ్‌లో ఉన్న లక్షల కేసుల్లో ఇదొకటవుతుంది గనుక సహజంగానే జాప్యం చోటుచేసుకుంటుంది. సుదీర్ఘంగా సాగే ఈ ప్రక్రియంతా నిందితులకూ, వారి కుటుంబాలకూ ఒక శిక్షలాంటిదే. ప్రస్తుత కేసుల్లో కప్పన్‌కు బెయిల్ రావటానికే 28 నెలలు పట్టింది. ఇక కేసు విచారణ పూర్తయి, తీర్పు వెలువడటానికి మరెన్నేళ్లు పడుతుందో? తీర్పు ప్రతికూలంగా వెలువడితే మళ్లీ జైలుకూ, ఆ తర్వాత అప్పీల్‌కూ పోవాలి. ఆ తర్వాత మళ్లీ బెయిల్, విచారణకు హాజరుకావడం షరా మామూలు. అడపా దడపా జరిగే ఉగ్రవాద ఘటనలను సాకుగా చూపి ప్రభుత్వాలు ఈ కఠినమైన చట్టాలు తీసుకొచ్చాయి. ఉన్న చట్టాలకు సవరణలద్వారా పదునుపెట్టాయి. చట్టసభల్లో చర్చ జరిగినప్పుడల్లా తమ చర్యలను గట్టిగా సమర్థించుకున్నాయి. దుర్వినియోగానికి ఆస్కారం లేనివిధంగా పకడ్బందీ నిబంధనలు చేర్చామని స్వోత్కర్షకు పోయాయి. సాధారణ పౌరులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం లేనేలేదని చెప్పాయి. ఆచరణలో మాత్రం జనం తరఫున ప్రశ్నిస్తున్న ఉద్యమకారులు, నిజాలను ధైర్యంగా వెలికితీసేందుకు ప్రయత్నించే పాత్రికేయులు ఈ చట్టాలకు బలైపోతున్నారు. ఈ ధోరణి ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. కనుక దీన్ని అరికట్టేందుకు సర్వోన్నత న్యాయస్థానం తగిన ఆదేశాలివ్వాలి.

ఉత్తరాదిన కొత్త ఉరుములు

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

పదహారవ శతాబ్దపు భక్తకవి తులసీదాసు రాసిన 'రామ్‌చరిత్‌మానస్' ఇప్పుడు ఉత్తరాదిలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ప్రాచీన, మధ్య యుగాల్లో ద్విజులు రాసిన ఇతర గ్రంథాలకు వ్యతిరేకంగా శూద్ర, దళిత రాజకీయనేతలు నేడు మొట్టమొదటిసారిగా మేధా పోరాటానికి పిడికిలి బిగిస్తున్నారు. ఆ పుస్తకాలను ఆయుధాలుగా చేసుకుని ఆరెస్సెస్, బీజేపీలు సమకాలీన హిందూ జాతీయవాదాన్ని నిర్మించి అన్ని విద్యా సంస్థలపై ఆధిపత్యాన్ని నెలకొల్పాలని ప్రయత్నిస్తున్నాయన్నది వారి ప్రధాన ఆరోపణ. అందుకే వారు శూద్రులు, దళితులు వర్సెస్ ద్విజులు అనే కొత్త వ్యూహంలోకి ఆరెస్సెస్, బీజేపీని లాగడం ద్వారా ఉత్తరాదిన సరికొత్త యుద్ధానికి తెర తీయడానికి సిద్ధం అవుతున్నట్లు కనిపిస్తోంది.

గోస్వామి తులసీదాస్ రాసిన రామ్‌చరిత్ మానస్ ఇప్పుడు ఉత్తర భారతదేశంలో... ప్రత్యేకించి ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో కుల యుద్ధాన్ని రాజేస్తోంది. ఆ ప్రాంత బ్రాహ్మణులు, క్షత్రియులు ఈ పుస్తకాన్ని తమ ఆధ్యాత్మిక రామాయణంగా భావిస్తుంటారు. అయితే ఈ పుస్తకంలో శూద్రులకు, దళితులకు వ్యతిరేకంగా అవమానకరమైన ద్విపదలు ఉన్నాయని ఆరోపిస్తూ తాజాగా ఇద్దరు శూద్ర ఓబీసీ నేతలు స్వామి ప్రసాద్ మౌర్య (సమాజ్‌వాది పార్టీ–యూపీ), బీహార్ విద్యామంత్రి చంద్రశేఖర్ (ఆర్జేడీ) పుస్తకాన్ని నిషేధించాలన్న డిమాండ్‌తో పోరు ప్రారంభించారు. ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ సైతం తన బలమైన శూద్ర నేపథ్యంతో పుస్తకంపై తీవ్ర వైఖరిని చేపట్టారు.

సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు, యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ 2023 జనవరి 29న ఒక పత్రికా సదస్సులో ప్రసంగిస్తూ... ''నేను శూద్రుడినా లేక శూద్రుడిని కాదా తెలీదు కానీ, నేను రాముడికి వ్యతిరేకం కాదు. మరే ఇతర హిందూ దేవుడికి కూడా వ్యతిరేకం కాదు. అయితే ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, రామ్‌చరిత్‌మానస్ నుంచి శూద్రుల గురించి ప్రస్తావించిన ఆ పంక్తులను పఠించగలరా?'' అని ప్రశ్నించారు. ఈ అంశం గురించి ఒక జర్నలిస్టు మళ్లీ ప్రశ్నించి చీకాకు పరచినప్పుడు 'మీకు తెలిసి ఉంటే వాటిని చదవగలరా?'' అని అడిగారు. అప్పుడు ఆ జర్నలిస్టు ఆ పంక్తిని చదివి వినిపించారు. ''డోలు, నిరక్ష్యరాస్యుడు, శూద్రుడు, పశువు, మహిళ... వీళ్లందరూ శిక్షార్హులే..'' అన్నది ఆ పంక్తి సారాంశం. అప్పుడు అఖిలేష్ ఆ జర్నలిస్టును ''ఆ పంక్తులు శూద్రులను, దళితులను, స్త్రీలను అవమానిస్తున్నాయా లేదా?'' అని ప్రశ్నించారు. ''సీఎం యోగి అయినందున ఈ పంక్తులను రాష్ట్ర అసెంబ్లీలో చదవాలని నేను అడుగుతాను'' అన్నారు.

అంతకు ముందు అఖిలేష్ యాదవ్ ఒక ఆలయాన్ని సందర్శించడానికి వెళ్లినప్పుడు ఆర్ఎస్ఎస్, బీజేపీ ఆయనను అడ్డుకోవాలని చూశాయి. రామ్‌చరిత్‌మానస్ శూద్రులను, దళితులను, మహిళలను అవమానిస్తోందని, ఆ పుస్తకాన్ని నిషేధించాలని చెప్పిన ఎస్పీ నేత స్వామి ప్రసాద్ మౌర్యపై చర్య తీసుకోవాలని ఆ రెండు పార్టీలవారు నినదించారు. మౌర్య హిందువుల మనోభావాలను గాయపర్చారని వారి ఆక్షేపణ. కేసులు పెట్టారు. కానీ ఆయన తన వైఖరికి కట్టుబడ్డారు. ఆలయం వద్ద అడ్డుకోవడానికి ప్రయత్నించిన వారికి అఖిలేష్ కూడా గట్టిగా సమాధానమిచ్చారు. వెనుకబడిన వర్గాల (ఓబీసీల)ను, దళితులను మొత్తంగా శూద్రులుగా బీజేపీ పరిగణిస్తోందని, బీజేపీలో ఉంటున్నవారితోపాటు, పార్టీకి ఓటు వేస్తున్న శూద్రులను, దళితులను, మహిళలందరినీ రామ్‌చరిత్ మానస్ అవమానిస్తోందని మౌర్య పేర్కొన్నారు. బీహార్ విద్యా మంత్రి ఆర్జేడీ నేత చంద్రశేఖర్ కూడా ''రామ్‌చరిత్‌మానస్ మనుస్మృతి లాగా, ఆర్ఎస్ఎస్ రెండో సర్‌సంఘ్ చాలక్ (ఛీఫ్) ఎమ్ఎస్ గోల్వాల్కర్ రచించిన గ్రంథం 'పాంచజన్యం' లాగా ఒక విభజన గ్రంథం'' అని అన్నారు.



ఈ నేపథ్యంలోనే... ప్రాచీన, మధ్యయుగాల్లో బ్రాహ్మణులు రాసిన కుల గ్రంథాలకు వ్యతిరేకంగా ఉత్తర భారత శూద్ర, దళిత రాజకీయనేతలు మేధాపోరాటం చేస్తున్నారు. ''ఈ పుస్తకాలను ఉపయోగించుకోవడం ద్వారా ఆరెస్సెస్, బీజేపీలు సమకాలీన హిందూ జాతీయవాదాన్ని నిర్మించి అన్ని విద్యా సంస్థలపై ఆధిపత్యాన్ని నెలకొల్పాలని చూస్తున్నాయి. ఆహార ఉత్పత్తిదారులు, తోలుపని వారు, వడ్రంగులు, కుమ్మరులు, పశుపోషకులు, గొర్రెలకాపర్లు వంటి వారిని గౌరవించకూడని, వారు పనికిమాలిన వారని సూచించడానికి 'శూద్ర', 'చండాల' భావనలను ఈ పుస్తకాలు చాలా వరకు వ్యాపింపజేశాయి. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదవటానికి, విద్యను అభ్యసించడానికి వీరికి అర్హత లేదని, సమాజంలో గౌరవం పొందే అర్హత వీరికి లేదని ఈ పుస్తకాలు చెప్పాయి. అలాగే ఆలయాల్లో ప్రవేశించడానికి వీరికి అనుమతి లేదని పేర్కొన్నాయి'' అని ఆరోపిస్తున్నారు.

ఓబీసీ, దళిత్ వంటి సమకాలీక వర్గీకరణలను స్వాతంత్ర్యానంతర భారత్‌లో కులాలు, కమ్యూనిటీల కోసం దాదాపుగా వాడేవారు. గతంలో ఓబీసీలు, దళితులు బ్రాహ్మణ పుస్తకాలను నిశితంగా పరిశీలించలేదు. అందుచేత తమ గురించి ఈ పుస్తకాలు ఏమని పేర్కొన్నాయన్నది వీరు ఎన్నటికీ అర్థం చేసుకోలేదు. భారతదేశంలోని ఓబీసీలను ఏమాత్రం అర్థం చేసుకోకుండానే శూద్రులు అనే వర్గీకరణను పై పుస్తకాల్లో రాసేశారు. అందుకే జాతీయవాద సమయంలో జాట్లు, పటేళ్లు, మరాఠీలు, కమ్మవారు, రెడ్లు, లింగాయతులు, నాయర్లు తదితరులు శూద్ర హోదాను కాకుండా క్షత్రియత్వాన్ని తాము పొందవచ్చని ఆలోచించారు. శూద్ర హోదా అవమానకరమైనదని వారు భావించారు. ప్రాచీన, మధ్యయుగాలకు చెందిన రచనల్లో చాలా మంది బ్రాహ్మణ రచయితలు శూద్ర, చండాల అనే భావనను వారు పనికిరానివారు అని చిత్రించేందుకు ఉపయోగించారు. రుగ్వేదం రచించిన రోజుల నుంచి ఇది చారిత్రకంగా సాగుతూ వచ్చింది. వారు తమను తాము హిందువులుగా ఎన్నటికీ భావించలేదు. ముస్లిం చరిత్రకారుడు అల్ బెరూనీ (క్రీ.శ. 973–1053) 'అల్–హింద్' అనే పుస్తకం రాసిన తర్వాతే, హిందూ అనే భావన భారతీయ నిఘంటువులోకి వచ్చి చేరింది. అయితే ఇప్పుడు ఆరెస్సెస్, బీజేపీ భావ వ్యాప్తిలో ముస్లింలకు మొహమ్మద్ ఎలాగో, తులసీదాసు కూడా అలాగే గొప్ప హిందూ ప్రవక్త అయిపోయారు. ప్రవక్తను విమర్శించేవారు ఎవరైనా సరే, చంపేస్తామనే బెదిరింపులకు లోనయ్యేవారు. ఇప్పుడు స్వామి మౌర్యను అంతమొందించాలని ఒక హిందూ మతగురువు ఇప్పటికే ఫత్వా జారీ చేశారు. కానీ శూద్రులు, దళితుల విషయంలో ఎవరైనా ఇలాంటి విమర్శ చేస్తే వారికి ఏమీ కాదు.

ఓబీసీ మహాసభ సభ్యులు గత వారం రామ్‌చరిత్‌మానస్ పుటలను బహిరంగంగా తగులబెట్టారు. ఈ దేశం అగ్రరాజ్యమని నేడు ఆరెస్సెస్, బీజేపీ శక్తులు పిలుస్తున్నాయి. అయితే శూద్రుల, దళితుల, ఆదివాసీల శ్రమ మాత్రమే ఈ దేశాన్ని ఈ స్థాయికి తీసుకొచ్చింది. ఇది భారతదేశం గురించిన నూతన భావన. ఆరెస్సెస్, బీజేపీ అధికారంలోకి వచ్చాక, అధికార కుల రాజకీయాలు నిశిత పరీక్షకు గురవుతున్నాయన్న విమర్శ ఉంది. ఎందుకంటే సామాజిక, రాజకీయ ప్రక్రియలో ఈ కులతత్వపు గ్రంథాలను పాలకవర్గ శక్తులు తిరిగి రుద్దాలని కోరుకుంటున్నాయి. తమ ఉనికిని, భవిష్యత్తును సరికొత్త ఉచ్చులోకి దింపే ప్రయత్నం జరుగుతోందని శూద్ర, ఓబీసీ, దళితులు మెల్లగా గుర్తిస్తున్నారు. గతంలో ఓబీసీలు, దళితులు రిజర్వేషన్ చుట్టూనే పోరాడుతూ వచ్చారు. ఆరెస్సెస్, బీజేపీలు ఉద్యోగాలను ప్రైవేటీకరించడం ద్వారా, దాదాపు ఈ సమస్యను అసంగతంగా మార్చి వేశాయి. ద్విజ నాయకత్వం కింద ముస్లింలు శత్రువులు అనే ముద్రను బలంగా చొప్పించడం ద్వారా శూద్రులు, దళితులను ద్విజ నియంత్రణలోకి తీసుకురావాలని వీరు కోరుకున్నారు. క్రమంగా ఈ ఎజెండాలో తమను ఉచ్చులోకి లాగుతున్నారని శూద్రశక్తులు గ్రహిస్తున్నాయి. అదే సమయంలో ప్రాంతీయ పార్టీలను లేకుండా చేయాలని ఆరెస్సెస్, బీజేపీ కోరుకుంటున్నాయి. బెంగాల్, ఒడిషా తప్ప దేశ వ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు, మండల్ విప్లవం తర్వాత పుట్టుకొచ్చిన శూద్ర నేతల ఆధిపత్యంలో ఉంటున్నాయన్నది గమనించాలి.

శూద్ర, దళిత కమ్యూనిటీల నుంచి మేధావులు ఆవిర్భవిస్తుండటంతో, రామ్‌చరిత్‌మానస్, ఇతర ప్రాచీన సంస్కృత గ్రంథాల చుట్టూ కొత్త చర్చలు మొదలు కానున్నాయి. అఖిలేష్ శూద్రుడు కాబట్టి 2016 యూపీ ఎన్నికల్లో ఓడిపోయి, ముఖ్యమంత్రిగా అధికార నివాసాన్ని ఖాళీ చేసినప్పుడు ఆవు పాలతో, గోమూత్రంతో సీఎం నివాసాన్ని శుద్ధి చేసి యోగి ఆదిత్యనాథ్ తనను ఎంతగా అవమానించిందీ అఖిలేష్‌కి, శూద్రులు, దళితులకు ఇంకా గుర్తుంది. ఇప్పుడిక రామ్ చరిత్‌మానస్ లేవనెత్తిన సమస్యతో ఉత్తర భారతదేశంలో అనేక కుల సాంస్కృతిక పోరాటాలు ప్రధాన భూమికలోకి రానున్నాయి.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎదగండి మంత్రిగారూ



ఆడపిల్లలు పెళ్లీడు దాటకుండానే మాతృత్వ మధురిమల్ని కౌగలించుకోవాలని అస్సాం సీఎం అయిన హిమంత్ బిస్వా శర్మ అనే పురుషుడు సలహా ఇచ్చారు. ఎవరిని, దేనిని, ఎప్పుడు కౌగలించుకోవాలో అమ్మాయిలకు చెప్పడం ఆయన పని కాదు.

– మినీ నాయర్, రచయిత్రి

బాగుంది కదా!



2014లో పానిపట్‌లో జరిగిన టోర్నమెంట్‌లో 11 ఏళ్ల బాలుడు తన క్రికెట్ జట్టును విజయ పథంలో నడిపించి, 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా కూడా ఎంపికయ్యాడు. బాలుడిగా నాడు మారు వేషంలో ఆడిన షెఫాలీ వర్మ నేడు అండర్ –19 ప్రపంచకప్పులో ఇంగ్లండ్‌పై ఘన విజయం సాధించిన భారత జట్టుకు కెప్టెన్!

– జ్యోతి యాదవ్, రిపోర్టర్

దేశాన్ని కలపకండి



శ్రీ గౌతమ్ అదానీకి ఒకటి గుర్తు చెయ్యాలని అనుకుంటున్నాను. అదానీ అంటే ఇండియా కాదు. ఇండియా అంటే అదానీ కాదు. హిండెన్‌బర్గ్ నివేదిక అదానీ గ్రూప్ మీదే కానీ, ఇండియా మీద కాదు. 'దుష్టబుద్ధికి దేశభక్తే చివరి శరణ్యం' అని ఒక మహనీయుడు అన్నారు.

– అద్వైత్, చరిత్రకారుడు

నో థంబ్స్ అప్



ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లకు వెయ్యి మంది టీచర్లను నియమిస్తున్నారు! ఇది 'థంబ్స్ అప్' ఇవ్వవలసిన సందర్భమే కానీ... అలా బొటన వేలు ఎత్తి చూపిస్తే అనుచితంగా ఉండదు కదా!

– దీపక్ షెనాయ్, మనీ ఎక్స్‌పర్ట్

మనుషులుగా గుర్తించారు



గొప్ప బడ్జెట్ అనేందుకు చిన్న ఉదాహరణ. అన్ని పట్టణాలు, నగరాలలో మ్యాన్‌హోల్స్ మిషన్‌హోల్స్‌గా మారబోతున్నాయి! యంత్రాలు వచ్చాక ఇక మాన్యువల్ స్కావింజింగ్ ప్రమాదాలు, అవమానాలు కూడా ఉండవు.

– అభిజిత్ మజుందార్, జర్నలిస్ట్

ఉపాధికి హామీలేని బడ్జెట్

అభిప్రాయం



డా॥ తిరునహరి శేషు

ఏడు ప్రాధాన్యతా అంశాలతో (సప్తర్షి) 2023–24 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్... కోవిడ్ అనంతరం దేశం ఎదుర్కొంటున్న అత్యంత ప్రధానమైన సమస్యలైన ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకూ, స్వయం ఉపాధికీ ప్రాధాన్యం ఇవ్వకపోవడం ఆశ్చర్యమేస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడుతున్న ఆర్థిక మందగమన పరిస్థితులలో వేలాది మంది ఉద్యోగాలూ, ఉపాధీ కోల్పోతున్న తరుణంలో... బడ్జెట్‌లో ఉపాధి, ఉద్యోగాల కల్పనకు చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. 2006 నుండి దేశవ్యాప్తంగా విస్తృతంగా అమలవుతున్న 'మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం' (మన్రేగా)కు గత మూడు బడ్జెట్లలో వరుసగా నిధులు కోత పెట్టడం వలన పథకం లక్ష్యం నీరుగారి పోయే ప్రమాదం ఏర్పడింది.



113.7 మిలియన్ కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న ఈ పథకానికి 2021–22 బడ్జెట్‌లో రూ. 98 వేల కోట్లూ, 2022–23 బడ్జెట్‌లో రూ. 75 వేల కోట్లూ కేటాయించగా... 2023 –24 బడ్జెట్‌లో కేవలం రూ. 60 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి 21.6 శాతం నిధులను తగ్గించారు. ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి గ్రామీణ ప్రాంతాలలో నైపుణ్యంలేని వారికి వందరోజుల పని దినాలు కల్పించడానికి రూ. 2.72 లక్షల కోట్లు అవసరమవుతుంది. కానీ ఈ బడ్జెట్‌లో రూ. 60 వేల కోట్లే కేటాయించటంతో గ్రామీణ ప్రాంతాలలో ఉపాధికి హామీ దొరకదేమో అనిపిస్తోంది. నిధుల లేమితో పథకం అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి అనేది వాస్తవం. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ ప్రకారం భారతదేశంలో నిరుద్యోగం 8.3గా ఉంది. దీనిలో గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగం 9 శాతం కంటే ఎక్కువగా ఉన్నదని సర్వే సంస్థ తన నివేదికలో వెల్లడి చేసింది. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించటంతో నిరుద్యోగం మరింత పెరిగే ప్రమాదం లేకపోలేదు.

2021–22 బడ్జెట్ పెడుతున్న సమయంలో ఎన్నికలు ఉన్న కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, అస్సాం రాష్ట్రాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. అలాగే ఇప్పుడు తొమ్మిది రాష్ట్రాలకు జరుగనున్న శాసనసభ ఎన్నికలనూ, 2024లో జరిగే లోక్ సభ ఎన్నికలనూ దృష్టిలో పెట్టుకొని రైతులూ, స్త్రీలూ, వేతనజీవులూ, గిరిజనుల వంటి వారిపై ఈ బడ్జెట్‌లో వరాల జల్లు కురిపించినట్లుగా కనిపి స్తుంది. నాగాలాండ్, మేఘాలయ, త్రిపుర, రాజస్తాన్, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో గిరిజనుల ప్రాబల్యం ఎక్కువ కాబట్టి ఆ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో గెలుపు కోసం గిరిజన సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్దపీట వేశారనే చెప్పాలి.

వ్యవసాయ రంగంలో సంస్కరణలు, కేటాయింపులు, రుణ పరిమితి లక్ష్యం పెంపు (20 లక్షల కోట్లు), వేతన జీవులకు వ్యక్తిగత ఆదాయ పన్ను పరిమితి పెంపు, 'పీఎం గరీబ్‌కల్యాణ్ అన్న యోజన' ద్వారా 80 కోట్ల మంది పేదలకు ఉచిత బియ్యం పంపిణీ, 'పీఎం ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణ' పథకానికి రూ. 79 వేల కోట్ల కేటాయింపులు ఆహ్వానించదగినవే. రైల్వేలకూ, మౌలిక సదుపాయాల కల్పనకూ నిధులు కేటాయించిన విధంగానే... విద్య, ఆరోగ్య రంగాలకు మరిన్ని నిధులు కేటాయిస్తే బాగుండేది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో కూడా తెలంగాణ రాష్ట్రానికి నిరాశ ఎదురైందనే చెప్పాలి. విభజన చట్టంలో పొందుపరిచిన హామీల ప్రస్తావన లేకుండా రైల్వే ప్రాజెక్టులు, నీటిపారుదల ప్రాజెక్టుల నిధుల ప్రస్తావన లేకుండా; జాతీయ హోదా ప్రస్తావన లేకుండా, జాతీయ విద్యా సంస్థల కేటాయింపు లేకుండా మరొకసారి కేంద్ర బడ్జెట్ నిరాశపరిచిందనే చెప్పాలి. రూ. 45 లక్షల కోట్ల బడ్జెట్‌లో కేటాయింపులు ఘనంగా ఉన్నాయి. కానీ వాటిని పూర్తిస్థాయిలో ఖర్చు చేసి లక్ష్యాలను సాధించినప్పుడే 'విజన్ ఫర్ అమృత్ కాల్'కు సార్థకత చేకూరుతుంది.

ఆర్థిక విశ్లేషకులు, కాకతీయ విశ్వవిద్యాలయం

సామాజిక న్యాయ స్థాపన దిశలో...

సందర్భం



కైలసాని శివప్రసాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న వికృతమైన రాజకీయ క్రీడలు పరాకాష్ఠకు చేరాయి. ఈ పరిణామంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదలకు చెందిన బహుజన బిడ్డలు అప్రమత్తం కావలసిన ఆవశ్యకత ఏర్పడింది. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి డెబ్బై ఐదు సంవత్సరాలు గడిచాయి. ఈ కాలంలో ఇప్పటి వరకు దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... బహుజనుల జీవన ప్రమాణాలు పెంచేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.

గతంలో చంద్రబాబు నాయుడు పాలనా కాలంలో పండుగల సమయంలో కానుకలు, ఎన్నికల సమయంలో పసుపు–కుంకుమ లాంటివీ, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నామమాత్ర సబ్ ప్లాన్ నిధులు ఇచ్చి చేతులు దులుపుకొనేవారు. వీటితోనే బహుజనుల జీవితాలు బాగుపడుతున్నట్లు చంద్రబాబు గొప్పలు చెప్పుకునేవారు. బహుజనుల సంక్షేమానికి బాబు వెచ్చించిన నిధుల కన్నా... ఆ కార్యక్రమాల ప్రచారానికి చేసిన ఖర్చు రెట్టింపు స్థాయిలో ఉండేదనడంలో ఎటువంటి సంశయం లేదు. చంద్రబాబు పాలనా కాలంలో పెద్ద పెద్ద నిర్మాణాలు చేసి కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చే విధంగా కార్పొరేట్ తరహా పాలన సాగేది. దానికి పూర్తి విరుద్ధంగా బడుగు, బలహీన వర్గాల, అగ్రవర్ణ పేదల జీవన ప్రమాణాలు పెంచడమే నిజమైన అభివృద్ధిగా భావించి వైఎస్ జగన్ అందుకు అనుగుణంగా కార్యక్రమాలు చేపట్టారు. దేశవ్యాప్తంగా ఎక్కడా లేని విధంగా జగన్‌మోహన్ రెడ్డి గ్రామ, వార్డు సచివాలయాలను రాష్ట్ర వ్యాప్తంగా నెలకొల్పి ప్రజల వద్దకే పాలనను చేర్చారు.

అలాగే పేదల విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగ, గృహ నిర్మాణాల కొరకు మూడు లక్షల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేయడం విశేషం. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా 'నాడు–నేడు' పథకం ద్వారా జగన్ ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలు వెచ్చించి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను సకల సౌకర్యాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. విపక్షాలు సృష్టించిన అడ్డంకులను అధిగమించి, మేధావుల ముసుగులో చేసిన విమర్శలు సైతం తట్టుకుని జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను ప్రవేశ పెట్టడం గొప్ప పరిణామం. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్సీ సిలబస్‌తో పాటూ బైజూస్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు క్లాసులు చెప్పిస్తుండడం గమనార్హం.

ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వైద్య రంగంలో జగన్ అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రతి 2500 మంది జనాభాకు ఒక విలేజ్ క్లినిక్‌ను స్థాపించి ఆ క్లినిక్‌లో అవసరమైన సిబ్బందిని నియమించారు. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా గతంలో కేవలం 782 జబ్బులకు మాత్రమే చికిత్స అందించేవారు. ప్రస్తుతం మూడు వేలకు పైగా జబ్బులకు ఆరోగ్యశ్రీని విస్తరింపచేసి పేదల ఆరోగ్యం పట్ల తనకు ఉన్న చిత్తశుద్ధిని జగన్ చాటుకున్నారు. నేతన్నలకు, మత్స్యకారులకు, కాపులకు, ఆటో నడుపుకొని బతికేవారికి, చిరు వ్యాపారస్థులకు వివిధ పథకాల ద్వారా వారి ఖాతాల్లో డబ్బులు జమ చేసివారి వారి వృత్తులలో ముందుకు సాగటానికి అవసరమైన ఆర్థిక సాయాన్ని జగన్ సర్కార్ అందిస్తోంది.



దేశానికి వెన్నెముక రైతు. రాష్ట్రంలో రైతులకు పెట్టుబడి కొరకు ప్రతి సంవత్సరం రూ. 13,500 ప్రతి రైతుకూ ఇస్తున్నారు. అదే విధంగా రైతుల సంక్షేమం కొరకు రాష్ట్రంలో దాదాపు పదకొండు వేల రైతు భరోసా కేంద్రాలు నెలకొల్పి, ఎరువులు, కల్తీ లేని స్వచ్ఛమైన విత్తనాలు, పురుగు మందులు, రైతులకు అవసరమైన అన్నిరకాల సామాగ్రి ప్రభుత్వం అందిస్తోంది. ఏపీ రైతు భరోసా కేంద్ర నమూనా దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చే దిశగా జగన్ మోహన్ రెడ్డి 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి వాటిలో ప్రభుత్వమే ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని భావించి నిర్మాణాలకు శ్రీకారం చుట్టడం విశేషం. దీనికి ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సుమారు 40 వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసింది. ఏపీ ప్రభుత్వ పాలనను గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్థాపించడంలో భాగంగా చూడవచ్చు.

రాజ్యాధికారం బహుజనులకు అందించడంలో భాగంగా గ్రామ సర్పంచ్ దగ్గర నుంచి రాష్ట్రమంత్రి పదవి వరకూ అనేక పదవులను ఆయా కులాలు, మతాలు, వర్గాల దామాషా ప్రాతిపదికన కట్టబెట్టడం తెలిసిందే.

ఇంత చేస్తున్నా రాష్ట్రంలోని ప్రతిపక్షాలు అనవసరమైన విమర్శలు చేయడం శోచనీయం. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ప్రజలకు డబ్బు పంచుతున్నారని ప్రతిపక్షాల ప్రధాన ఆరోపణ. దీనిని బట్టే పేదవాడి సంక్షేమం పట్ల ఈ పార్టీలకు ఉన్న చిత్త శుద్ధి ఏపాటిదో అర్థమవుతుంది.

విప్లవాత్మక నిర్ణయాలతో ప్రజారంజక పాలన సాగిస్తున్న జగన్‌కు ప్రజల అండ తరగని ఆస్తి. ధనవంతులు, కార్పొరేట్ల వైపు ఉన్న ప్రతిపక్షాలు ఒక వైపూ; మహిళలూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదలు ఉన్న బహుజన సమూహంలో భాగంగా ఉన్న వైసీపీ మరో వైపూ ఉంది. ఎవరు సామాజిక న్యాయం కోసం పోరాడుతున్నారో స్పష్టంగానే కనిపిస్తోంది.


వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.త్రయోదశి సా.6.58 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: ఆరుద్ర ఉ.6.50 వరకు, తదుపరి పునర్వసు, వర్జ్యం: రా.8.04 నుండి 9.50 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.50 నుండి 9.35 వరకు, అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 6.36, సూర్యాస్తమయం: 5.52

తండ్రి, కుమార్తెను బలిగొన్న వాటర్ హీటర్

- మరో మహిళకు తప్పిన ప్రాణాపాయం
- విజయవాడ సత్యనారాయణపురంలో ఘటన


ఇప్పిలి సింహాచలం (ఫైల్)


పసుపులేటి మంగమ్మ (ఫైల్)

సత్యనారాయణపురం (విజయవాడ సెంట్రల్): భర్త నుంచి విడిపోయి ఒంటరిగా ఉంటున్న కూతురు, మనవళ్లకు అన్నీ తానై చూసుకుంటున్నాడు ఆ పెద్దాయన. విధి చిన్నచూపు చూడటంతో విద్యుదాఘాతానికి గురై తండ్రి, ఆయనను కాపాడే ప్రయత్నంలో కుమార్తె మృత్యువాత పడ్డారు. పదేళ్ల వయసు నిండని ఇద్దరు బిడ్డలను అనాథల్ని చేసి వెళ్లిపోయారు. ఈ హృదయ విదారక ఘటన సత్యనారాయణపురంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. రామకోటి మైదానం పాపిట్లవారివీధిలో నివాసం ఉంటున్న ఇప్పిలి సింహాచలం (60) పెయింటింగ్ పనులు చేసుకుంటూ భార్య వరాలమ్మతో కలసి పాత రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నారు. అతని కుమార్తె పసుపులేటి మంగమ్మ (32) భర్తతో విభేదాల కారణంగా 6, 9 ఏళ్ల కుమారులతో కలసి పుట్టింట్లోనే ఉంటుంది. వారు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో 1, 3వ తరగతి చదువుతున్నారు. సింహాచలానికి ఆరోగ్యం సహకరించకపోవడంతో కొంతకాలంగా పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. భార్య వరాలమ్మ, కూతురు మంగమ్మ ఇళ్లలో పనులు, సాయంత్రం సమయంలో ఫుడ్‌కోర్టులో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం సాయంత్రం 6.30 గంటల సమయంలో మంగమ్మ తన ఇద్దరు పిల్లలకు స్నానం చేయించి ఇంటి సమీపంలోని ట్యూషన్‌కు పంపించింది. సింహాచలం కూడా స్నానం చేసే నిమిత్తం వేడినీళ్లు కాచుకోవడానికి ప్లాస్టిక్ బకెట్‌లో వాటర్ హీటర్ పెట్టి స్విచ్ వేశాడు. ఆ సమయంలో విద్యుత్‌షాక్ తగిలి కిందపడిపోయాడు. కాపాడే ప్రయత్నంలో కూతురు మంగమ్మ తండ్రిని పట్టుకోవడంతో ఆమెకు విద్యుత్ షాక్ తగిలి ఇద్దరూ మృత్యువాత పడ్డారు. వారిని కాపాడే క్రమంలో పక్క పోర్షన్‌లో ఉండే అక్కవరపు సీత(54)కు విద్యుత్ షాక్ తగిలి తీవ్ర గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. భర్త, కూతురు మృతి చెందటంతో ఆమె ఇద్దరు పిల్లలను చూసుకుని తల్లి వరాలమ్మ కుమిలిపోవడం స్థానికుల కలచివేసింది. సత్యనారాయణపురం సీఐ వెంకటనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జాడలేని జిల్లేడు..
కానరాని తంగేడు

ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదనేది నానుడి. నాగజెముడు..తంగేడు..కుంకుడు..జిల్లేడు..ఉమ్మెత్త.. తిప్పతీగ..మునగ.. కరివేపాకు..వేప.. ఇవి కూడా మనిషికెంతో మేలు చేస్తాయి. ఇప్పుడంటే ఆధునిక వైద్యం అంతటా అందుబాటులోకి వచ్చింది కానీ ఒకప్పుడు ప్రతి ఇంటి పెరట్లో ఉండే ఇలాంటి మొక్కలు, చెట్లపైనే ఆధారపడి పల్లె ప్రజలు ప్రాణాలు కాపాడుకునేవారు. ప్రాణం మీదకొచ్చే జబ్బైతే తప్ప ఓ మోస్తరు అనారోగ్యం నుంచి బయటపడేందుకు ఆకు పసర్లే ఉపయోగించేవారు. వాటి మీదే ఆధారపడి జీవించేవారంటే అతిశయోక్తి కాదు. రెండు, మూడు దశాబ్దాల క్రితం వరకు పెరట్లో ఈ తరహా ఔషధ గుణాలున్న మొక్కలు, చెట్లు కన్పించేవి. ఇప్పుడు పల్లెల్లో కూడా జీవనశైలి మారిపోయింది. సంప్రదాయంగా వైద్యానికి వాడే పెరటి మొక్కల పెంపకం 80 శాతం పడిపోయింది. ఏ ఇంటి పెరట్లో అయినా ఇలాంటి మొక్క ఒకటి కన్పిస్తే అది నిజంగా వింతే. పెరటి వైద్యం అంటే ఏమిటో కూడా నేటి యువతరానికి తెలియని దుస్థితి ఏర్పడింది. ముఖ్యంగా నాగజెముడు, తంగేడు, జిల్లేడు, కుంకుడు, ఉమ్మెత్త లాంటివి ఎక్కడో తప్ప కన్పించకుండా పోయాయి. అయితే కోవిడ్ తదనంతర కాలంలో మొక్కలపై కాస్త మక్కువ పెరిగింది. కుండీల్లోనైనా ఇతర మొక్కలతో పాటు ఒకటో రెండో ఔషధ మొక్కలు పెంచాలనే ఆరాటం మొదలైంది. ఈ మక్కువ మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని నిపుణులు అంటున్నారు. మాయమైన మన పెరటి మొక్కల గురించి పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు.



'ఊపిరిపోసే' నాగజెముడు

పెరట్లో ముఖ్యంగా పొలాల వెంట ముళ్ల పొదల్లా ఉండే నాగజెముడు ఇప్పుడు మచ్చుకైనా కన్పించడం లేదు. కార్పొరేట్ కంపెనీలు ఈ మొక్కపై విస్తృత పరిశోధనలు చేసి, విలువైన ఔషధంగా గుర్తిస్తే.. మన పల్లె జనం మాత్రం ఆధునిక వైద్యానికి అలవాటు పడి దీని ప్రాధాన్యతను గుర్తించడం లేదు. నిజానికి ఈ తరానికి ఈ మొక్క ఎలా ఉంటుందో కూడా తెలియదు. నాగజెముడు పూలను ఆస్తమా తగ్గించేందుకు, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులకు వాడతారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించడంలో దీని పాత్ర చాలా కీలకమని అనేక పరిశోధనల్లో తేలింది. ఈ నేపథ్యంలో ఇప్పుడిప్పుడే అక్కడక్కడా ఇంటి ముందు కుండీల్లో ఇది కన్పించడం ఆహ్వానించదగ్గ పరిణామం.

ఇవీ నిజాలు..

- వృక్ష శాస్త్రవేత్తలు ఇప్పటివరకు 3.5 లక్షల మొక్క జాతులను గుర్తించారు. ఇందులో 2.78 లక్షల మొక్కలపై ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు జరిగాయి. వాటి ఔషధ గుణాలు గుర్తించారు. ఇప్పటికే 1.26 లక్షల మొక్క జాతులను వివిధ రూపాల్లో వాడుకుంటున్నారు.
- 30 ఏళ్ల క్రితం గ్రామీణ ప్రాంతాల్లో 2 లక్షల మొక్క జాతులు ఉన్నాయి. ఇవి ఇప్పుడు 80 వేల లోపే ఉన్నాయి.
- పెరటి వైద్యం 30 ఏళ్ల క్రితం వరకూ 92 శాతం ఉండేది. ఏదో ఒక మొక్కతో వ్యాధిని నయం చేసుకునే వాళ్ళు. ఇప్పుడు కేవలం 12 శాతమే పెరటి వైద్యాన్ని నమ్ముతున్నారు. అయితే కరోనా వచ్చిన తర్వాత ఇది 21 శాతానికి పెరిగింది.
- పల్లెల్లో పెరటి వైద్యంగా వాడిని మొక్కల్లో 20 జాతులు ప్రస్తుతం ఆయుర్వేద మందుల రూపంలో విస్తృతంగా అందుబాటులోకి వస్తున్నాయి. కొన్ని కార్పొరేట్ కంపెనీలు దాదాపు రూ.2 వేల కోట్లతో వీటిని పెంచుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా చూస్తే.. మన దేశంలోని 82 రకాల ఔషధ మొక్కలను వాణిజ్యపరంగా అభివృద్ధి చేస్తున్నారు.

పొలాలకు 'రక్షణ కంచె'

మంగళగిరి కంచె.. ఈ మొక్క గురించి చాలామందికి తెలియదు. సుమారు ఇరవై ఏళ్ళ క్రితం వరకు చాలా పల్లెల్లో ఇంటి పెరట్లో, పొలం గట్టుపై కనిపించిన మొక్క ఇది. కార్బన్-డై-ఆక్సైడ్‌ను నియంత్రించడంలో దీనికో ప్రత్యేకత ఉంది. పంట పొలాల్లో మొక్కలకు హాని చేసే క్రిమి కీటకాలను అదుపు చేస్తుంది. చిన్న మొక్క వేస్తే చాలు పొలం చుట్టూ రక్షణ కవచంలా అల్లుకుపోయే ఈ మొక్క.... ఇనుప కంచెల ఆవిర్భావంతో కనుమరుగైంది. ఈ మొక్కపై విస్తత పరిశోధనలు జరిగి దీని ప్రాధాన్యత విశ్వవ్యాప్తమైనా.. మన దగ్గర ఎవరికీ తెలియనంతగా కనుమరుగైపోయింది. ఇతర దేశాల్లో మాత్రం ఈ మొక్క పెంపకాన్ని బాగా ప్రోత్సహిస్తున్నారు.

కాల గర్భంలో ఎన్నో..

విరిగిన ఎముకలు కట్టుకోవడానికి వాడే నల్లేరు.. కఫంతో ఊపిరి ఆగిపోయే పరిస్థితి నుంచి కాపాడే కరక్కాయ.. ప్రాణం పోయేలా అన్పించే తలనొప్పిని తగ్గించే సొంఠి.. కురుపు ఏదైనా ఆకుతోనే నయం చేసే జిల్లేడు.. చర్మవ్యాధుల పనిబట్టే మారేడు.. సర్వ రోగ నివారిణి తులసి..ఇలాంటివెన్నో మనకు కన్పించకుండా పోతున్నాయి.

చర్మ వ్యాధులకు ఉమ్మెత్త

ఉమ్మెత్త పరిస్థితి కాస్త నయం. ముళ్ళ కాయలతో పెరట్లో కన్పించే దీన్ని ప్రజలింకా పూర్తిగా మరిచిపోలేదు. ఇప్పటికీ అక్కడక్కడా గ్రామాల్లో కన్పిస్తోంది. కానీ ఈ మొక్కను కార్పొరేట్ ఆయుర్వేద వైద్యం విస్తతంగా అభివృద్ధి చేస్తోంది. ఔషధ రూపంలో ప్రతి ఊరూ వెళ్ళిన ఈ మొక్క.. పెరట్లో ఉన్నా పల్లె జనం దీని విలువ తెలుసుకోవడం లేదు. ఉమ్మెత్త ఆకులు, కాయలను చర్మవ్యాధులకు బాగా వాడతారు. దీర్ఘకాల చర్మ వ్యాధులను సైతం తగ్గించే గుణం దీని సొంతం. ఇంత మంచి గుణాలున్న మొక్క మరో ఆరేళ్ళ తర్వాత పల్లెల్లో కన్పించదని వృక్ష శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ప్రకృతి ఫలసాయం..
శ్రీవారి ప్రసాదం!

అన్నప్రసాదం తయారీకోసం 12 రకాల ఉత్పత్తులు



సాక్షి, అమరావతి: శ్రీవారి ప్రసాదం, అన్నప్రసాదం తయారీ కోసం తిరుమల తిరుపతి దేవస్థానానికి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన 12 రకాల ఉత్పత్తుల సరఫరాకు రంగం సిద్ధమైంది. శ్రీవారికి సమర్పించే నైవేద్యంతో పాటు స్వామి దర్శనానికి వచ్చే లక్షలాది భక్తులకు నాణ్యమైన, రుచికరమైన ప్రసాదంతో పాటు.. అన్నప్రసాదాల తయారీలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించాలని టీటీడీ సంకల్పించింది. పైలట్ ప్రాజెక్టుగా 2021–22 సీజన్‌లో 1,304 టన్నుల శనగలను ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించి టీటీడీకి సరఫరా చేశారు. కాగా 2022–23 సీజన్ నుంచి 15 రకాల ఉత్పత్తుల కోసం టీటీడీ ప్రతిపాదించగా.. 12 రకాల ఉత్పత్తుల సరఫరాకు ఏపీ మార్క్‌ఫెడ్ ముందుకొచ్చింది. ఈ మేరకు రైతు సాధికార సంస్థతో కలిసి మార్క్‌ఫెడ్. టీటీడీతో అవగాహన ఒప్పందం చేసుకుంది. బియ్యం, కంది, మినుములు, శనగలు, పెసలు, బెల్లం, పసుపు పొడి, వేరుశనగ, మిరియాలు, కొత్తిమీర, మస్టర్డ్ సీడ్, చింతపండు రకాలకు సంబంధించి 15 వేల టన్నులు సరఫరా చేయనున్నారు. ఈ ఒప్పందం మేరకు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటల వారీగా సాగు చేస్తున్న 21,181 మంది రైతులను గుర్తించి రైతు సాధికార సంస్థ ద్వారా ప్రత్యేక శిక్షణనిచ్చారు. సాగు, ధరల నిర్ణయం, సేకరణ, నిల్వ, సరఫరా, కార్యకలాపాలను జాయింట్ కలెక్టర్ల నేతృత్వంలోని ప్రత్యేక కమిటీ సీఎం యాప్ ద్వారా పర్యవేక్షిస్తుంది.

15 శాతం ప్రీమియం ధర చెల్లింపు

జిల్లాల వారీగా గుర్తించిన రైతుల వివరాలను ఈ యాప్ ద్వారా ఎన్‌రోల్ చేసి ఆర్బీకేల్లో ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల ద్వారా.. మార్కెట్ ధరల కంటే కనీసం 15 శాతం ప్రీమియం ధర చెల్లించి సేకరిస్తారు. ఇలా గడిచిన ఖరీఫ్ సీజన్‌లో సాగైన సోనామసూరి (స్లెండర్ వెరైటీ) ఆవిరి పట్టని పాత బియ్యం, బెల్లం, శనగలను సరఫరా చేస్తుండగా, మిగిలిన ఉత్పత్తులను ప్రస్తుత రబీ సీజన్ నుంచి సరఫరా చేయనున్నారు. ఆర్బీకేల ద్వారా సేకరించిన ఈ ఉత్పత్తులను జిల్లా స్థాయిలో గుర్తించిన గోదాములు, కోల్డ్ స్టోరేజ్‌ల్లో నిల్వ చేస్తారు. సాగు, కోత, నిల్వ సమయాల్లో ఆయా ఉత్పత్తుల నాణ్యతను నిర్ధారించుకునేందుకు మూడు దశల్లో నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు లిమిటెడ్(ఎన్‌ఏబీఎల్) గుర్తింపు పొందిన థర్డ్ పార్టీ ల్యాబ్‌లో తనిఖీ చేస్తారు. రసాయన అవశేషాలు లేవని, నిర్దేశించిన ప్రమాణాలకనుగుణంగా ఫైన్ క్వాలిటీ(ఎఫ్‌ఏక్యూ) ఉత్పత్తులని నిర్ధారించుకున్న తర్వాతే ప్రాసెసింగ్ మిల్లుకు సరఫరా చేసేందుకు అనుమతినిస్తారు. అక్కడ ప్రాసెస్ చేశాక టీటీడీకి సరఫరా చేస్తారు. ఇలా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన చెరకుతో తయారు చేసిన బెల్లం ఉత్పత్తులను ఈ నెల 10వ తేదీన టీటీడీకి సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నెలాఖరులోగా నిర్దేశించిన శనగలు, సోనామసూరి బియ్యాన్ని సరఫరా చేయనున్నారు.

15 శాతం ప్రీమియం ధర చెల్లిస్తున్నాం



టీటీడీకి 12 రకాల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను సరఫరా చేస్తున్నాం. ఖరీఫ్‌లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగైన బెల్లం, శనగలు, బియ్యం సరఫరా చేస్తున్నాం. మిగిలిన 9 ఉత్పత్తులను ప్రస్తుత రబీలో సేకరించి సరఫరా చేస్తాం.

–రాహుల్ పాండే, ఎండీ, ఏపీ మార్క్‌ఫెడ్

ప్రకృతి ఉత్పత్తులను ప్రోత్సహించడమే లక్ష్యం



ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసే రైతులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏపీ మార్క్‌ఫెడ్‌తో కలిసి టీటీడీతో ఒప్పందం చేసుకున్నాం. జిల్లాల వారీగా ఎకరంలోపు కమతాలు కలిగిన చిన్న, సన్నకారు రైతులను గుర్తించి వారు పండించిన ఉత్పత్తులను సేకరించి మార్క్‌ఫెడ్ ద్వారా టీటీడీకి సరఫరా చేస్తున్నాం.

–పి.విజయకుమార్, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, రైతు సాధికార సంస్థ

గోదావరి డెల్టాకు అదనపు నీరు విడుదల

సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఏపీ జెన్‌కో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ డొంకరాయి జలాశయం నుంచి గోదావరి పంట భూములకు గురువారం రాత్రి నుంచి అదనంగా నీరు విడుదల చేస్తున్నట్లు జెన్‌కో ఎస్‌ఈ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. డిసెంబరు చివరి వారం నుంచి గోదావరి డెల్టాకు నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు 4,300 క్యూసెక్కులు విడుదల చేయగా గురువారం నుంచి మరో 1,700 క్యూసెక్కులు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఈ మేరకు అదనపు నీటిని డొంకరాయి మెయిన్ డ్యామ్ నుంచి వారం రోజులపాటు విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం సీలేరు కాంప్లెక్స్‌లో బలిమెల రిజర్వాయర్‌తో కలుపుకుని 35 టీఎంసీల నీరు ఉందని ఆయన తెలిపారు.

హుండీ ఆదాయంలో రికార్డుల మోత

- ఆపద మొక్కులవాడి ఆదాయం 11 నెలల్లోనే రూ.1,415.21 కోట్లు
- ఈ ఏడాది రూ.1,500 కోట్లు దాటే అవకాశం



తిరుమల: ఆపద మొక్కులవాడికి సాధారణంగా మే, జూన్ నెలల్లో మాత్రమే హుండీ ద్వారా లభించే ఆదాయం నెలకు రూ.100 కోట్లు దాటేది. మిగిలిన నెలల్లో నెలకు రూ.100 కోట్లలోపే ఉండేది. ప్రస్తుతం శ్రీవారికి నిత్యం రూ.4 కోట్లకు పైగా హుండీ ఆదాయం లభిస్తోంది. టీటీడీ చరిత్రలో ముందెన్నడూ లేనివిధంగా గత ఏడాది మార్చి నుంచి ప్రతినెలా హుండీ ఆదాయం రూ.100 కోట్లు దాటుతోంది. గడచిన 11 నెలల్లో రూ.1,415.21 కోట్లు రాగా.. ఈ ఏడాది రూ.1,500 కోట్ల మార్కును దాటిపోనుంది.

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్లు జైలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా పోలూరు తాలూకా కలంబూరుకు చెందిన నిందితుడు ఎం.జీవాకు ఐదేళ్లు జైలు శిక్ష, రూ.ఐదు లక్షల జరిమానా విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నాగరాజు గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... 2017, మార్చి 10న తిరుపతి రేంజ్ పెరుమాళ్లపల్లి ఫారెస్ట్ బీట్, ఆంజనేయస్వామి గుడి సమీపంలోని శేషాచలం అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు శ్రీనివాసమంగాపురం, శ్రీవారి మెట్టు రోడ్డు సమీపంలోని అటవీ ప్రాంతంలో గాలించారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఎం.జీవాను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. జీవా వద్ద ఉన్న నాలుగు ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి... నిందితుడికి ఐదేళ్లు జైలు శిక్ష, రూ.ఐదు లక్షల జరిమానా విధించారు.

ఊపిరాడక ఇద్దరి మృత్యువాత

- కెమికల్ ట్యాంకును శుభ్రపరుస్తుండగా దుర్ఘటన
- గాజులమండ్యంలోని ఓ రసాయన కర్మాగారంలో ప్రమాదం


నరేంద్ర (ఫైల్)


వెంకటేష్ (ఫైల్)

రేణిగుంట (తిరుపతి జిల్లా) : ఇక్కడి గాజులమండ్యం కెమికల్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో గురువారం ఇద్దరు యువకులు కెమికల్ సింథటిక్ ట్యాంకును శుభ్రంచేస్తూ మృతిచెందారు. ఈ సంఘటన గురువారం సాయంత్రం వెలుగుచూసింది. గాజులమండ్యం సీఐ ఆరోహణరావు, ఎస్‌ఐ ధర్మారెడ్డి కథనం మేరకు.. మండలంలోని పిల్లపాళెం దళితవాడకు చెందిన క్రిష్ణయ్య, సుబ్బరత్నమ్మ కుమారుడు నరేంద్ర (23), గంగయ్య, చిన్నక్క కుమారుడు వెంకటేష్ (22) గాజులమండ్యంలోని సాయిరాధా బయోటెక్ కెమికల్ కర్మాగారంలో పనిచేస్తున్నారు. ఫ్యాక్టరీలోని కెమికల్ వేస్టేజ్ ఆయిల్ ఉన్న పెద్ద సింథటిక్ ట్యాంకును గురువారం మధ్యాహ్నం శుభ్రంచేసేందుకు తొలుత నరేంద్ర ట్యాంకులోకి ఇనుప నిచ్చెన వేసుకుని దిగాడు. ట్యాంకులోపల ఉన్న కెమికల్ వేస్టేజ్ ఆయిల్ ఘాటైన వాసన వెదజల్లడంతో దాన్ని పీల్చి క్షణాల్లో అపస్మారక స్థితికి చేరుకుని కిందపడిపోయాడు. పైనున్న వెంకటేష్ అతన్ని కాపాడేందుకు ట్యాంకులోకి దిగి అతను కూడా ఆ వాసన పీల్చాడు. దీంతో ఇద్దరూ ట్యాంకులో సొమ్మసిల్లి పడిపోయారు. అక్కడున్న వారు ట్యాంకును పగలగొట్టి వీరిద్దరినీ బయటకు తీసి తిరుపతి రుయాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు కర్మాగారానికి చేరుకుని ఘటన జరిగిన తీరును పరిశీలించారు. మృతుల కుటుంబీకుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేస్తామని.. ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం ఉంటే చర్యలు చేపడతామని సీఐ తెలిపారు.

ఇద్దరికీ తల్లిదండ్రులు లేరు

మృత్యువాత పడిన యువకులిద్దరికీ తల్లిదండ్రులు లేరు. నరేంద్ర తల్లిదండ్రులు క్రిష్ణయ్య, సుబ్బరత్నమ్మ పదేళ్ల కిందటే మరణించగా.. అతన్ని చిన్నాన్న వెంకటరమణ చేరదీశాడు. మరో యువకుడు వెంకటేష్ తల్లిదండ్రులు గంగయ్య, చిన్నక్క కూడా కొన్నేళ్ల కిందట మృతిచెందడంతో వెంకటేష్ ఫ్యాక్టరీలో కార్మికునిగా పనిచేస్తూ బతుకుతున్నాడు.

రాములోరి బ్రహ్మోత్సవాలకు టీటీడీ ఏర్పాట్లు

- ఒంటిమిట్ట కోదండ రాముడి బ్రహ్మోత్సవాలకు మార్చి 30న అంకురార్పణ
- ఏర్పాట్లపై అధికారులతో టీటీడీ జేఈవో సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న జేఈవో వీరబ్రహ్మం

తిరుపతి (అలిపిరి): వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట క్షేత్రంలోని శ్రీకోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అధికారులకు సూచించారు. టీటీడీ పరిపాలన భవనంలో ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల నిర్వహణపై అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. కోదండ రామస్వామి కల్యాణానికి అవసరమైన తలంబ్రాల తయారీని ఎప్పుడు ప్రారంభించాలనే అంశంపై అధికారులతో చర్చించారు. బ్రహ్మోత్సవాలకు డిప్యుటేషన్‌పై నియమించే అధికారులు, ఉద్యోగులతోపాటు శ్రీవారి సేవకులకు వసతి, ఆహార ఏర్పాట్లపై ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. స్వామివారి కల్యాణానికి పెద్దసంఖ్యలో తరలివచ్చే భక్తులకు అన్నప్రసాదాల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగించడానికి విరివిగా మజ్జిగ, తాగునీరు పంపిణీ చేయడానికి అవసరమైన కౌంటర్లు సిద్ధం చేసుకోవాలన్నారు. టీటీడీ విజిలెన్స్ అధికారులు స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుని భద్రత, పార్కింగ్ ఏర్పాట్లకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఆలయం, కల్యాణ వేదిక వద్ద భక్తులను ఆకట్టుకునేలా పుష్పాలంకరణలు, విద్యుత్ అలంకరణలు చేయాలన్నారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, అవసరమైన మందులు, సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని సూచించారు. రథోత్సవ నిర్వహణ ఎలా ఉండాలి, సిబ్బంది ఎంతమంది అవసరం అనే విషయాలపై చర్చించారు.

30న అంకురార్పణ: కోదండ రాముడి బ్రహ్మోత్సవాలకు మార్చి 30వ తేదీన అంకురార్పణ జరగనుంది. 31వ తేదీన ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. సమీక్షలో డిప్యూటీ ఈవోలు గుణభూషణ్‌రెడ్డి, గోవిందరాజన్, సుబ్రహ్మణ్యం, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి, అన్నదానం ప్రత్యేక అధికారి జీఎల్ఎన్ శాస్త్రి, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్, డీఎఫ్‌వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో పుణ్యక్షేత్రాల సందర్శన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ ఆరిమండ వరప్రసాద్‌రెడ్డి చెప్పారు. తొలి దశలో భాగంగా విజయవాడ కేంద్రంగా మూడు ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్లను రూపొందించినట్లు తెలిపారు. రెండో దశలో విశాఖ నుంచి మరో మూడు సర్క్యూట్లను ప్రతిపాదిస్తున్నామని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ప్రయాస లేకుండా.. తక్కువ ఖర్చులో పుణ్యక్షేత్రాల సందర్శనను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. గైడ్‌తో పాటు రవాణా, భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఒక్కో సర్క్యూట్‌లో 7 నుంచి 10 దేవాలయాలను సందర్శించేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఏపీటీడీసీ ఎండీ కన్నబాబు మాట్లాడుతూ.. ప్రతి భక్తుడు సంతృప్తికరంగా, సురక్షితంగా ఆలయాలను సందర్శించేలా ప్యాకేజీలను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. అంతకుముందు ఏపీటీడీసీ చైర్మన్, ఎండీ కలిసి పర్యాటక శాఖ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఏపీటీడీసీ ఈడీ (ఆపరేషన్స్) గోవిందరావు, ఈడీ (ప్రాజెక్ట్స్) మల్‌రెడ్డి, రిలీజియస్ టూరిజం స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ట్రాన్స్‌పోర్టు మేనేజర్ జగదీశ్ పాల్గొన్నారు.

తొలి దశలోని ఆధ్యాత్మిక సర్క్యూట్లు..

విజయవాడ–తిరుపతి: విజయవాడ ఇంద్రకీలాద్రి, మంగళగిరి పానకాల నరసింహస్వామి, నెల్లూరు రంగనాథస్వామి, శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వర స్వామి, తిరుమల వేంకటేశ్వరస్వామి, తిరుచానూరు, కాణిపాకం.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

విజయవాడ–శ్రీశైలం: ఇంద్రకీలాద్రి, మంగళగిరి, పెదకాకాని మల్లేశ్వరస్వామి, త్రిపురాంతకం, శ్రీశైలం, మహానంది, అహోబిలం, యాగంటి.

విజయవాడ–సింహాచలం: ఇంద్రకీలాద్రి, ద్వారకా తిరుమల, అన్నవరం, లోవ తలుపులమ్మ, పిఠాపురం శక్తి, దత్తాత్రేయపీఠం, వాడపల్లి వేంకటేశ్వరస్వామి, ర్యాలి లక్ష్మీజగన్మోహినీ కేశవ స్వామి, సింహాచలం.

రెండో దశకు సంబంధించిన ప్రతిపాదనలు..

విశాఖ–శ్రీకాకుళం: సింహాచలం, విశాఖలోని కనకమహాలక్ష్మి దేవాలయం, అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం, రామతీర్థం.

విశాఖ–తిరుపతి: సింహాచలం, విశాఖలోని కనకమహాలక్ష్మి దేవాలయం, అన్నవరం, ద్వారకా తిరుమల, ఇంద్రకీలాద్రి, మంగళగిరి, నెల్లూరు రంగనాథస్వామి, శ్రీకాళహస్తి, తిరుమల, తిరుచానూరు, కాణిపాకం.

విశాఖ–శ్రీశైలం: సింహాచలం, విశాఖలోని కనకమహాలక్ష్మి దేవాలయం, అన్నవరం, ద్వారకా తిరుమల, ఇంద్రకీలాద్రి, మంగళగిరి, పెదకాకాని మల్లేశ్వరస్వామి, త్రిపురాంతకం, శ్రీశైలం, మహానంది, అహోబిలం, యాగంటి.


సమగ్ర పశుగణన నిబద్ధతతో చేపట్టాలి

కేంద్ర ముఖ్య కార్యదర్శి రాజేష్‌కుమార్ సింగ్


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాజేష్‌కుమార్ సింగ్

తిరుచానూరు(తిరుపతి జిల్లా): గ్రామస్థాయిలో సమగ్ర పశుగణన నిబద్ధతతో చేపట్టాలని కేంద్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి రాజేష్‌కుమార్ సింగ్ అన్నారు. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో తిరుపతిలోని ఎస్వీ పశు వైద్య విశ్వవిద్యాలయంలో గురువారం తొమ్మిది దక్షిణాది రాష్ట్రాల పశుగణన జిల్లా నోడల్ అధికారులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాజేష్‌కుమార్ సింగ్ హాజరై ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ రూపకల్పన, ప్రణాళికలు చేసేందుకు సమగ్ర సర్వే ఎంతో ఉపకరిస్తుందన్నారు. నిబద్ధతతో కూడిన పశు గణన పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తుల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. అనంతరం కేంద్ర మంత్రిత్వ సలహాదారు సుమీద్ సోపాన్ నగ్రారే మాట్లాడుతూ సమగ్ర పశుగణన ప్రాధాన్యతతో కూడుకున్నదన్నారు.

11 నుంచి శివదీక్షా భక్తులకు స్పర్శ దర్శనం



శ్రీశైలం టెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు మాత్రమే జ్యోతిర్ముడి కలిగి ఉన్న శివభక్తులకు నిర్ణీత వేళల్లో స్వామి వారి స్పర్శ దర్శనం కల్పిస్తున్నట్లు శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న గురువారం తెలిపారు. 15వ తేదీ సాయంత్రం నుంచి శివదీక్షా భక్తులకు కూడా సాధారణ భక్తుల మాదిరే స్వామి వారి అలంకార దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. శివదీక్షా భక్తులకు చంద్రావతి కల్యాణ మండపం నుంచి ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేసి దర్శనం కల్పిస్తామన్నారు. అలాగే ఈ నెల 14, 15, 16 తేదీల్లో మధ్యాహ్న సమయంలో సాధారణ భక్తులకు ఉచిత స్పర్శ దర్శనం యథావిధిగా ఉంటుందని చెప్పారు. శివదీక్షా శిబిరాలలో ఈ నెల 9 నుంచి 23వ తేదీ వరకు శివదీక్షా భక్తులు జ్యోతిర్ముడిని సమర్పించేందుకు ఏర్పాట్లు చేశామని వివరించారు.

ప్రపంచ శిఖరాగ్రాలపై 'నవరత్నాలు'

అంటార్కిటాలోని విన్సన్ పర్వతంపై రాష్ట్ర ప్రభుత్వ నవరత్నాల జెండా ఎగురవేసిన విశాఖ యువకుడు అన్మిష్‌వర్మ



సాక్షి ప్రతినిధి, విజయవాడ: ప్రపంచంలోని ఏడు ఎత్తయిన పర్వతాలపై రాష్ట్ర ప్రభుత్వ 'నవరత్నాల' జెండాను విశాఖపట్నం యువకుడు భూపతిరాజు అన్మిష్‌వర్మ ఎగురవేశాడు. మార్షల్స్‌లో ప్రపంచ పతకాలు సాధించిన అన్మిష్‌వర్మ 2020 నుంచి ప్రపంచంలోని ఎత్తయిన పర్వతాలను అధిరోహించడం ప్రారంభించాడు. గత రెండేళ్లలో ఆఫ్రికాలోని కిలిమంజారో, సౌత్ అమెరికాలోని అకాంకోగోవా, నేపాల్‌లోని ఎవరెస్ట్, యూరప్‌లోని ఎల్‌బ్రూస్, నార్త్ అమెరికాలోని డెనాలి, ఆస్ట్రేలియాలోని కొసియస్కో పర్వతాలను అధిరోహించి అక్కడ రాష్ట్ర ప్రభుత్వ నవరత్నాల జెండాను ఎగురవేశాడు. తాజాగా ఈ ఏడాది జనవరి 22న అంటార్కిటాలోని విన్సన్ పర్వతాన్ని అధిరోహించి జాతీయ జెండాతోపాటు ఆంధ్ర రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాల జెండాను ఎగురవేశాడు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలకుగాను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపే బ్యానర్లను ప్రదర్శించాడు. లండన్, చెక్ రిపబ్లిక్, అమెరికాకు చెందిన ముగ్గురు పర్వతారోహకులతో కలిసి అన్మిష్‌వర్మ ఈ పర్వతాన్ని అధిరోహించాడు. అన్మిష్‌వర్మ తండ్రి వేణుగోపాలరాజు మిలటరీలో పని చేశారు. తల్లి సత్యవేణి గృహిణి. విశాఖపట్నంలోని బిట్స్ కాలేజీలో ఎంబీఏ పూర్తిచేసిన అన్మిష్‌వర్మ ఇప్పటివరకు దేశానికి రెండు ప్రపంచ పతకాలను అందించాడు. తాజాగా ప్రపంచంలోని ఏడు ఎత్తయిన పర్వతాలను అధిరోహించి మరో రికార్డు సృష్టించాడు.

క్లుప్తంగా...

పెరిగే భూతాపాన్ని ఆపలేం!

బెర్లిన్: భూతాపం(గ్లోబల్ వార్మింగ్) పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కే పరిమితం చేయాలన్న పారిస్ ఒప్పందం ఆచరణ సాధ్యమయ్యేలా ప్రస్తుతం కనిపించడం లేదని జర్మనీ పరిశోధకులు తేల్చిచెప్పారు. అనుకున్న లక్ష్యం సాధించాలంటే సామాజికమార్పు తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఈ మేరకు జర్మనీలోని యూనివర్సిటీ హాంబర్గ్ క్లస్టర్ ఆఫ్ ఎక్సలెన్స్ 'క్లైమేట్, క్లైమాటిక్ చేంజ్, సొసైటీ(క్లిక్స్) పేరిట ఒక నివేదిక విడుదల చేసింది. వాతావరణ మార్పులపై యుద్ధం అనేది కొత్త కోణంలో జరగాలని సైంటిస్టులు అభిప్రాయపడ్డారు. వాతావరణ మార్పులకు అడ్డుకట్ట వేయాలన్న ఆశయాలు కాగితాలకే పరిమితం అవుతున్నాయని, అభివృద్ధి పేరిట జరుగుతున్న కార్యక్రమాలు, ప్రపంచ పరిణామాలను గమనిస్తే భూతాపం పెరుగుదలను 1.5 డిగ్రీలకు పరిమితం చేయాలన్న లక్ష్యం ఆచరణ సాధ్యం కాదని తేలిపోతుందని 'క్లిక్స్' ప్రతినిధి అనితా ఏంగెల్స్ చెప్పారు.

విద్వేష ప్రసంగాలను ఆపాలని ఆదేశించినా చర్యల్లేవు

న్యూఢిల్లీ: విద్వేష ప్రసంగాల కట్టడికి చర్యలు తీసుకోవాలని తాము పదేపదే ఆదేశాలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని గురువారం సుప్రీంకోర్టు విచారం వ్యక్తం చేసింది. విద్వేష ప్రకటనలను అడ్డుకోవాలంటూ వస్తున్న అర్జీలపై అవే ఉత్తర్వులివ్వాల్సి రావడం ఇబ్బందికరంగా ఉంటోందని వ్యాఖ్యానించింది. హిందూ జన్ ఆక్రోశ్ మోర్చా ఈ నెల 5న ముంబైలో తలపెట్టిన ర్యాలీని నిషేధించాలని, ఆ సంస్థ మత విద్వేషాలను పెంచుతోందంటూ దాఖలైన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ చేపట్టింది. 'ఇలాంటి వాటిపై ఇప్పటికే పలు మార్లు ఆదేశాలిచ్చాం. యంత్రాంగం నుంచి చర్యలు కరువయ్యాయి. అందుకే ఇలా ప్రతి కార్యక్రమానికి ఉత్తర్వులివ్వాల్సి రావడం మాకు చిరాకు కలిగిస్తోంది' అని ధర్మాసనం పేర్కొంది.

వీఆర్ఎస్ తీసుకుంటే తర్వాతి పే స్కేల్ రివిజన్ వర్తించదు

న్యూఢిల్లీ: స్వచ్ఛంద పదవీ విరమణ(వీఆర్ఎస్) తీసుకున్న ఉద్యోగులకు ఆ తర్వాతి కాలంలో వచ్చిన పే స్కేల్ రివిజన్‌లను వర్తింపజేయడం కుదరదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. మహారాష్ట్ర స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో వీఆర్ఎస్ తీసుకున్న కొందరు మాజీ ఉద్యోగులు వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు పై విధంగా స్పందించింది. ' జీతభత్యాల పెంపు, పే స్కేల్ రివిజన్ అనేది పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధాన నిర్ణయం. ఉద్యోగుల జీవితాలతో ముడిపడిన అంశమైనందున ఈ విషయం పరిశీలించే బాధ్యత ప్రభుత్వాలదే. ద్రవ్యోల్బణం, జీవన వ్యయాలకనుగుణంగా జీతాలు ఉండాలి' అని తెలిపింది.

పార్లమెంట్‌లో 'హిండెన్‌బర్గ్' ప్రకంపనలు

- అదానీ గ్రూప్‌పై ఇచ్చిన నివేదికపై తక్షణమే చర్చించాలి
- ఉభయ సభల్లో విపక్షాల పట్టు
- వాయిదా తీర్మానాల తిరస్కరణతో గందరగోళం
- సభను అడ్డుకున్న విపక్ష ఎంపీలు.. వెల్‌లో నిరసన
- లోక్‌సభ, రాజ్యసభ నేటికి వాయిదా


ఢిల్లీలో విజయ్ చౌక్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఖర్గే, విపక్ష పార్టీల నేతలు

సాక్షి, న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదిక గురువారం పార్లమెంట్‌లో తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. మార్కెట్ విలువను భారీగా కోల్పోతున్న అదానీ కంపెనీల్లో ఎల్ఐసీ, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల పెట్టుబడుల అంశంపై తక్షణమే చర్చించాలంటూ విపక్షాలు చేపట్టిన ఆందోళనతో ఉభయ సభలు స్తంభించాయి. హిండెన్‌బర్గ్ నివేదికపై చర్చించాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ సహా 9 విపక్షాల ఎంపీలు వెల్‌లోకి వచ్చి సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. దీంతో ఉభయ సభలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి.

9 పార్టీల వాయిదా తీర్మానాలు

సభా కార్యకలాపాల ఆరంభానికి ముందే ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో విపక్ష నేతలు పార్లమెంట్ ప్రాంగణంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అదానీ అంశంపై కేంద్రం సమాధానం ఇచ్చేదాకా సభా కార్యక్రమాలు అడ్డుకోవాలని నిర్ణయించారు. దీనికి అనుగుణంగానే ఉభయ సభల్లో 9 పార్టీలు వాయిదా తీర్మానాలిచ్చాయి. లోక్‌సభలో కాంగ్రెస్ తరఫున మాణిక్యం ఠాగూర్, బీఆర్ఎస్ తరఫున నామా నాగేశ్వర్‌రావు, రాజ్యసభలో మల్లికార్జున ఖర్గే వాయిదా తీర్మానం ఇచ్చారు. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ ఓం బిర్లా.. జాంబియా నుంచి వచ్చిన పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. ప్రశ్నోత్తరాలు చేపట్టాలని నిర్ణయించారు. అయితే, అదానీ అంశంపై చర్చించేందుకు రూల్ 267 కింద తామిచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చించాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. ప్రశ్నోత్తరాలకు సహకరించాలంటూ స్పీకర్ పదేపదే కోరినా వెనక్కి తగ్గలేదు. ఏకంగా వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలతో హోరెత్తించారు. దీంతో సభను స్పీకర్ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమయ్యాక విపక్ష ఎంపీలు ఆందోళనను కొనసాగించారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి జోక్యం చేసుకుంటూ సభా కార్యక్రమాలు సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు. అయినప్పటికీ విపక్ష సభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

జేపీసీ లేక సీజేఐ నేతృత్వంలో కమిటీ

అదానీ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని, ఇందుకోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) లేక సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఉదయం ఉభయ సభలు వాయిదా పడిన వెంటనే మల్లికార్జున ఖర్గే నేతృత్వంలోని విపక్ష ఎంపీలు విజయ్‌చౌక్‌లో విలేకరులతో మాట్లాడారు. ''మార్కెట్ విలువ కోల్పోతున్న సంస్థల్లో ఎల్ఐసీ, ప్రభుత్వ రంగ బ్యాంకులతో బలవంతంగా పెట్టుబడులు పెట్టించారు. దీనిపై చర్చించడానికి మేమిచ్చిన తీర్మానాన్ని సస్పెండ్ చేశారు. అదానీ అంశంపై పార్లమెంట్‌లో లోతుగా చర్చించాలి. అదానీపై విచారణ వివరాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు బయటపెట్టాలి'' అని డిమాండ్ చేశారు.

సమగ్ర విచారణతోనే..: నామా, కేకే

అదానీ వ్యవహారంపై జేపీసీ లేక సీజేఐ కమిటీతో సమగ్ర విచారణ జరిపిస్తేనే వాస్తవాలు బయటకు వస్తాయని బీఆర్ఎస్ ఎంపీలు నామా నాగేశ్వర్ రావు, కె.కేశవరావు పేర్కొన్నారు. ఎల్ఐసీ సహా బ్యాంకుల్లో డబ్బులు దాచుకున్న పేదల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు.

జనం సొమ్మును లూటీ చేశారు

ఎల్ఐసీ, ఎస్‌బీఐ సహా పలు ప్రభుత్వ సంస్థలతో అదానీ గ్రూప్‌లో బలవంతంగా పెట్టుబడులు పెట్టించారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఆరోపించారు. తాజా సంక్షోభం వల్ల ఆయా సంస్థలు భారీగా నష్టపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోట్లాది మంది భారతీయులు పొదుపు చేసుకున్న సొమ్ము ప్రమాదంలో చిక్కుకుందని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. అదానీ అంశంపై దర్యాప్తు జరిపించాలని విపక్షాలు కోరినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని జైరామ్ రమేశ్ మండిపడ్డారు. బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న డబ్బును అదానీ సంస్థల్లో పెట్టుబడి పెట్టారని, ఇప్పుడు వారంతా భయాందోళనకు గురవుతున్నారని సమాజ్‌వాదీ పార్టీ నేత రామ్‌గోపాల్ యాదవ్ చెప్పారు. జనం సొమ్మును అదానీ లూటీ చేశారని సీపీఎం నేత ఎలమారమ్ ధ్వజమెత్తారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. భారీ కుంభకోణం జరిగితే ప్రభుత్వం ఎందుకు నోరువిప్పడం లేదని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ నిలదీశారు.

అదానీ అంశంపై విపక్షాల ఐక్యత

ఏ తరహా దర్యాప్తు అనే డిమాండ్‌లో స్పష్టత కరువు

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో నిరసన తెలిపే విషయంలో అదానీ–హిండెన్‌బర్గ్ అంశంపై మరింత దూకుడుగా ముందుకెళ్లాలని విపక్ష పార్టీలు ఏకాభిప్రాయానికొచ్చాయి. కానీ అదానీ షేర్ల వివాదంపై ఏ తరహా దర్యాప్తుకు డిమాండ్ చేయాలనే అంశంలో పార్టీల మధ్య ఏకాభిప్రాయం కరువైంది. పార్లమెంట్‌లో అదానీ అంశాన్ని చర్చించాలని పట్టుబట్టడం, ఇరు సభలూ వాయిదాపడిన తర్వాత కాంగ్రెస్ చీఫ్ ఖర్గే నేతృత్వంలో భావసారూప్యత ఉన్న పార్టీల నేతలు ఢిల్లీలో సమావేశమయ్యారు. అదానీ అంశంపై ఒక్కటిగా పోరాడాలని సమావేశంలో ఉమ్మడి నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలతో బలవంతంగా అదానీ గ్రూప్‌లో పెట్టుబడులు పెట్టించారని సమావేశంలో కొందరు నేతలు వ్యాఖ్యానించారు. అయితే, అదానీ గ్రూప్ లక్ష్యంగా విమర్శలు ఉండాలిగాని హిండెన్‌బర్గ్ రీసెర్చ్ పేరును ప్రస్తావించకూడదని, ప్రస్తావిస్తే విషయం భారత్ ఆవల, పక్కదారి తప్పుతుందని కొందరు అభిప్రాయపడ్డారు. సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)తో దర్యాప్తు చేయించాలన్న డిమాండ్‌ను ఖర్గే ప్రధానంగా ప్రస్తావించారు. సీపీఐ, సీపీఎం, సమాజ్‌వాదీ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ మాత్రం సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో విచారణకు డిమాండ్‌చేయాలని తమ అభిప్రాయం తెలిపాయి. కొందరు సెక్యూరిటీస్ , ఎక్స్ఛేంజ్ బోర్డ్(సెబీ) ఆధ్వర్యంలో దర్యాప్తు జరగాలన్నారు.

అవమానాలు, నిరాదరణ..

- రష్యా నుంచి వచ్చానని ఉక్రెయిన్ నెటిజన్లు ట్రోలింగ్
- విశ్వసుందరి పోటీల్లో పక్షపాతం జరిగిందని రష్యా భామ అన్నా లిన్నికోవా ఆవేదన



మాస్కో: అమెరికాలో ఇటీవల ముగిసిన విశ్వసుందరి పోటీలపై రష్యా అందాల భామ అన్నా లిన్నికోవా సంచలన ఆరోపణలు చేశారు. ఈ పోటీల సమయంలో తనను అందరూ దూరంగా పెట్టారని, తీవ్రమైన నిరాదరణ ఎదుర్కొన్నానని అన్నారు. ఈవెనింగ్ మాస్కో పత్రికకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ విశ్వసుందరి పోటీల్లో కూడా పక్షపాతం చూపించారని అమెరికా, ఉక్రెయిన్ అందాల బామలకే అందరూ అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. ఈ సారి మిస్ అమెరికా ఆర్‌బానీ గాబ్రియెల్ విశ్వసుందరి కిరీటం దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ పోటీల్లో తాను ఉక్రెయిన్ సోషల్ మీడియా నుంచి తీవ్రమైన నెగిటివిటీ ఎదుర్కొన్నానని, అక్కడ నెటిజన్లు తనని అవమానిస్తూ, బెదిరింపులకు గురి చేశారని వెల్లడించారు. ఉక్రెయిన్, స్విట్జర్లాండ్ నుంచి అందాల పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన వారు తనని ఒక నిప్పుని చూసినట్టే చూశారని వెల్లడించారు. కానీ మిస్ వెనిజులా మాత్రం తనను ఎంతో బాగా చూశారని చెప్పారు. ' వెనిజులా నుంచి వచ్చిన అమందా దుదామెల్ ఎంతో మంచి మనసున్న అమ్మాయి. ఇతరులకి సాయంగా ఉంది' అని చెప్పుకొచ్చారు.

ఎట్టకేలకు సిద్దిఖీకి బెయిల్

లక్నో: ఉత్తరప్రదేశ్ జైల్లో రెండు సంవత్సరాలకు పైగా గడిపిన కేరళ పాత్రికేయుడు సిద్దిఖి కప్పన్ ఎట్టకేలకు బెయిల్‌పై గురువారం బయటకు వచ్చారు. 2020 అక్టోబర్‌లో యూపీలోని హత్రాస్‌లో దళిత యువతి అత్యాచారం, హత్య ఉదంతాన్ని కవర్ చేయడానికి వెళ్లిన కప్పన్‌ను పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. ఈ ఉదంతాన్ని కవర్ చేయడానికి వెళ్లిన కప్పన్‌ని చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, పాపులర్ ఫ్రంట్‌తో ఆయనకు సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలపై అదుపులోనికి తీసుకున్నారు. అప్పట్నుంచి ఆయన విచారణ ఖైదీగానే జైల్లో మగ్గిపోతున్నారు. ఎట్టకేలకు జైలు నుంచి విడుదలయ్యారు. ఉదయం 9.15 గంటలకి బయటకు వచ్చిన కప్పన్ తాను సుదీర్ఘమైన పోరాటాన్ని చేశానని చెప్పారు. అందుకే చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ రెండున్నరేళ్లలో కప్పన్ తల్లి కన్నుమూశారు. ఈ కేసులో సెప్టెంబర్‌లో సుప్రీం కోర్టు బెయిల్ ఇచ్చినప్పటికీ ఈడీ మనీలాండరింగ్ కేసు పెట్టడంతో మరికొన్నాళ్లు జైల్లో ఉండవలసి వచ్చింది.

బైడెన్ ప్రభుత్వంలో ఎన్నారైల పట్టు

అమెరికా హౌస్ కమిటీల్లో నలుగురు ఇండియన్ అమెరికన్లకు దక్కిన చోటు


ప్రమీల


అమిబేరా

వాషింగ్టన్: అమెరికా రాజకీయాల్లో ఇండియన్ అమెరికన్లకి ప్రాధాన్యత పెరుగుతోంది. కాంగ్రెస్ సభ్యులైన నలుగురు ఇండియన్ అమెరికన్లను అత్యంత ముఖ్యమైన హౌస్ పానెల్స్ సభ్యులుగా నియమించారు. ఇమిగ్రేషన్ శాఖలో అత్యంత శక్తిమంతమైన హౌస్ జుడీషియరీ కమిటీ ప్యానెల్ సభ్యురాలిగా కాంగ్రెస్ సభ్యురాలు ప్రమీల జయపాల్ నియమితులయ్యారు. అమెరికాలో ఛిన్నాభిన్నంగా మారిన ఇమిగ్రేషన్ వ్యవస్థని గాడిలో పెట్టడానికి అవకాశం ఇచ్చినందుకు జయపాల్ హర్షం వ్యక్తం చేశారు. ఇక ఇంటెలిజెన్స్‌కు సంబంధించి వ్యవహారాలను నడిపే కమిటీ సభ్యుడిగా అమి బేరాని నియమించారు. అమెరికా జాతీయ భద్రత అంశంలో ఇంటెలిజెన్స్ కమిటీ ప్రధాన పాత్ర పోషిస్తుంది. కాలిఫోర్నియా నుంచి ఆరు సార్లు కాంగ్రెస్‌కు ఎన్నికైన బేరా జాతి భద్రతకు సంబంధించిన కమిటీలో సభ్యుడు కావడం ఎంతో గర్వకారణమని వ్యాఖ్యానించారు. అమెరికా సహా ప్రపంచ దేశాలకు ముప్పుగా మారిన చైనా వ్యవహారాలపై కొత్తగా ఏర్పాటైన కమిటీలో సభ్యుడిగా రాజా కృష్ణమూర్తిని నియమించారు. మరొక ఇండియన్ అమెరికన్ ప్రజాప్రతినిధి రో ఖన్నాకి అమెరికా, చైనా మధ్య వ్యూహాత్మక పోటీకి సంబంధించిన కమిటీలో సభ్యుడిగా చోటు కల్పించారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా ఆర్థికంగా, భద్రతా పరంగా అమెరికా సవాళ్లు విసురుతున్న నేపథ్యంలో వాటిని ఎదుర్కోవడానికి వ్యూహరచన చేయాల్సిన అవసరం ఉందని కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు.

కశ్మీర్‌లో సెంట్ బాటిల్ ఐఈడీ బాంబ్

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో పలు పేలుళ్లతో సంబంధమున్న లష్కరే తోయిబా ఉగ్రవాది ఆరిఫ్‌ను పోలీసులు రేసీ జిల్లాలో అరెస్ట్‌చేశారు. అతని వద్ద సుగంధ ద్రవ్య సీసాలో అమర్చిన అధునాతన పేలుడు పదార్థం(ఐఈడీ)ను స్వాధీనం చేసుకున్నారు. జమ్మూకశ్మీర్‌లో ఇలా పర్ఫ్యూమ్ బాటిల్‌లో ఐఈడీ బాంబ్‌ను స్వాధీనం చేసుకోవడం ఇదే తొలిసారి అని జమ్మూకశ్మీర్ డైరెక్టర్ జనరల్ దిల్బాగ్ సింగ్ చెప్పారు. స్ప్రే బటన్‌ను నొక్కడంతో యాక్టివేట్ అయిన ఆ బాంబ్‌ను నిర్వీర్యం చేసే పనిలో భద్రతా బలగాలు నిమగ్నమయ్యాయి. ' వాస్తవానికి ఆరిఫ్ ఉపాధ్యాయుడిగా 12 ఏళ్ల క్రితం ప్రభుత్వ ఉద్యోగంలో చేరాడు. మూడేళ్ల క్రితం కరాచీకి పారిపోయిన మేనమామ ద్వారా కశ్మీర్‌లోని లష్కరే ఉగ్రవాది ఖాసిమ్‌తో సంబంధం పెట్టుకుని ఉగ్రవాదిగా మారాడు' అని డీజీపీ చెప్పారు.

మేఘాలయలో బీజేపీ ఒంటరి పోరు

న్యూఢిల్లీ/షిల్లాంగ్: త్వరలో జరగనున్న మేఘాలయ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మొత్తం 60 సీట్లకు అభ్యర్థులను బరిలో నిలపనుంది. నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార నేషనలిస్ట్ డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ కూటమితో కలిసి 60 సీట్లకుగాను 20 చోట్ల పోటీ చేయనుంది. బీజేపీ కార్యదర్శి, ఈశాన్య రాష్ట్రాల కో–ఇన్‌చార్జి రితురాజ్ సిన్హా గురువారం ఢిల్లీలో మీడియాకు ఈ విషయం వివరించారు. తమ పార్టీ మేఘాలయలోని మొత్తం స్థానాలకు ఒంటరిగా పోటీ చేయనుండటం ఇదే మొదటిసారని చెప్పారు. సీఎం కాన్రాడ్ సంగ్మాకు పోటీగా సౌత్ తురా స్థానం నుంచి మాజీ తీవ్రవాది బెర్నార్డ్ మారక్ బరిలోకి దిగనున్నారు. మారక్ ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్నారు.

అయోధ్య చేరుకున్న పవిత్ర సాలగ్రామ శిలలు



అయోధ్య: అయోధ్యలో నిర్మిస్తున్న రామమందిరం గర్భగుడిలో కొలువుతీరే బాలరాముడి విగ్రహ తయారీకి వినియోగించే పవిత్ర సాలగ్రామ శిలలను నేపాల్ నుంచి తెప్పించారు. దాదాపు ఆరు కోట్ల సంవత్సరాల పురాతన శిలలుగా చెప్పబడే ఈ శిలలను నేపాల్‌లోని మస్తాంగ్ జిల్లాలోని ముక్తినాథ్‌కు సమీపంలో కాళీ గండకీ నదీ ప్రవాహప్రాంతం నుంచి సేకరించారు. జానకీరాముల విగ్రహాలను చెక్కేందుకు 26 టన్నులు, 14 టన్నులు బరువైన ఈ రెండు శిలలను రోడ్డు మార్గంలో బుధవారం రాత్రి అయోధ్యకు తీసుకొచ్చారు. 51 మంది వైదికుల వేదమంత్రోచ్చారణల నడుమ శిలలను ఆలయానికి సంబంధించిన శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు అందజేశారు. ఈ సందర్భంగా కరసేవక్‌పురంలో గురువారం మధ్యాహ్నం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిలలను చూసి తరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానికులు తరలివచ్చారు. అంతకుముందు, సీతాదేవి జన్మస్థలంగా పేరొందిన నేపాల్‌లోని జనక్‌పూర్ నుంచి ఈ శిలల రోడ్డుమార్గ ప్రయాణం మొదలైంది.

జనం సొమ్మును బీజేపీ నేతలకు దోచిపెట్టే కుట్ర

బర్ధమాన్: సొంత పార్టీ నాయకులకు లబ్ధి చేకూర్చడానికి కేంద్రంలోని అధికార బీజేపీ ఆరాటపడుతోందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విమర్శించారు. ఇందుకోసం ఎల్ఐసీ, జాతీయ బ్యాంకుల్లో జనం దాచుకున్న సొమ్మును ఉపయోగించుకుంటోందని అన్నారు. ప్రజల డబ్బును సొంత పార్టీ నేతలకు దోచిపెట్టాలన్నదే బీజేపీ పన్నాగమని మండిపడ్డారు. ఆమె గురువారం పూర్వబర్ధమాన్ జిల్లాలో ఓ కార్యక్రమంలో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ అబద్ధాల పుట్ట అని దుయ్యబట్టారు. బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత షేర్ మార్కెట్ భారీగా నష్ట పోయిందని గుర్తు చేశారు.

554 మంది జడ్జీల్లో 430 మంది జనరల్ కేటగిరీయే

న్యూఢిల్లీ: 2018 నుంచి హైకోర్టు జడ్జీలుగా నియమితులైన 554 మందిలో 430 మంది జనరల్ కేటగిరీకి చెందిన వారేనని న్యాయ శాఖ మంత్రి కిరెన్ రిజిజు రాజ్యసభలో తెలిపారు. మిగిలిన వారిలో 58 మంది ఇతర వెనుకబడిన కులాలకు, 19 మంది షెడ్యూల్ కులాలకు చెందిన వారు కాగా, కేవలం ఆరుగురు షెడ్యూల్ తెగలకు, 27 మంది మైనారిటీలని వివరించారు. మొత్తమ్మీద 84 మంది మహిళా జడ్జీలున్నారని చెప్పారు. మొత్తం జడ్జీల్లో జనరల్ కేటగిరీకి చెందిన వారే 77% పైగా ఉన్నారన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల నియామకాలకు రిజర్వేషన్లు లేవని మంత్రి పేర్కొన్నారు. అత్యున్నత న్యాయ వ్యవస్థలోనూ సామాజిక వైవిధ్యం సాధించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. జడ్జీల నియామకాలకు ప్రతిపాదనలు పంపే సమయంలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళా జడ్జీల పేర్లను కూడా పరిశీలించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను కోరుతోందని వెల్లడించారు. 2018 నుంచి ఇప్పటి వరకు సుప్రీంకోర్టులో 30 మంది జడ్జీలు నియమితులయ్యారని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న జిల్లా జడ్జీల్లో 612 మంది ఎస్సీలు, 204 మంది ఎస్టీలు, 1,329 మంది ఓబీసీలు, 1,406 మంది మహిళలు ఉన్నారని ఒక ప్రశ్నకు సమాధానంగా పేర్కొన్నారు.

ఆస్ట్రేలియా కరెన్సీపై బ్రిటిష్ రాజరికం కనుమరుగు

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియా మరో బ్రిటిష్ వలసపాలన తాలూకు గుర్తును చెరిపేసుకుంటోంది. అక్కడి 5 ఆస్ట్రేలియా డాలర్ల కరెన్సీ నోటుపై ఇన్నాళ్లు బ్రిటిష్ రాణి ఎలిజబెత్ ముఖచిత్రాన్ని ముద్రించారు. రాణి ఎలిజబెత్ అస్తమయం తర్వాత రాజుగా పగ్గాలు చేపట్టిన కింగ్ ఛార్లెస్ ముఖచిత్రాన్ని 5 డాలర్ల కరెన్సీ నోటుపై ముద్రించాలని భావించట్లేదని ఆస్ట్రేలియా కేంద్ర బ్యాంక్ తాజాగా ప్రకటించింది. అయితే, ఛార్లెస్ ఫొటో ఉండే కొత్త నాణేలను మాత్రం ఈ ఏడాది చివరిలోపు చలామణిలోకి తీసుకురానున్నారు. ఇన్నాళ్లు ఒక్క 5 డాలర్ల నోటుపైనే బ్రిటిష్ రాజరిక ఆనవాళ్లు ఉండేవి. ఎలిజబెత్ ఫొటో తొలగింపుతో నోట్లపై నామరూపాలు పోయినట్లే. ఈ మార్పుపై ప్రభుత్వంతో చర్చించాకే ఈ తుది నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర బ్యాంక్ వెల్లడించింది. ఆస్ట్రేలియా రాజ్యాంగం ప్రకారం బ్రిటిష్ రాజరికమే అత్యున్నత పరిపాలన హోదాలో ఉంది. కానీ మారిన వర్తమాన రాజకీయ, భౌగోళిక పరిస్థితుల్లో ఆ రాజరికం కేవలం అలంకారప్రాయంగా తయారైంది. 'కొత్త నోటుకు ఒకవైపు ఆస్ట్రేలియా పార్లమెంట్, మరో వైపు ఆస్ట్రేలియా తొలితరం స్థానికుల లేదా దేశ అద్భుత ప్రకృతి అందాల ఫొటోను పొందుపరుస్తాం' అని ఆర్థిక మంత్రి జిమ్ చామర్స్ అన్నారు. కరెన్సీపై రాజరికాన్ని వదులుకోవడంపై అక్కడి రాజకీయవర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గణతంత్రదేశంగా ఆవిర్భవించే ప్రయత్నం చేస్తోందని కొందరు ఎంపీలు వ్యాఖ్యానించారు.

నాసా విద్యుత్ విమానం వచ్చేస్తోంది

కేంబ్రిడ్జ్: గగనతలంలో భారీ స్థాయిలో కర్బన ఉద్గారాలను వెదజల్లే చిన్న విమానాలకు చరమగీతం పాడేందుకు అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా నడుం బిగించింది. వాయుకాలుష్యం లేని అధునాతన విద్యుత్ విమానాన్ని సిద్ధంచేస్తోంది. ఈ ప్రయోగాత్మక విమానానికి ఎక్స్–57 అని నామకరణం చేసింది. ఈ ఏడాదే ఈ బుల్లి విమానం గగనతల అరంగేట్రం చేయనుంది. దీనిని 14 ప్రొపెల్లర్లను అమర్చారు. ఇటలీ తయారీ టెక్నామ్ పీ2006టీ నాలుగు సీట్ల విమానానికి ఆధునికత జోడించి లిథియం అయాన్ బ్యాటరీలతో పనిచేసేలా కొత్త ఎలక్ట్రిక్ ఏరోప్లేన్‌ను సిద్ధం చేస్తున్నారు. సాధారణంగా ఉండే రెండు రెక్కలకే అటు నుంచి ఇటు చివరిదాకా సమ దూరంలో ఎక్కువ బ్యాటరీలు, చిన్న మోటార్ల కలయితో ప్రొపెల్లర్లను ప్రయోగాత్మక డిజైన్‌లో అమర్చడం విశేషం. ప్రయాణసమయంలో ప్రొపెల్లర్‌తో పనిలేనపుడు వెంటనే దాని బ్లేడ్లు వెనక్కి ముడుచుకుంటాయి. దీంతో వేగం తగ్గే ప్రసక్తే లేదు. కొత్త డిజైన్ ప్రొపెల్లర్లతో శబ్దకాలుష్యం తక్కువ. ఎక్కువ సాంద్రత ఉండే గాలిలోనూ అత్యంత వేగంగా దూసుకెళ్లేలా 11 బ్లేడ్లతో ప్రొపెల్లర్లను రీడిజైన్ చేశారు. ప్రొపెల్లర్లతో జనించే అత్యంత అధిక శక్తి కారణంగా ఈ విమానాలకు పొడవాటి రన్‌వేలతో పనిలేదు. అత్యల్ప దూరాలకు వెళ్లగానే గాల్లోకి దూసుకెళ్లగలవు. ప్రస్తుతానికి 200 కిలోమీటర్లలోపు, గంటలోపు ప్రయాణాల కేటగిరీలో దీనిని ప్రవేశపెట్టాలని యోచిస్తున్నారు.

ఈడీ చార్జిషీట్‌లో కేజ్రీవాల్ పేరు

- లిక్కర్ స్కామ్ అనుబంధ చార్జిషీట్‌లో చేర్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
- విజయ్‌నాయర్ తన మనిషి అని, ఆయన్ను నమ్మొచ్చని ఢిల్లీ సీఎం చెప్పారని వెల్లడి
- ఫేస్‌టైం కాల్‌లో సమీర్ మహేంద్రుతో మాట్లాడారని ఆరోపణ
- కేజ్రీవాల్‌ను ఎవరెవరు కలిసిందీ వివరణ
- ఎమ్మెల్సీ కవిత, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్లు ప్రస్తావన



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ కుంభకోణానికి సంబంధించి ఈడీ గురువారం అనుబంధ చార్జీషీట్ దాఖలు చేసింది. ఇందులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పేరును చేర్చింది. సౌత్ గ్రూపు నుంచి రూ.100 కోట్లు తీసుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న విజయ్‌నాయర్ తన మనిషి అని, విజయ్‌ను నమ్మొచ్చని ఫేస్‌టైం కాల్‌లో సమీర్ మహేంద్రుతో కేజ్రీవాల్ అన్నారని పేర్కొంది. కేజ్రీవాల్‌ను ఎవరెవరు కలిసిందీ, ఎవరెవరు ఫోన్‌లో మాట్లాడిందీ తెలిపింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్లను మరోమారు ప్రస్తావించింది. ఈడీ దాఖలు చేసిన 428 పేజీల సప్లిమెంటరీ చార్జిషీట్‌ను రౌజ్ అవెన్యూ ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఇందులో పేర్కొన్న నిందితులు విజయ్‌నాయర్, అభిషేక్ బోయినపల్లి, శరత్ చంద్రారెడ్డి, బినోయ్‌బాబు, అమిత్ అరోరాలతో పాటు ఏడు కంపెనీలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 23కు వాయిదా వేసింది.

కిక్‌బ్యాక్‌లపై చర్చించారు!

స్కామ్‌లో కీలక వ్యక్తులతో పాటు ఆయా సంస్థల్లో పనిచేస్తున్న వారి స్టేట్‌మెంట్లను చార్జిషీట్‌కు ఈడీ జత చేసింది. అరుణ్‌పిళ్లై కవిత తరఫు ప్రతినిధిగా ఇండో స్పిరిట్స్‌లో చేరారని తెలిపింది. సౌత్ గ్రూపునకు చెందిన కవిత, మాగుంట, అభిషేక్ బోయినపల్లి, శరత్‌చంద్రారెడ్డిలు ఎవరెవరితో మాట్లాడారు? ఎవరెవరితో ఎక్కడ సమావేశమయ్యారన్న అంశాలు పొందుపరిచింది. కిక్‌బ్యాక్‌ల రూపంలో ముందుగా పెట్టుబడి ఎలా తిరిగి రాబట్టాలనే అంశాన్ని పెట్టుబడిదారులు చర్చించారని పేర్కొంది. విజయ్‌నాయర్ పాలసీ రూపకల్పనలో కీలకపాత్ర పోషించాడని పేర్కొంది. మనీలాండరింగ్ కేసు పెట్టడానికి తగిన కారణాలున్నాయని తెలిపింది. సౌత్ గ్రూపులో ఎమ్మెల్సీ కవిత, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, రాఘవ మాగుంట, శరత్‌రెడ్డిలు భాగస్వాములు అని తెలిపింది. సౌత్ గ్రూపునుంచి ఆప్ నేతలకు సొమ్ములు ఎలా చేరాయో వివరించింది. ఎవరెవరిని ఏయే కారణాలతో అరెస్టు చేసిందీ తెలియజేసింది. సౌత్‌గ్రూపు నుంచి తీసుకున్న రూ.100 కోట్లలో రూ.30 కోట్లు గోవా ఎన్నికలకు ఆప్ ఖర్చు చేసినట్లు ఆరోపించింది.

కవిత, ఆమె భర్తతో భేటీ అయ్యా: సమీర్ మహేంద్రు

తన వాటా నుంచి ఆంధ్రప్రభ పబ్లికేషన్స్, ఇండియా ఎహెడ్‌లకు రూ.1 కోటి, రూ.70 లక్షలు చొప్పున ఇండో స్పిరిట్స్ నుంచి జమ చేయాలని అరుణ్‌పిళ్లై సూచించారు. శరత్‌చంద్రారెడ్డికి ఐదు జోన్లు, ఎంఎస్‌రెడ్డికి రెండు జోన్ల ద్వారా ఇండో స్పిరిట్స్‌లో రూ.5 కోట్ల పెట్టుబడితో రూ.17 కోట్లు ఆర్జించారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డితో ఢిల్లీ నివాసంలో రెండు, మూడుసార్లు భేటీ అయి మద్యం వ్యాపారంపై మాట్లాడా. ఈ సమయంలో మాగుంట కుమారుడు రాఘవ, బుచ్చిబాబు ఉన్నారు. అరుణ్‌పిళ్లై అతని అనుయాయులు అభిషేక్ బోయినపల్లి, బుచ్చిబాబులతో మాట్లాడడానికి విజయ్‌నాయర్ జూమ్ మీటింగ్ ఏర్పాటు చేశారు. అరుణ్, అభిషేక్, బుచ్చిబాబులకు రాజకీయ పలుకుబడి ఉందని వారు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు స్నేహితులని విజయ్‌నాయర్ చెప్పారు. అరుణ్‌తో ఫోను సంభాషణల్లో కవిత పేరు వచ్చింది. ఇండో స్పిరిట్స్ వెనక ఎవరు ఉన్నారో చెప్పాలని అరుణ్‌పిళ్లైను అడగ్గా తెలంగాణ సీఎం కుమార్తె కవిత ఉన్నారని, ఆమె తరఫు తాను ప్రతినిధినని చెప్పారు. హైదరాబాద్ వెళ్లి కవిత ఇంట్లో కవిత, భర్త అనిల్‌తో భేటీ అయ్యా. అరుణ్ తమ కుటుంబానికి సన్నిహితుడని ఇప్పటికే కలిసి వ్యాపారం చేస్తున్నామని కవిత చెప్పారు.

కేజ్రీవాల్, సిసోడియాలతో భేటీ అయ్యా: దినేష్ అరోరా

తొలుత సంజయ్ సింగ్‌ను కలిశా. అతని ద్వారా మనీష్ సిసోడియాను హోటల్‌లో కలిశా. సంజయ్ సింగ్ విజ్ఞప్తి మేరకు ఇతర హోటళ్ల యాజమాన్యాలు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఖర్చుల నిమిత్తం రూ.82 లక్షల చెక్కులు ఇచ్చాయి. ఐదు, ఆరు సార్లు సిసోడియాతో మాట్లాడడంతో పాటు ఒకసారి సంజయ్‌సింగ్‌తో కలిపి ముఖ్యమంత్రి నివాసంలో సీఎం కేజ్రీవాల్‌తో భేటీ అయ్యా. తొలుత విజయ్‌నాయర్‌తో పరిచయం అయింది. అనంతరం అర్జున్ పాండే, అరుణ్‌పిళ్లై , బుచ్చిబాబు, అభిషేక్ బోయినపల్లిలను నాయర్ పరిచయం చేస్తూ వీరికి తెలంగాణ ఎమ్మెల్సీ కవిత, ఏపీ ఎంపీ ఎంఎస్‌రెడ్డిలకు బాగా దగ్గరవారని తెలిపారు. సౌత్ గ్రూపు విజయ్ నాయర్‌కు రూ.100 కోట్లు అడ్వాన్స్‌గా ఇచ్చింది. బిజినెస్‌లో సౌత్‌గ్రూప్‌కు ఆరుశాతం కిక్‌బ్యాక్ కింద మొత్తంగా సుమారు రూ.210 కోట్లు వస్తుంది. సౌత్ గ్రూపునకు రూ.100 కోట్లు రికవరీ అయిన తర్వాత మిగిలిన రూ.100 కోట్లు విజయ్‌నాయర్ (ఆప్ కోసం), సౌత్ గ్రూపు పంచుకుంటారు. మద్యం వ్యాపారంపై చర్చించడంతోపాటు అడ్వాన్స్‌గా ఇచ్చిన రూ.100 కోట్లు ఎలా రికవరీ అవుతుందో కూడా చర్చించాం.

రూ.19 కోట్లు కాదు..రూ.32 కోట్లు తీసుకున్నా: అరుణ్

నవంబర్, డిసెంబర్ 2021ల్లో విజయ్‌నాయర్ ఫోన్ చేసి ఢిల్లీలోని ఇండియా హ్యాబిటెట్ సెంటర్‌లో కలవమన్నారు. ఇండో స్పిరిట్స్ నుంచి రూ.19 కోట్లు తీసుకున్నట్టుగా గతంలో ఇచ్చిన స్టేట్‌మెంట్ తప్పు. రూ.32 కోట్లు తీసుకున్నా. దీంట్లో రూ.25 కోట్లు నేరుగా నా ఖాతాలోకే వెళ్లాయి. ఒక ఈవెంట్ నిమిత్తం ఆంధ్రప్రభ పబ్లికేషన్స్‌కు ఇండో స్పిరిట్స్ ద్వారా రూ.1 కోటి, ఇండియా ఎహెడ్‌కు రూ.70 లక్షలు అందజేశా. గచ్చిబౌలిలోని శ్రీహిల్స్ దగ్గర నాలుగు ఎకరాలు కొనుగోలు నిమిత్తం వేముల హరి ద్వారా క్రియేటివ్ డెవలపర్స్‌కు రూ.5 కోట్లు అడ్వాన్స్‌గా ఇచ్చా. మార్చి 2021లో శరత్‌రెడ్డితో పాలసీ మార్పుపై చర్చించాం. మే 2021న బంజరాహిల్స్‌లోని ఎమ్మెల్సీ కవిత నివాసంలో అభిషేక్ బోయినపల్లిని కలిశా. అక్కడే శరత్‌రెడ్డికి అభిషేక్‌ను పరిచయం చేశా. ఢిల్లీ సీఎం కార్యాలయం పక్కనే విజయ్ నాయర్ నివాసం ఉంటారు. ఆప్ సోషల్ మీడియా చూసేది కూడా విజయ్‌నాయర్ కావడంతో అతడిపై కేజ్రీవాల్‌కు పూర్తి నమ్మకం ఉంది. మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఏర్పాటు చేసిన సమావేశంలో రాఘవ, నాగరాజరెడ్డిలు కూడా పాల్గొన్నారు. న్యూ పాలసీపై ఢిల్లీ సీఎంతో తాను మాట్లాడానని, కేజ్రీవాల్ తనని ఢిల్లీ లిక్కర్ ట్రేడ్‌కు ఆహ్వానించారని మాగుంట తెలిపారు. ఇండో స్పిరిట్స్‌లో ఎమ్మెల్సీ కవిత తరఫున భాగస్వామిని. కవితకు చాలా కాలంగా స్నేహితుడిని. ఇండో స్పిరిట్స్ లాభాలతో ఏం చేయాలనేది ఇంకా డిసైడ్ చేసుకోలేదు. సమీర్ మహేంద్రు, కవితలు ఫేస్ టైంలో మాట్లాడుకునే ఏర్పాటు చేశా. ఒకసారి హైదరాబాద్‌లో నేరుగా కలుసుకునే ఏర్పాటు చేశా. ఇండో స్పిరిట్స్‌లో అసలు పెట్టుబడిదారు కవిత అని సమీర్ మహేంద్రుకు చెప్పా. శరత్‌రెడ్డి హోల్‌సేల్ బిజినెస్‌లో ఎంటర్ కాలేదు.

అభిషేక్ పలుమార్లు డబ్బిచ్చారు: గౌతమ్ ముత్తా

ఇండియా ఎహెడ్ న్యూస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఏఎన్‌పీఎల్)లో పెట్టుబడులు పెట్టాలని అభిషేక్ బోయినపల్లిని కోరా. పెట్టుబడి మొత్తం కంపెనీ ఖాతాకు కాకుండా నాకు ఇవ్వాలని కోరా. ఐఏఎన్‌పీఎల్‌కు రూ.50 లక్షల చెక్కు అభిషేక్ ఇచ్చారు. దీన్ని కొన్ని కారణాల వల్ల తిరిగి ఇచ్చేశా. ఛానల్ నడపడానికి వ్యక్తిగతంగా ఇవ్వాలని కోరగా 10.11.2020న రూ.1.08 కోట్లు బదిలీ చేశారు. అనంతరం జెడ్ఎన్‌పీఎల్ షేర్లు రూ.5.80 కోట్లకు కొనుగోలు చేసి నన్ను, అభిషేక్‌ను డైరెక్టర్లుగా అపాయింట్ చేయాలని కోరా. దీని నిమిత్తం జెడ్ఎన్‌పీఎల్‌కు రూ.75 లక్షల రుణం ఇచ్చా. దీన్ని షేర్ల కొనుగోలులో అడ్జస్ట్ చేశారు. అనంతరం ఇండియా ఎహెడ్ ఐపీఆర్ సొంతమైన ఆంధ్రప్రభ పబ్లికేషన్ లిమిటెడ్‌కు రూ.1.30 కోట్లు బదిలీ చేశా. ఇండియా ఎహెడ్ ట్రేడ్‌మార్క్‌ను నా పేరుమీద బదిలీ చేసుకున్నా. ఈ క్రమంలో పలుతేదీల్లో అభిషేక్ రూ.6.53 కోట్లు బదిలీ చేశారు.

సమీర్ తదితరులతో సమావేశమయ్యా:

అభిషేక్ బోయినపల్లి స్టేట్‌మెంట్: విజయ్ నాయర్ ఆప్‌కు బాగా దగ్గర. విజయ్ ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ 2021–22 రూపొందించారని అరుణ్ పిళ్లై తెలిపారు. శరత్‌చంద్రారెడ్డి రిటైల్ జోన్స్ రన్ చేయడానికి ఆసక్తి చూపారు. తాజ్ హోటల్‌లో సమీర్ మహేంద్రు, అరుణ్‌పిళ్లై, శరత్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, రాజేశ్ మిశ్రా బినోయ్‌బాబు, బుచ్చిబాబులతో సమావేశమయ్యా. 10 రిటైల్ ఎల్7 లైసెన్సులు మాగుంట, సమీర్‌మహేంద్రు, శరత్‌రెడ్డిలకు వచ్చినందుకు సెలబ్రేట్ చేసుకున్నాం. సమీర్‌కు రెండు, మాగుంటకు మూడు, శరత్‌రెడ్డిలకు ఐదు ఎల్7 లైసెన్సులు వచ్చాయి. అరుణ్, బుచ్చిబాబు, విజయ్‌నాయర్‌తో మరోసారి సమావేశమయ్యా. ఈ సమయంలోనే గౌతమ్ ముత్తాకు రూ.75 లక్షలు ఎందుకు ఇచ్చారన్న అంశంపై చర్చ జరిగింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం | 3 | ఫిబ్రవరి | 2023

దివ్యాంగ కార్యకర్తల నిరసన



శివాజీనగర: రాష్ట్రంలో నగర, గ్రామీణ ప్రాంతాల్లో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 6,860 మంది దివ్యాంగులకు గౌరవ వేతనం, కార్యకర్తల ఉద్యోగాల పర్మనెంట్ చేయటంతో పాటు వివిధ డిమాండ్ల పరిష్కరించాలని కోరుతూ నవకర్ణాటక దివ్యాంగుల గౌరవవేతన కార్యకర్తల సంఘం ఫ్రీడం పార్క్‌లో ధర్నా చేసింది. ఉన్నచోటే సామాజిక విద్యా ఆర్థిక పునర్వసతి సేవలను కల్పించాలని, స్కాలర్‌షిప్‌లు, ద్విచక్ర వాహనాలు, నెల పింఛన్, ఉద్యోగం తదితరాలను కల్పించాలని కోరారు.

న్యూస్‌రీల్

ఎయిర్‌పోర్టులో ఉద్యోగాలని తప్పుడు ప్రచారం



శివమొగ్గ: శివమొగ్గ నగరానికి సమీపంలో నిర్మాణంలో ఉన్న విమానాశ్రయంలో ఉద్యోగాలు కల్పిస్తామని వస్తున్న ప్రకటనలను నమ్మొద్దని జిల్లా ఎస్పీ జీకే మిథున్ కుమార్ తెలిపారు. మోసపూరిత ప్రకటనలపై ఎస్పీ సందిస్తూ విమానాశ్రయ పనులు జరుగుతున్నాయని, నియామకాలు జరగలేదని, ఇంతలోనే సోషల్ మీడియాలో వస్తున్న ప్రకటనలు అన్నీ అబద్ధమని, వాటిని నమ్మి యువత మోసపోవద్దని హెచ్చరించారు.

కోడిగుడ్ల దాడిలో జిల్లా బహిష్కారానికి సిఫార్సు

మైసూరు: కాంగ్రెస్ మాజీ సీఎం సిద్దరామయ్య కొడగు జిల్లా పర్యటనలో ఉన్న సమయంలో ఆయన కారు మీదికి కోడిగుడ్లను విసిరిన కేసులో ఇద్దరిని అధికారులు జిల్లా బహిష్కరణకు సిఫార్సు చేశారు. మడికెరి నగరసభ నామినేటెడ్ సభ్యుడు కవన్ కావేరప్ప, హిందూ యువ వాహిని జిల్లా సంచాలకుడు వినయ్‌లు నిందితులు. గత అక్టోబరులో వరద నష్టాలను పరిశీలించడానికి సిద్దు అక్కడకు వచ్చినప్పుడు కోడిగుడ్లు విసిరినట్లు కేసు నమోదైంది. విచారణ జరిపిన మడికెరి సబ్ కలెక్టర్ వారిపై జిల్లా బహిష్కరణ చర్యలు తీసుకోవాలని కోర్టుకు నివేదిక పంపారు. విషయం తెలుసుకున్న హిందూ సంఘాలు గురువారం మడికెరిలో కలెక్టర్ ఆఫీసు ఎదుట ధర్నా చేశారు.

నగర శివార్లలో చిరుత సంచారం

బనశంకరి: సిలికాన్ సిటీలో చిరుతపులుల హవా కొనసాగుతోంది. దీంతో నగరవాసుల్లో భయభ్రాంతులు నెలకొన్నాయి. బెంగళూరు శివార్లలోని గొంగడిపుర గ్రామంలో బుధవారం రాత్రి చిరుత ప్రత్యక్షమైంది. నైస్ రోడ్డు కొడిగేహళ్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గొంగడిపుర గ్రామం వద్ద చిరుత సంచరించడాన్ని గ్రామస్తులు గమనించారు. చీకటైతే చాలు రెండు పిల్లలతో కలిసి రెండు నెలలు నుంచి ఈ ప్రాంతంలో చిరుతపులి తిరుగుతోంది. దీంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రాలేకపోతున్నారు. మహిళలు, పిల్లలు భయపడుతున్నారు. వీధి కుక్కను ఎత్తుకెళ్లిందని గ్రామస్తులు తెలిపారు. అటవీ అధికారులు తక్షణం చిరుతను బంధించాలని వారు కోరారు.

ఎంపీ తేజస్వి సూర్యపై బీబీఎంపీ ఆగ్రహం

బనశంకరి: బహిరంగ ప్రదేశాల్లో గోడలపై పెయింటింగ్ వేయడాన్ని నేరంగా పరిగణించిన బీబీఎంపీ అలాంటి వారిపై సుమోటోగా కేసు నమోదు చేస్తామని హెచ్చరించింది. బెంగళూరు దక్షిణ లోక్‌సభ సభ్యుడు తేజస్విసూర్య సార్వజనిక స్థలాల్లో గోడలపై కమలం పెయింటింగ్ వేయడంతో బీబీఎంపీ ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎంపీ తేజస్విసూర్య గోడలపై కమలం పెయింటింగ్ గీసిన వీడియో వైరల్‌గా మారింది. గత నెల 31 తేదీన వీడియోలను తేజస్విసూర్య తన సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. ఎంపీగా ఉంటూ గోడలపై పెయింటింగ్ చేయడం ఎంతవరకు సమంజసమని చర్చ తలెత్తింది. ఈ విషయంపై బీబీఎంపీ ప్రత్యేక కమిషనర్ జయరామ్‌రాయపుర మాట్లాడుతూ.. దక్షిణ వలయ పరిధిలో గోడలపై కమలం చిత్రం పెయింటింగ్ చేసినట్లు తమ దృష్టికి వచ్చింది. దీనిపై తాము సుమోటో కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

150 మంది కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు!

శివాజీనగర: రాబోయే అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశం గురువారం బెంగళూరు పార్టీ కార్యాలయంలో జరిగింది. సుమారు 150 నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను సిద్ధం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి రణదీప్‌సింగ్ సుర్జేవాల, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, సీఎల్పీ నేత సిద్దరామయ్య తదితరులు పాల్గొన్నారు. 130కు పైగా నియోజకవర్గాలకు ఒక్కో అభ్యర్థి పేరును హైకమాండ్‌కు సిఫార్సు చేశారు. ఈ సమావేశంలో ప్రతి నియోజకవర్గం గురించి చర్చించారు. జిల్లా కమిటీలు ప్రతిపాదించిన పేర్లను పరిశీలించారు. తీవ్ర వ్యతిరేకతలు, అభ్యంతరాలు వినిపించిన నియోజకవర్గాల్లోని అభ్యర్థుల పేరును రెండో జాబితాలో చేర్చాలని నిర్ణయించారు. తొలి జాబితాలో 150 నియోజకవర్గాల అభ్యర్థల పేర్లను మరో మూడు నాలుగు రోజుల్లో హైకమాండ్‌కు పంపుతారు. ప్రస్తుత ఎమ్మెల్యేల్లో ఒకరిద్దరిని మినహాయించి అనేక మందికి టికెట్ ఖరారవుతుందని సమాచారం. కొందరు నాయకులు వయోభారం వల్ల తప్పుకుంటూ తమ కొడుకులు, కూతుళ్లకు టికెట్ ఇవ్వాలని సిఫార్సు చేశారు.

ఇన్‌స్టాలో మోసగాళ్ల వల

- స్కూల్, కాలేజీ బాలికలకు బ్లాక్‌మెయిలింగ్
- సోషల్ మీడియాతో అత్యధిక నేరాలు ఈ యాప్‌లోనే
- నగర పోలీసులకు సవాల్





బనశంకరి: ప్రస్తుతం సోషల్ మీడియాకు యువతరం దాసోహమైంది. అక్కడే నేరగాళ్లు పంజా విసురుతున్నారు. ప్రాథమిక విద్య, పీయూ కాలేజీలో చదివే విద్యార్థులు, విద్యార్థినులు దొంగచాటుగా ఇన్‌స్టా గ్రాం అకౌంట్ తెరుస్తున్నారు. ఇందులో ఖాతా తెరవాలంటే 18 ఏళ్ల వయసు ఉండాలి. కానీ 15, 16 ఏళ్ల బాలలు మేజర్లమని నమోదు చేసి ఇన్‌స్టాలో చేరుతున్నారు. ఆ తరువాత తలెత్తే ఇబ్బందులు తల్లిదండ్రులతో పాటు సైబర్‌క్రైం పోలీసులకు తలనొప్పిగా మారాయి.

పలు కేసులు వచ్చాయి. వీడియోలు, ఫోటోలను మార్ఫింగ్ చేసి డబ్బు, ఇతర డిమాండ్ల కోసం బ్లాక్‌మెయిల్ చేయడం పెరిగింది. బ్లాక్‌మెయిలర్ల వేధింపులను తట్టుకోలేక కొందరు యువతులు తమ ప్రాణాలు తీసుకుంటున్నారు. యువతులు సోషల్ మీడియోలో ప్రొఫైల్‌ను లాక్‌చేసి ఉంచాలని పోలీసులు సూచించారు.

స్థానికంగా ఆఫీసులు ఉండాలి

నేరాల కేసుల్లో ఇన్‌స్టా గ్రాం కేంద్ర కార్యాలయాలకు ఆన్‌లైన్ ద్వారా వివరాలు పంపించి సహకారం కోరుతామని, కానీ దీనికి సరైన స్పందన లభించదని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సోషల్ మీడియా సంస్థల ఆఫీసులను బెంగళూరులో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్ షాకు రాష్ట్రంలో సోషల్ మీడియా సంస్థల ఆఫీసుల ఏర్పాటుపై విజ్ఞప్తి చేస్తామని రాష్ట్ర హోం మంత్రి అరగ జ్ఞానేంద్ర తెలిపారు.

నేరం సులభం, దర్యాప్తు కష్టం

- దేశంలో కర్ణాటక సైబర్‌నేరాల్లో ద్వితీయ స్థానంలో ఉంది. ఇలాంటి కేసులను నిర్వహిస్తున్న సైబర్ ఎకానమి అండ్ నార్కోటిక్స్ క్రైం (సెన్) పోలీసులకు సోషల్ మీడియాలో ఇన్‌స్టా గ్రామ్ అతి పెద్ద సవాల్‌గా మారింది.
- కాలేజీ కుర్రకారు ఎక్కువగా ఉపయోగిస్తున్న యాప్ ఇన్‌స్టా కావడం గమనార్హం. ఇందులోనే ఎక్కువ మోసాలు, నేరాలు జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు.
- రాష్ట్రంలో ఏడాదికి 8 వేల నుంచి 12 వేలకు పైగా సైబర్‌క్రైం కేసులు నమోదు అవుతుండగా వీటిలో 60 శాతం కేసులు సోషల్ మీడియా అయిన వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, టెలిగ్రాం, ఇన్‌స్టా ద్వారా సంభవిస్తున్నాయి.
- ఆర్థిక వంచన కేసుల్లో బ్యాంకుల నుంచి సమాచారం అందుతుంది. కానీ సోషల్ మీడియాకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తు అంత సులభతరం కాదు.
- సోషల్ మీడియా అకౌంట్ ఐడీ ఆధారంగా విచారణ చేపడతారు. కానీ సమాచారం పొందడానికి సోషల్ మీడియా కార్యాలయాలు రాష్ట్రంలో ఉండవు. దర్యాప్తు త్వరితగతిన సాగదు.



తామరతంపరగా అకౌంట్లు

కరోనా లాక్‌డౌన్ సమయంలో స్కూలు, కాలేజీ విద్యార్థినులు ఇన్‌స్టా అకౌంట్లు ఎక్కువగా తెరిచారు. ఇదే అదనుగా నేరగాళ్లు బాలిక ఫోటోలకు లైక్‌లు కొట్టి మెసేజీలు పంపి మభ్యపెట్టడం, వారి ఫోటోలు వీడియోలను తీసుకుని దుర్వినియోగం చేస్తున్నట్లు

కిరాతక భర్త

- డంబెల్‌తో భార్య హత్య
- కృష్ణరాజపురం పరిధిలో ఘోరం



కృష్ణరాజపురం: కుటుంబ గొడవలతో ఇనుప డంబెల్‌తో భార్యను కొట్టి చంపాడో కిరాతక భర్త. జీవితాంతం తోడు నీడగా చూసుకుంటానన్న పెళ్లినాటి ప్రమాణాలను తుంగలో తొక్కి దారుణంగా బలిగొన్నాడు. ఈ సంఘటన నగరంలోని కృష్ణరాజపురం పరిధిలోని రామ్మూర్తినగరలో ఉన్న హొయ్సళ స్ట్రీట్‌లో గురువారం చోటు చేసుకుంది. లిడియా (44) భర్త చేతిలో ప్రాణాలు పోగొట్టుకున్న అభాగ్యురాలు.

వివరాలు.. మోరిస్, లిడియాలకు 15 ఏళ్ల కిందట పెళ్లయింది. వీరికి ముగ్గురు కొడుకులు ఉన్నారు. మోరిస్ ప్రైవేటు ఉద్యోగం చేసేవాడు. ఉదయం ముగ్గురు పిల్లలు స్కూల్‌కు వెళ్లిన తరువాత భార్య భర్త గొడవపడ్డారు. ఈ సమయంలో ఉన్మాదిగా మారిన మోరిస్ ఇనుప డంబెల్‌ను తీసుకుని భార్య తలను నుజ్జు చేశాడు. రక్తపుమడుగులో ఆమె శవమైంది. ఇరుగుపొరుగు సమాచారం అందించడంతో రామ్మూర్తినగర పోలీసులు వచ్చి నిందితున్ని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తల్లి మరణం, తండ్రి జైలుపాలు కావడంతో పిల్లలు అనాథల్లా మారారు.


పిల్లలతో మోరిస్, లిడియా దంపతులు (ఫైల్)

డెలివరీ బాయ్‌పై దంపతుల దాడి

- అపార్టుమెంటు ముందు బాయ్స్ ధర్నా



బనశంకరి: ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన రెండు వస్తువుల్లో కొన్ని లేవని ఆర్డరుదారు, ఆమె భర్త కలిసి డెలివరీ బాయ్‌పై చెప్పులతో దాడి చేశారు. ఈ ఘటన బెంగళూరు ఎలక్ట్రానిక్‌సిటీ ప్రెస్టేజ్ సన్‌రైజ్ రాక్స్ వుడ్ అపార్టుమెంట్‌లో జరిగింది. వివరాలు... అపార్టుమెంటులో నివసించే శ్రీని ఆమె భర్త బ్లింకిట్ యాప్ ద్వారా 8 రకాల నిత్యావసర వస్తువులను బుధవారం ఉదయం ఆర్డర్ చేశారు. కొంతసేపటికి డెలివరీబాయ్ వీరేశ్ గొల్లహళ్లి నుంచి వస్తువులను తీసుకొచ్చాడు. వస్తువులను శ్రీని దంపతులు ఇంట్లోకి తీసుకెళ్లి తలుపు మూసుకుని తరువాత బయటికి వచ్చి రెండు వస్తువులు తీసుకురాలేదని ఆరోపించారు. మొత్తం వస్తువులు తెచ్చాను, డబ్బు ఇవ్వాలని బాయ్ అడిగాడు. దీంతో వారు అతనితో ఘర్షణకు దిగి కొట్టారు. చెప్పులతో కూడా దాడి చేసినట్లు బాయ్ ఆరోపించాడు.

డెలివరీ బాయ్స్ ధర్నా

బాయ్ వీరేశ్ పై దాడికి పాల్పడిన ఉత్తరప్రదేశ్ కు చెందిన మహిళ క్షమాపణ చెప్పాలని అపార్టుమెంట్ ముందు వందలాది మంది డెలివరీబాయ్స్ ధర్నాకు దిగారు. వారికి కన్నడ సంఘాలు కూడా మద్దతు పలికాయి. ఈ సమయంలో దాడికి పాల్పడిన మహిళ పారిపోయింది. పోలీసులు కూడా చేరుకున్నారు. బాధితుడు హెబ్బగోడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు పెట్టడానికి పోలీసులు నిరాకరించారు. బాయ్‌పై పోలీసులు ఒత్తిడి చేసి రాజీచేసి పంపించారని తెలిసింది. ఈ సంఘటనతో అపార్టుమెంటు వద్ద ఉద్రిక్తత ఏర్పడింది.

కాంగ్రెస్ కుంభకోణాలపై లోకాయుక్తలో ఫిర్యాదులు

బనశంకరి: మాజీ సీఎం సిద్దరామయ్య, రాబర్ట్ వాద్రాతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు, అధికారుల కుంభకోణాలపై 3,728 పేజీల ఆధారాలతో లోకాయుక్తకు ఫిర్యాదు చేశామని బీజేపీ నేత ఎన్‌ఆర్ రమేశ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పది భారీ కుంభకోణాలకు సంబంధించి సిద్దరామయ్య, రాబర్ట్ వాద్రా, మాజీ మంత్రులు కేజే.జార్జ్, కృష్ణబైరేగౌడ, యుటీ.ఖాదర్, ఎంబీ.పాటిల్, జమీర్ అహ్మద్, దినేశ్ గుండూరావ్, ఎం.కృష్ణప్ప, ఎన్ఏ.హ్యారీస్, ప్రియాకృష్ణపై ఫిర్యాదులు చేశానన్నారు. అదే విధంగా 9 మంది సీనియర్ ఐఏఎస్, ఐదుగురు కేఏఎస్ అధికారులతో పాటు 21 మంది అధికారులపై ఫిర్యాదు చేశానని, వందల కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. భారీ కుంభకోణాలకు సంబంధించి సాక్ష్యాలతో లోకాయుక్తకు ఫిర్యాదు చేశానన్నారు.


ఆధారాలను చూపుతున్న రమేశ్

సైకో డాక్టర్ వేధింపులు

- దంత వైద్యురాలి ఆత్మహత్య
- ఐటీ సిటీలో వెలుగుచూసిన ఘోరం


డెంటిస్ట్ ప్రియాంశి త్రిపాఠి

యశవంతపుర: శ్రద్ధగా చదివి దంత వైద్యురాలైంది. జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని తపిస్తే ఒక ప్రేమోన్మాది చర్యల వల్ల అర్ధాంతరంగా తనువు చాలించాల్సి వచ్చింది. సహచర వైద్యుని వేధింపులను తాళలేక దంత వైద్యురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన బెంగళూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉత్తరప్రదేశ్ లక్నోకు చెందిన దంత వైద్యురాలు ప్రియాంశి త్రిపాఠి (28) మృతురాలు.

ప్రేమించలేదని నిందలు

వివరాలు.. ప్రియాంశి ఓ ప్రముఖ ప్రైవేటు ఆస్పత్రిలో దంతవైద్యురాలిగా పని చేసేది. అదే ఆస్పత్రిలో పనిచేసే సుమిత్ అనే వైద్యుడు ప్రేమ పేరుతో ఆమెను వేధించటం ప్రారంభించాడు. ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో పాటు డబ్బుల కోసం వెంటపడేవాడు. మద్యం, సిగరెట్ తాగాలని వేధించాడు. ఆమె అతన్ని పట్టించుకోకపోవడంతో ద్వేషం పెంచుకున్నాడు. ఆమె ప్రవర్తన సరిగా లేదంటూ ఆస్పత్రిలో తప్పుడు ప్రచారం ప్రారంభించాడు. ఆమెను ఎవరూ పెళ్లి చేసుకోరని చెప్పేవాడు.

తల్లిదండ్రులు హెచ్చరించినా..

అతని ఆగడాలను తట్టుకోలేక ప్రియాంశి తల్లిదండ్రులకు చెప్పి లక్నోకు వాపస్ వచ్చేస్తానని వేడుకొంది. దీంతో ప్రియాంశి తల్లిదండ్రులు బెంగళూరుకు వచ్చి సుమిత్‌కు బుద్ధిమాటలు చెప్పారు. తరువాత కూడా అతని తల్లిదండ్రులకు ఫోన్ చేసి కొడుకు ప్రవర్తనను వివరించి తమ కూతురి తంటాకు రావద్దని హెచ్చరించారు. ఇంత జరిగినా సుమిత్‌లో మార్పు రాలేదు. మళ్లీ ఉన్మాదిగా మారి ప్రియాంశిని వేధించటం ప్రారంభించాడు. దీనితో విరక్తి కలిగిన ప్రియాంశి జనవరి 24న ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. లక్నో నుంచి తల్లిదండ్రులు అనేకసార్లు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చి ఇంటి యజమానికి కాల్ చేశారు. వెళ్లి చూడగా ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు బయటపడింది. ప్రియాంశి తండ్రి సుశీల్ త్రిపాఠి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సుమిత్‌పై సంజయ్‌నగర పోలీసులు కేసు నమోదు చేశారు. తన కూతురిని శారీరకంగా, మానసికంగా హింసించటంతోనే ఆత్మహత్య చేసుకుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

శరావతి బాధితులకు భూహక్కు ఇవ్వాలి

శివాజీనగర: శరావతి ప్రాజెక్ట్‌తో భూమి కోల్పోయిన వారికి భూమి హక్కు కల్పించే విషయమై కేంద్రానికి ప్రతిపాదన సమర్పించనున్నట్లు మాజీ సీఎం బీ.ఎస్.యడియూరప్ప తెలిపారు. గురువారం హోం మంత్రి అరగ జ్ఞానేంద్ర నేతృత్వంలో శరావతి బాధితుల సమస్యపై చర్చించారు. సమావేశం అనంతరం యడియూరప్ప మాట్లాడుతూ... శరావతి బాధితులకు భూమి హక్కు కల్పించే విషయంపై కేంద్రానికి ప్రతిపాదన సమర్పిస్తామని, తాము కేంద్ర అటవీ శాఖ మంత్రిని భేటీ చేసి విన్నవించామన్నారు. ఇప్పటికే జిల్లా యంత్రాంగం సర్వేచేసి ప్రతిపాదన సిద్ధం చేసిందన్నారు.





జల్లికట్టు రణరంగం సంప్రదాయ జల్లికట్టుకు అధికారులను అనుమతించలేదని జనం భారీఎత్తున ఆందోళన నిర్వహించారు. బెంగళూరుకు సమీపంలో తమిళనాడులోని క్రిష్ణగిరి జిల్లా హోసూరు వద్ద కామనదొడ్డి, గోపసంద్రం గ్రామాలవాసులు ధర్నా చేయడంతో హైవే స్తంభించింది. పోలీసులు లాఠీచార్జీ చేయడంతో ఉద్రిక్తత ఏర్పడింది

కేంద్ర బడ్జెట్ బాగుంది: సీఎం

శివాజీనగర: కేంద్ర బడ్జెట్ చాలా బాగుందని సీఎం బొమ్మై అన్నారు. గురువారం విధానసౌధలో ఆయన మీడియా భేటీలో మాట్లాడారు. రాష్ట్ర గ్రామీణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, రైల్వే, నగరాభివృద్ధి, నీటి సరఫరా, వ్యవసాయం, వసతి తదితరాలకు అధికంగా నిధులు లభించాయన్నారు. ప్రగతికి అనుకూలమైన బడ్జెట్ అన్నారు. ఉద్యోగం, వ్యాపారాల అభివృద్ధికి ఇది సహాయపడుతుందన్నారు. గ్రామీణ మౌలిక సదుపాయాలు, నీటి సరఫరా, రైల్వే, రోడ్ల అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు చెప్పారు.

వారసుల నుంచి జరిమానాను వసూలు చేయొచ్చు: హైకోర్టు

శివాజీనగర: జరిమానా చెల్లించాల్సిన వ్యక్తి మరణిస్తే, అతని వారసుల నుంచి ఆ జరిమానాను వసూలు చేయవచ్చని రాష్ట్ర హైకోర్టు కీలకమైన తీర్పునిచ్చింది. హాసన్‌వాసి దివంగత తోతిల్ గౌడ వారసులు వేసిన కేసులో జడ్జి శివశంకర్ అమరణ్ణవర్ ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. జరిమానా నుంచి పిటిషన్‌దారుకి మినహాయింపు ఇవ్వబడదని స్పష్టం చేసింది.

కేసు వివరాలు.. 2011 డిసెంబరులో హాసన్ అదనపు సెషన్స్ కోర్టు పిటిషన్‌దారుడు తోతిల్ గౌడకు అక్రమ విద్యుత్ వాడకం కేసులో రూ.29,204 జరిమానా విధించింది. తోతిల్ గౌడ హైకోర్టులో అప్పీల్ చేయగా విచారణ మొదలైంది. ఇంతలో అతడు మృతిచెందాడు. ఆ పిటిషన్‌ను కోర్టు కొట్టివేస్తూ, జరిమానా మొత్తాన్ని అపరాధి ఆస్తి నుంచి గాని ఆస్తి వారసుదారుని నుండి గానీ వసూలు చేయాలని ఆదేశించింది.

త్వరలో మోదీ, అమిత్‌షా పర్యటనలు

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా పుత్తూరు క్యాంప్కో సంస్థ ఈ నెల 11న నిర్వహించే సువర్ణ మహోత్సవంలో పాల్గొనడానికి కేంద్ర సహకార, హోంమంత్రి అమిత్ షా రానున్నారు. ఆయన ఇటీవలే ధార్వాడ, బెళగావిలో పర్యటించారు. మరోవైపు ప్రధాని మోదీ ఈ నెల 6న తుమకూరుకు రానుండడం తెలిసిందే. ఆపై మోదీ 13న బెంగళూరులో ఏరో ఇండియా వైమానిక ప్రదర్శనను ప్రారంభిస్తారు. తరువాత 18న చిక్కబళ్లాపురలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మళ్లీ నెలాఖరులో శివమొగ్గ విమానాశ్రయ పనులకు మోదీ శంకుస్థాపన చేయనున్నారు.

అనుమానంతో భార్యకు కత్తిపోట్లు


నిందితుడు రాజేశ్ (ఫైల్)

యశవంతపుర: అక్రమ సంబంధాల గొడవలతో ఓ చోట భార్యపై భర్త, మరోచోట భర్తపై భార్య దాడులు చేశారు. వివరాలు... గురువారం ఉదయం హాసన సిద్దయ్య నగరలో నివాసం ఉంటున్న రాజేశ్‌కు భార్యపై అనుమానం ఏర్పడింది. 10 రోజుల నుంచి ఇద్దరి మధ్య గొడవ జరుగుతోంది. ఎందుకు రగడ పడతారని ఇరుగుపొరుగు మందలిస్తే రాజేశ్ వారితోనూ ఘర్షణ పడ్డాడు. చాకుతో ఆదిత్య అనే యువకుడిని పొడవడంతో గాయాలయ్యాయి. అదే ఆవేశంతో భార్యను కూడా పొడవడంతో తీవ్ర గాయాలపాలైంది. స్థానికులు బాధితులను ఆస్పత్రికి తరలించారు. పెన్షన్ మొహల్లా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

భర్తపైకి కారుతో దాడి

భార్య వెంట తిరుగుతున్న వ్యక్తిని ప్రశ్నిస్తే కారు ఎక్కించి హత్యకు యత్నించిన ఘటన మంగళూరు వద్ద పుత్తూరులో జరిగింది. బంట్వాళ పెరువాయికి చెందిన సుధీర్ కుమార్, కాసరగోడకు చెందిన యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరి మధ్య విభేదాలు కావటంతో ఆమె దూరంగా ఉంటోంది. హరిప్రసాద్‌తో సంబంధం పెట్టుకొంది. ఇద్దరూ కలిసి షికార్లు తిరిగేవారు. వారిద్దరూ కారులో వెళ్తుండగా భర్త సుధీర్ కారును అడ్డగించి ప్రశ్నించాడు. దీనితో ఆక్రోశానికి గురైన ఆ జంట కారును ఎక్కించి హత్య చేయడానికి యత్నించారని సుధీర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్లుప్తంగా

విజయపురలో 'గాలి'కి ఘనస్వాగతం



జనార్దన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

గంగావతి: విజయపుర జిల్లా చడచణ తాలూకాలో బుధవారం కేఆర్‌పీపీ సంస్థాపకులు గాలి జనార్దన్‌రెడ్డి పర్యటించారు. మార్గమధ్యంలో హలి జయంతి మహలింగ మఠానికి వెళ్లి కన్నూరి శ్రీమధురంభాపురి శాఖ గురుమఠంలోని సోమనాథ శివాచార్య ఆశీర్వాదాన్ని పొందారు. అలాగే ఈ ప్రాంతంలోని పలు మఠాలను, దేవస్థానాలను ఆయన సందర్శించారు. పలు గ్రామాల్లో ప్రజలు ఊరేగింపును నిర్వహించి పెద్ద ఎత్తున పూలవర్షం కురిపించి జనార్దనరెడ్డికి గజమాల వేసి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కాగా ఈ ప్రాంతంలో నాగఠాణ అసెంబ్లీ క్షేత్రం నుంచి తమ పార్టీ అభ్యర్థిగా శ్రీకాంత్‌ను ప్రకటించారు. ర్యాలీలో ప్రముఖులు, కన్నడ చిత్రరంగ గాయకులు, పెద్ద సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాలి లక్ష్మీ అరుణకు స్వాగతం



గాలి లక్ష్మీ అరుణను స్వాగతిస్తున్న మహిళలు

బళ్లారిఅర్బన్: కేఆర్‌పీపీ పార్టీ సంస్థాపక అధ్యక్షులు గాలి జనార్దన్‌రెడ్డి సతీమణి, నగర అభ్యర్థి గాలి లక్ష్మీఅరుణ గురువారం సాయంత్రం దేవినగర్‌లో పర్యటించారు. ఆమెకు బాణసంచాను పేల్చి, పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. తన భర్త జనార్దన్‌రెడ్డి చేసిన సేవలను గుర్తించి తనను తమ ఇంటి మహిళగా ఆదరిస్తారని ఆశిస్తూ బరిలో దిగినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తనతో పాటు తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆ ప్రాంత వాసులను కోరారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, రూరల్ టికెట్ ఆంకాక్షి అభ్యర్థి బీ.శ్రీనివాసులు, పార్టీ నగర అధ్యక్షులు సునీల్‌రెడ్డి, పదాధికారులు ప్రవీణ్‌రెడ్డి, రవి, బసవనగౌడ, శకుంతల, సిరివార గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-స్కూటర్లు అగ్నికి ఆహుతి

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా బంట్వాళ తాలూకా బీసీ రోడ్డులో ఎలక్ట్రానిక్ గోదాములో గురువారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ ద్విచక్ర వాహనాలు కాలిపోయ్యాయి. ఆకస్మికంగా మంటలు లేచి ప్రమాదం జరిగిందని యజమాని పోలీసులకు తెలిపారు. కొమాకి సంస్థకు చెందిన ఎలక్ట్రానిక్ స్కూటర్లు అనేకం ఆహుతయ్యాయి. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. భారీ మొత్తంలో ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు బంట్వాళ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పైఅంతస్తు నిర్మాణ పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి

గంగావతి: తాలూకాలోని బసాపట్నలో దేవదాయ, ధర్మాదాయ శాఖ నుంచి రూ.10 లక్షల నిధులతో శ్రీనంజుండేశ్వర కళ్యాణ మంటపం పైఅంతస్తు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి భూమిపూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కులాలు, మతాలకు చెందిన దేవస్థానాలు, కళ్యాణ మంటపాల అభివృద్ధి కోసం ప్రాధాన్యతను కల్పించి నిధులు కల్పించామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు చెన్నప్ప మళిగి, యమునప్ప వితలాపుర, సన్నక్కి నీలప్ప, జీపీ ఉపాధ్యక్షులు శ్రీకాంత్, సిద్ధలింగయ్యస్వామి గడ్డిమఠ, సిద్ధరామయ్య గురువులు పాల్గొన్నారు.

బట్టలు ఉతకడానికెళ్లి ఇద్దరు నీటి పాలు

సాక్షిబళ్లారి: బట్టలు ఉతికేందుకు వెళ్లి ఇద్దరు నీటి పాలైన ఘటన విజయపుర జిల్లా ముద్దేబిహాళ్ తాలూకాలో జరిగింది. గురువారం ఆ తాలూకా హడలగేరి సమీపంలోని కేజేబీఎన్ఎల్ కాలువ వద్దకు రసూల్(25), సమీవుల్లా(10) అనే ఇద్దరు ప్రమాదవశాత్తు కాలువలో కొట్టుకొని పోవడంతో స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది మృతదేహాలను వెలికి తీశారు. మృతులిద్దరూ బాగలకోటె జిల్లా రబకవి-బనహట్టి తాలూకా చిమ్మడ గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. ఘటనపై అక్కడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

బళ్లారిఅర్బన్: జిల్లాలోని కురుగోడు తాలూకా గుత్తిగనూరుకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులు కాలువలో పడి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. గురువారం గ్రామానికి చెందిన మణికంఠ(14), హర్షవర్ధన్(9)తో పాటు మరో చిన్నారి ముగ్గురు కలిసి కాలకృత్యాలు తీర్చుకునేందుకు కాలువ వద్దకు వెళ్లి కాలు జారి ముగ్గురు పడిపోయారు. వీరిలో ఇద్దరు మృతి చెందగా మరో బాలుడు మాత్రం ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. కురుగోడు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

దుర్వాసన..విద్యార్థులకు నరకయాతన

- పాఠశాల పక్కనే మురుగు కంపు
- ఫిర్యాదుపై స్పందించని అధికారులు



పాఠశాల ఆవరణలో ఆడుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులు



పాఠశాల పక్కనే మురుగు కాలువలో నిల్వ చేరిన డ్రైనేజీ నీరు

సాక్షి,బళ్లారి: స్వచ్ఛ భారత్ మాట అటుంచితే బావి భారత పౌరులను తీర్చిదిద్దే పాఠశాల పక్కనే మురుగు కంపు కొడుతున్నా అధికారులు స్పందించకపోవడంతో విద్యార్థులు నరకయాతనకు గురవుతున్నారు. కౌల్‌బజార్‌లోని రక్షితా కాలనీలోని అల్ సఫా ప్రైమరీ పాఠశాల పక్కనే పోతున్న మురుగు కాలువలోకి చుట్టుపక్కల ఇళ్లవారు యథేచ్ఛగా వదులుతున్న మురుగు నీరు నిల్వ చేరి విద్యార్థులకు శాపంగా మారింది. కాలనీలో పేద, అనాథ విద్యార్థుల కోసం కులమతాలకతీతంగా పాఠశాలలను నిర్మించి విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. పాఠశాలలో ఆయా సంప్రదాయాల ప్రకారం విద్యా బోధన జరుగుతోంది. కన్నడ, ఇంగ్లిష్ మీడియంలో చక్కగా విద్యాబోధన చేస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. అయితే పాఠశాల పక్కనే మురుగు కంపు కొడుతూ డ్రైనేజీ నీరు నిత్యం పారుతుండటంతో విద్యార్థులు దుర్వాసనతో పాటు దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ నీరు నిల్వ చేరకుండా, దుర్వాసన నిర్మూలనకు తగిన చర్యలు చేపట్టాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని పాఠశాల నిర్వాహకులు మహబూబ్ సాక్షికి తెలిపారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ తమ పాఠశాల పక్కనే మురుగు కాలువలో డ్రైనేజీ నీరు నిల్వ చేరకుండా చేయాలని, లేకపోతే పోరాటం తప్పదని హెచ్చరించారు.

శ్రీరాములు, సంతోష్‌లాడ్ ముద్దులు

- సోషల్ మీడియాలో ఆ వీడియో వైరల్



మంత్రి శ్రీరాములుకు ముద్దు పెడుతున్న మాజీ మంత్రి సంతోష్‌లాడ్

సాక్షి,బళ్లారి: రాష్ట్ర రవాణా శాఖా మంత్రి బీ.శ్రీరాములు, మాజీ మంత్రి సంతోష్‌లాడ్ ఇద్దరు ముద్దులు పెట్టుకోవడం సోషల్ మీడియాలో వైరల్ అయింది. గురువారం జిల్లాలోని సండూరు తాలూకా బన్నిహట్టి గ్రామంలో నిర్వహించిన పూజలో పాల్గొనేందుకు విచ్చేసిన ఇరువురు ముఖాముఖి కనబడటంతో మంత్రి శ్రీరాములుకు మాజీ మంత్రి సంతోష్‌లాడ్ ముందుకు వచ్చి ముందు పెట్టడంతో పాటు చెవిలో గుసగుసలాడటంతో అక్కడున్న వారు ఒక్కసారిగా అవ్వాక్కయ్యారు. బీజేపీలో కీలకంగా వ్యవహరిస్తున్న శ్రీరాములు, కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా ఉన్న సంతోష్‌లాడ్ ఇద్దరూ ముద్దు పెట్టుకోవడం ఏమిటని ఇటు కాంగ్రెస్, అటు బీజేపీ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న తరుణంలో ఒకరిపై మరొకరు విమర్శలు సంధించుకోవాల్సిన సమయంలో ముద్దులు పెట్టుకున్నారేమిటా? అని చర్చించుకుంటున్నారు.

కొత్త లేఔట్లలో 12 మీటర్ల రోడ్లు తప్పనిసరి

- బుడా అభివృద్ధికి మాస్టర్ ప్లాన్
- సమావేశంలో పాలకుల తీర్మానం



సమావేశంలో ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, బుడా అధ్యక్షుడు మారుతీ ప్రసాద్ తదితరులు

సాక్షి,బళ్లారి: నగర జనాభాకు అనుగుణంగా బుడా పరిధిలో లేఔట్లు కూడా అదే స్థాయిలో పెరుగుతున్న నేపథ్యంలో కొత్త లేఔట్లు వేసే ప్రతి ఒక్కరూ ఇకపై తప్పనిసరిగా 12 మీటర్ల రోడ్డు వేయాల్సిన అవసరం ఉందని బుడా అధ్యక్షుడు మారుతీ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం బుడా కార్యాలయంలో ఎమ్మెల్యేలు గాలి సోమశేఖర్‌రెడ్డి, బీ.నాగేంద్ర, బుడా అధికారులు, మెంబర్లు తదితరులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం బుడా పరిధిలో చాలా కాలనీల్లో 9 మీటర్ల రోడ్లు వేయడం వల్ల ఆయా కాలనీల్లో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెరుగుతున్న వాహనాలతో ఇళ్ల ముందు పార్కింగ్ స్థలాలు లేక ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందన్నారు. అందువల్ల ఇకపై 12 మీటర్ల రోడ్లను వేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో నగరాభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేశామన్నారు. నల్లచెరువులో డ్రైనేజీ నీరు నిలువ ఉండకుండా పక్కకు మళ్లించి హెచ్ఎల్‌సీ నుంచి రక్షిత మంచినీటి పైప్‌లైన్ వేసి నగరంలో మంచినీటి సమస్య తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రంగమందిరం సర్కిల్ వద్ద సంగొల్లి రాయణ్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

బడ్జెట్‌లో రైల్వేకు బంపర్ ఆఫర్

- నైరుతి రైల్వే జీఎం సంజీవ్ కిషోర్

హుబ్లీ: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన బడ్జెట్‌లో భారతీయ రైల్వేకు పెద్దపీట వేశారని నైరుతి రైల్వే జనరల్ మేనేజర్ సంజీవ్ కిషోర్ తెలిపారు. హుబ్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2023లో రైల్వే రంగానికి రూ.2.40 లక్షల కోట్లు పెట్టుబడిగా కేటాయించారన్నారు. ఇది 2013-14లో కన్నా 9 రెట్లు అధికమన్నారు. బొగ్గు గనులు, రసాయనిక ఎరువులు, ఇతర ఆహార ధాన్యాల పరస్పర రవాణాకు 100 నిర్ణాయక రవాణా పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. ఈ పథకానికి రూ.75 వేల కోట్లు పెట్టుబడిగా పెట్టారన్నారు. రైల్వే ప్రయాణికుల శ్రేయస్సు దృష్ట్యా రాజధాని, శతాబ్ది, దురంతో, హంసఫర్, తేజస్ వంటి ప్రీమియం రైళ్లకు గాను వెయ్యికి పైగా అదనపు బోగీలను నవీకరిస్తున్నామన్నారు. రైళ్ల వేగాన్ని పెంచడానికి కొన్ని చోట్ల వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ల ప్రారంభిస్తున్నామన్నారు. పాత రైలు మార్గాలను మార్చేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.

రాష్ట్ర స్థాయి అబాకస్‌లో పతకాల పంట



విజేత విద్యార్థులకు ప్రశస్తిని అందించిన దృశ్యం

కంప్లి: పట్టణంలోని ఏ-1 అబాకస్ సెంటర్ విద్యార్థులు గోవాలోని ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన 4వ రాష్ట్ర స్థాయి అబాకస్, మానసిక సామర్థ్య పోటీల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. పాల్గొన్న 15 మంది విద్యార్థుల్లో నలుగురు చాంపియన్‌షిప్, ముగ్గురు తొలి రన్నరప్, తలా నలుగురు రెండు, మూడవ రన్నరప్‌లుగా ఎంపికై ప్రశస్తి పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణనిచ్చిన గిరీష్ బెల్లద, సునీత బెల్లద, సహాయకులు పూజ, శిల్ప, వైష్ణవి, విద్యార్థులు పాల్గొన్నారు.

విగ్రహం తరలింపుపై ఆందోళన

హుబ్లీ: రాత్రికి రాత్రే కేహెచ్ పాటిల్ విగ్రహం తరలించడంపై కాంగ్రెస్ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. సిటీ కార్పొరేషన్ ఈతకొలను ఎదుట 31 ఏళ్ల క్రితం నెలకొల్పిన సహకార సంఘాలకు జీవం పోసిన భీష్ముడు కేహెచ్ పాటిల్ విగ్రహాన్ని సంబంధిత నిర్వాహకుల దృష్టికి తేకుండా ఇందిరా గ్లాస్ హౌస్‌లో పెట్టడంపై కాంగ్రెస్ నేతలతో పాటు సంబంధిత విగ్రహ ప్రతిష్టాన నేతలు ఆ స్థలానికి వచ్చి జిల్లా యంత్రాంగం, కార్పొరేషన్ తీరుపై విరుచుకుపడ్డారు. ప్రతిష్టాన అధ్యక్షులు, మాజీ మంత్రి హిండసగేరి మాట్లాడుతూ అభివృద్ధి పనులకు విగ్రహం అడ్డుగా ఉంటే తమకు తెలియజేస్తే తామే తొలగించే వారమన్నారు. అయితే రాత్రికిరాత్రే ఇలా చేయడం ఆయన్ను అవమానించినట్టే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సృజన వెలికితీత కోసమే కలికా హబ్బ

హొసపేట: విద్యార్థుల్లోని సృజనశీలతను వెలికితీసేందుకు విద్యాశాఖ కలికా హబ్బను ప్రారంభించిందని విజయనగర జిల్లా విద్యాశాఖ అధికారి కొట్రేశ్ తెలిపారు. ఆయన గురువారం టీబీ డ్యాం హెచ్ఈఎస్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు, తమిళ పాఠశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన కలికా హబ్బ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అంతకు ముందు విద్యార్థులు ఊరేగింపులో అనేక వేషధారణలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బీఈఓ చెన్నబసప్ప, వివిధ పాఠశాల ముఖ్యోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వార్డు ప్రముఖులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలి

బళ్లారిటౌన్: వచ్చే ఎన్నికల్లో బెళగావి జిల్లా కుడిచి నియోజకవర్గంలో కాంగ్రెస్ టికెట్‌ను ఎస్సీ, ఎస్టీ గిరిజన సముదాయాల నేత విశ్వనాథ్ రామచంద్ర గాణిగేర్‌కు ఇవ్వాలని అలెమారి గిరిజన మహాసభ, జిల్లా చెన్నదాసర సంఘం డిమాండ్ చేసింది. గురువారం ఆయా సముదాయాల నేతలు వై.శివకుమార్, రమణప్ప భజంత్రి తదితరులు విలేకరులతో మాట్లాడారు. ఆ నియోజకవర్గంలో రామచంద్ర గాణిగేర్‌కు బీ ఫాం ఇవ్వాలని ఒత్తిడి చేశారు. ప్రముఖులు రంగయ్య, సుబ్బణ్ణ, ఎర్రిస్వామి, జంబుగస్ పాల్గొన్నారు.

ఉప్పారలకు టికెట్లు ఇవ్వండి

బళ్లారిటౌన్: రాష్ట్రంలో దాదాపు 35 లక్షల జనాభా ఉన్న తమ ఉప్పార సమాజానికి వచ్చే ఎన్నికల్లో అన్ని పార్టీలు 5 చోట్ల టికెట్లు ఇవ్వాలని రాష్ట్ర ఉప్పార మహాసభ ఉపాధ్యక్షుడు సిద్దేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పత్రికా భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 40 నియోజకవర్గాల్లో తమ ఓట్లే నిర్ణాయకమని గుర్తు చేశారు. తాము రాజకీయంగా, ఆర్థికంగా, విద్యా పరంగా వెనుకంజలో ఉన్నా ఇంతవరకు చామరాజనగర్‌లో మాత్రమే ఒక ఎమ్మెల్యే ఉన్నారన్నారు. అందువల్ల తమ సమాజానికి అన్ని పార్టీలు అవకాశం కల్పించాలన్నారు. నేతలు గురుమూర్తి, మల్లన్న, భీమన్న, పంపాపతి, తిమ్మప్ప, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

మెట్లపై నుంచి పడి వ్యక్తి మృతి



మృతుడు శర్మాస్ వలీ

హొసపేట: పైఅంతస్తుకు వెళ్లేందుకు మెట్లు ఎక్కుతుండగా అదుపు తప్పి కింద పడటంతో తలకు తీవ్రగాయాలై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నగరంలోని సిద్దలింగ చౌక్‌లో జరిగింది. వివరాలు..శర్మాస్ వలీ(53) అనే వ్యక్తి గత నెల 31న ఇంటి మిద్దెపైకి వెళుతుండగా కింద పడటంతో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే బంధువులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి ప్రాథమిక వైద్యం అందించిన అనంతరం కొప్పళ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే అతను చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు టౌన్ పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు దర్యాప్తులో ఉంది.

లోకాయుక్త వలలో ఎస్సై



ఎస్సై బసవరాజ్

రాయచూరు రూరల్: సిరవారలో మద్యం అంగడి యజమాని నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటుండగా దేవదుర్గ ఎస్ఐ బసవరాజ్ లోకాయుక్త అధికారుల వలలో చిక్కాడు. మాన్వి-దేవదుర్గ రోడ్డులోని మద్యం అంగడిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఆరోపణలపై ఇటీవల ఎస్ఐ బసవరాజ్ లంచం ఇవ్వాలని అడిగాడు. దీంతో బార్ యజమాని పథకం ప్రకారం లోకాయుక్త అధికారులకు సమాచారం అందించి మంగళవారం రాత్రి ఎస్సైని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టించారు. ఈ ఘటనపై లోకాయుక్త అధికారులు కేసు నమోదు చేసుకున్నారు.

లారీ ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

బొమ్మనహళ్లి: ఆనేకల్ తాలూకాలోని అత్తిబెలి వద్దనున్న చెక్‌పోస్ట్ దగ్గర రోడ్డు పక్కన నిలబడి ఉన్న కంటైనర్‌ను వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. లారీ ముందు భాగం మొత్తం నుజ్జునుజ్జు కాగా లారీ డ్రైవర్ నాగరాజు రెండు కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. కంటైనర్‌లోకి లారీ ముందు భాగం చిక్కుకుపోయింది. డ్రైవర్‌ను బయటకు తీయడానికి ఫైర్ సిబ్బంది కొన్ని గంటపాటు శ్రమించి తీసి ఆస్పత్రికి తరలించారు. అత్తిబెలి పోలీసులు కేసు నమోదు చేశారు.

స్వామీజీతో మాజీ ఎమ్మెల్యే భేటీ



స్వామీజీ ఆశీర్వాదం అందుకుంటున్న సురేష్‌బాబు

కంప్లి: ప్రజా సమస్యలపై స్పందించినప్పుడే ప్రజలు మిమ్ములను ఆదరిస్తారని ఎమ్మిగనూరు మఠాధిపతి వామదేవ శివాచార్య తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సురేష్ బాబు వేంకటేశ్వరస్వామి దర్శనంతో పాటు తలనీలాలు సమర్పించుకొని స్వామీజీ ఆశీర్వాదం కోసం విచ్చేయగా ఆశీర్వదించి ఆయన మాట్లాడారు.

హుణిసిగిలో యువత స్వచ్ఛ సేవ

- శ్రమదానంతో కళ్యాణి శుభ్రం



బావిలో నిండిన చెత్తను తొలగిస్తున్న యువత

రాయచూరు రూరల్: పురాతన కాలం నాటి బావులను సంరక్షించాలనే సదాశయంతో యువత శ్రమదానంతో కళ్యాణిని శుభ్రం చేశారు. యాదగిరి జిల్లా హుణిసిగిలో మరుగున పడ్డ దేవర దాసిమయ్య తీర్థ క్షేత్రం బావిలో నిండిన ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు తదితరాలను తొలగించి స్వచ్ఛతకు యాదగిరి యువ బ్రిగేడ్ మంజునాథ్ నడుం బిగించారు. బుధవారం 15 మందితో కూడిన యువ బ్రిగేడ్ సభ్యులు కలిసి కళ్యాణిలోని చెత్తచెదారాన్ని తొలగించి శుభ్రం చేసి పుష్కరిణిని చూడముచ్చటగా తీర్చిదిద్దారు.

వైకుంఠవాసికి విశేషపూజలు



బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి నియోజకవర్గం పరిధిలోని బిళ్లేకహళ్లిలో వెలసిన చరిత్ర ప్రసిద్ధి చెందిన శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠ నారాయణస్వామి వారి ఆలయ వార్షికోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. మూలవిరాట్లకు ప్రత్యేక అలంకర గావించి పూజలు నిర్వహించారు. ఉడుపి విశ్వ ప్రసన్న తీర్థ స్వామీజీ ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు, హోమాలు చేశారు. ఎమ్మెల్యే ఎం.సతీష్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఇతరులు అంగళ్లు వేయరాదు

తుమకూరు: తుమకూరు జిల్లాలోని గుబ్బిలో జరుగనున్న శ్రీ చెన్నబసవేశ్వర స్వామి వారి జాతర మహోత్సవంలో ఇతర వర్గాల వ్యాపారులకు అవకాశం ఇవ్వరాదని వీహెచ్‌పీ, భజరంగదళ కార్యకర్తలు గురువారం జిల్లా కలెక్టర్ వై.ఎస్. పాటిల్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. భారీఎత్తున జరిగే చెన్నబసవేశ్వర రథోత్సవానికి వేలాదిగా భక్తులు వస్తారని, ఇతర వర్గం వ్యాపారాలు అంగళ్లు వేయకుండా చూడాలని కోరారు.

పొదల్లోకి దూసుకెళ్లిన బస్సు

తుమకూరు: కేఎస్ఆర్‌టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. జిల్లాలోని పావగడ తాలూకాలోని సింగరెడ్డిహళ్లి వద్ద వైఎస్ హోసకోటె నుంచి పావగడ వైపు బస్ ప్రయాణిస్తోంది. సింగరెడ్డిహళ్లి వద్ద ఉన్న మలుపు వద్ద వేగం అదుపు కాక రోడ్డు పక్కన కంపచెట్లలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ వెంటనే బ్రేక్ వేయడం వల్ల అక్కడితో ఆగిపోయింది. ప్రయాణికులెవరికీ గాయాలు కాలేదు.

ఎన్నికలకు సన్నద్ధం కావాలి

రాయచూరు రూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అధికారులు సంసిద్ధంగా ఉండాలని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ సూచించారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సూక్ష్మ, అతి సూక్ష్మ పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. అభ్యర్థుల ఎన్నికల నిర్వహణ వ్యయం తదితరాలపై నిఘా పెట్టాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ శశిధర్, ఎస్పీ నిఖిల్, ప్రొబేషనరీ డీసీ అపూర్వ, ఏడీసీ దురుగేష్‌లున్నారు.

డ్యూటీ సమయంలో బార్‌లో బిల్ కలెక్టర్



మందు బాటిల్‌తో బిల్ కలెక్టర్ రాఘవేంద్ర కులకర్ణి

రాయచూరు రూరల్: లింగసూగూరులోని ఓ బార్‌లో పట్టపగలే బిల్ కలెక్టర్ రాఘవేంద్ర కులకర్ణి మద్యం తాగుతున్న వీడియో వైరల్ అయింది. తాలూకాలోని మావినబావి గ్రామ పంచాయతీ బిల్ కలెక్టర్ మంగళవారం విధులకు గైర్హాజరై మందు కొడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అతనిపై చర్యలు తప్పవని సంబంధిత అధికారి తెలిపారు.

ముగ్గురు దొంగల అరెస్ట్ -18 వాహనాలు స్వాధీనం

రాయచూరు రూరల్: జిల్లాలో వాహనాలను దొంగలించిన ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 18 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెంకటప్ప నాయక్ వెల్లడించారు. బుధవారం సింధనూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయచూరు, కొప్పళ, యాదగిరి జిల్లాల్లో చోరీలు చేసిన నిందితులను గుర్తించి మస్కిలోని గాంధీనగర్‌లో పునీత్, చిన్ను, సింధనూరు వెంకటేశ్వరనగర్‌లో వీరేష్‌లను అరెస్ట్ చేశామన్నారు. స్వాధీనపరచుకున్న వాహనాల విలువ సుమారు రూ.6.50 లక్షలు ఉంటుందని అంచనా వేశామన్నారు.

కోలారు వార్తలు...

జేడీఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లే

- కాంగ్రెస్ ఎమ్మెల్యే జమీర్ అహ్మద్ ఖాన్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు

శ్రీనివాసపురం : జేడీఎస్‌కు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లేనని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి కుమారస్వామే కారణమని కాంగ్రెస్ ఎమ్మెల్యే జమీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. గురువారం తాలూకాలోని గౌనిపల్లిలో ప్రజా ధ్వని యాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జేడీఎస్ బీజేపీకి బీ టీంగా ఉందన్నారు. అందువల్ల జేడీఎస్‌కు ఎట్టి పరిస్థితిలోను ఓటు వేయొద్దన్నారు. నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసిన రమేష్‌కుమార్‌ను మళ్లీ అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఎమ్మెల్యే కె ఆర్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టే పార్టీనే అధికారంలోకి తేవాలని కోరారు. ఎమ్మెల్సీ అనిల్‌కుమార్, మాజీ మంత్రి నజీర్ అహ్మద్, జెడ్పీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసన్ పాల్గొన్నారు.

వైభవంగా బూదిబసవేశ్వర రథోత్సవం

- తాడు లేకుండానే నడిచిన రథం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయచూరు రూరల్: దేవదుర్గ తాలూకా గబ్బూరులో బూది బసవేశ్వరుని జాతర వైభవంగా జరిగింది. గురువారం ఆలయం వద్ద బూదిబసవ శివాచార్య స్వామీజీ రథాన్ని లేచి రా బసవా అని ఐదుసార్లు పిలవడంతో రథం దానంతటదే సుమారు పది అడుగుల దూరం తాడు, ప్రజల సాయం లేకుండా నేరుగా ముందుకు కదిలింది. నేత్రపర్వంగా సాగిన రథోత్సవంలో వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ప్రేమించి మోసం, యువతి ఆత్మహత్య

యశవంతపుర: బెళగావి జిల్లా అథణి తాలూకా తావంశి గ్రామంలో ప్రేమ వికటించి యువతి ఆత్మహత్య చేసుకుంది. ఇది లవ్ జిహాద్ అని స్థానికులు ఆరోపించారు. వివరాలు... తేజస్విని (21) అనే యువతిని అసిఫ్ దేశాయి అనే యువకుడు ప్రేమ పేరుతో నమ్మించాడు. పెళ్లి చేసుకొంటానని చెప్పి తరువాత ముఖం చాటేశాడు. మోసపోయానని ఆవేదనతో యువతి ఆత్మహత్య చేసుకొంది. రెండేళ్లుగా ప్రేమ పేరుతో వెంట తిప్పుకొన్నాడు. అథణి పోలీసులు అసిఫ్‌పై కేసు నమోదు చేశారు.

ఆ ఆరోపణలు నిరాధారం

కోలారు : దళిత సముదాయానికి అపార సేవలు అందించిన మాజీ సీఎం సిద్దరామయ్యపై నిరాధార ఆరోపణలు చేయడాన్ని మానుకుని ఎన్నికల్లో ఆయనను బలపర్చాలని కర్ణాటక దళిత వెల్ఫేర్ ట్రస్టు ప్రముఖుడు శాంతరాజు తెలిపారు. గురువారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సిద్దరామయ్య దళితులకు అన్యాయం చేశారంటూ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. కొంతమంది దళిత నాయకులు ప్రత్యర్థులతో కుమ్మక్కై ఇలాంటి కరపత్రాల ప్రచారం చేస్తున్నారన్నారు. సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా ఉండగా దళితుల అభివృద్ధి కోసం అనేక పథకాలను అమలు చేశారన్నారు. కోలారు నియోజకవర్గ ప్రజలు సిద్దరామయ్యపై విశ్వాసం ఉంచి ఎన్నికల్లో గెలిపించాలన్నారు. సంఘం పదాధికారులు సుందర్, రాజశేఖర్, చిక్కణ్ణ పాల్గొన్నారు.


పురాతన పుష్కరిణి ప్రారంభం

కోలారు : దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉన్న నగర నడిబొడ్డులోని నాగరకుంట పుష్కరణికి ఎట్టకేలకు మోక్షం లభించింది. చోళుల కాలంలో నిర్మించిన ఈ పుష్కరిణి నిర్వహణ సరిగా లేక శిథిలమై పోయింది. పుష్కరిణి కనుమరుగవుతుందని భావించిన స్థానికులు పుష్కరిణిని జీర్ణోద్ధరణ చేయాలని ఏళ్ల తరబడి జిల్లా యంత్రాంగాన్ని మొరపెట్టుకున్నారు. స్థానికుల ఒత్తిడితో ఎట్టకేలకు పుష్కరిణి జీర్ణోద్ధరణకు నిర్ణయించిన జిల్లా యంత్రాంగం పుష్కరిణి అభివృద్ధి కోసం నగరసభ నుంచి రూ.80 లక్షలను విడుదల చేయించింది. దీనికి దాతల సహకారం జత కావడంతో పుష్కరిణిని సుందరంగా తీర్చిదిద్ది గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా పుష్కరిణి వద్ద ధార్మిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రారంభోత్సవానికి ఎంపీ ఎస్ మునిస్వామి, ఎమ్మెల్సీ ఇంచర గోవిందరాజులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి ఆర్థిక సాయం

కోలారు : నగరంలోని కువెంపు నగర్‌లోని కనక విద్యార్థి నిలయంలో గురువారం జిల్లా కురుబ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సమాజ సేవకుడు ఆర్.మునిరాజు కురుబ సముదాయ భవన నిర్మాణానికి రూ.1.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మునిరాజు మాట్లాడుతూ సముదాయం అభివృద్ధికి పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కురుబ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకొని సముదాయ ఉన్నతికి తోడ్పడాలన్నారు. సముదాయ ప్రముఖులు మధుసూదన్, కేఎస్ఆర్టీసీ మునియప్ప, నడువళ్లి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యత



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన గ్రామస్తులు

కేజీఎఫ్ : నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చామని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే రూపా శశిధర్ తెలిపారు. బుధవారం తాలూకాలోని టి.గొల్లహళ్లి జీపీ అధ్యక్షుడితో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో రోడ్లు, మినీ విధానసౌధ, ఏపీఎంసీ మార్కెట్ తదితరాలను తీర్చిదిద్దినట్లు తెలిపారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి వారే స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారన్నారు. ఎన్నికల ముందు ప్రత్యర్థులు తనపై చేస్తున్న లేనిపోని ఆరోపణలను పట్టించుకోవద్దన్నారు.

సహకార సంఘ భవనం ప్రారంభం

కోలారు : పాడి రైతులు పాల ఉత్పత్తిలో శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తే మంచి ఆదాయాన్ని పొందవచ్చని కోముల్ డైరెక్టర్ డి.వి.హరీష్ తెలిపారు. గురువారం తాలూకాలోని వక్కలేరి ఫిర్కా జక్కనహళ్లిలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులు పశువులకు ఇంట్లోనే శాస్త్రీయ పద్ధతుల్లో తయారు చేసిన దాణాను అందించాలన్నారు. పాడి రైతుల కోసం కోముల్ అందిస్తున్న సౌలభ్యాలను వినియోగించుకోవాలన్నారు. పాల సమాఖ్య డిప్యూటీ మేనేజర్ డాక్టర్ మహేష్, చిక్కనహళ్లి డైరీ అధ్యక్షుడు సి.అమరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొన్న కారు, యువకుడి దుర్మరణం

మైసూరు: కారు బైక్‌ను ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మైసూరు నగరంలోని టి. నరిసిపుర రోడ్డులోని వసంత నగర శ్రీ లక్ష్మి కళ్యాణ మండపం సమీపంలో చోటు చేసుకుంది. మృతుడిని శ్రీరంగ పట్టణం తాలూకా కడతనాళు గ్రామానికి చెందిన జగదీష్ (31)గా గుర్తించారు. ఇతను వసంత నగర నుంచి టి.నరసిపుర రోడ్డులో బైక్‌పై వెళ్తుండగా రింగ్ రోడ్డులో కారు వేగంగా వచ్చి ఢీకొంది. తీవ్ర గాయాలతో జగదీశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ ఢీకొని....

మైసూరు: ట్రాక్టర్ బైక్‌ను ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా హుల్లహళ్లి గ్రామంలో చోటు చేసుకుంది. మృతుడిని నంజనగూడు తాలూకా శిరమళ్లి గ్రామానికి చెందిన దర్శన్ (22)గా గుర్తించారు. ఇతను స్నేహితుడితో కలిసి బైక్‌పై హుల్లహళ్లికి వచ్చి కిరాణా సరుకులు తీసుకుని తిరిగి వస్తుండగా ట్రాక్టర్ ఢీకొంది. తీవ్ర గాయాలతో దర్శన్ ఘటన స్థలంలోనే మృతి చెందాడు. స్నేహితుడికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పగటిపూట త్రీఫేస్ సరఫరా చేయాలి



బెస్కాం అధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: రైతులకు రాత్రి వేళ ఇస్తున్న కరెంట్‌ను పగటిపూట ఇవ్వాలని జేడీఎస్ నాయకుడు, మాజీ జెడ్పీ అధ్యక్షుడు సీఆర్ నరసింహమూర్తి డిమాండ్ చేశారు. గురువారం బెస్కాం కార్యాలయం చేరుకుని అధికారులతో మాట్లాడారు. రాత్రి పూట ఇవ్వడం వల్ల రైతులు విష సర్పాలు, విష జంతువుల బారిన పడుతున్నారని, త్రీఫేస్ కరెంటును పగటిపూట ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అదే ఏవిధంగా చిరుతల సంచారం కూడా భయం కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో జేడీఎస్ తాలూకు కార్యాధ్యక్షుడు నటరాజు, కోశాధికారి భాస్కర్, ఎస్సీ విభాగం అధ్యక్షుడు బోమ్మశెట్టిపల్లి రాఘవేంద్ర,ప్రభు, వెంకటేష్, శ్రీనివాసరెడ్డి, వెంకటరమణప్ప తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారాడని దాడి



గాయపడిన శివు

యశవంతపుర: కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరిన కార్యకర్తను చితకబాదిన ఘటన చిక్కమగళూరు జిల్లాలో జరిగింది. చిక్కమగళూరు జిల్లా ఎన్ఆర్‌పుర తాలూకా నాగలాపుర రావూరులో కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీలో చేరిన కార్యకర్తను మారణాయుధాలతో దాడి చేశారు. రావురుకు చెందిన శివు కాంగ్రెస్‌ను వదిలి బీజేపీలో చేరాడు. ఎమ్మెల్యే మద్దతుదారులు మారణాయుధాలతో దాడి చేసి గాయపరిచి పరారయ్యారు. ఎన్ఆర్ పుర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. శివు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

దుస్తుల దుకాణంలో గొడవ

బొమ్మనహళ్లి: ఓ దుస్తుల దుకాణంలో ఇద్దరు ఉద్యోగులు గొడవ పడి ఒకరిపై హత్యాయత్నం జరిగిన ఘటన నగరంలోని హెచ్ఎస్ఆర్ లేఔట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు... హెచ్ఎస్ఆర్ లేఔట్‌లో ఓ లెనిన్ దుస్తుల దుకాణం ఉంది. ఇందులో రాజేశ్ మిశ్రా, సురేశ్ ఇద్దరు విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల రాజేశ్ తన భార్యతో ఫోన్‌లో మాట్లాడుతుండగా సురేశ్ అక్కడికి వచ్చి వీడియో కాల్‌లో నీ భార్యను చూపించమని అడిగాడు. దీంతో రాజేశ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆగ్రహంతో రాజేశ్ కత్తెర తీసుకుని సురేశ్ కడుపులో పొడిచాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రాజేశ్‌ను అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు.

అటవీ అధికారి సస్పెండ్

యశవంతపుర: రిజర్వు ఫారెస్ట్‌లో చెట్లను నరికిన కేసులో ఉప అటవీశాఖ అధికారిపై వేటుపడింది. చిక్కమగళూరు జిల్లా ఆల్దూరు డిప్యూటీ అటవీశాఖ అధికారి దర్శన్‌ను సస్పెండ్ చేశారు. రిజర్వు అటవీ పరిధిలో ఖరీదైన చెట్లను నరికి అమ్మిన కేసులో చిక్కమగళూరు జిల్లా అటవీశాఖ అధికారులు ఆయనను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

మేకల దొంగకు దేహశుద్ధి

మైసూరు: మేకలు, గొర్రెలను అపహరిస్తున్న దొంగను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన మైసూరు జిల్లా టి.నరిసిపుర తాలూకా మాద్రహళ్లి గ్రామంలోచోటు చేసకుంది. మైసూరు గౌసియా నగరకు చెందిన రియాజ్ మాద్రహళ్లిలోని సిద్దరామయ్య అనే రైతు ఇంటి ముందు కట్టి ఉంచిన గొర్రెలను చోరీ చేస్తుండగా స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

జల్లికట్టును అడ్డుకున్నారని యుద్ధకాండ



ఆందోళనకారులను మళ్లిస్తున్న పోలీసులు



ఉద్రిక్తత మధ్య పరుగులు తీస్తున్న ఎద్దులు



రాళ్లు రువ్వడంతో ధ్వంసమైన వాహనాలు



- గోపసంద్రం వద్ద ఉద్రిక్తత
- ఎద్దుల పండుగకు పోలీసులు నో
- హైవేపై భారీగా ప్రజల ధర్నా
- వాహనాలపై రాళ్ల దాడులు
- చెదరగొట్టిన పోలీసులు

హోసూరు, క్రిష్ణగిరి: ఉత్సాహంగా జల్లికట్టు సాగాల్సిన చోట రాళ్ల దాడులు, ఉద్రిక్తత చెలరేగాయి. హోసూరు సమీపంలో నిర్వహిస్తున్న జల్లికట్టును పోలీసులు అడ్డుకోవడంతో ఆవేశానికి గురైన ప్రజలు హోసూరు– క్రిష్ణగిరి జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. పోలీసులు అడ్డుకోవడంతో తిరగబడిన ఆందోళనకారులు పోలీసులపై, వాహనాలపై రాళ్లు విసిరారు. ఈ ఘటన కామనదొడ్డి సమీపంలో గురువారం ఉదయం చోటు చేసుకొంది. కొన్ని గంటలపాటు అక్కడ అల్లర్లతో యుద్ధ వాతావరణం ఏర్పడింది.

హైవే దిగ్బంధం..

వివరాలు.. ఏటా మాదిరిగానే హోసూరు సమీపంలోని సూళగిరి తాలూకా గోపసంద్రం వద్ద గురువారం జల్లికట్టు నిర్వహించేందుకు గ్రామస్థులు ఏర్పాటు చేశారు. జల్లికట్టు ఎద్దులతో స్థలానికి చేరుకొనేలోపు ఆట నిర్వహణకు అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. ఈ వార్త దావాలనంలా వ్యాపించింది. ఆవేశానికి గురైన సుమారు 2 వేల మందికిపైగా ప్రజలు, ముఖ్యంగా యువకులు సమీపంలోని హైవేపైకి చేరుకొని ఆందోళన చేపట్టారు. ఆందోళనకారులను పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నించగా తిరగబడ్డారు. జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలపై, పోలీసులపై రాళ్లు విసిరి ప్రభుత్వ, ప్రైవేట్ వాహనాల అద్దాలను ధ్వంసం చేశారు.

భాష్పవాయు ప్రయోగం, లాఠీచార్జి..

విషయం తెలుసుకొన్న హోసూరు సబ్‌కలెక్టర్, జిల్లా ఎస్పీ సరోజ్‌కుమార్ ఠాగూర్ చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. డీఐజీ నేతృత్వంలో క్రిష్ణగిరి, ధర్మపురి, సేలం జిల్లాలకు చెందిన 300 మందికిపైగా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి భాష్పవాయు గోళాలు పేల్చి, లాఠీచార్జీలతో ఆందోళకారులను హైవే నుంచి బయటకు చెదరగొట్టారు. సుమారు 2 గంటల పాటు క్రిష్ణగిరి వైపు 12 కిలోమీటర్ల దూరం, బెంగళూరు, హోసూరు వైపు 5 కిలోమీటర్ల దూరం వాహనాలు అక్కడికక్కడే నిలిచిపోయాయి. ప్రస్తుతం అక్కడంతా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భారీగా పోలీసులు మోహరించారు. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని టెన్షన్ నెలకొంది.

నిబంధనలను పాటించలేదు: ఎస్పీ..

క్రిష్ణగిరి జిల్లాలో జల్లికట్టు నిర్వహణకు తప్పనిసరిగా అనుమతి పొందాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని, కానీ గ్రామస్థులు అనుమతి తీసుకోలేదు. అలాగే పశు వైద్యులు, ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లు ఘటనా స్థలంలో తప్పనిసరిగా ఉండాలని నిబంధనలున్నాయని, నిబంధనలు పాటించకపోవడం వల్లనే నిషేధించామని అన్నారు.

చిరుతల సంచారం



ప్రశాంత నగర్ గ్యాస్ పాయింట్ వద్ద చిరుత

గౌరిబిదనూరు: నగర శివారు ప్రాంతంలో చిరుతల సంచారం ఇప్పుడు నగర వాసులను కలవరపెడుతోంది. బుధవారం రాత్రి దాదాపు 8 గంటల సమయంలో ప్రశాంత నగర్ గ్యాస్ పాయింట్ సమీపంలో రెండు చిరుతలు, ఒక కూన నగర వాసులకు కనిపించాయని నగరసభ అధ్యక్షురాలు రూపా అనంతరాజు తెలిపారు. రెండు రోజుల క్రితం ఇక్కడే దూడను చిరుత పులి బలిగొంది. దీంతో రాత్రి వేళల్లో పశువుల పట్ల జాగ్రత్త తీసుకోవాలని ఆమె నగర వాసులకు సూచించారు. అటవీ శాఖ బోనులు ఏర్పాటు చేశారు.

హెచ్‌ఎం లైంగిక వేధింపులపై విచారణ

గౌరిబిదనూరు: నగర సమీపంలోని హీరేబిదనూరు ప్రభుత్వ అప్పర్ ప్రైమరీ పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయుడు చిక్కణ్ణపై గ్రామస్థులు విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. బుధవారం విద్యాశాఖ అధికారి శ్రీనివాసమూర్తి వచ్చి విచారణ జరిపారు. గురువు స్థానంలో ఉండి నీచ పనులకు పాల్పడుతున్నారని, అతన్ని విధుల నుంచి తప్పించాలని బాలికల తల్లిదండ్రులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. హెచ్‌ఎంకు నోటీసు ఇచ్చామని, శుక్రవారం కమిటీ ముందు వచ్చి తన వివరణ ఇవ్వాల్సి ఉందని విద్యాశాఖ అధికారి తెలిపారు. విచారణ సందర్భంగా ఎస్ఐ గోపాల్, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రెడ్డెప్ప, సర్వశిక్షణా అభియాన్ అధికారి గంగిరెడ్డి, నగరసభ సభ్యుడు సుబ్బరాజు, రాజణ్ణ, అనంతరాజు, భాగ్యమ్మ, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తాం

మండ్య: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జలజీవన్ మిషన్ పథకం అమల్లో అనేక అక్రమాలు జరిగాయని, దీనిపై లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తామని కేపీసీసీ ఉపాధ్యక్షుడు పీఎం నరేంద్ర స్వామి తెలిపారు. గురువారం మండ్య నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మండ్య జిల్లాలోని పలు గ్రామాలకు తాగునీటి సరఫరా చేసే పథకం పనులు జరుగుతున్నాయని, దీనికి సంబంధించి పైప్‌లైన్ల ఏర్పాటులో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపించారు. దీనిపై లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులకు బకాయి నోటీసులు

శివాజీనగర: బెంగళూరులోని ప్రతిష్ఠాత్మకమైన ప్రభుత్వ ఆసుపత్రులకు బకాయిపడ్డ విద్యుత్ బిల్లులు చెల్లించాలని బెస్కాం నోటీసులు ఇచ్చింది. నగరంలోని మల్లేశ్వరం కే.సీ.జనరల్ ఆసుపత్రి, జయనగరలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పలు ప్రభుత్వ ఆసుపత్రులు, పోలీస్ స్టేషన్‌లకు బెస్కాం నోటీస్ జారీ చేసింది. కేసీ జనరల్ ప్రభుత్వ ఆసుపత్రి సుమారు రూ.48 లక్షలు విద్యుత్ బిల్లు బకాయిపడింది. ఈ నేపథ్యంలో బెంగళూరు విద్యుత్ సరఫరా మండలి బకాయిపడ్డ బిల్లు చెల్లించాలని నోటీస్ జారీ చేసింది. అంతేకాకుండా కాలపరిమితిలో విద్యుత్ బిల్లు చెల్లించని పక్షంలో విద్యుత్ సరఫరా కట్ చేయనున్నట్లు హెచ్చరించింది.

ఆకట్టుకుంటున్న మేళా



మేళాలో సందర్శకుల సందడి

బనశంకరి: బెస్ట్ ఆఫ్ ఇండియా లైఫ్‌స్టైల్, ఫర్నీచర్, హ్యాండీక్రాఫ్ట్స్ అండ్ హ్యాండ్‌లూమ్ ప్రదర్శన నగర వాసులను కనువిందు చేస్తోంది. జాలహళ్లి హెచ్‌ఎంటీ మైదానంలో ఏర్పాటు చేసిన మేళాలో 120కి పైగా స్టాళ్లు ఏర్పాటు చేశారు. ప్రదర్శనలో బనారస్ సిల్క్ చీరలు మగువుల మనసు దోచేస్తున్నాయి. అంతేగాక టర్కీలైట్స్, సెరామిక్‌పోస్ట్స్, విభిన్న రకాల చీరలు, డిజైనింగ్ కుర్తాలు, బందానీ, క్రాకరీ, చికాన్‌కారీ టాప్స్, స్కర్ట్స్ యువతులను ఆకట్టుకుంటున్నాయి. ప్రదర్శన ఈనెల 28 తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

యలహంకను నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతాం



భూమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

బనశంకరి: యలహంక నియోజకవర్గాన్ని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్ తెలిపారు. గురువారం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నగరోత్థాన పథకం కింద రూ.30 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో యలహంక నియోజకవర్గంలో వంద కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో యలహంక వలయ జాయింట్ కమిషనర్ పూర్ణిమా, బీబీఎంపీ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి, బీజేపీ నేతలు ఎం.కృష్ణమూర్తి, వీవీ.రామమూర్తి, ఆర్.శ్రీనివాసులు, ఆబా.శివకుమార్, ఏఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సహాయకుడు సస్పెండ్



శివరామేగౌడ

మండ్య: అవినీతి అధికారికి మద్దతుగా నిలబడిన రెవెన్యూ మంత్రి ఆర్.అశోక్ సహాయకుడు, రెవెన్యూ ఉద్యోగి శివరామేగౌడను సస్పెండ్ చేశారు. మండ్య తహసీల్దార్ కుంసి అహ్మద్ పైన రెవెన్యూ మంత్రికి సామాజిక కార్యకర్త కేఆర్ రవీంద్ర రెండుసార్లు ఫిర్యాదులు చేశాడు. అవినీతికి పాల్పడుతున్నందున తహసీల్దార్, సిబ్బంది పైన చర్యలు తీసుకోవాలని కోరాడు. వారికి శివరామేగౌడ అండగా ఉంటున్నాడని తెలిపాడు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు విచారణ జరిపి శివరామేగౌడను సస్పెండ్ చేశారు.

ఆధార్ అప్‌డేట్ కేంద్రం ప్రారంభం



అప్‌డేట్ చేసుకుంటున్న ఎమ్మెల్యే

మైసూరు: కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో ఆధార్ కార్డు రెన్యూవల్ కేంద్రాన్ని గురువారం మైసూరు కేఆర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రామదాసు ప్రారంభించారు. తన ఆధార్ వివరాలను ఆయన అప్‌డేట్ చేసుకున్నారు. నియోజకవర్గంలోని వివేకానందనగరలో ఉన్న నామదేవ సింపి సముదాయ భవనంలో వార్డు– 59 ఆధార్ కార్డు అప్‌డేట్ ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులోనే మధుమేహం, కంటిచికిత్స శిబిరాలను కూడా ప్రారంభించారు.

ప్రహరీ పనులకు భూమిపూజ



కృష్ణరాజపురం: హోసకోటె నియోజకవర్గం ముగవాళ గ్రామ పంచాయతీ సిద్దాపుర గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు కాంపౌండ్ నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ భూమిపూజ చేశారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి మాట్లాడారు.

శాసనసభ ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరం



పోలింగ్ కేంద్రం పరిశీలనలో అధికారులు

బొమ్మనహళ్లి: వచ్చే శాసనసభ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో బెంగళూరు నగర జిల్లా పరిధిలోని ఆనేకల్ నియోజకవర్గంలో గురువారం బెంగళూరు దక్షిణ ఉప విభాగం అధికారి రఘునందన్ ఆనేకల్ పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్య రాకుండా చూసుకోవాలని తహసీల్దార్ శివప్పకు సూచించారు.

నకిలీ నోట్ల కేసులో అరెస్ట్

చింతామణి: చింతామణి పట్టణం నకిలీ నోట్ల కేసులో పోలీసులు మరొకరిని అరెస్ట్ చేశారు. గత నెల 19న పట్టణంలోని మార్కెట్ యార్డు వెనుక బార్న్ ఫౌండేషన్ భవనంలో నకిలీ నోట్ల ముద్రణ కేసులో ముగ్గురిని అరెస్ట్ చేయగా గురువారం ఇదే కేసుకు సంబంధించి తాలూకాలోని జంగమశీగనహళ్లి గ్రామానికి చెందిన దేవరాజ్‌ను పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు.

ఈవీఎం గోడౌన్లు సిద్ధం



పిల్లహళ్ల వద్ద ఈవీఎం, వీవీప్యాట్స్ గోడౌన్‌ను ప్రారంభిస్తున్న తుషార్ గిరినాథ్ తదితరులు

బనశంకరి: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బెంగళూరు నగర జిల్లా పరిధిలోని ఏడు నియోజకవర్గాల ఈవీఎం, వీవీ ప్యాట్స్ నిల్వ ఉంచే గోడౌన్లను పిల్లహళ్లి గ్రామంలో నిర్మించామని జిల్లా ఎన్నికల అధికారి, బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ తెలిపారు. గురువారం పిల్లహళ్లిలో నూతనంగా నిర్మించిన ఈవీఎం యంత్రాలు, వీవీప్యాట్స్ గోదామును తుషార్ గిరినాథ్ ప్రారంభించి మాట్లాడారు. 2023 శాసనసభ ఎన్నికలకు సంబంధించి బెంగళూరు నగర జిల్లా పరిధిలోకి వచ్చే 7 నియోజక వర్గాలు ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్స్ గోదామును కొత్తగా పిల్లహళ్లి వద్ద ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడే బెంగళూరు ఉత్తర, బెంగళూరు దక్షిణ గోదాముల నిర్మాణాలు జరుగుతున్నాయని, లోకసభ ఎన్నికల నాటికి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో బెంగళూరు నగర జిల్లా కలెక్టర్ కేఏ. దయానంద్, అదనపు జిల్లా కలెక్టర్ కృష్ణమూర్తి, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

పేదలకు ఒరిగిందేమీలేదు



పారిశ్రామికవేత్త వసంత చంద్రన్

హోసూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలకు ఎటువంటి ఉపయోగము లేదని, వారికి నిరుత్సాహమే మిగిలిందని హోసూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త వసంత చంద్రన్ ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌లో వెల్లడించిన నిధుల్లో ఉద్యోగులకు అనుకూలంగా ఉందని, గ్రామీణ ఉపాధి హామీ పథకం కుంటుపడుతుందని, రైతులకు మొండి చెయ్యిలా ఉందని విశ్లేషించారు.

తనిఖీల్లో దొరికిన బైక్ దొంగ

హోసూరు: హోసూరు ప్రాంతంలో ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న వ్యక్తిని మత్తిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు ధర్మపురి జిల్లా పాలకోడు ప్రాంతానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు వేల్‌మురుగన్ (23) రెండు రోజుల క్రితం మత్తిగిరి సమీపంలో కొత్తజీగూరు వద్ద తన బైక్‌ను నిలిపి వెళ్లాడు. తిరిగి వచ్చేలోపు ద్విచక్రవాహనం కనిపించకపోవడంతో మత్తిగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు బుధవారం సాయంత్రం వాహన తనిఖీలు చేస్తుండగా పులేంద్రన్ (32) అనే వ్యక్తి చోరీకి గురైన బైక్ మీద వెళ్తుండగా పట్టుకున్నారు. ఇతనిది తిరుపత్తూరు జిల్లా ఆలంగాయం అని గుర్తించారు. హోసూరు, మత్తిగిరి తదితర ప్రాంతాల్లో పలు ద్విచక్రవాహనాలను ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. అతన్ని అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు.

కారు ఢీకొని వృద్ధురాలు మృతి

క్రిష్ణగిరి: కారు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం క్రిష్ణగిరి–ధర్మపురి జాతీయ రహదారి తిమ్మాపురం వద్ద చోటు చేసుకుంది. వివరాలు... క్రిష్ణగిరి జిల్లా కావేరిపట్టణం సమీపంలోని దేవరముక్కుళం గ్రామానికి చెందిన వృద్ధురాలు ధనలక్ష్మి (67) తిమ్మాపురం వద్ద నడచి వెళ్తుండగా ఆ మార్గంలో వచ్చిన కారు ఢీకొంది. దీంతో ఆమె తీవ్ర రక్తగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చెరువులను నీటితో నింపుతాం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

బాగేపల్లి: కరువు ప్రాంతంగా పేరున్న బాగేపల్లి తాలూకాతో పాటు నియోజకవర్గంలో దాదాపు 24 చెరువులను అభివృద్ధి చేయడంతో పాటు చెరువుల్లో నీటిని నింపడం కోసం రూ. 74 కోట్ల వ్యయంతో హెచ్.ఎన్. వ్యాలీ పథకం పనులకు ఎమ్మెల్యే ఎస్.ఎన్ సుబ్బారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...తాలూకాలోని మిట్టెమరి సమీపంలో ఉన్న మల్లిగుర్కి గ్రామం వద్ద పనులు ప్రారంభించామని, చెరువులను నీటితో నింపితే భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని, భవిష్యత్‌లో తాగునీటి సమస్య లేకుండా చేస్తామన్నారు.

పంటల్ని పాడుచేసిన ఏనుగులు



సంచరిస్తున్న ఏనుగుల మంద

కెలమంగలం: కెలమంగలం సమీపంలోని ఉడేదుర్గం అటవీ ప్రాంతంలో మకాం వేసిన 40 ఏనుగుల మందలో 20 ఏనుగుల మంద విడిపోయి బుధవారం రాత్రి నాగమంగలం చుట్టుప్రక్కల ప్రాంతాల్లో రైతుల పంటపొలాలపై దాడి చేసి ధ్వంసం చేశాయి. ఉదయం పొలాల వద్దకెళ్లిన రైతులు పాడైన పంటలను చూసి అవాక్కయ్యారు. అటవీశాఖ సిబ్బంది చేరుకొని ఏనుగుల గుంపును ఉడేదుర్గం అటవీ ప్రాంతానికి మళ్లించారు. నాగమంగలం గ్రామానికి చెందిన రైతులు చంద్రప్పకు చెందిన బీన్స్, నారాయణప్పకు చెందిన వరి, మణికి చెందిన బంతిపూలు, క్రిష్ణప్పకు చెందిన చామంతి పంటలను పాడు చేశాయి.

నేడు మహాలక్ష్మీ ఆలయ కుంభాభిషేకం



ముస్తాబైన శ్రీమహాలక్ష్మి ఆలయం

కెలమంగలం: డెంకణీకోట తాలూకా కెలమంగలం సమీపంలోని బోడిచిపల్లి పంచాయతీ మోక్షాపురి గ్రామంలో కొత్తగా నిర్మించిన శ్రీ స్వయంభు సరస్వతి, మహాలక్ష్మిదేవి ఆలయ కుంభాభిషేక మహోత్సవం శుక్రవారం జరగనుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. గురువారం గణపతి హోమం, మృత్యుంజయ హోమం, విష్ణుసహస్ర పారాయణం, వాస్తుబలి, పీఠ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. శుక్రవారం ఉదయం గణపతి హోమంతో కార్యక్రమాలు ప్రారంభమై 9.30 గంటలకు కుంభాభిషేకోత్సవం ఘనంగా జరుగనున్నట్లు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కెలమంగలం: రెండు రోజుల క్రితం తళి సమీపంలో ఏనుగు దాడిలో మృతి చెందిన బాధిత కుటుంబానికి తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్ ఆర్థిక సాయాన్ని అందజేశారు. డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని దేవరబెట్ట గ్రామానికి చెందిన లగుమప్ప(53) అడవిలో పశువులను మేపుతుండగా ఒంటి ఏనుగు దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన లగుమప్ప ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అటవీ శాఖ బాధిత కుటుంబానికి మొదట విడతగా రూ. 50 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే టి. రామచంద్రన్ బాధితుడు లగుమప్ప భార్యకు నగదును అందజేశారు.

బాగేపల్లి జేడీఎస్ అభ్యర్థిగా డీజే

బాగేపల్లి: వచ్చే ఎన్నికల్లో బాగేపల్లి నుంచి జేడీఎస్ అభ్యర్థిగా డీజే నాగరాజు బరిలో ఉంటారని, ఇందులో ఎలాంటి మార్పు ఉండదని, అదే సమయంలో ఏ పార్టీతోను పొత్తు పెట్టుకోమని మాజీ సీఎం కుమారస్వామి స్పష్టం చేశారు. గురువారం బాగేపల్లికి వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...డీజే నాగరాజు విషయంలో మార్పు ఇక ఏదీ ఉండదని, పార్టీ తరపున ఆయనే పోటీ చేస్తారన్నారు. ప్రతి విషయంలో మంత్రి సుధాకర్ తల దూరుస్తున్నారని మండిపడ్డారు. ఆయనకు డబ్బు పిచ్చి పట్టిందన్నారు.

డప్పు కళాకారునికి సత్కారం



చింతామణి: పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన డప్పు కళాకారుడు మునివెంకటప్పను గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్ ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వ గురువుగా భారత్

తుమకూరు: భారత దేశం నేడు ప్రపంచ దేశాలను ఆకర్షిస్తోందని, విశ్వ గురువుగా మారే సమయం ఆసన్నమైందని ఏబీవీపీ జాతీయ కార్యదర్శి హర్ష నారాయణ అన్నారు. గురువారం తుమకూరు నగరంలోని గుబ్బి వీరణ్ణ రంగ మందిరంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తుమకూరు జిల్లా సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

దేశ యువత నడుం బిగిస్తే దేశం విశ్వగురువుగా మారుతుందన్నారు. సమ్మేళనాన్ని బెళ్లావి శ్రీ కారదేశ్వర మఠానికి చెందిన శ్రీ శారద వీరబసవమహా స్వామీజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా నగరంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు.


ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో అపాలస్వామికి పింఛన్ ఇస్తున్న వార్డు వెల్ఫేర్ సెక్రటరీ సునీత


విజయనగరంలో వృద్ధురాలు అందమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఉమ


గుంటూరులో నవనీతమ్మకు దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీరు రహీం


ఏలూరు రాణినగర్‌లో గాడి చిన్నమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఎ.కేశవ


విశాఖ జిల్లా గాజువాకలో చికిత్స పొందుతున్న బి.శ్రీరామ్మూర్తికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ బి.లక్ష్మీభారతి


నెల్లూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతి జిల్లా కోటపోలూరుకు చెందిన పోలమ్మకు పింఛను అందిస్తున్న బెంజిమెన్


శ్రీకాకుళం జిల్లా హుస్సేన్‌పురంకు చెందిన సరస్వతికి పింఛన్ అందిస్తున్న సూర్యనారాయణ


కాకినాడ జీజీహెచ్‌లో వృద్ధుడు మరిడియ్యకు పింఛను అందజేస్తున్న వలంటీర్ లోవలక్ష్మి


ఒంగోలు ప్రగతి కాలనీలో వృద్ధురాలు లక్ష్మమ్మకు పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ సురేష్


నంద్యాల జిల్లా శివపురంకు చెందిన చిన్న బాషు మియ్యాకు ఆస్పత్రిలో పింఛను అందిస్తున్న జాస్మిన్


నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొడవలూరు మండలం పూలతోటకు చెందిన మానం హనుమయ్య(80)కు పింఛను అందజేస్తున్న వలంటీర్ అశోక్

క్లుప్తంగా...

టెన్షన్ పెట్టిన విద్యార్థులు

- హాస్టల్ గోడ దూకి వెళ్లిపోయిన 30 మంది ఇంటర్ స్టూడెంట్స్
- తిరిగి హాస్టల్‌కు తెచ్చిన అధికారులు
- అన్నమయ్య జిల్లాలో ఘటన


లారీలో విద్యార్థులు విద్యాలయానికి తరలింపు

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట సమీపంలోని జీఎంసీ బాలయోగి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయానికి చెందిన 30 మంది ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల అదృశ్యం గురువారం కలకలం సృష్టించింది. నాలుగు గంటల ఉత్కంఠ తర్వాత విద్యార్థులే తామెక్కడ ఉన్నామో చెప్పడంతో టెన్షన్ వీడింది. పోలీసులు, అధికారుల కథనం ప్రకారం.. ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులు 30 మంది గురువారం మధ్యాహ్నం భోజనం అయ్యాక విద్యాలయం ప్రహరీ దూకి వెళ్లిపోయారు. విద్యార్థులు తరగతులకు రాక పోవడంతో అధ్యాపకులు క్లాస్ టీచర్లకు సమాచారం ఇచ్చారు. వారు హాస్టల్‌కు వెళ్లి చూడగా విద్యార్థులు లేరు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ వెంటనే రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం ఆరు గంటలకు విద్యార్థుల నుంచి ఉపాధ్యాయులకు ఫోన్ వచ్చింది. తాము బి.కొత్తకోట సమీపంలోని హంద్రీ – నీవా కాలువ వద్ద ఉన్నట్టు వారు చెప్పారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని విద్యాలయానికి తరలించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆర్డీవో మురళి, డీఎస్పీ కేశప్పలు విద్యార్థులను విచారించారు. కొందరు ఉపాధ్యాయులు వేధిస్తున్నారని, సమస్యలను చెప్పుకుందామంటే అడ్డుపడుతున్నారని విద్యార్థులు చెప్పారు.

నడిరోడ్డుపై లోకేశ్ సభ

- జాతీయ రహదారిపై ప్రజలకు ఇబ్బంది కలిగేలా ప్రసంగం
- ముందే వారించినా బేఖాతర్.. నిర్వాహకులకు నోటీసులు జారీ


పలమనేరులో హైవేపై ప్రచార రథం పైనుంచి మాట్లాడుతున్న నారా లోకేశ్

పలమనేరు(చిత్తూరు జిల్లా): టీడీపీ నేత నారా లోకేశ్ పాదయాత్ర నిబంధనలను ఉల్లంఘించి జాతీయ రహదారిపై బహిరంగ సభ నిర్వహించడంపై పోలీసులు ఆ పార్టీ నేతలకు నోటీసులు జారీ చేశారు. గురువారం పలమనేరు ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఏటీఎం సెంటర్ వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై లోకేశ్ ప్రచార రథాన్ని ఎక్కి ప్రసంగించారు. ఇది నిబంధనలకు విరుద్ధమని స్థానిక పోలీసులు నచ్చజెప్పగా లోకేశ్ వాగ్వాదానికి దిగారు. నిబంధనలు తప్పకుండా పాటిస్తామని హామీ ఇచ్చి ఉల్లంఘించడం సరికాదని స్పష్టం చేస్తూ కార్యక్రమ నిర్వాహకుడు మాజీ మంత్రి అమర్‌నాథరెడ్డి అనుచరులకు పోలీసులు నోటీసులు జారీచేశారు. నిబంధనల ప్రకారం జాతీయ, రాష్ట్ర రహదారులు, మున్సిపల్ పరిధిలో బహిరంగ సభలు నిర్వహించకూడదని తాము ముందుగానే తెలియచేశామని డీఎస్పీ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించినందున కేసు నమోదు చేస్తున్నట్టు చెప్పారు. కొందరు టీడీపీ నాయకులు పోలీస్‌స్టేషన్ ఎదుట మెయిన్ రోడ్డుపై ధర్నా చేశారు.

రాష్ట్రంలో యుద్ధం మొదలైంది: లోకేశ్
రాష్ట్రంలో యుద్ధం మొదలైందని, యువగళాన్ని చూసి సీఎం గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని నారా లోకేశ్ పేర్కొన్నారు. 2019 దాకా తనపై ఒక్క కేసు కూడా లేదని, ఇప్పుడు 19 కేసులు పెట్టినా భయపడనన్నారు. జీవో 1 లాంటివి ఎన్ని తెచ్చినా భయం లేదన్నారు. యువగళం, వారాహి ఆగదని చెప్పారు. తాను తన తాత, తండ్రిలా కాదని, వైఎస్సార్‌సీపీ పాలిట మూర్ఖుడినని వ్యాఖ్యానించారు.

శ్రద్ధ వహిస్తేనే సత్ఫలితాలు

> విద్యార్థులు 6వ తరగతిలోకి రాగానే విద్యను సీరియస్ అంశంగా తీసుకుని చదువుపై మరింతగా దృష్టి పెట్టేలా చర్యలు చేపట్టాలి. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ ఏర్పాటు, సబ్జెక్టుల వారీ టీచర్లతో పాటు బోధన కార్యక్రమాలపై అన్ని స్థాయిల్లోనూ అధికారులు, క్షేత్ర స్థాయిలోని సిబ్బంది సీరియస్‌గా వ్యవహరించాలి. మొక్కుబడిగా చేస్తే విద్యార్థుల భవిష్యత్తు దెబ్బ తింటుంది. ప్రపంచ స్థాయి పోటీని తట్టుకుని విజయాలు సాధించేలా మన విద్యార్థుల్లో ఇంగ్లిష్ ప్రావీణ్యం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం కేంబ్రిడ్జి, టోఫెల్ (టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ యాజ్ ఎ ఫారిన్ లాంగ్వేజ్‌ను ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీసెస్–ఈటీఎస్ అనే సంస్థ నిర్వహిస్తుంది) లాంటి సంస్థల భాగస్వామ్యాన్ని కూడా తీసుకోవాలి. 3వ తరగతి నుంచే పరీక్షలు నిర్వహించి పిల్లలకు సర్టిఫికెట్లు జారీ చేసేలా కార్యక్రమాలు రూపొందించాలి. అప్పుడు మరిన్ని మంచి ఫలితాలుంటాయి.
> – సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విద్యా రంగంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా వేల కోట్ల రూపాయలు వెచ్చించి అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను తరచూ సమీక్షించడంతో పాటు, అవి పూర్తి స్థాయిలో సత్ఫలితాలు ఇచ్చేలా క్షేత్ర స్థాయి వరకు నిరంతర పర్యవేక్షణ ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మనబడి నాడు–నేడు, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద పథకాల్లో ఎక్కడా ఎలాంటి లోపాలు తలెత్తకుండా అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు మరింత మెరుగు పడేలా బోధనాభ్యసన కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆంగ్ల మాధ్యమ బోధన, డిజిటల్ తరగతుల ఏర్పాటు తరుణంలో అధికారులు ఆ దిశగా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో పాఠశాల విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరంతర సమీక్ష, పర్యవేక్షణ వల్ల విద్యాకానుక దగ్గర నుంచి పాఠ్యాంశాల వరకు.. మౌలిక సదుపాయాల కల్పన దగ్గర నుంచి గోరుముద్ద వరకు నాణ్యత పెరుగుతుందన్నారు. పిల్లలకు అద్భుతమైన స్కూలు వాతావరణం అందుబాటులో ఉంటుందని, తద్వారా చదువుపై వారు మరింత ఏకాగ్రత చూపగలుగుతారని చెప్పారు. ఏటా విద్యా కానుక కింద ఇస్తున్న వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించాలని, నాణ్యతలో రాజీ ఉండకూడదని ఆదేశించారు. పాఠ్య పుస్తకాల్లో పేపర్ క్వాలిటీగా ఉండేలా చూడాలన్నారు. వచ్చే ఏడాది అందించాల్సిన విద్యా కానుక కిట్‌లను ఈ విద్యా సంవత్సరం ఆఖరుకే స్కూళ్లకు చేర్చాలని చెప్పారు. మార్చిలో మొదలు పెట్టి ఏప్రిల్ చివరి నాటికి విద్యా కానుక వస్తువులన్నింటినీ స్కూళ్లకు చేరుస్తామని, స్కూళ్లు తెరిచే నాటికి పిల్లలకు విద్యా కానుక కిట్ అందిస్తామని అధికారులు చెప్పారు. గోరుముద్దలో భాగంగా రాగి మాల్ట్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమీక్షలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..


విద్యార్థులకు అందించే బూట్ల నాణ్యతను పరిశీలిస్తున్న సీఎం జగన్

ఐఎఫ్‌పీల ద్వారా బోధనపై మరింత నిశిత దృష్టి

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందించేందుకు వీలుగా ఐఎఫ్‌పీ(ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్)లను ఏర్పాటు చేస్తున్నాం. 6వ తరగతి ఆపై ప్రతి తరగతి గదిలోనూ వీటిని ఏర్పాటు చేస్తున్నాం. వీటి వల్ల బోధన, నేర్చుకోవడం మరింత సులభతరమవుతుంది. 6వ తరగతి కన్నా దిగువ తరగతులకు టీవీ స్క్రీన్లను అందుబాటులోకి తెస్తున్నాం. తర్వాత 8వ తరగతి నుంచి ట్యాబ్‌లిస్తున్నాం. దీని వల్ల ఇంటి దగ్గర కూడా పిల్లలు ఆడియో, వీడియో, గ్రాఫిక్స్ ఎలిమెంట్స్ ఉన్న పాఠ్యాంశాలను నేర్చుకునే అవకాశం కల్పించాం.
- వచ్చే విద్యా సంవత్సరానికల్లా ఐఎఫ్‌పీ, టీవీ స్క్రీన్లను స్కూళ్లలో ఏర్పాటు చేయాలి. వీటిని ఏర్పాటు చేసినప్పుడే నాడు–నేడు పూర్తవుతుంది. 8వ తరగతిలోకి వచ్చే విద్యార్థులకు ట్యాబులను వచ్చే విద్యా సంవత్సరంలో స్కూళ్లు ప్రారంభమయ్యేలోగా అందించేలా చర్యలు తీసుకోవాలి. సబ్జెక్ట్ టీచర్లు, పాఠ్య పుస్తకాల్లో అంశాలు, ట్యాబుల్లోని బైజూస్ కంటెంట్, ఐఎఫ్‌పీ కంటెంట్.. మొత్తంగా పూర్తి సినర్జీతో ఉండాలి.
- టీచర్లకూ ఇంగ్లిష్‌పై పట్టు పెరిగేందుకు శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. విద్యార్థులు క్రమంగా ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడంలో మెరుగైన ప్రావీణ్యం సాధించాలి. ట్యాబ్‌ల వినియోగం, పాఠ్యాంశాలను నేర్చుకుంటున్న తీరుపై పిల్లల తల్లిదండ్రులకు ఫీడ్‌బ్యాక్ అందించాలి.
- నాడు–నేడులో మొత్తం 11 రకాల మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోంది. వీటిలో లోపాలుంటే వెంటనే సరిదిద్దాలి.

మార్చి 2 నుంచి పిల్లలకు రాగి మాల్ట్

జగనన్న గోరుముద్దలో భాగంగా వారంలో మూడు రోజులు ఉదయం పూట విద్యార్థులకు రాగి మాల్ట్ అందించాలి. మార్చి 2వ తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలి. మరో మూడు రోజులు చిక్కి అందించాలి. ఈ కార్యక్రమం వల్ల పిల్లల్లో రక్తహీనత (ఐరన్ లోపం)ను నివారించవచ్చు.

అధికారులు ఏం చెప్పారంటే..

- సబ్జెక్ట్ టీచర్ విధానంతో అర్హతలున్న టీచర్లు అందుబాటులోకొచ్చారు.
- గతంలో 3, 4, 5 తరగతుల పిల్లలకు సబ్జెక్టుల వారీగా బోధన లేదు. ఇప్పుడు వీరికి మంచి బోధన అందుతోంది.
- ఐఎఫ్‌పీల కొనుగోలు టెండర్ జ్యుడీషియల్ ప్రివ్యూకు వెళ్లింది.
- ట్యాబ్‌ల వినియోగంలో వైఎస్సార్ కడప, విజయనగరం, చిత్తూరు జిల్లాల విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో ఉన్నారు.
- మొదటి దశ నాడు–నేడుపై, మౌలిక సదుపాయాలకు సంబంధించి ఆడిట్ పూర్తయ్యింది.

అంగన్‌వాడీలు, హాస్టళ్లలోనూ నాడు–నేడు

- మొదటి దశలో 15,715 స్కూళ్లను అభివృద్ధి చేసిన ప్రభుత్వం రెండో దశలో 23,221 స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. మూడో దశలో 16,968 స్కూళ్లను మౌలిక వసతులతో తీర్చిదిద్దనుంది. వీటితోపాటు అంగన్‌వాడీలు, హాస్టళ్లను కూడా నాడు–నేడు కింద అభివృద్ధి చేస్తోంది.
- సమీక్షలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, విద్యా శాఖ సలహాదారు సాంబశివారెడ్డి, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్, పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేష్‌కుమార్, పాఠశాల మౌలిక వసతుల శాఖ కమిషనర్ కాటమనేని భాస్కర్, ఇంటర్ విద్య కమిషనర్ ఎం వీశేషగిరిబాబు తదితరులున్నారు.

నేడు 'జగనన్న విదేశీ విద్యా దీవెన'

- టాప్ 200 విదేశీ వర్సిటీల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు సాయం
- 213 మందికి తొలి విడతగా రూ.19.95 కోట్లు
- బటన్ నొక్కి ఖాతాల్లో జమ చేయనున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణాలకు చెందిన పేద విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా టాప్ యూనివర్సిటీల్లో ఉన్నత విద్యనభ్యసించేలా ఆర్థిక సాయం అందించే జగనన్న విదేశీ విద్యా దీవెన అమలుకు సీఎం జగన్ శుక్రవారం శ్రీకారం చుట్టనున్నారు. ఈ ఏడాది టాప్ 200 విదేశీ యూనివర్సిటీల్లో అడ్మిషన్లు పొందిన 213 మందికి మొదటి విడత సాయంగా రూ.19.95 కోట్లను క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు జమ చేయనున్నారు.

జగనన్న విదేశీ విద్యా దీవెన ఇలా
నాణ్యమైన విద్యకు పట్టం కడుతూ క్యూఎస్ ర్యాంకింగ్స్ ప్రకారం టాప్ 200 యూనివర్సిటీల ఎంపిక చేతురు. టాప్ 100 విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు గరిష్టంగా రూ.1.25 కోట్ల వరకు, మిగిలిన వారికి గరిష్టంగా రూ.కోటి వరకు 100% ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్. 100 – 200 క్యూఎస్ ర్యాంకింగ్ యూనివర్సిటీల్లో సీట్లు పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు 100% ట్యూషన్ ఫీజు గరిష్టంగా రూ.75 లక్షల వరకు రీయిబర్స్‌మెంట్ చేస్తారు. మిగిలిన విద్యార్థులకు గరిష్టంగా రూ.50 లక్షలు లేదా ట్యూషన్ ఫీజులో 50 శాతం ఏది తక్కువైతే అది చెల్లిస్తారు. విదేశీ విశ్వవిద్యాలయాలకు వెళ్లే విద్యార్థులకు విమాన, వీసా చార్జీలను సైతం ప్రభుత్వం రీయింబర్స్ చేస్తోంది.

నెల్లూరు రూరల్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఆదాల

- సమన్వయకర్తగా నియామకం
- పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడి
- కోటంరెడ్డి బాధితులు పార్టీలోకి వచ్చేందుకు సిద్ధం : ఆదాల

సాక్షి, అమరావతి: నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. వచ్చే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా ఆదాల ప్రభాకరెడ్డే పోటీ చేస్తారని ప్రకటించారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌తో సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రాంతీయ సమన్వయకర్త బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు సమావేశమయ్యారు. అనంతరం సజ్జల మీడియాతో మాట్లాడారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి 2024 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రకటించిన ఆడియో ఇటీవల సర్క్యులేట్ అయ్యిందని గుర్తు చేశారు. టీడీపీలోకి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నాక కోటంరెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఖాళీ అయిన నెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త స్థానాన్ని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డితో సీఎం వైఎస్ జగన్ భర్తీ చేశారని వివరించారు. బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఇకపై ఆదాల ద్వారానే అన్ని కార్యక్రమాలు జరుగుతాయని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఆదాల విజయం నల్లేరుపై నడకేనని ధీమా వ్యక్తం చేశారు.


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు

నన్ను నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా నియమించినందుకు పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు. నాపై పెట్టిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తా. పార్టీ నేతలు, కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటా. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడానికి శాయశక్తులా కృషి చేస్తా. కోటంరెడ్డితోపాటు ఆయన అనుచరులు ఎవరైనా టీడీపీలోకి వెళ్తారేమోగానీ ఆ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఎవరూ వెళ్లరు. కోటంరెడ్డి దౌర్జన్యాలకు బలైన టీడీపీ నేతలు, కార్యకర్తలు భారీ ఎత్తున వైఎస్సార్‌సీపీలోకి చేరడానికి సిద్ధంగా ఉన్నారు. కోటంరెడ్డి వెళ్లిపోవడం వల్ల వచ్చే నష్టమేమీ లేదు.

– ఆదాల ప్రభాకర్‌రెడ్డి,
నెల్లూరు రూరల్ నియోజకవర్గం
వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

ఏపీ ఇన్ పార్లమెంట్

కొవ్వాడ అణువిద్యుత్‌పై వెస్టింగ్ హౌస్‌తో చర్చలు

- రాజ్యసభలో ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు

సాక్షి, న్యూఢిల్లీ: కొవ్వాడలో ఆరు అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకోసం వెస్టింగ్‌హౌస్ కంపెనీ (అమెరికా)తో చర్చలు జరుపుతున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ వెల్లడించారు. రాజ్యసభలో గురువారం వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వకంగా జవాబిచ్చారు. వెస్టింగ్ హౌస్ కంపెనీతో చర్చలు ముగిసిన అనంతరం అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటుకయ్యే ఖర్చు, నిర్మాణానికి పట్టే సమయం వంటి వివరాలతో ప్రాజెక్టు ప్రతిపాదనలు ఖరారవుతాయని వివరించారు. ప్రస్తుతానికి భూసేకరణ, ప్రాజెక్టు ఏర్పాటుకు అవసరమైన అనుమతులు పొందడం, ప్రాజెక్టు స్థలంలో భూమి స్వరూప స్వభావాలపై అధ్యయనం వంటి పనులు జరుగుతున్నాయని, అణు విద్యుత్ ప్రాజెక్టు కోసం 2,079 ఎకరాల భూమి అవసరం కాగా.. ఇప్పటికే 2,061 ఎకరాల భూసేకరణ పూర్తయిందని, దీనిని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ పేరిట బదలాయించడం కూడా పూర్తయిందని ఆయన తెలిపారు. నిర్మాణ దశలో 8వేల మందికి, నిర్మాణం పూర్తిచేసుకుని విద్యుదుత్పత్తి ప్రారంభించిన అనంతరం ప్రతి యూనిట్‌లో 2 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నట్లు వివరించారు.

564 మంది విద్యార్థులకు కేవీపీవై ఫెలోషిప్‌లు..
కిషోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన (కేవీపీవై) పథకం కింద గడచిన ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో 564 మంది విద్యార్థులకు ఫెలోషిప్ అందించినట్లు కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్ వెల్లడించారు. విజయ సాయి రెడ్డి అడిగిన మరో ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. కేవీపీవైకి ప్రత్యేకించి నిధులు కేటాయింపు ఏదీ ఉండదని, ఇన్‌స్పైర్, ఇన్‌స్పైర్–షీ బడ్జెట్ కింద కేటాయించిన నిధులతోనే కేవీపీవై ప్రోగ్రాం అమలుచేస్తారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా పరిశోధన రంగంలో ప్రతిభ, యోగ్యత కలిగిన విద్యార్థులను అధిక సంఖ్యలో గుర్తించేందుకు కేవీపీవై ప్రోగ్రాంను (ఎస్‌హెచ్ఈ) స్కాలర్‌షిప్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్‌తో అనుసంధానించినట్లు తెలిపారు. దీని ద్వారా ఔత్సాహికులు ప్రాథమిక, నేచురల్ సైన్స్‌లో అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులు చేసేందుకు ఏటా రూ.12 వేల చొప్పున ఉపకారవేతనం లభిస్తుందని అన్నారు. అలాగే, ఇన్‌స్పైర్–మానక్ కింద ఏటా దేశవ్యాప్తంగా 10 లక్షల ఐడియాల నుంచి లక్ష ఐడియాలను ఎంపికచేసి వాటిని ప్రతిపాదించిన ఒక్కో విద్యార్థి బ్యాంకు అకౌంట్‌లో నేరుగా రూ.10 వేలు జమచేస్తున్నట్లు తెలిపారు.



ఏపీ హైకోర్టులో ఐదు న్యాయమూర్తుల ఖాళీలు
ఏపీహైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తులకుగాను గత నెల 30 వరకు 32 మంది న్యాయమూర్తులు పనిచేస్తున్నారని కేంద్ర న్యాయశాఖ తెలిపింది. ప్రస్తుతం ఇక్కడ ఐదు న్యాయమూర్తుల పదవులు ఖాళీగా ఉండగా, ఒక ఖాళీ ప్రతిపాదన ప్రస్తుతం సుప్రీంకోర్టు కొలీ జియం వద్ద పెండింగ్‌లో ఉందని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు ఓ ప్రశ్నకు జవాబిచ్చారు.

పోలవరం పరిహారం నేరుగా నిర్వాసితులకే

- రాష్ట్ర ప్రభుత్వం కోరిందన్న కేంద్ర జలశక్తి శాఖ



సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కుటుంబాలకు పరిహారం నేరుగా వారికే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిందని కేంద్ర జలశక్తి శాఖ పేర్కొంది. వైఎస్సార్‌సీపీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ ప్రశ్నకు జలశక్తి శాఖమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ గురువారం లోక్‌సభలో ఈ మేరకు సమాధానమిచ్చారు. 2016లో కేంద్ర ఆర్థిక శాఖ ఆఫీస్ మెమోరాండం 1.4.2014 నాటి ధరలకే ఇరిగేషన్ కాంపొనెంట్ మిగతా మొత్తం ఇవ్వాలని చెబుతోందన్నారు. ఎప్పటికప్పుడు ఏపీ ప్రభుత్వం చేసిన ఖర్చులను రీయింబర్స్ చేస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 2014 నుంచి డిసెంబర్ 2022 వరకు ఏపీ సర్కారు రూ.3,779.5 కోట్లు రీయింబర్స్ చేయాలని బిల్లులిచ్చిందని దీని నిమిత్తం రూ.3,431. 59 కోట్లు రీయింబర్స్ చేశామన్నారు. 2014 నుంచి 2022 వరకూ ఆర్అండ్ఆర్‌కు ఇచ్చిన రూ.2,267.29 కోట్ల బిల్లుకుగాను రూ.2,110.23 కోట్లు రీయింబర్స్ చేశామన్నారు.

పాత ప్రాజెక్టుల పునరుద్ధరణ ప్రతిపాదనల్లేవు
పాత ప్రాజెక్టుల విస్తరణ, ఆధునీకరణ, పునరుద్ధరణల నిమిత్తం ఏపీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిపాదనలు లేవని కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఏపీకి ఐదు సోలార్ ప్రాజెక్టుల అనుమతి
4,100 మెగావాట్ల సామర్థ్యం ఉన్న ఐదు సోలార్ పార్కులు ఏపీకి అనుమతించామని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు వల్లభనేని బాలశౌరి, మాగుంట శ్రీనివాసులురెడ్డిల ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

స్మార్ట్ సిటీ అడ్వైజరీ ఫోరంలో స్థానిక యువత
స్మార్ట్ సిటీ మిషన్ నిబంధనల మేరకు స్మార్ట్ సిటీ అడ్వైజరీ ఫోరంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ మేయర్, సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్ల ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు ఇతర భాగస్వాములతోపాటు స్థానిక యువత ఉంటారని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కౌశల్ కిశోర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు పోచ బ్రహ్మానందరెడ్డి, గురుమూర్తిల ప్రశ్నకు ఆయన జవాబిచ్చారు.
కాగా, విశాఖ మెట్రో నిమిత్తం 42.55 కి.మీ పొడవున రూ.8,300 కోట్ల అంచనా వ్యయంతో ఏపీ ప్రభుత్వం 2018లో ప్రతిపాదన ఇచ్చిందని కేంద్ర గృహ పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కౌశల్ కిశోర్ తెలిపారు. ఈ మొత్తం కొరియాకు చెందిన ఎగ్జిమ్ బ్యాంకు పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ పద్ధతిలో ఆర్థిక సాయం చేస్తుందని అప్పుడు ఏపీ ప్రభుత్వం తెలిపిందని.. కానీ ఆ తర్వాత కొరియా బ్యాంకు సాయానికి నిరాకరించిందని వైఎస్సార్‌సీపీ ఎంపీలు బీవీ సత్యవతి, ఎంవీవీ సత్యనారాయణల ప్రశ్నకు జవాబిచ్చారు. విశాఖ మెట్రోకు సంబంధించి అధ్యయనం నిమిత్తం కేంద్రం రూ.3.5 కోట్లు విడుదల చేసిందన్నారు.

దేశవ్యాప్తంగా 'పెట్టుబడుల' సదస్సులు

సాక్షి, అమరావతి: పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా విశాఖలో మార్చి నెలలో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సును విజయవంతం చేయడమే లక్ష్యంగా.. దేశవ్యాప్తంగా పెట్టుబడుల సన్నాహక సదస్సులను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించబోతోంది. ఫిబ్రవరి 10 నుంచి 24 వరకు దేశంలోని 7 ప్రధాన నగరాల్లో రోడ్‌షోలు నిర్వహించేందుకు ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు ప్రణాళికలు రూపొందించింది. సీఎం జగన్ ఇటీవల ఢిల్లీలో ప్రారంభించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సన్నాహక సదస్సు విజయవంతమవ్వడంతో.. అదే స్ఫూర్తితో ఈ రోడ్‌షోలను కూడా నిర్వహించబోతోంది. ఫిబ్రవరి 10న త్రివేండ్రం, కోల్‌కతా, 14న బెంగళూరులో, 17న చెన్నై, అహ్మదాబాద్, 21న ముంబై, 24వ తేదీన హైదరాబాద్‌లో ఈ రోడ్‌షోలు నిర్వహించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశమున్న వనరులు, ప్రయోజనాలను వివరించడంతో పాటు ప్రధానంగా 13 రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ఈ రోడ్ షోలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మూడేళ్లుగా సులభతర వాణిజ్యంలో మొదటి స్థానంలో ఉండటం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందుబాటులో ఉండటంతో పాటు వేలాది ఎకరాల భూమి తక్షణం అందుబాటులో ఉండటం.. సింగిల్ విండో విధానంలో 21 రోజుల్లోనే అన్ని అనుమతులను మంజూరు చేస్తుండటంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పలు సంస్థలు ఇప్పటికే ఆసక్తిని వ్యక్తం చేశాయి. మార్చి 3–4 తేదీల్లో విశాఖ వేదికగా జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో ఆ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతూ.. వాస్తవ ఒప్పందాలు చేసుకుంటాయని పరిశ్రమల శాఖ అధికారులు వెల్లడించారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శుక్రవారం ॥ 3-2-2023

తీరిన కోరిక

ప్రతి పైసా కూడగట్టి విమానం ఎక్కారు


బెంగళూరు విధాన సౌధ ముందు కేరళ ఉపాధి కూలీల బృందం

అమ్మ విమానం ఎక్కి ఉండదు ఒక్కసారైనా. మనకు తీసుకెళ్లే వీలు ఉన్నా ఇంట్లోని ఆడవాళ్లను విమానం ఎక్కించడానికి ఖర్చు కారణం చూపుతాము. కేరళలో కూలి పని చేసే 24 మంది స్త్రీలు తాము జీవితంలో ఒక్కసారైనా విమానం ఎక్కాలని నిశ్చయించుకున్నారు. పైసా పైసా కూడగట్టారు. టికెట్లు బుక్ చేశారు. చిన్నపిల్లల్లా కేరింతలు కొడుతూ కొచ్చి నుంచి బెంగళూరుకు ఆకాశంలో ఎగిరారు. ఎంత మంది స్త్రీలకో ఇలాంటి కోరిక ఉండొచ్చు. ప్రయత్నిస్తే సాధ్యమని వీరు అంటున్నారు.

‘మాకు రెండు కోరికలు. ఒకటి విమానం ఎక్కాలి. రెండు ఏసీ ట్రైన్‌లో ప్రయాణించాలి. ఆ రెండు కోరికలూ ఇప్పుడు తీర్చుకుంటున్నాం’ అంది 55 ఏళ్ల గీతా ఉన్నికృష్ణన్. మొన్నటి జనవరి 26న కొచ్చి నుంచి బెంగళూరుకు విమానంలో ప్రయాణించిన బృందంలో ఈమె కాకుండా ఇంకో 23 మంది మహిళలు ఉన్నారు. వీరంతా కేరళలోని కొట్టాయం జిల్లాలో పనాచ్చికాడ్ అనే చిన్న పంచాయతీకి చెందినవారు. అందరూ గ్రామీణ ఉపాధిలో భాగంగా పంచాయితీ కింద పని చేసే వారే. రోజు కూలీలు అనుకోవచ్చు. చెత్త ఎత్తేవారు, రోడ్లు ఊడ్చేవారు, పంచాయితీ చేసే నిర్మాణాల్లో రాళ్లు ఎత్తేవారు ఈ మహిళలు.

‘అయితే ఏమిటి? మేము విమానం ఎక్కకూడదా?’ అనుకున్నారు. కాని వీరు యువతులో, చిన్నపిల్లలో కాదు. ఈ బృందంలో తక్కువ వయసు 55 అయితే అందరికంటే ఎక్కువ వయసు 77. ‘మా రోజు కూలీ రోజుకు 311 రూపాయలు. అయితే అందులో నుంచే పైసా పైసా దాచిపెట్టి టికెట్ డబ్బు చేయాలనుకున్నాం. ఒక మొత్తం అయ్యాక మా పంచాయతీ మెంబర్ అబ్రహంను కలిశాం. ఆయన మాకు అండగా నిలిచి టికెట్లు బుక్ చేయడమే కాకుండా మా ప్రయాణంలో భాగమయ్యాడు’ అన్నారు వాళ్లు.

కొచ్చి నుంచి తెల్లవారుజాము విమానం ఎక్కేటప్పుడు వీరి సంబరం అంతా ఇంతా కాదు. బెంగళూరులో దిగాక ఒక ఎం.ఎల్.ఏ సాయంతో వీరు విధాన సభ చూసే అవకాశం పొందారు. ‘మేము మెట్రో రైలు కూడా ఎక్కాం తెలుసా?’ అన్నారు వాళ్లు. 77 ఏళ్ల చెల్లమ్మ అయితే ఎంతో మురిసిపోయింది. ‘ఇలా జరుగుతుందని నిజంగా అనుకోలేదు’ అందామె.

వీరంతా బెంగళూరు నుంచి కొచ్చికి తాము కోరుకున్నట్టు ఏసి ట్రైన్‌లో తిరుగు ప్రయాణం చేయనున్నారు.

ప్రతి ఒక్కరికి చిన్న చిన్న ముచ్చట్లు తీర్చుకునే హక్కు ఉంది. స్త్రీలు తమ ముచ్చట్లను అనేక కారణాల రీత్యా బయటకు చెప్పరు. కుటుంబంలోని మగవారు అడిగి వాటిని తీర్చరు. కాని ఆ ముచ్చట తీరితే వారికి కలిగే ఆనందం ఎంతటితో ఈ బృందాన్ని చూస్తే తెలుస్తుంది. అమ్మనో, అత్తగారినో, అంతగా జరుగుబాటులేని మేనత్తనో, పిన్నినో విమానం ఎక్కించి సంతోషపడాలని ఎవరికైనా అని పిస్తే సంతోషం. ఎవరికీ అనిపించకపోయినా ఈ కథనం చదివి అలా స్ఫూర్తి పొందితే మరీ సంతోషం.

ఫ్యాషన్



పెళ్లికళకు పరిపూర్ణత

కలల రోజు కళ్ల ముందు నిలిచే సమయం అత్యంత వైభవంగా మారిపోవాలనుకుంటారు. అందుకు తగినట్టుగానే ప్రతి అలంకరణలోనూ ప్రత్యేకత చూపుతారు. ఆ పెళ్లి కళకు పరిపూర్ణత రావాలంటే మాత్రం కేశాలంకరణదే అత్యంత కీలకమైన పాత్ర. సాధారణ డిజైన్స్ నుంచి ఆధునికపు హెయిర్ స్టైల్స్ ఎలా రూపు మార్చుకున్నాయో తెలుసుకుంటే మీదైన ప్రత్యేకమైన రోజుకు మరింత అందంగా ముస్తాబు అవ్వచ్చు.

పెళ్లికూతురు ఆకర్షణీయ రూపానికి జీవం పోసేది కేశాలంకరణే. పెళ్లి దుస్తులను ఎంత ప్రత్యేకంగా ఎంచుకుంటారో జడను కూడా అంతే స్పెషల్‌గా డిజైన్ చేయించుకుంటారు. సాధారణ పూల జడల నుంచి వజ్రాలతోనూ, బంగారంతోనూ మెరిసే అందమైన పొడవాటి జడలను నవ వధువుల ఎంపికలో ఉంటాయి. అలాగే, పెళ్లికూతురి దగ్గరి బంధువులు, స్నేహితులు కూడా వీటి ఎంపికలో పోటీ పడుతుంటారు. ఇందుకు ఇమిటేషన్ జ్యువెలరీతో పాటు ఇతర ఫ్యాన్సీ జడలు కూడా రకరకాల డిజైన్లలో అందుబాటులోకి వచ్చాయి. లక్షల రూపాయల నుంచి వందల రూపాయల వరకు ఉన్న ఈ డిజైన్స్‌లో ఇవి కొన్ని.

సంప్రదాయ వేడుకలలో వేసే హెయిర్ స్టైల్స్ ఎప్పుడూ ఒకేలా ఉంటుంటాయి. ఈ బ్రైడల్ హెయిర్ స్టైల్స్‌లో మార్పులు చూస్తే ఇన్ని డిజైన్స్ ఉన్నాయా అనే ఆశ్చర్యం కలగక మానదు. ఇందుకోసం ఉపయోగిస్తున్న లాంగ్ రిబ్బన్, మిర్రర్, టాజిల్స్‌తోనూ జడలు ప్రధాన ఆకర్షణగా డిజైనర్ల చేతుల్లో రూపు దిద్దుకుంటున్నాయి.



సొంతంగా తయారీ

ఆసక్తి గల వారు పూసలు, ముత్యాలు, స్టోన్స్, రంగు దారాలను ఉపయోగించి మల్టీకలర్ లాంగ్ జడలను సొంతంగా తయారు చేసుకోవచ్చు. దారాలకు పూసలు గుచ్చి, గమ్‌తో స్టోన్స్ లేదా అద్దాలను అతికించి పొడవాటి దండలుగా (జడ అంత పొడవులో) తయారు చేసుకోవాలి. వాటిని డ్రెస్‌తో మ్యాచ్ చేసుకోవాలి. సందర్భాన్ని బట్టి ఎలాంటి అలంకరణ బాగుంటుందో చూసుకొని, ఆ జడను అలంకరించుకోవాలి.

ఫ్యాన్సీ అలంకరణ

సాధారణ కేశాలంకరణలో మల్లె, గులాబీ పూల జడలు పెళ్లికూతురు అలంకరణలో భాగంగా ఉంటాయి. కొందరు తమ చీర రంగుతో మ్యాచ్ అయ్యే పూల జడలను ఎంపిక చేసుకుంటారు. ఇవే కాకుండా స్వరోస్కి స్టోన్స్ ఉన్న పొడవాటి వరుసల క్లిప్స్‌ను పెట్టేసి కేశాలంకరణ పూర్తి చేసుకోవచ్చు. ఇవి, రిసెప్షన్ వంటి వేడుకల్లో అందంగా ఉంటాయి. పెళ్లికి ఎంచుకోగల ఆధునిక కేశాలంకరణలో ఇవి ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. డిజైన్ బట్టి ఈ జడల ధరలు అందుబాటులో ఉన్నాయి.



మెరిసే.. మెరిసే

కేశాలంకరణ ప్రత్యేక సందర్భాల్లోనే కాదు ప్రతిరోజూ స్పెషల్‌గా ఉండాలనుకుంటారు. ఇలాంటి వారికి డే హెయిర్ జ్యువెలరీ (హెయిర్ క్లిప్స్) అందుబాటులో ఉన్నాయి. వీటిని గెట్ టు గెదర్ వంటి పార్టీలకు వేసుకునే వెస్టర్న్ డ్రెస్సులకూ అందంగా నప్పుతాయి.

పెళ్లి కూతురి లేదా అతిథుల తమ కేశాలంకరణలో వివిధ స్టైల్స్‌ను అనుకరించాలంటే అందుకు తగిన ఆన్‌లైన్ ట్యుటోరియల్ వీడియోలు కూడా అందుబాటులో ఉన్నాయి. వాటిని చూసి ఎలాంటి స్టైల్ బాగుంటుందో ఎంపిక చేసుకునే వీలుంటుంది. మీదైన గొప్ప రోజు కోసం మీ జుట్టును స్టైలింగ్ చేయడం వల్ల పెళ్లికి వచ్చే మొత్తం అందరినీ మంత్ర ముగ్ధులను చేస్తుంది. పెళ్లిరోజును మరింతగా వెలిగిపోయేలా మార్చేస్తుంది.

బ్యూటిప్స్

మొటిమలు, మచ్చలు మటు మాయం!



ముఖంపై మొటిమలు ఉంటే రోజ్ వాటర్, అలోవెరా జెల్ కలిపి రాసుకోండి. దీనికోసం టీస్పూన్ అలోవెరా జెల్‌ను స్పూన్ రోజ్ వాటర్‌లో కలిపి మీ ముఖానికి ప్యాక్‌లా వేయాలి. అరగంట తరువాత, ముఖాన్ని శుభ్రమైన నీటితో కడగాలి. కలబందను ముఖానికి రోజుకు రెండు మూడు సార్లు అప్లై చేయడం ద్వారా మొటిమల సమస్య నుండి బయటపడవచ్చు.

ముఖ సౌందర్యానికి రోజూ పచ్చి కూరగాయలు తినాలి. లేదా పచ్చి కూరగాయల జ్యూస్ తాగినా అద్భుతంగా పనిచేస్తుంది. కూరగాయలతో జ్యూస్ చేసుకుని తీసుకోవడం వల్ల అందంగా తయారవుతారు. పసుపు, చందనం కలిపి తరచూ ముఖానికి మసాజ్ చేయటం కూడా అందాన్ని రెట్టింపు చేస్తుంది. స్నానం చేసే సమయంలో లేదంటే మామూలుగా అయినా వీటిని శరీరానికి రాసుకోవటం అలవాటు చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

వంటిల్లు

ఉడిపి మెనూ..

అదేమిటో కానీ, మన ఇంటి వంట కంటే పక్కింటి పోపుకే ఘుమఘుమలు ఎక్కువ. మన పొరుగున ఉన్న కర్నాటక రాష్ట్రం ఉడిపి వాళ్ల ఆరోగ్యవంటలకు మన వంటింట్లో పోపు వేద్దాం. పాలిచ్చే తల్లి ఏమి తినాలో ఉడిపి వాళ్ల మెనూ చూద్దాం.

బాదం పోరిడ్జ్ (రవ్వ గంజి)



కావలసినవి: రవ్వ – 2 టేబుల్ స్పూన్లు ; నీరు– కప్పు ; బాదం – 8 ; బెల్లం పొడి– టేబుల్ స్పూన్ ; పాలు– అర కప్పు.

తయారీ: ● బాదం పప్పును మిక్సీలో వేసి పొడి చేయాలి. నీటిని మరిగించాలి. పాలను కాచి పక్కన ఉంచాలి.
● మందపాటి పెనంలో రవ్వను పచ్చి వాసన పోయేటట్లు కొద్దిసేపు వేయించాలి (రంగు మారే వరకు వేయించరాదు).
● రవ్వలో మరుగుతున్న నీటిని పోస్తూ (ఉండలు కట్టకుండా) కలపాలి.
● ఇప్పుడు బెల్లం పొడి, బాదం పొడి, వేడి పాలను పోసి కలిపి ఉడకడం మొదలైన తరవాత మూత పెట్టి మంట ఆపేయాలి. ఇది పాలిచ్చే తల్లికి చక్కటి పోషకాహారం. గట్టిగా హల్వాలా తినవచ్చు లేదా జావలా గరిటె జారుడు గా ఉండాలంటే పాల మోతాదు పెంచుకోవచ్చు.

ఉడిపి సాంబార్



కావలసినవి: కందిపప్పు – అరకప్పు (కడిగి అరగంటసేపు నానబెట్టాలి) ; పసుపు– అర టీ స్పూన్ ; ఉప్పు– రుచికి తగినంత ; బీరకాయ ముక్కలు– 300 గ్రాములు ; టొమాటో ముక్కలు – కప్పు.
సాంబార్ పేస్ట్ కోసం: మినప్పప్పు– టేబుల్ స్పూన్ ; గుంటూరు మిర్చి– 8 ; పొట్టి మిరపకాయలు – 6 ; ధనియాలు – 2 టేబుల్ స్పూన్లు ; యాలకులు – 2 ; లవంగాలు – 3 ; దాల్చిన చెక్క– అంగుళం ముక్క ; జీలకర్ర – టీ స్పూన్ ; పచ్చి కొబ్బరి ముక్కలు– అర కప్పు ; గసగసాలు– టీ స్పూన్.
సాంబార్ పోపు కోసం: నూనె : టేబుల్ స్పూన్ ; మెంతులు – చిటికెడు ; ఆవాలు– అర టీ స్పూన్ ; ఇంగువ పొడి – చిటికెడు ; కరివేపాకు– 2 రెమ్మలు ; చింతపండు– 70 గ్రాములు (300 మి.లీ రసం చేయాలి) ; నీరు– ముప్పావు లీటరు ; ఉప్పు – తగినంత.
గార్నిష్ చేయడానికి: నూనె – 2 టీ స్పూన్లు ; వేరుశనగ పప్పు – 4 టేబుల్ స్పూన్లు ; ఆవాలు – అర టీ స్పూన్ ; ఎండు మిర్చి– 2 ; కొత్తిమీర తరుగు – కప్పు.

తయారీ: ● కంది పప్పును ప్రెషర్ కుక్కర్‌లో వేసి ఒకటిన్నర కప్పుల నీళ్లు పోసి, పసుపు వేసి ఉడికించాలి. చల్లారిన తర్వాత ఉప్పు వేసి మెత్తగా పేస్ట్ చేయాలి. ● మందపాటి బాణలి వేడి చేసి సాంబార్ పేస్టు కోసం తీసుకున్న దినుసులను సన్నమంట మీద వేయించి చల్లారిన తరవాత నీటిని వేస్తూ మెత్తగా గ్రైండ్ చేయాలి.
● బీరకాయ ముక్కల్లో కొద్దిగా నీటిని చిలకరించి మీడియం మంట మీద ఒక మోస్తరుగా ఉడికించాలి. మరీ మెత్తగా ఉడకకూడదు. ● మందపాటి పాత్రలో నూనె వేడి చేసి పోపు కోసం తీసుకున్న దినుసులను వేసి వేయించి టొమాటో ముక్కలు వేసి మగ్గనివ్వాలి. తర్వాత చింతపండు రసం పోసి కలిపి అందులో సాంబార్ పేస్ట్, బీరకాయ ముక్కలు, కందిపప్పు పేస్ట్ వేసి కలిపి రుచి చూసి అవసరమైతే మరికొంత ఉప్పు వేసి కలిపి ఉడికించాలి. ● చిన్న బాణలిలో నూనె వేసి గార్నిష్ చేయడానికి తీసుకున్న దినుసులను వేయించి ఉడుకుతున్న సాంబార్‌లో వేసి దించేయాలి. ఇది అన్నంలోకి చక్కటి రుచినిస్తుంది. రోటీ చపాతీల్లోకి చేసేటప్పుడు నీటి మోతాదు తగ్గించుకుని చిక్కగా చేసుకోవాలి.

చేమ కూర స్నాక్



కావలసినవి: చేమ ఆకులు – 6 ; రవ్వ – అర కప్పు.
మసాలా కోసం: కొబ్బరి ముక్కలు– అర కప్పు ; ధనియాలు – టేబుల్ స్పూన్ ; జీలకర్ర – అర టేబుల్ స్పూన్ ; చింతపండు – గోళీ అంత ; బెల్లం పొడి – టేబుల్ స్పూన్ ; ఎండు మిర్చి – 3 ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి.
పోపు కోసం: నూనె– టేబుల్ స్పూన్ ; కొబ్బరి తురుము – అర కప్పు ; బెల్లం పొడి– టేబుల్ స్పూన్.

తయారీ: ● చేమ ఆకులను శుభ్రం చేసి చిన్న ముక్కలుగా తరిగి పక్కన ఉంచాలి. ● మసాలా దినుసుల కోసం తీసుకున్న అన్నింటినీ మిక్సీలో వేసి నీటిని వేస్తూ ముద్దగా గ్రైండ్ చేసుకోవాలి. ● ఈ మసాలా లో రవ్వ, చేమ ఆకు వేసి కలపాలి. దీనిని నాలుగు భాగాలు చేసి లడ్డులుగా చేసి ఆవిరి మీద ఉడికించాలి. వేడి తగ్గిన తరవాత మెల్లగా చిదమాలి. ● ఇప్పుడు పెనం పెట్టి నూనె వేడి చేసి కొబ్బరి తురుము, బెల్లం పొడి వేసి వేయించాలి. అవి వేగిన తరవాత ఉడికించిన చేమకూర ఆకుల మిశ్రమాన్ని వేసి బాగా కలపాలి. తీపి ఇష్టపడేవాళ్లు దీనిని బ్రేక్‌ఫాస్ట్‌గా తింటారు. భోజనం తరవాత తినడానికి బాగుంటుంది. ఈవెనింగ్ స్నాక్‌గా కూడా బాగుంటుంది.

మోహన్ లడ్డు



కావలసినవి: గోధుమ పిండి– కప్పు ; బియ్యప్పిండి– టేబుల్ స్పూన్ ; నెయ్యి – 2 టేబుల్ స్పూన్లు ; చక్కెర– కప్పు ; నీరు – అర కప్పు ; యాలకుల పొడి– అర టీ స్పూన్ ; జీడిపప్పు – 2 టేబుల్ స్పూన్లు ; కిస్‌మిస్ – టేబుల్ స్పూన్ ; నూనె – పూరీలు కాలడానికి తగినంత.

తయారీ: ● వెడల్పు పాత్రలో గోధుమపిండి, బియ్యప్పిండి, ఒక టేబుల్ స్పూన్ నెయ్యి వేసి, నీటిని పోస్తూ ముద్దగా కలపాలి. బాణలిలో నూనె వేడి చేసి ఈ పిండినంతటినీ పూరీలు చేసుకోవాలి. మోహన్ లడ్డు కోసం చేసే ఈ పూరీలు మెత్తగా ఉండకూడదు, కరకరలాడాలి. చల్లారిన తరవాత వీటిని తుంచి చిన్న ముక్కలు చేయాలి. ● బాణలిలో నెయ్యి వేడి చేసి జీడిపప్పు, కిస్‌మిస్ వేయించి పూరీ ముక్కల్లో కలపాలి. ● ఒక పాత్రలో చక్కెర వేసి, నీరు పోయాలి. చక్కెర కరిగిన తరవాత, యాలకుల పొడి వేసి మీడియం మంట మీద సిరప్ తయారయ్యే వరకు మరిగించాలి. ఈ చక్కెర పాకాన్ని పూరీ ముక్కల మీద పోస్తూ లడ్డు చేయాలి. ఇది ఉడిపి స్పెషల్.

సొప్పు పాల్య



కావలసినవి: పాలకూర – 2 కట్టలు ; ఉల్లిపాయ– 1 (తరగాలి) ; ఉప్పు – అర టీ స్పూన్ ; మిరియాల పొడి– టీ స్పూన్.
పోపు కోసం: నెయ్యి– 2 టీ స్పూన్లు ; జీలకర్ర – అర టీ స్పూన్ ; కరివేపాకు– 2 రెమ్మలు.

తయారీ: ● పాలకూరను శుభ్రం చేసి తరగాలి.
● బాణలిలో నెయ్యి వేడి చేసి జీలకర్ర వేయాలి. అవి చిటపటలాడిన తర్వాత ఉల్లిపాయ ముక్కలు వేసి మగ్గనివ్వాలి. ఆ తర్వాత కరివేపాకు వేయాలి.
● ఇప్పుడు పాలకూర, ఉప్పు, మిరియాల పొడి వేసి కలిపి మూత పెట్టి సన్న మంట మీద పది నిమిషాల సేపు మగ్గనివ్వాలి (ఆకులోని నీటితోనే మగ్గుతుంది). దీనిని పాలిచ్చే తల్లికి రెండు రోజులకొకసారి పెడతారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శుక్రవారం ॥ 3-2-2023

యువర్స్

● టెక్..టాక్



లెనోవా యోగా స్లిమ్ 7ఐ ప్రో ఎక్స్

డిస్‌ప్లే: 14.5 అంగుళాలు రిజల్యూషన్: 3072× 1920 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
ఫీచర్స్: వైఫై 6ఇ, బ్లూటూత్ 5.1
ఐఆర్ కెమెరా (ఫేస్ రికగ్నైజేషన్)
బ్యాటరీ లైఫ్: 10 గంటలు
బరువు: 1.4 కేజీలు
ప్రారంభ ధర: ₹ 1,12,200/-

గూగుల్ మ్యాప్‌కు ప్రత్యామ్నాయాలు



జీపిఎస్–ఆధారిత నావిగేషన్ ప్లాట్‌ఫామ్‌లలో గూగుల్ మ్యాప్‌కు పేరు ఉంది. అయితే మార్కెట్‌లో బెస్ట్‌ఫీచర్‌లతో కూడిన ప్రత్యామ్నాయాలు కూడా ఉన్నాయి. మచ్చుకు రెండు...

'మ్యాప్ మైఇండియామూవ్' అనేది గూగుల్ మ్యాప్‌కు పాపులర్ ఆల్టర్‌నేటివ్‌గా పేరు తెచ్చుకుంది. వాయిస్–గైడెడ్ నావిగేషన్‌లాంటి స్టాండర్డ్ ఫీచర్స్ దీనిలో ఉన్నాయి. పనిచేయని స్ట్రీట్‌లైట్లు, పనికిరాని స్పీడ్‌బ్రేకర్లు, ప్రమాదకరమైన గుంతలు... మొదలైన వాటికి సంబంధించిన సమాచారాన్ని రిపోర్ట్ చేస్తుంది.

ఇక sggic జీపీఎస్ నావిగేషన్ మ్యాప్స్ యాప్‌కు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది యూజర్లు ఉన్నారు. ఈ యాప్ ద్వారా ఆఫ్‌లైన్‌లో వివిధ దేశాలకు సంబంధించిన 3డీ మ్యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

కోకా కోలా స్మార్ట్‌ఫోన్



పాపులర్ సాఫ్ట్‌డ్రింక్ బ్రాండ్ కోకా కోలా తమ బ్రాండెడ్ స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేయడానికి రెడీ అవుతోంది.

దీనికి సంబంధించిన కొత్త డిజైన్‌ను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఫోన్ వెనక కోకా కోలా బ్రాండ్ కనిపిస్తుంది. కోకా కోలా బ్రాండ్ కలర్ థీమ్ రెడ్‌తో ముస్తాబైన ఈ స్మార్ట్‌ఫోన్ త్వరలో మన దేశంలో విడుదల కానుంది. కోకా కోలా ఫోన్ ఏమిటి! అని ఆశ్చర్యపోతాం గానీ నాన్–స్మార్ట్‌ఫోన్ కంపెనీలు స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లోకి రావడం ఇది మొదటిసారి కాదు. కోకా కోలా స్మార్ట్‌ఫోన్ రియల్‌మీ 104జీ మోడల్‌లో ఉండనున్నదని వార్తలు వినిపిస్తున్నాయి.

వాట్సాప్‌లో త్వరలో కొత్త ఫీచర్స్



యూజర్స్ కోసం రాబోయే రోజుల్లో కొత్త ఫీచర్స్ తీసుకురావడానికి వాట్సాప్ కసరత్తు చేస్తోంది. న్యూ టెక్స్ట్ ఎడిటర్‌కు న్యూ ఫాంట్స్ యాడ్ చేయడం ద్వారా విత్‌ఇన్ ఇమేజ్, వీడియోలలో టెక్స్ట్ ఎడిట్ చేయడం, డిఫరెంట్ ఫాంట్స్‌తో టెక్స్ట్ యాడ్ చేయవచ్చు. టెక్స్ట్ ఎడిటర్‌ను రీవ్యాంప్ చేసి మరిన్ని ఫీచర్‌లు తీసుకురానున్నారు. గ్రూప్ టెక్స్ట్, డిస్క్రిప్షన్స్‌కు సంబంధించి పదాల పరిమితిని పెంచనున్నారు.

● సక్సెస్ స్టోరీస్


కిషన్


రితిక పాండే

బ్రిలియంట్ యంగ్ టాలెంట్

- కొత్తగా ఆలోచిస్తే విజయం మనదే

ఇరవై రెండు సంవత్సరాల వయసులో... ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కంటెంట్ క్రియేషన్ ప్లాట్‌ఫామ్‌కు బిజినెస్ హెడ్‌గా పనిచేస్తున్నాడు కిషన్ పన్‌పాలియా. ఇరవైనాలుగు సంవత్సరాల వయసులోనే ఆర్టిస్ట్‌గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది రితిక పాండే. ఈ ఇద్దరు తాజాగా... 'ఫోర్బ్స్ 30 అండర్ 30' 2023 జాబితాలో చోటు సంపాదించారు...

చిన్న వయసులోనే మోస్ట్ పాపులర్ కంటెంట్ క్రియేషన్ ప్లాట్‌ఫామ్ 'పెప్పర్ కంటెంట్'కు బిజినెస్ హెడ్‌గా పెద్ద బాధ్యతలు నిర్వహిస్తున్నాడు కిషన్ పన్‌పాలియా.

ఒక్కసారి ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళితే...

'ఇండియా కాటన్ సిటీ'గా పేరుగాంచిన మహారాష్ట్రలోని అకోల. కిషన్ ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. 'పాకెట్ మనీ కోసం తల్లిదండ్రుల మీద ఆధారపడడం ఎందుకు? నేను సంపాదించలేనా!' అని ఆలోచించి రంగంలోకి దిగాడు. తన ఐడియా చెప్పి స్నేహితులు బంధువులను ఒప్పించాడు. అందరూ కలిసి స్క్రాప్ కొని అమ్మడం మొదలు పెట్టారు.

పాకెట్ చాలనంత మనీ వచ్చి చేరింది!

కట్ చేస్తే...

బిట్స్ పిలానిలో చదువుకునే రోజుల్లో కిషన్‌కు మంచి గుర్తింపు ఉండేది. దీనికి కారణం కాలేజీ ఈవెంట్ కోసం లక్షా పాతికవేల స్పాన్సర్‌షిప్‌ను సంపాదించడం. నిజానికి కాలేజీ ఈవెంట్‌కు పాతికవేలకు మించి స్పాన్సర్‌షిప్ వచ్చేది కాదు. మొదటి సంవత్సరంలో ఉన్నప్పుడు తన సీనియర్స్ అనిరుధ్ సింగ్లా, రిషబ్ శేఖర్‌లు 'పెప్పర్ కంటెంట్' పేరుతో కంటెంట్ క్రియేషన్ ప్లాట్‌ఫామ్ స్టార్ట్ చేశారు. కిషన్‌ను కూడా తమతో కలుపుకున్నారు.

మొదటిసారిగా ఆటోమోటివ్ పార్ట్స్ డీలర్ నుంచి 'కూల్ కంటెంట్' ఆఫర్ వచ్చింది. రాసే వారి కోసం చూశారు. పదానికి పదిహేను పైసలు అంటే ఎవరు మాత్రం వస్తారు!

దీంతో తప్పనిసరి పరిస్థితులలో తామే కంటెంట్ పనిలోకి దిగారు. పది రోజుల్లో 300 పీస్‌లు రాశారు. ఇక అప్పటి నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు.

ప్రస్తుతం 'పెప్పర్ కంటెంట్' 2,500 మంది కస్టమర్‌లతో, 1.2 లక్షల మంది కంటెంట్ క్రియేటర్స్‌తో పనిచేసింది. మన దేశంలో లార్జెస్ట్ ఫ్రీలాన్స్ క్రియేటర్స్ ప్లాట్‌ఫామ్‌గా ఎదిగింది.

బిజినెస్ సెన్స్, రెవెన్యూ మేనేజ్‌మెంట్‌లో తనదైన ప్రత్యేకతను సృష్టించుకున్న కిషన్‌ను తన 'సక్సెస్ మంత్రా' గురించి అడిగితే– 'నిరంతర సాధన' అంటాడు.

> నిరంతర సాధనే సక్సెస్ మంత్ర. - కిషన్

> విశ్వవిద్యాలయాలు, గొప్ప పుస్తకాల నుంచి మాత్రమే కాదు ప్రకృతి ప్రపంచం నుంచి కూడా ఎంతో నేర్చుకోవచ్చు. - రితిక

వారణాసిలో పుట్టిన రితిక పాండే ముంబై రావడానికి ముందు ఆఫ్రికాలోని వివిధ ప్రాంతాలలో పెరిగింది. శ్రిష్టి మణిపాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్, డిజైన్ అండ్ టెక్నాలజీలో చదువుకుంది. వేల్స్ (యూకే)లోని ఒక సిటీలో కొంతకాలం పురాణాలు, సైన్స్–ఫిక్షన్ ఆధారంగా కళాసాధన ప్రారంభించింది.

అక్కడి నుంచి ఇండియాకు తిరిగి వచ్చిన తరువాత హిమాచల్‌ప్రదేశ్‌లోని మారుమూల ప్రాంతాలకు ప్రయాణించింది. ప్రకృతి ప్రపంచంతో స్నేహం చేసింది. తనలో సృజనాత్మకమైన కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించుకుంది.

'విశ్వవిద్యాలయాలు, గొప్ప పుస్తకాల నుంచి మాత్రమే కాదు ప్రకృతి ప్రపంచం నుంచి కూడా ఎంతో నేర్చుకోవచ్చు. అందుకే ఎన్నో మారుమూల ప్రాంతాలకు వెళ్లాను. ఇది నిరంతరమైన ప్రయాణం. నిరంతర సాధన. ఆర్టిస్ట్‌లు నేర్చుకోవడానికి ప్రకృతిలోనే ఎన్నో పాఠాలు ఉన్నాయి' అంటుంది రితిక.

రితిక వర్ణచిత్రాలలో మనుషులు కనిపిస్తారు. మొక్కలు, జంతువులు కనిపిస్తాయి. స్థూలంగా చెప్పాలంటే హ్యూమన్, నాన్–హ్యూమన్‌కు సంబంధించి రిలేషన్ అనే థీమ్ కనిపిస్తుంది.

'గ్రోస్‌వెనర్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన రితిక ఆర్ట్ వర్క్ సోలో షోకు అద్భుతమైన స్పందన వచ్చింది. ఎంతో మంది ప్రైవేట్ ఆర్ట్ కలెక్టర్స్ ఆసక్తి ప్రదర్శించారు' అంటున్నారు లండన్‌లోని గ్రోస్‌వెనర్ గ్యాలరీ డైరెక్టర్ చార్లెస్ మూర్.

● బ్రెయిన్ జిమ్

ఫటాఫట్ ధనాధన్ ★★★★

8	3	4
1	5	?
6	7	2

క్వశ్చన్‌మార్క్ స్థానంలో ఉండాల్సిన నంబర్ ఏమిటి?

జవాబు: 9
కారణం: ప్రతి వరుస కూడితే వచ్చే జవాబు 15.

● ఇంగ్లిష్ ఇడియమ్స్

ఎవరీ డచ్ అంకుల్?

విమర్శ ముఖ్యమే కానీ శృతి మించిన విమర్శ సరికాదు. విమర్శ కోసం విమర్శ చేసేవారిని, అడగకుండానే సలహా ఇచ్చేవారిని 'డచ్ అంకుల్' అంటారు.

ఉదా: **అన్నపూర్ణాస్ హజ్బెండ్ ఈజ్ సచ్ ఏ డచ్ అంకుల్ ఎట్ డిన్నర్ పార్టీస్. హీ ఆల్వేస్ ట్రైస్ టు సార్ట్ ఔట్ ఎవ్రీ వన్స్ లివ్స్**



డచ్ అంకుల్ పేరేమిటో మనకు తెలియదుగానీ, వన్స్ అపాన్ ఏ టైమ్ జరిగిన ఆంగ్లో–డచ్ వార్ నేపథ్యం నుంచి పుట్టుకు వచ్చిన మాట ఇది.

బకిల్ డౌన్

ఒక పనిలో విజయం సాధించాలంటే అంకిత భావం ఉండాలి. బాగా కష్టపడాలి. 'ఫలానా పనిలో మనం ఎలాగైనా విజయం సాధించాలి' అని చెప్పడానికి ప్రతీకాత్మకంగా ఉపయోగించే ఇడియమ్ బకిల్ డౌన్.

ఉదా: **ఇఫ్ వుయ్ ఆర్ గోయింగ్ టు కంప్లీట్ దిస్ టాస్క్ ఇట్స్ నెససరీ టు బకిల్‌డౌన్.**

● గేమింగ్

మార్స్ గ్రహమా మజాకా!

సైన్స్–ఫిక్షన్ అడ్వెంచర్‌గేమ్ 'డెలివర్ అజ్ మార్స్' నిన్న విడుదలైంది. 'డెలివర్ అజ్ మూన్'కు కంటిన్యూగా వస్తున్న గేమ్ ఇది. 'డెలివర్ అజ్ మూన్' కథ ముగిసిన పదిసంవత్సరాల తరువాత ఏమవుతుంది అనేది తాజా గేమ్



కథ. యంగెస్ట్ ఆస్ట్రోనాట్ కతీ జాన్సన్ 'సేవ్ ఎర్త్' మిషన్‌లో భాగంగా రెడ్ ప్లానెట్‌కు వెళతాడు అక్కడ జాన్సన్‌కు ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి అనేది కథ. గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించిన ఏఆర్‌కె కాలనీ షిప్‌లను రికవరీ చేసుకోవడంలో అడుగడుగునా ప్రమాదాలు ఎదురవుతాయి.

'ఇది ఎమోషనల్ స్టోరీతో కూడిన అడ్వెంచర్ గేమ్' అంటున్నాడు డైరెక్టర్ పాల్ డిట్‌మన్.

జానర్: యాక్షన్ **ఇంజిన్:** అన్‌రియల్ ఇంజిన్ 4 **మోడ్:** పజిల్ అండ్ వీడియో మోడ్

ప్లాట్‌ఫామ్: ప్లేస్టేషన్ 5, ప్లేస్టేషన్ 4, ఎక్స్‌బాక్స్ వన్, మైక్రోసాఫ్ట్ విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

సినిమా

మాలీ కాలింగ్


తెలుగులో తెలుగు అమ్మాయిలు తప్ప ఇతర భాషల బ్యూటీలు ఎక్కువగా సినిమాలు చేస్తుంటారు. ముఖ్యంగా అటు ముంబై ఇటు కేరళ భామల హవా ఎక్కువగా ఉంటుంది. అయితే తెలుగులో బాగా పాపులార్టీ తెచ్చుకున్న నాయికలు ఇప్పుడు మలయాళంకి వెళుతున్నారు. ఇద్దరు సీనియర్ హీరోయిన్లకు, ఒక యువ హీరోయిన్‌కు మాలీవుడ్ నుంచి కాల్ వెళ్లింది. మలయాళంలో ఈ ముగ్గురి తొలి చిత్రం గురించి తెలుసుకుందాం.


● తమన్నా

ఇండస్ట్రీకి వచ్చి పదిహేను సంవత్సరాలు దాటినా ఇంకా అగ్రకథానాయికల్లో ఒకరిగా కొనసాగుతున్నారు తమన్నా. ముఖ్యంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో సినిమాలు చేసిన తమన్నా వీలైనప్పుడు కన్నడ తెరపైనా మెరిశారు. అయితే మలయాళ వెండితెరపై మాత్రం కనిపించలేదు. ఇండస్ట్రీకి వచ్చిన 17 ఏళ్ల తర్వాత తమన్నా ఫస్ట్ టైమ్ ఓ మాలీవుడ్ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దిలీప్ హీరోగా అరుణ్ గోపీ దర్శకత్వంలో రూపొందుతున్న 'బాంద్రా' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారామె. ఈ సినిమాలో తమన్నా మహారాణి పాత్రలో కనిపించనున్నారట. సో.. మాలీవుడ్‌కి రాణిలా ఎంటర్ అవుతున్నారన్న మాట. ఈ చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది. కాగా దిలీప్ హీరోగా నటిస్తున్న మరో సినిమాతో టాలీవుడ్ బాపు బొమ్మగా ప్రేక్షకులు చెప్పుకునే కన్నడ భామ ప్రణీత కూడా మాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటం విశేషం. ఈ సినిమాకు రతీష్ రఘునందన్ దర్శకుడు. ఆల్రెడీ ఈ సినిమా షూటింగ్ కూడా మొదలైంది. అయితే ఇప్పటివరకు ఎక్కువగా క్లాస్ పాత్రల్లోనే కనిపించిన ప్రణీత ఈ సినిమాలో మాత్రం కాస్త మాస్‌గా కనిపించనున్నారట. క్యారెక్టర్ దృష్ట్యా ప్రణీత పాత్రకు కాస్త అహంకారం ఉంటుందట. సో.. ప్రణీత మాలీవుడ్ ఎంట్రీ మమమ్మాస్ అన్నమాట. ఈ సినిమాను కూడా ఈ ఏడాదిలోనే రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఇక ఓ బిడ్డకు (కుమార్తె ఆర్నా) జన్మనిచ్చిన తర్వాత ప్రణీత ఒప్పుకున్న తొలి సినిమా ఇదే. మరోవైపు టాలీవుడ్ బేబమ్మ ('ఉప్పెన'లో కృతీ శెట్టి పేరు), యంగ్ బ్యూటీ కృతీ శెట్టికి కూడా మాలీవుడ్ నుంచి పిలుపొచ్చింది. మలయాళ యంగ్ హీరో టోవినో థామస్ నటిస్తున్న తాజా పాన్ ఇండియా మూవీ 'అజయంటే రందం మోషణం'లో కృతీ శెట్టి ఓ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఐశ్వర్యా రాజేష్, సురభి లక్ష్మీ కూడా హీరోయిన్లుగా చేస్తున్నారు. మూడు యుగాల కథాంశంతో ఈ చిత్రం రూపొందుతోంది.


● కృతి, ప్రణీత

సీనియర్ దర్శకుడు సాగర్ కన్నుమూత



సీనియర్ దర్శకుడు వి. సాగర్ (71) గురువారం వేకువజామున 5.45కి చెన్నైలోని తన నివాసంలో కన్నుమూశారు. సాగర్ పూర్తి పేరు ఉయ్యూరు విద్యాసాగర్ రెడ్డి. గుంటూరు జిల్లా నిడమర్రులో పుట్టిన సాగర్ ఎస్సెల్సీ పాసయ్యాక సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. ముందు ఎడిటింగ్, ఆ తర్వాత డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్‌గా చేశారు. 'రాకాసి లోయ' చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అయిన సాగర్ ఆ తర్వాత 30 చిత్రాలకు పైగా దర్శకత్వం వహించారు. సాగర్ దర్శకత్వంలో కృష్ణ హీరోగా రూపొందిన 'అమ్మ దొంగ' సూపర్ హిట్ అయ్యింది. ఆ తరువాత కృష్ణతోనే 'జగదేక వీరుడు' చిత్రాన్ని తెరకెక్కించారు. అలాగే వినోద్ కుమార్, సౌందర్య జంటగా సాగర్ తెరకెక్కించిన 'అమ్మ నా కోడలా' మంచి సినిమా అనిపించుకుంది. ఆయన దర్శకత్వం వహించిన 'రామసక్కనోడు'కి మూడు నంది అవార్డులు లభించాయి. స్టార్ డైరెక్టర్లుగా పేరు తెచ్చుకున్న వీవీ వినాయక్, శ్రీను వైట్ల వంటి వారు సాగర్ శిష్యులే. తెలుగు సినిమా దర్శకుల సంఘానికి మూడుసార్లు అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు సాగర్. కాగా చెన్నై, హైదరాబాద్‌లో నివసిస్తుంటారు సాగర్. చెన్నైలో ఉంటూ వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ''గురువారం ఉదయం ఆస్పత్రిలో చేరాల్సి ఉండగా, అనుకోకుండా గుండెపోటు రావడంతో కన్నుమూశారు'' అని సాగర్ పెద్ద కుమారుడు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సాగర్‌కు భార్య మాలా, ఇద్దరు కొడుకులు చంద్రశేఖర్, రాజశేఖర్, ఒక కుమార్తె చందన ఉన్నారు. చంద్రశేఖర్ సినిమా పరిశ్రమలో కొన్నాళ్లు కెమెరా డిపార్ట్‌మెంట్‌లో చేశారు. రాజశేఖర్ ఆస్ట్రేలియాలో, చందన అమెరికాలో ఉంటున్నారు. సాగర్ భౌతిక కాయానికి నేడు చెన్నైలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

నన్ను క్షమించగలవా?


● బ్రహ్మానందం

ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణ ప్రధాన పాత్రల్లో కృష్ణవంశీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రంగ మార్తాండ'. నటుడు బ్రహ్మానందం కీలక పాత్రలో నటించారు. కాలిపు మధు, ఎస్. వెంకట్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. బ్రహ్మానందం పుట్టినరోజు (ఫిబ్రవరి 1) సందర్భంగా 'రంగ మార్తాండ' నుంచి బ్రహ్మానందం గ్లింప్స్ రిలీజ్ చేశారు. ''ధగ ధగ్గాయ రాజమకుట సువర్ణ మణిగణ రాజరాజేశ్వరా, సుయోధన సార్వభౌమ.. శరాఘతాలతో ఛిద్రమై.. ఊపిరి ఆవిరై దిగంతాల సరిహద్దులు చెరిగిపోతున్న వేళ.. అఖండ భారత సామ్రాజ్యాన్ని కురుక్షేత్ర సంగ్రామంలో కానుకగా ఇస్తానని శుష్క వాగ్దానాలు వల్లెవేసిన ఈ దౌర్భాగ్యుడికి కడసారి దర్శనం కల్పిస్తున్నావా? నా దైవ స్వరూపమా.. నన్ను క్షమించగలవా?'' అంటూ భావోద్వేగంతో బ్రహ్మానందం చెప్పే డైలాగ్స్‌తో గ్లింప్స్ సాగుతుంది. రాహుల్ సిప్లిగంజ్, శివాత్మిక నటించిన ఈ చిత్రానికి సంగీతం: ఇళయరాజా.

పద్దెనిమిది రోజులు ఫుడ్ తీసుకోలేదు!

- సందీప్ కిషన్



"సందీప్‌లో ప్రతిభ, కష్టం కనిపించాయి కానీ అదృష్టం కనిపించలేదు' అని హీరో నాని అన్నారు. నిజంగానే నాకు అదృష్టం కలసిరాలేదని, రావాల్సినంత పేరు రాలేదని చాలామంది అంటుంటారు. నాని చెప్పినట్లు 'మైఖేల్'తో నాకు అదృష్టం కూడా కలిసొస్తుందని నమ్ముతున్నా" అని హీరో సందీప్ కిషన్ అన్నారు. రంజిత్ జయకొడి దర్శకత్వంలో సందీప్ కిషన్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'మైఖేల్'. నారాయణ్ దాస్ కె. నారంగ్ సమర్పణలో భరత్ చౌదరి, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా సందీప్ చెప్పిన విశేషాలు.

● ఇప్పటివరకూ నేను చేయాలనుకుని చేయలేకపోయినది ఏంటి? అని ఆలోచించినప్పుడు 'మైఖేల్' ఐడియా వచ్చింది. నా ఆలోచన రంజిత్‌కి చెప్పాను. ఆ ఆలోచన తీసుకుని తను చెప్పిన 'మైఖేల్' కథ బాగా నచ్చింది. భరత్ చౌదరి, రామ్మోహన్ రావు, సునీల్ నారంగ్ వంటి నిర్మాతలు తోడవ్వడంతో ఈ సినిమా స్థాయి భారీగా పెరిగింది. ఈ చిత్రకథకి, విజువల్ నెరేటివ్‌కి, సినిమాకి పాన్ ఇండియా స్థాయి ఉంది.. అందుకే పాన్ ఇండియా మూవీగా తీశాం. ● 'మైఖేల్' యూనిక్ స్టోరీ. చెడ్డవాళ్ల మధ్య జరిగే ప్రేమకథ ఇది. యాక్షన్, ఎమోషన్స్, డార్క్ కామెడీ ఉంటుంది. మైఖేల్ చాలా వైల్డ్. గ్యాంగ్‌స్టర్ కాకపోయినా నా పాత్ర ఎగ్రెసివ్‌గా ఉంటుంది. ● ఈ సినిమాలోని ఓ సన్నివేశం కోసం దాదాపు 18 రోజులు పాటు ఫుడ్ తీసుకోకుండా నీళ్ల మాత్రమే తాగేవాణ్ణి. ఒక దశలో కుడి కాలు పని చేయడం మానేసింది. అయినా ఒక ఫైట్ షూట్ చేసి, ప్యాకప్ చెప్పాం. తమిళ సంస్కృతి, భాష నాకు తెలుసు. అందుకే తమిళ ప్రేక్షకుల నుంచి నాకు మంచి ప్రేమ లభించింది.. అలాగే విజయ్ సేతుపతిగారు 'మైఖేల్'లో భాగమయ్యారు. ధనుష్‌గారు 'కెప్టెన్ మిల్లర్'లో నన్ను తీసుకున్నారు. 'మైఖేల్'కి తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో నేనే డబ్బింగ్ చెప్పాను.

● 'మైఖేల్' నాకు చాలా స్పెషల్ జర్నీ. ఈ ప్రయాణంలో బరువు తగ్గాను, స్కూబా డైవింగ్ నేర్చుకున్నాను. అండర్ వాటర్‌లోనూ షూటింగ్ చేశాం. ప్రస్తుతం 'భైరవ కోన, కెప్టెన్ మిల్లర్, బడ్డీ' సినిమాలు చేస్తున్నాను. అలాగే 'ఫ్యామిలీ మ్యాన్ 3' వెబ్ సిరీస్ ఉంది.

సల్మాన్.. ఆమిర్... ఓ సినిమా!



సల్మాన్ ఖాన్, ఆమిర్ ఖాన్‌లు కలిసి ఓ సినిమా చేయనున్నారా? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. స్పానిష్ ఫిల్మ్ 'చాంపియన్స్' హిందీ రీమేక్‌ను నిర్మించి, నటించాలనుకున్నారు ఆమిర్. అయితే ఇప్పుడు ఈ రీమేక్‌కు సల్మాన్ ఖాన్ బాగుంటారని భావించారట. ఈ సినిమా గురించి చర్చించడానికి సల్మాన్‌ను ఇంటికి ఆహ్వానించారట ఆమిర్. కాగా తాను నటించిన 'ది ఫారెస్ట్ గంప్' హిందీ రీమేక్ 'లాల్‌సింగ్ చడ్డా' సరిగ్గా ఆడకపోవడంతో వెంటనే మరో రీమేక్‌లో నటించాలనే నిర్ణయాన్ని ఆమిర్ మార్చుకున్నారట. అందుకే హీరోగా నటించాల్సిందిగా సల్మాన్‌ను రిక్వెస్ట్ చేశారని టాక్.

మాస్ వేద


● శివరాజ్‌కుమార్

కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ హీరోగా నటించిన కన్నడ చిత్రం 'వేద' అదే పేరుతో తెలుగులో విడుదల కానున్న విషయం తెలిసిందే. నిర్మాత వీఆర్ కృష్ణ మండపాటి ఈ నెల 9న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు. ''మంచి మాస్ యాక్షన్ మూవీగా రూపొందిన ఈ చిత్రకథ తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకంతోనే అనువదించాం. కన్నడ పరిశ్రమలో శివ రాజ్‌కుమార్ ఒక ఐకానిక్ హీరో. ఆయన కెరీర్‌లో 125వ సినిమా అయిన 'వేద'ని మేం విడుదల చేయడం ఆనందంగా ఉంది'' అని వీఆర్ కృష్ణ అన్నారు. ఈ చిత్రానికి ఎ. హర్ష దర్శకత్వం వహించారు.

మా నాన్న చివరి కోరిక నెరవేరింది

- సూర్య వశిష్ఠ



''**బు**ట్టబొమ్మ'లో నటించే చాన్స్ రావడం హ్యాపీగా ఉంది. ఇందులో నా పాత్ర కొత్తగా, ఆకట్టుకునేలా ఉంటుంది'' అన్నారు సూర్య వశిష్ఠ. అనిఖా, సూర్య వశిష్ఠ, అర్జున్ దాస్ ప్రధాన పాత్రల్లో శౌరి చంద్రశేఖర్ టి. రమేష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బుట్టబొమ్మ'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజ్ అవుతోంది. సూర్య వశిష్ఠ మాట్లాడుతూ– ''మా నాన్న సత్యం గారు 30 ఏళ్లకుపైగా సినీ పరిశ్రమలో ఉన్నారు. రాఘవేంద్రరావు, రాజమౌళి, త్రివిక్రమ్‌గార్ల వద్ద కో డైరెక్టర్‌గా చేశారు. మా నాన్న 'కప్పేల'ని చూపించి, అందులోని ఆటో డ్రైవర్ పాత్ర నాకు సరిపోతుందన్నారు. అయితే కోవిడ్‌తో ఆయన మరణించారు. ఆ తర్వాత త్రివిక్రమ్‌గారిని కలిసి, 'బుట్టబొమ్మ' ఆడిషన్‌లో పాల్గొని, ఎంపికయ్యాను. అలా మా నాన్నగారి చివరి కోరిక నెరవేరంది'' అన్నారు.

ఆనందంతో మాట రాలేదు

- సుహాస్


● గౌరీప్రియ, సుహాస్, టీనా

''**మా** సినిమా ప్రీమియర్స్ చూసిన చాలా మంది నన్ను దీవిస్తుంటే ఆనందంతో మాట రాలేదు'' అని సుహాస్ అన్నారు. షణ్ముఖ ప్రశాంత్ దర్శకత్వంలో సుహాస్, టీనా శిల్పరాజ్ జంటగా నటించిన చిత్రం 'రైటర్ పద్మభూషణ్'. జి. మనోహర్ సమర్పణలో అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర, చంద్రు మనోహర్ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఫ్యామిలీ స్క్రీనింగ్స్ సక్సెస్ మీట్‌లో శరత్ చంద్ర, చంద్రు మనోహర్ మాట్లాడుతూ– ''మా సినిమా ప్రీమియర్స్‌లో ప్రేక్షకులు ప్రతి ఐదు నిమిషాలకోసారి గట్టిగా నవ్వడం మరచిపోలేని అనుభూతి'' అన్నారు.

మూడు చిత్రాల్లో...


● క్రిష్

''**క్ష**ణం'కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా, 'గూఢచారి, టైగర్ నాగేశ్వరావు' సినిమాలకు, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీలో కొన్ని చిత్రాలకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా చేశాను. ఎనిమిదేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నాను. ప్రేక్షకుల చేత మంచి నటుడు అనిపించుకోవాలన్నదే నా లక్ష్యం'' అని క్రిష్ సిద్ధిపల్లి అన్నారు. ఇంకా క్రిష్ మాట్లాడుతూ– ''నేను లేని నా ప్రేమకథ'లో ఓ లీడ్ రోల్ చేశాను. ప్రస్తుతం 'సుఖీభవ', 'రమ్య, రాబర్ట్, రహీం', 'ఎంగేజ్‌మెంట్' అనే మూడు సినిమాల్లో నటిస్తున్నాను. ఇంకా 'లవ్ ఇన్ 65'లో కీ రోల్, 'ఆహా' ఓటీటీ ప్రాజెక్టులో చేస్తున్నాను'' అన్నారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
3-2-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▼
224	6
59,932	17,610

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తెలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,188	▲	372
డోజోన్స్	33,953	▼	140
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,166	▲	89
డాక్స్	15,509	▲	328
హాంగ్‌సెంగ్	3,286	▲	1
నికాయ్	27,402	▲	55

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారట్)	58,882
బంగారం (22 క్యారట్)	58,646
వెండి (కేజీ)	71,576

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	81.10	82.77
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	88.71	91.81
€	యూరో	ఒకటి	99.82	103.20
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	62.71	64.78
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	57.37	59.77
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.81	63.86
SAR	సౌదీ రియాల్	[illegible]	20.92	22.59
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.48	23.27
¥	చైనా యువాన్	[illegible]	11.01	13.11

హెచ్‌డీఎఫ్‌సీ లాభం అప్

క్యూ3లో రూ. 7,078 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ మార్టిగేజ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్– డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 15 శాతం పుంజుకుని రూ. 7,078 కోట్లకు చేరింది. స్టాండెలోన్ నికర లాభం సైతం రూ. 3,261 కోట్ల నుంచి రూ. 3,691 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 13 శాతం మెరుగై రూ. 4,840 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 3.5 శాతంగా నమోదయ్యాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.32 శాతం నుంచి 1.49 శాతానికి దిగివచ్చాయి.

వడ్డీ రేట్ల ఎఫెక్ట్

ఆర్‌బీఐ వడ్డీ రేట్ల పెంపు నేపథ్యంలో లాభదాయకత మందగించినట్లు హెచ్‌డీఎఫ్‌సీ వైస్‌చైర్మన్, సీఈవో కేకి మిస్త్రీ వెల్లడించారు. అయితే రుణాలను కొత్త రేట్లకు వేగంగా అనుసంధానిస్తున్నట్లు, ఈ ప్రభావం రుణాలపై తదుపరి త్రైమాసికం నుంచీ ప్రతిఫలించనున్నట్లు తెలియజేశారు. వ్యక్తిగత రుణ విభాగం 26 శాతం వృద్ధిని సాధించగా.. సగటు టికెట్(రుణ) పరిమాణం రూ. 35.7 లక్షలకు బలపడినట్లు వెల్లడించారు. రూ. 18 లక్షలకుపైగా వార్షిక ఆదాయంగల రుణగ్రహీతలు 52 శాతంగా తెలియజేశారు. గ్రూప్ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు విలీనంపై ఆర్‌బీఐ, ఎన్‌సీఎల్‌టీ నుంచి నిర్ణయాలు వెలువడవలసి ఉన్నట్లు పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ షేరు దాదాపు 2 శాతం క్షీణించి రూ. 2,613 వద్ద ముగిసింది.

భారత్‌లో శామ్‌సంగ్ ఎస్23 తయారీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్మార్ట్ డివైజెస్ తయారీలో ఉన్న కొరియా కంపెనీ శామ్‌సంగ్ భారత్‌లో ప్రీమియం గెలాక్సీ ఎస్23 స్మార్ట్‌ఫోన్లను తయారు చేయనున్నట్టు ప్రకటించింది. ఎస్23 ధరల శ్రేణి భారత్‌లో రూ.75,000 నుంచి రూ.1.55 లక్షలు. ప్రస్తుతం గెలాక్సీ ఎస్ సిరీస్ మోడళ్లు వియత్నాంలో తయారు అవుతున్నాయి. అన్ని గెలాక్సీ ఎస్23 స్మార్ట్‌ఫోన్లు నోయిడా ఫ్యాక్టరీలో తయారు చేయనున్నట్టు కంపెనీ వెల్లడించింది. శామ్‌సంగ్ ఇప్పటికే నోయిడా ఫ్యాక్టరీలో తయారీ ద్వారా దేశీయ డిమాండ్‌లో ఎక్కువ భాగాన్ని పూర్తి చేస్తోంది. కెమెరా లెన్స్‌ల దిగుమతిపై సుంకాన్ని తొలగిస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన ఒక రోజు తర్వాత కంపెనీ నుంచి ఈ ప్రకటన వెలువడడం విశేషం. కెమెరాయే గెలాక్సీ ఎస్ సిరీస్ స్మార్ట్‌ఫోన్ల ప్రత్యేకత.

మూడు మోడళ్లు..

కంపెనీ భారత్‌లో తాజాగా గెలాక్సీ ఎస్23 శ్రేణిలో హై–ఎండ్ కెమెరా సెన్సర్స్‌తో మూడు మోడళ్లను ఆవిష్కరించింది. ఎస్23, ఎస్23 ప్లస్, ఎస్23 అల్ట్రా వీటిలో ఉన్నాయి. 6.8 అంగుళాల క్యూహెచ్‌డీ ప్లస్ 120 హెట్జ్ అమోలెడ్ డిస్‌ప్లేతో ఎటువంటి వెలుతురులోనైనా స్పష్టమైన చిత్రాలను తీయగలిగేలా గెలాక్సీ ఎస్23 అల్ట్రాను రూపొందించింది. ఈ మోడల్‌కు 12 ఎంపీ మొదలు.. 200 ఎంపీ అడాప్టివ్ పిక్సెల్ సెన్సార్ వరకు 5 కెమెరాలను పొందుపరిచారు. విక్టస్–2 కార్నింగ్ గొరిల్లా గ్లాస్, ఆండ్రాయిడ్ 13, ఇన్ డిస్‌ప్లే అల్ట్రాసోనిక్ ఫింగర్‌ప్రింట్ స్కానర్, 12 ఎంపీ డ్యూయల్ పిక్సెల్ ఫ్రంట్ కెమెరా వంటి ఫీచర్లు ఉన్నాయి. ఫిబ్రవరి 17 నుంచి అందుబాటులో ఉండే అవకాశం ఉంది.



మార్కెట్ అస్థిరతలతోనే ఎఫ్‌పీవో వెనక్కి

- ఇన్వెస్టర్ల ప్రయోజనాలే మాకు ముఖ్యం
- అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ ఫ్లాగ్‌షిప్ కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీవో)ను ఉపసంహరించుకోవడంపై గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ స్పందించారు. మార్కెట్లో నెలకొన్న అస్థిరతల నేపథ్యంలోనే ఈ నిర్ణయానికి వచ్చినట్లు చెప్పారు. అదానీ గ్రూప్ రూ.20,000 కోట్ల సమీకరణతో ఎఫ్‌పీవోకి రాగా, హెచ్‌ఎస్‌ఐ, సంస్థాగత ఇన్వెస్టర్ల మద్దతుతో పూర్తిగా సబ్‌స్క్రయిబ్ కావడం తెలిసిందే. ''పూర్తిగా సబ్‌స్క్రయిబ్ అయిన ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్‌ను రద్దు చేయడం చాలా మందిని ఆశ్చర్యపరిచింది. నిన్నటి మార్కెట్ అస్థిరతలను చూసిన తర్వాత ఎఫ్‌పీవో విషయంలో ముందుకు వెళ్లడం నైతికత కాదని బోర్డ్ బలంగా అభిప్రాయపడింది''అని గౌతమ్ అదానీ తన సందేశంలో పేర్కొన్నారు. అమెరికాకు చెందిన పెట్టుబడుల సంస్థ హిండెన్ బర్గ్ అదానీ గ్రూప్‌పై పలు ఆరోపణలు చేయగా.. ఆ తర్వాత నుంచి గ్రూప్ కంపెనీల షేర్లు రోజూ నష్టపోతుండడం తెలిసిందే. అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.3,112–3,276 ధరల శ్రేణితో ఎఫ్‌పీవో పూర్తి చేసుకుంది. కానీ, ఆ తర్వాత మార్కెట్లో షేరు దీనికంటే తక్కువకు పడిపోవడం గమనార్హం. ఓపెన్ మార్కెట్లో తక్కువ ధరకు లభిస్తున్నందున అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఎఫ్‌పీవోలో ఇన్వెస్ట్ చేసి నష్టపోయామని ఇన్వెస్టర్లు భావించే అవకాశం ఉంటుందని కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి. ''వ్యాపారవేత్తగా నాలుగు దశాబ్దాల నా ప్రయాణంలో భాగస్వాములు అందరి నుంచి, ముఖ్యంగా వాటాదారుల నుంచి ఎంతో మద్దతు లభించింది. నా వరకు నా వాటాదారుల ప్రయోజనాలే పరమావధి. ఆ తర్వాతే ఏదైనా. కనుక నష్టాల నుంచి ఇన్వెస్టర్లను రక్షించేందుకు ఎఫ్‌పీవోను ఉపసంహరించుకున్నాం'' అని గౌతమ్ అదానీ వివరించారు.

యథావిధిగా గ్రూప్ వ్యాపార కార్యకలాపాలు

ఈ నిర్ణయం గ్రూపు వ్యాపార కార్యకలాపాలపై ఏమీ ఉండదని, ఎప్పటి మాదిరే తాము సకాలంలో ప్రాజెక్టుల పూర్తిపై దృష్టి సారిస్తామని ప్రకటించారు. మార్కెట్లు స్థిరపడిన తర్వాత తిరిగి మార్కెట్‌కు వెళ్లే వ్యూహాన్ని సమీక్షిస్తామని చెప్పారు. ''ఈఎస్‌జీపై మేము బలంగా దృష్టి పెట్టాం. ప్రతీ వ్యాపారం కూడా బాధ్యతాయుత మార్గంలో విలువను సృష్టిస్తుంది. మా పాలనా సూత్రాలకు మేము కుదుర్చుకున్న పలు అంతర్జాతీయ భాగస్వామ్యాలే నిదర్శనం. పలు వ్యాపారాల్లో వీటిని నిర్మించాం'' అని గౌతమ్ అదానీ వాటాదారులకు వివరించారు.

సత్యం కేసులో తాజా ఉత్తర్వులు ఇవ్వండి

సెబీకి శాట్ ఆదేశం



న్యూఢిల్లీ: సత్యం కంప్యూటర్స్ స్కామ్‌లో రామలింగరాజు తదితరులను 14 ఏళ్లపాటు సెక్యూరిటీస్ మార్కెట్ల నుంచి నిషేధిస్తూ సెబీ జారీ చేసిన ఉత్తర్వులను అప్పిలేట్ ట్రిబ్యునల్ శాట్ పక్కన పెట్టింది. 14 ఏళ్ల వ్యవధిని నిర్దేశించడానికి ఏ కారణమూ చూపలేదని పేర్కొంది. అలాగే ఒక్కొక్కరూ అక్రమంగా ఎంతెంత లబ్ధి పొందారో వేర్వేరుగా లెక్కించాల్సిందని సూచించింది. దీనిపై నాలుగు నెలల్లో కొత్తగా ఉత్తర్వులు ఇవ్వాలంటూ ఆదేశించింది. వివరాల్లోకి వెడితే .. ఖాతాల్లో అవకతవకలు బైటపడటంతో 2009లో సత్యం కంప్యూటర్స్ సంక్షోభంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి ప్రమోటర్లయిన రామలింగ రాజు, రామ రాజులతో పాటు పలువురిపై కేసులు దాఖలయ్యాయి. ఆరుగురిని సెక్యూరిటీస్ మార్కెట్ల నుంచి 14 ఏళ్లు నిషేధించడంతో పాటు భారీగా జరిమానా విధిస్తూ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ 2018లో రెండు ఉత్తర్వులు ఇచ్చింది. వీటిపై వారు సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా తాజా ఆదేశాలు వచ్చాయి.

కొత్త పన్ను విధానం ఆకర్షణీయం

- తక్కువ పన్ను రేటు
- ఎక్కువ మందికి ప్రయోజనకరం
- నచ్చిన విధానం ఎంచుకోవచ్చు
- సీబీడీటీ చైర్మన్ నితిన్‌గుప్తా



న్యూఢిల్లీ: నూతన పన్ను విధానం 2023–24 బడ్జెట్‌తో ఆకర్షణీయంగా మారినట్టు ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) చైర్మన్ నితిన్ గుప్తా తెలిపారు. ఎక్కువ మంది ఇన్వెస్టర్లకు ఇది ప్రయోజనకరమని, తక్కువ పన్ను రేటును వారు ఆస్వాదిస్తారని చెప్పారు. బడ్జెట్ అనంతరం ఓ వార్తా సంస్థతో గుప్తా మాట్లాడారు. తగ్గింపులు, మినహాయింపులను క్రమంగా దూరం చేయడం కోసమే నూతన పన్ను విధానంలో (మినహాయింపుల్లేని) కొత్త శ్లాబులు, రేట్లు ప్రకటించడానికి కారణంగా పేర్కొన్నారు. దీని ద్వారా వ్యక్తులు, సంస్థలపై పన్ను రేట్లు తగ్గించాలన్న దీర్ఘకాలిక డిమాండ్‌ను చేరుకోవడం సాధ్యపడుతుందన్నారు. ''నూతన పన్ను విధానాన్ని రెండేళ్ల క్రితం (2020–21 బడ్జెట్‌లో) ప్రతిపాదించాం. అయినప్పటికీ తగిన ప్రతిఫలాన్ని ఇవ్వడం లేదు. ఇప్పుడు ప్రభుత్వం శ్లాబులను మార్చింది. దీనివల్ల పన్ను చెల్లింపుదారులకు రేట్లు, శ్లాబులు ఇప్పుడు చాలా స్పష్టంగా అర్థమవుతాయి''అని చెప్పారు. కార్పొరేట్ విభాగంలో పన్ను చెల్లింపుదారులకు ఇదే మాదిరి చర్యలను కొంత కాలం క్రితం ప్రకటించగా, వారికి ప్రయోజనకరంగా మారినట్టు గుప్తా తెలిపారు. నూతన పన్ను విధానంతో లబ్ధి పొందని వర్గాలు చాలా తక్కువన్నారు. దీనిలో స్టాండర్డ్ డిడక్షన్ కల్పించినందున, అది పాత విధానంలోని ప్రయోజనాలకు ఏ మాత్రం తీసిపోదన్నారు.

పన్ను చెల్లింపు దారుల ఇష్టమే..

నూతన పన్ను విధానం డిఫాల్ట్ (ప్రమేయం లేని)గా ఉంటున్నందున, పాత పన్ను విధానంలో ఉన్నవారిపై ప్రభావం పడుతుందా? అన్న ప్రశ్నకు.. ఏ విధానం అయినా ఎంపిక చేసుకుని రిటర్నులు దాఖలు చేసే స్వేచ్ఛ పన్ను చెల్లింపుదారులకు ఉంటుందని నితిన్‌గుప్తా చెప్పారు. కావాలంటే పాత పన్ను విధానానికి కూడా మారిపోవచ్చన్నారు. ''డిఫాల్ట్ అంటే ఫైలింగ్ పోర్టల్ స్క్రీన్‌పై ముందు కనిపిస్తుంది. కానీ, అక్కడ ఏ పన్ను విధానం అనే ఆప్షన్ ఉంటుంది. కావాల్సిన విధానాన్ని ఎంపిక చేసుకోవచ్చు''అని గుప్తా వివరించారు. ఏ వర్గం పన్ను చెల్లింపుదారులను కూడా నిరుత్సాహపరచబోమన్నారు. నూతన పన్ను విధానంలో రూ.7 లక్షల వరకు పన్ను చెల్లించే అవకాశం లేకుండా రిబేట్ కల్పించడం తెలిసిందే. దీనికి అదనంగా రూ.50 వేల స్టాండర్డ్ డిడక్షన్ ప్రయోజనం కూడా ప్రకటించారు. పాత విధానంలో అయితే రూ.5 లక్షలకు మించిన ఆదాయంపై 20% పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కాకపోతే వివిధ సెక్షన్ల కింద తగిన సాధనాల్లో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది.

అంతిమంగా కొత్త విధానమే

తక్కువ పన్ను రేట్లతో, మినహాయింపుల్లేని, సులభతర పన్నుల విధానానికి (నూతన పన్ను విధానం) మళ్లడమే ప్రభుత్వ ధ్యేయమని కేంద్ర ప్రభుత్వ రెవెన్యూ విభాగం కార్యదర్శి సంజయ్ మల్హోత్రా తెలిపారు. రెవెన్యూ శాఖ నిర్వహించిన విశ్లేషణ ప్రకారం ఏటా రూ.15 లక్షలు ఆర్జించే వ్యక్తి పాత పన్ను విధానంలో రూ.3.75 లక్షల వరకు క్లెయిమ్‌లు పొందొచ్చని.. కానీ, తక్కువ పన్ను రేట్లతో దీనికి ప్రత్యామ్నాయ పన్నుల విధానాన్ని ప్రతిపాదించినట్టు చెప్పారు. నూతన పన్ను విధానం తప్పనిసరి చేయడానికి ఎలాంటి గడువు పెట్టుకోలేదని స్పష్టం చేశారు.

కొనసాగిన ఊగిసలాట

సెన్సెక్స్‌కు లాభం, నిఫ్టీకి నష్టం



ముంబై: రోజంతా లాభనష్టాల మధ్య దోబూచులాడిన స్టాక్ సూచీలు చివరికి మిశ్రమంగా ముగిశాయి. అదానీ షేర్లలో పతనం కొనసాగడం, అంతర్జాతీయ మార్కెట్లలోని నెలకొన్న మిశ్రమ సంకేతాల మధ్య సెన్సెక్స్ లాభాలను సాధించగా, నిఫ్టీ స్వల్ప నష్టంగా నష్టపోయింది. ఉదయం సెన్సెక్స్ 248 పాయింట్ల నష్టంతో 59,460 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 729 పాయింట్ల రేంజ్‌లో 59,216 వద్ద కనిష్టాన్ని, 60,008 గరిష్టాన్ని తాకింది. చివరికి 224 పాయింట్లు పెరిగి 59,932 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 99 పాయింట్ల నష్టంతో 17,616 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఆఖరికి 6 పాయింట్ల స్వల్ప నష్టంతో 17,610 వద్ద నిలిచింది. మెటల్, ఫార్మా, ప్రభుత్వరంగ బ్యాంక్స్, ఆర్థిక షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, ప్రైవేట్ బ్యాంక్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు డాలర్లకు డిమాండ్ పెరగడంతో ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ 40 పైసలు పతనమై 82.20 స్థాయి వద్ద ముగిసింది. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపుకిది చివరి దశ కావచ్చనే అంచనాల మధ్య ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

అదానీ గ్రూప్ షేర్లలో కొనసాగిన అమ్మకాలు

అదానీ గ్రూప్ ఎఫ్‌పీఓ ఉపసంహరించుకోవడంతో తీవ్రమైన అమ్మకాల ఒత్తిడిని చవిచూశాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ 26.50%, అదానీ ట్రాన్స్‌మిషన్, అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లు 10% పతనమయ్యాయి. అదానీ పోర్ట్స్ 6%, అదానీ విల్మార్, ఎన్‌డీటీవీ, అదానీ పవర్ షేర్లు 5% చొప్పున నష్టపోయాయి.

సాక్షి స్పోర్ట్స్

రెజ్లర్ అమన్‌కు కాంస్యం



భారత యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ క్రొయేషియాలో జరుగుతున్న జాగ్రెబ్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించాడు. పురుషుల 57 కేజీల కేటగిరీలో మూడో స్థానం కోసం జరిగిన పోరులో పోటీపడిన 17 ఏళ్ల అమన్ 10–4తో జేన్ రే రోడ్స్ రిచర్డ్స్ (అమెరికా)పై గెలుపొందాడు. ఈ ఈవెంట్‌లో యుతొ నిషివుచి (జపాన్) చేతిలో అమన్ సెమీస్‌లో ఓడిపోయాడు. అయితే ప్రత్యర్థి ఫైనల్ చేరడంతో రెపిచేజ్ రౌండ్‌కు అమన్ అర్హత సాధించాడు. మహిళల 50 కేజీల్లో శివాని పవార్ క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. ఆమె 0–4తో ఎరిన్ సిమోన్ (అమెరికా) చేతిలో ఓడిపోయింది. భారత రెజ్లింగ్ సమాఖ్యతో విభేదాల నేపథ్యంలో అగ్రశ్రేణి రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, బజ్‌రంగ్ పూనియా, రవి దహియా ఈ టోర్నమెంట్‌లో ఆడటం లేదు. దీపక్ పూనియా, అన్షు మలిక్, సంగీత ఫొగాట్, సరితా మోర్, జితేంద్ర కిన్హా కూడా టోర్నీనుంచి ముందే తప్పుకున్నారు.

ఆస్ట్రేలియా సాధన షురూ



ప్రాక్టీస్ చేస్తున్న లబుషేన్



నాగపూర్ చేరుకున్న సిరాజ్

ఉస్మాన్ ఖాజాకు లైన్‌క్లియర్

బెంగళూరు: ఐదేళ్ల క్రితం...భారత గడ్డపై బోర్డర్–గావస్కర్ ట్రోఫీ తొలి టెస్టులో ఆస్ట్రేలియా అనూహ్య విజయంతో టీమిండియాకు షాక్ ఇచ్చింది. పుణేలో స్పిన్ పిచ్ సిద్ధం చేస్తే మనకంటే సమర్థంగా దానిని వాడుకున్న ఆ జట్టు పైచేయి సాధించింది. చివరకు సిరీస్ భారత్ ఖాతాలోనే చేరినా...స్పిన్‌పై ఆసీస్ సన్నద్ధతను ఆ టెస్టు చూపించింది. ఇప్పుడు కూడా సరిగ్గా అదే తరహాలో కఠిన పరిస్థితులను ఎదుర్కొనేందుకు కంగారూ బృందం సిద్ధమవుతోంది. అందు కోసం భారత గడ్డపై అడుగు పెట్టగానే ప్రణాళికలు అమలు చేసింది. తొలి టెస్టు ఈ నెల 9న నాగపూర్‌లో మొదలు కానుండగా... దానికంటే ముందు నాలుగు రోజులు మరో వేదికను తమ ప్రాక్టీస్ కేంద్రంగా ఆస్ట్రేలియా మార్చుకుంది. బెంగళూరు శివార్లలో ఆలూరు మైదానంలో ఆ జట్టు సాధన ప్రారంభించింది. ప్రాక్టీస్ మ్యాచ్‌లు అవసరం లేదని ముందే తేల్చుకున్న ఆసీస్...నెట్స్‌లోనే భిన్నమైన పిచ్‌లను రెడీ చేసి బరిలోకి దిగింది. స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కొనే క్రమంలో ఆ జట్టు కోచింగ్ బృందంలో డానియెల్ వెటోరీకి చోటు కల్పించింది. ప్రపంచ అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న వెటోరీ అనుభవం, సూచనలు కచ్చితంగా ఆసీస్‌కు ఉపయోగపడతాయి. గతంలో ఐపీఎల్‌లో బెంగళూరు జట్టుతో కలిసి పని చేసిన సాన్నిహిత్యంతో పిచ్‌ల ఏర్పాటు, ప్రాక్టీస్ విషయంలో ఆర్‌సీబీ బృందం సహకారాన్ని ఆస్ట్రేలియా హెడ్ కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ తీసుకున్నాడు. నాలుగు టెస్టుల వేదికల్లో ఎదురయ్యే పిచ్‌లపై ఒక అంచనాతో అదే తరహా పిచ్‌లను సిద్ధం చేసి ఆసీస్ ప్రాక్టీస్ చేస్తోంది. నెమ్మదైన టర్నింగ్ పిచ్, బాగా టర్నింగ్‌కు సహకరించే పిచ్, భిన్నమైన బౌన్స్‌లను నాగపూర్, ఢిల్లీ, అహ్మదాబాద్‌లలో ఆ జట్టు ఎదుర్కోవాల్సి రావచ్చు. సీమ్‌కు అనుకూలించే ధర్మశాల తరహా పచ్చిక ఉన్న పిచ్‌పై కూడా ఆస్ట్రేలియా సాధన మొదలు పెట్టింది. గతంలో అశ్విన్, జడేజాలను ఎదుర్కొన్న అనుభవం ఉన్నా...టెస్టుల్లో ఇప్పటి వరకు అక్షర్ పటేల్‌ను ఆస్ట్రేలియా ఎదుర్కోలేదు. అందుకే అతని బౌలింగ్ వీడియో ఫుటేజీపై ప్రత్యేక దృష్టి పెట్టింది. బౌలింగ్ శైలిలో అక్షర్‌ను పోలి ఉండే జమ్మూ కశ్మీర్ లెఫ్టార్మ్ స్పిన్నర్ ఆబిద్ ముస్తాక్ ప్రాక్టీస్‌లో ఆస్ట్రేలియాకు బౌలింగ్ చేస్తున్నాడు. ఆబిద్ ఈ సీజన్ రంజీ ట్రోఫీలో అగ్రశ్రేణి జట్లపై సత్తా చాటి మొత్తం 32 వికెట్లతో అందరి దృష్టినీ ఆకర్షించాడు. టాపార్డర్ బ్యాటర్ ఉస్మాన్ ఖాజా వీసా సమస్య పరిష్కృతమైంది. పాక్‌లో పుట్టిన ఈ క్రికెటర్ చివరి నిమిషంలో వీసా అందకపోవడంతో జట్టు సహచరులతో పాటు భారత్‌కు రాలేకపోయాడు. అయితే ఇప్పుడు అంతా చక్కబడటంతో గురువారం ఖాజా భారత్‌కు బయల్దేరాడు. మరో వైపు వేర్వేరు నగరాల్లో ఉన్న భారత క్రికెటర్లు ఒక్కొక్కరిగా తొలి టెస్టు వేదిక నాగపూర్‌కు చేరుకుంటున్నారు. జట్టు అంతా ఒక్క చోటికి చేరిన తర్వాత టీమ్ ప్రాక్టీస్ ప్రారంభమవుతుంది.

తుది పోరులో పేలవంగా...

- ఫైనల్లో భారత మహిళల పరాజయం
- ముక్కోణపు టోర్నీ విజేత దక్షిణాఫ్రికా



హర్లీన్

ఈస్ట్ లండన్: టి20 ప్రపంచకప్‌కు ముందు సన్నాహకంగా సాగిన టోర్నమెంట్‌లో భారత మహిళల జట్టుకు తీవ్ర నిరాశ! లీగ్ దశలో చక్కటి ప్రదర్శన కనబర్చిన జట్టు పేలవ బ్యాటింగ్ ప్రదర్శనతో చివరి మెట్టుపై చతికిలపడింది. ఫలితంగా ముక్కోణపు టోర్నీలో ఆతిథ్య దక్షిణాఫ్రికా మహిళలు విజేతగా నిలిచారు. గురువారం జరిగిన ఫైనల్లో సఫారీ బృందం 5 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 109 పరుగులే చేయగలిగింది. వికెట్లు అందుబాటులో ఉన్నా... సఫారీ టీమ్ కట్టుదిట్టమైన బౌలింగ్ ముందు భారత టాప్–4 బ్యాటర్లంతా వేగంగా ఆడటంలో విఫలమయ్యారు. ఎనిమిది బంతులాడి స్మృతి మంధాన (0) డకౌట్ కాగా, మరో ఓపెనర్ జెమీమా రోడ్రిగ్స్ (11) కూడా విఫలమైంది. హర్లీన్ డియోల్ (56 బంతుల్లో 46; 4 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలవగా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (22 బంతుల్లో 21; 2 ఫోర్లు) నిరాశపర్చింది. చివర్లో దీప్తి శర్మ (14 బంతుల్లో 16 నాటౌట్) స్కోరును 100 పరుగులు దాటించింది. ఎమ్‌లాబాకు 2 వికెట్లు దక్కాయి. అనంతరం దక్షిణాఫ్రికా 18 ఓవర్లలో 5 వికెట్లకు 113 పరుగులు చేసి విజయాన్నందుకుంది. దక్షిణాఫ్రికా కూడా 21 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడినా...'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' క్లో ట్రైఆన్ (32 బంతుల్లో 57 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడు ప్రదర్శించి జట్టును గెలిపించింది. స్నేహ్ రాణా 2 వికెట్లు పడగొట్టింది. భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచింది. ఈ నెల 10నుంచి దక్షిణాఫ్రికా గడ్డపైనే మహిళల టి20 వరల్డ్ కప్ జరగనుంది.

మధ్యప్రదేశ్ విజయలక్ష్యం 245

రెండో ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 93 ఆలౌట్



ఇండోర్: రంజీ ట్రోఫీలో తొలిసారి సెమీఫైనల్ చేరేందుకు చక్కటి అవకాశాలు సృష్టించుకున్న ఆంధ్ర జట్టు అంతలోనే తడబడింది. డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్‌పై ఏకంగా 151 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో పైచేయి సాధించినా...రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ వైఫల్యం జట్టును దెబ్బ తీసింది. ఓవర్‌నైట్ స్కోరు 144/4తో ఆట కొనసాగించిన మధ్యప్రదేశ్ గురువారం తమ తొలి ఇన్నింగ్స్‌లో 228 పరుగులకే ఆలౌటైంది. ఆదిత్య శ్రీవాత్సవ (31) ఒక్కడే కొద్దిగా పోరాడాడు. ఆంధ్ర బౌలర్లలో యర్రా పృథ్వీరాజ్ (5/26) ఐదు వికెట్ల ప్రదర్శనతో ప్రత్యర్థిని కుప్పకూల్చగా... కేవీ శశికాంత్ 3 వికెట్లు పడగొట్టాడు. అయితే ఆ తర్వాత ఆంధ్ర బ్యాటర్లు పూర్తిగా విఫలమయ్యారు. రెండో ఇన్నింగ్స్‌లో జట్టు 32.3 ఓవర్లలో 93 పరుగులకే ఆలౌటైంది. అశ్విన్ హెబర్ (35) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. చేతి గాయంతో బాధపడుతున్న కెప్టెన్ హనుమ విహారి (15) చివరి బ్యాటర్‌గా బరిలోకి దిగి మరో సారి 'లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటింగ్'తో జట్టును ఆదుకునే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. అవేశ్ ఖాన్ 4 వికెట్లు తీశాడు. అనంతరం 245 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన మధ్యప్రదేశ్ ఆట ముగిసే సమయానికి వికెట్ కోల్పోకుండా 58 పరుగులు చేసింది. హిమాన్షు మంత్రి (31 బ్యాటింగ్), యష్ దూబే (24 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. ఆ జట్టు విజయం కోసం మరో 187 పరుగులు చేయాల్సి ఉంది. సొంతగడ్డపై ఎంపీ సులువుగా లక్ష్యం ఛేదిస్తుందా లేక ఆంధ్ర మరోసారి చెలరేగి ప్రత్యర్థిని పడగొడతారా చూడాలి.

భారత్‌కు డెన్మార్క్ సవాల్

నేటి నుంచి డేవిస్ కప్ పోరు



హిలెరాడ్ (డెన్మార్క్): డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్–1 ప్లేఆఫ్‌లో భాగంగా భారత్ క్లిష్టమైన పోరుకు సిద్ధమైంది. శుక్ర, శనివారాల్లో జరిగే పోటీల్లో భారత్... డెన్మార్క్‌తో తలపడుతుంది. గతేడాది సొంత గడ్డ (ఢిల్లీ)పై జరిగిన పోరులో భారత్ 4–0తో డెన్మార్క్‌ను ఓడించింది. కానీ అప్పుడు స్టార్ ప్లేయర్, ప్రపంచ 9వ ర్యాంకర్ హోల్గర్ రూన్ గైర్హాజరయ్యాడు. ఇప్పుడు అతను అందుబాటులో ఉండటం, పోరు వారి గడ్డపైనే జరుగుతుండటంతో భారత్‌కు విజయం అంత సులువు కాదు. 19 ఏళ్ల టీనేజ్ సంచలనం రూన్ గతేడాది మూడు ఏటీపీ సింగిల్స్ టైటిల్స్ సాధించాడు. ఈ సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ప్రిక్వార్టర్స్ చేరాడు. ఏటీపీ ర్యాంకుల్లో టాప్–300 ర్యాంకింగ్స్‌లో కూడా లేని భారత ఆటగాళ్లకు ఏకంగా టాప్–10లోని ఆటగాడు ఎదురవడమే ఈ ప్లేఆఫ్ టైని క్లిష్టంగా చేసింది. రెండు రోజుల పాటు జరిగే ఈ సమరంలో భారత్ నుంచి యూకీ బాంబ్రీ (571 ర్యాంకు), సుమిత్ నగాల్ (509), ప్రజ్నేశ్ గుణేశ్వరన్ (306), రామ్‌కుమార్ (412), రోహన్ బోపన్న (డబుల్స్) బరిలోకి దిగుతున్నారు. అయితే భారత్‌కు రూన్ రూపంలో గట్టి ప్రత్యర్థి ఎదురవుతున్నప్పటికీ మిగతా ఇద్దరు హోల్మ్‌గ్రెన్ (484 ర్యాంకర్), ఎల్మెర్ మోయెల్లెర్ (718 ర్యాంకర్) లోయర్ ర్యాంకింగ్ ప్లేయర్లు ఉండటం భారత శిబిరానికి కాస్త ఊరట! రూన్‌తో పోరాటం కష్టమైనా మిగతా సింగిల్స్, డబుల్స్, రివర్స్ సింగిల్స్‌లో భారత ఆటగాళ్లు గెలిస్తే... ఈ పోరులో గట్టెక్కవచ్చు.

షెడ్యూల్

నేటి మ్యాచ్‌లు

యూకీ బాంబ్రీ X హోల్గర్ రూన్
సుమిత్ నగాల్ X అగస్ట్ హోల్మ్‌గ్రెన్
యూకీ–బోపన్న X ఇంగిల్డ్‌సన్–సిగ్స్‌గార్డ్

రేపటి మ్యాచ్‌లు

సుమిత్ X రూన్
యూకీ X హోల్మ్‌గ్రెన్
యూకీ–బోపన్న X ఇంగిల్డ్‌సన్–సిగ్స్‌గార్డ్

ఆర్చర్‌కు 6 వికెట్లు

చివరి వన్డేలో ఇంగ్లండ్ గెలుపు



కింబర్లీ: దక్షిణాఫ్రికా చేతిలో వన్డే సిరీస్‌ను కోల్పోయిన తర్వాత చివరి మ్యాచ్‌ను ఇంగ్లండ్ విజయంతో ముగించింది. బుధవారం జరిగిన మూడో వన్డేలో ఇంగ్లండ్ 59 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. ముందుగా ఇంగ్లండ్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 346 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జోస్ బట్లర్ (127 బంతుల్లో 131; 6 ఫోర్లు, 7 సిక్స్‌లు), డేవిడ్ మలాన్ (114 బంతుల్లో 118; 7 ఫోర్లు, 6 సిక్స్‌లు) సెంచరీలతో కదం తొక్కగా... ఎన్‌గిడికి 4 వికెట్లు దక్కాయి. అనంతరం దక్షిణాఫ్రికా 43.1 ఓవర్లలో 287 పరుగులకు ఆలౌటైంది. హెన్రిచ్ క్లాసెన్ (62 బంతుల్లో 80; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), రీజా హెన్‌డ్రిక్స్ (61 బంతుల్లో 52; 6 ఫోర్లు) రాణించారు. పేస్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ (6/40) ప్రత్యర్థిని కుప్పకూల్చగా, ఆదిల్ రషీద్ 3 వికెట్లు పడగొట్టాడు.

క్వార్టర్ ఫైనల్లో సాయిప్రణీత్

థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్

బ్యాంకాక్: భారత షట్లర్ భమిడిపాటి సాయిప్రణీత్ థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. అయితే మిగతా షట్లర్లకు ప్రిక్వార్టర్స్‌లోనే చుక్కెదురైంది. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సాయిప్రణీత్ 24–22, 7–21, 22–20తో జియోన్ హెయోక్ జిన్ (కొరియా)పై విజయం సాధించాడు. శుక్రవారం జరిగే క్వార్టర్స్‌లో అతను ఆరో సీడ్ లి షి ఫెంగ్ (చైనా)తో తలపడనున్నాడు. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో సిక్కిరెడ్డి– రోహన్ కపూర్ ద్వయం 11–21, 10–21తో 6వ సీడ్ ఫెంగ్ యాన్ జి–హువాంగ్ (చైనా) జోడీ చేతిలో, 8వ సీడ్ ఇషాన్ భట్నాగర్– తనీషా క్రాస్టో జంట 19–21, 16–21తో అక్బర్ బింటాంగ్–మార్షెలా గిస్కా ఇస్లామి (ఇండోనేసియా) జోడీ చేతిలో కంగుతిన్నాయి. పురుషుల డబుల్స్‌లో ఇషాన్ భట్నాగర్–సాయిప్రతీక్ 14–21, 21–18, 24–26తో తనడాన్ పన్‌పనిచ్–వచిరవిత్ సొతన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలయ్యారు. మహిళల సింగిల్స్‌లో అష్మిత 21–19, 13–21, 27–29తో ఆరో సీడ్ లైన్ హోజ్‌మార్క్ (డెన్మార్క్) చేతిలో తుదికంటా పోరాడి ఓడింది. పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జ్ 22–20, 15–21, 20–22తో లీ చుక్ యి (హాంకాంగ్) చేతిలో ఓడాడు.



విజేతలకు ఘనస్వాగతం: దక్షిణాఫ్రికాలో జరిగిన తొలి అండర్–19 మహిళల టి20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టులో సభ్యులైన తెలంగాణ ప్లేయర్లు గొంగిడి త్రిష, సొప్పదండి యశశ్రీ గురువారం స్వస్థలం చేరుకున్నారు. వీరిద్దరితో పాటు ఫిట్‌నెస్ ట్రైనర్ షాలినిలకు శంషాబాద్ విమానాశ్రయంలో రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, 'శాట్స్' చైర్మన్ ఆంజనేయగౌడ్ ఘనస్వాగతం పలికారు.

నెలాఖరులోపు ఎస్‌ఎస్‌ఎల్‌వీ-డీ2 ప్రయోగం



ఎస్‌ఎస్‌ఎల్‌వీ-డీ2 రాకెట్ నమూనా

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ నెలాఖరులోపు తిరుపతి జిల్లా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్‌ఎస్‌ఎల్‌వీ-డీ2) ప్రయోగాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రయోగంలో ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈఓఎస్-07) అనే ఉపగ్రహంతోపాటు మరో రెండు చిన్న తరహా ఉపగ్రహాలను ప్రయోగించనుంది. అయితే గత ఏడాది ఆగస్టు 7న ఎస్‌ఎస్‌ఎల్‌వీ-డీ1 పేరుతో చేసిన మొదటి ప్రయోగం సక్సెస్ అయినా... కక్ష్యలోకి చేరిన ఉపగ్రహాల నుంచి సిగ్నల్స్ అందకపోవడంతో ఈ ప్రయోగం విఫలమైనట్లుగా ఇస్రో ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రయోగంలో జరిగిన సాంకేతిక లోపాలు మరోసారి చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ఎస్‌ఎస్‌ఎల్‌వీ సిరీస్‌లో రెండో ప్రయోగాన్ని చేయడానికి ఇస్రో సిద్ధమవుతోంది.

గ్రేడ్-2 మున్సిపాలిటీగా పుట్టపర్తి

సాక్షి, అమరావతి: పుట్టపర్తి నగర పంచాయతీ స్థాయిని ప్రభుత్వం పెంచింది. ఇప్పటివరకు నగర పంచాయతీగా ఉన్న పుట్టపర్తిని గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేసింది. ఈ మేరకు గురువారం మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు.

జలరవాణా శాఖతో డీసీఐ భారీ ఒప్పందం

మూడేళ్లకు రూ.204.5 కోట్లతో ఎంవోయూ


ఒప్పందం కుదుర్చుకుంటున్న డీసీఐ సీఎండీ దివాకర్, వాటర్‌వేస్ అథారిటీ టెక్నికల్ మెంబర్ అశుతోష్‌గౌతమ్

సాక్షి, విశాఖపట్నం : కేంద్ర జల రవాణా అథారిటీ ఆఫ్ ఇండియా(ఐడబ్ల్యూఏఐ)తో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(డీసీఐ) భారీ ఒప్పందం కుదుర్చుకుంది. కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేసే ఐడబ్ల్యూఏఐ పరిధిలో ఉన్న వివిధ జాతీయ జలమార్గాల నిర్వహణకు సంబంధించి రూ.204.5 కోట్ల ఒప్పందంపై డీసీఐ సీఎండీ ఎస్.దివాకర్, వాటర్‌వేస్ అథారిటీ టెక్నికల్ మెంబర్ అశుతోష్‌గౌతమ్ గురువారం సంతకాలు చేశారు. ఈశాన్య భారత దేశంలోని ధన్‌సిరి నదిలో నుమాలిగర్ జెట్టీ నుంచి ధన్‌సిరి సంగమం వరకూ 35 కి.మీ., బరాక్ నదిలో భంగా నుంచి బదల్‌పూర్ వరకూ 10.5 కి.మీ., కోపిలి నదిలో బ్రహ్మపుత్ర నుంచి కలోంగ్‌పర్ బజార్ సంగమం వరకూ 10 కి.మీ., బ్రహ్మపుత్ర నది నుంచి మూడు రోపాక్స్ మార్గాల్లో 65 కి.మీ. వరకూ మూడేళ్ల పాటు నిర్వహణ బాధ్యతల్ని డీసీఐకి అప్పగించింది. వాటర్‌వేస్ అథారిటీతో ఐదేళ్లపాటు కలిసి పనిచేసేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు డీసీఐ సీఎండీ ఎస్.దివాకర్ తెలిపారు.

రేపటి నుంచి జాతీయ సాహిత్య రచనా వర్క్‌షాప్

‘బడిపిల్లలతో రచయితలు’ పేరిట విశాఖలో నిర్వహణ

సాక్షి, విశాఖపట్నం: భవిష్యత్ తరాలకు రచనలపై ఆసక్తిని కలిగించేందుకు ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే) ఆధ్వర్యంలో ఈ నెల 4, 5 తేదీల్లో విశాఖపట్నంలో జాతీయ సాహిత్య రచనా వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ఏడో వార్షికోత్సవంలో భాగంగా ‘బడిపిల్లలతో రచయితలు’ పేరుతో కూర్మన్నపాలెంలో ఈ వర్క్‌షాప్ ఏర్పాటుచేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే రచయిత్రులు బడిపిల్లలతో కలిసి సాహిత్యంపై అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ వర్క్‌షాప్‌లో భాగంగా ‘ఆమెపదం’, ‘తొలి అడుగులు’ అనే పుస్తకాలను కూడా ఆవిష్కరించనున్నట్లు ప్రరవే జాతీయ కార్యదర్శి కేఎన్ మల్లీశ్వరి తెలిపారు.

వైఎస్సార్ హెల్త్ వర్సిటీ వీసీ పోస్టుకు 29 మంది దరఖాస్తు

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ (వీసీ) పోస్టు కోసం 29 మంది వైద్యులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులు సమర్పించేందుకు మంగళవారంతో గడువు ముగిసింది. గడువు ముగిసే నాటికి 29 మంది దరఖాస్తులు సమర్పించారు. వీసీ ఎంపిక కోసం విశ్వభారతి వైద్య కళాశాల డైరెక్టర్ డాక్టర్ గజ్జల వీరనాగిరెడ్డి, స్విమ్స్ డైరెక్టర్ వీసీ డాక్టర్ వెంగమ్మ, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు సభ్యులుగా ప్రభుత్వం సెర్చ్ కమిటీని ఏర్పాటుచేసింది.

● తెలంగాణ

పెంపుడు కుక్కతో ప్రారంభోత్సవం


జోగిపేటలో ఫ్లెక్సీ దుకాణాన్ని ప్రారంభిస్తున్న కుక్కపిల్ల

జోగిపేట(అందోల్): ఎక్కడైనా.. ఏదైనా దుకాణం లేదా కార్యాలయాన్ని ఎవరైనా ప్రముఖులతో ప్రారంభిస్తారు. కానీ సంగారెడ్డిజిల్లా జోగిపేటలో మాత్రం ఒక దుకాణాన్ని వినూత్నంగా ప్రారంభించారు. ఎంపీపీ కార్యాలయం ముందు గురువారం ఏర్పాటుచేసిన మహదేవ్ ఫ్లెక్సీ ప్రింటింగ్ దుకాణాన్ని.. పెంపుడు కుక్కపిల్లతో ప్రారంభించారు. దుకాణం యజమాని అభిలాష్‌గౌడ్ దంపతులు తాము పెంచుకున్న కుక్కను ఎత్తుకొని ముందు కాళ్లతో కత్తెరను పట్టుకొని రిబ్బన్ కట్ చేయించారు.

వారధి కట్టిన సారథి నేనే

సొంత డబ్బుతో తాళ్లు, కర్రలతో వంతెన


తాళ్లు, కర్రలతో నిర్మించిన వంతెన

భైంసా రూరల్: ఎవరో వస్తారని ఎదురు చూడలేదు. ఎవరూ స్పందించకపోయినా పట్టించుకోలేదు. తాను అనుకున్నది చేశాడు. నలుగురికీ ఆదర్శంగా నిలిచాడు. సొంత డబ్బుతో వాగుపై వంతెన నిర్మించాడు నిర్మల్ జిల్లా భైంసా మండలం ఖత్గాం గ్రామానికి చెందిన యువ రైతు నాగేశ్. గ్రామ రైతులు పొలాల వద్దకు వెళ్లడానికి సుద్దవాగు అడ్డుగా ఉంది. గతంలో వాగు దాటుతూ ఇద్దరు మృతి చెందారు. వాగుపై వంతెన నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో.. రైతులు, కూలీలు పొలాల వద్దకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. దీంతో రైతు నాగేశ్ సొంత ఖర్చుతో తాళ్లు, కర్రలతో వంతెన నిర్మించాడు. వాగు అవతలివైపు 400 ఎకరాల పంట పొలాలున్నాయి. రైతు నాగేశ్ పొలం కూడా ఉంది. సొంతంగా రూ.25 వేలు ఖర్చుచేసి తాళ్లు, వెదురు కర్రలతో వంతెన నిర్మించిన నాగేశ్‌ను రైతులు, గ్రామస్తులు అభినందిస్తున్నారు.

మిన్నగా ముస్లిం మైనార్టీల సంక్షేమం

- సంక్షేమ పథకాల గణాంకాలే నిదర్శనం: సజ్జల
- సీఎం జగన్ చేకూర్చిన మేలును వివరిస్తూ కార్యక్రమాలు చేపట్టాలని పిలుపు
- తాడేపల్లిలో ముస్లిం మైనార్టీ సదస్సు


తాడేపల్లిలో జరిగిన ముస్లిం మైనార్టీ సదస్సులో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు సజ్జల

సాక్షి, అమరావతి: ముస్లిం మైనార్టీలకు ఏ ప్రభుత్వమూ చేయనంతగా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేసిందని, గణాంకాలే ఇందుకు నిదర్శనమని ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. పార్టీకి చెందిన ముస్లిం మైనార్టీ నేతలంతా ఆయా వర్గాలకు ప్రభుత్వం చేకూర్చిన మేలును వివరిస్తూ విస్తృత చర్చా కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. ముస్లిం మైనార్టీలు నివసించే ప్రాంతాలు, విద్యా సంస్థలు, యూనివర్సిటీలలో వీటిని చేపట్టాలన్నారు. గురువారం తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ విభాగం అధ్యక్షుడు, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ బాషా అధ్యక్షతన జరిగిన ముస్లిం మైనార్టీ సదస్సులో సజ్జల మాట్లాడారు.

మైనార్టీలకు వైఎస్సార్ కుటుంబంతో ఆత్మీయ బంధం

‘రాష్ట్రంలో 87 శాతం ముస్లిం మైనార్టీ కుటుంబాలు ప్రభుత్వ పథకాలతో ప్రయోజనం పొందాయి. ఏ కుటుంబాన్ని కలిసినా జగనన్న చేకూర్చిన లబ్ధి గురించి చెబుతాయి. గత మూడున్నరేళ్లలో ముస్లిం మైనార్టీలకి రూ.21 వేల కోట్లకి పైగా సాయం అందింది. నగదు రూపంలో డీబీటీ ద్వారా రూ.10 వేల కోట్లకుపైగా మైనార్టీలకి అందచేశాం. ఇవికాకుండా ఇతర పథకాల కింద రూ.పదివేల కోట్లకు పైగా ప్రయోజనం చేకూర్చాం’ అని సజ్జల తెలిపారు. ఏపీలో ముస్లిం మైనార్టీల సంక్షేమం టాప్‌గేర్‌లో ఉందన్నారు. సీఎం జగన్ అధికారం చేపట్టిన మూడున్నరేళ్లలో ఫలితాలు కళ్లకు కట్టినట్లు కనపడుతున్నాయన్నారు. ముస్లిం మైనార్టీలకు రక్షణ కల్పించడంతోపాటు భరోసా ఇవ్వగలిగే పార్టీ వైఎస్సార్‌సీపీ మాత్రమేనని స్పష్టం చేశారు. ముస్లిం మైనారిటీలకు వైఎస్సార్ కుటుంబంతో ఆత్మీయ అనుబంధం ఉందన్నారు. ముస్లిం మైనార్టీలు డాక్టర్లు, ఇంజనీర్లుగా రాణించడంతోపాటు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారంటే నాడు వైఎస్సార్ కల్పించిన 4 శాతం రిజర్వేషన్లే కారణమన్నారు. వైఎస్సార్‌సీపీ డీఎన్‌ఏలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలున్నారని చెప్పారు. సీఎం జగన్ చేపట్టిన సంక్షేమ యజ్ఞం ఆగిపోవాలని ఏకమై కుట్రలు చేస్తున్న ప్రతిపక్షాలకు ప్రజలు మరోసారి తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

ప్రతి ఇంటికీ వివరిద్దాం..

సీఎం జగన్ చేసిన మేలు గురించి ప్రతి ముస్లిం కుటుంబానికి తెలియచేస్తూ పార్టీ మైనార్టీ నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ సూచించారు. ఇది తమ బాధ్యతగా భావించాలన్నారు. త్వరలో జిల్లా, నియోజక వర్గ స్థాయిలో ముస్లిం మైనార్టీల సదస్సులుంటాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షుడు, వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ బాషా తెలిపారు. విజయవాడలో లక్ష మందితో భారీ సభ నిర్వహిస్తామన్నారు.

మేనమామను కాదని ముస్లింకు సీటిచ్చారు..

ముస్లిం సోదరులకు మేలు చేయటంలో తండ్రికి తగ్గ తనయుడిగా సీఎం జగన్ పేరు తెచ్చుకున్నారని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా పేర్కొన్నారు. సొంత మేనమామ కడప స్థానాన్ని కోరుకుంటే ఆయన్ను కాదని ముస్లిం మైనార్టీనైన తనకు ఇవ్వడమే కాకుండా ఏకంగా డిప్యూటీ సీఎంగా చేశారని గుర్తు చేసుకున్నారు. అదే చంద్రబాబు హిందూపూర్‌లో ముస్లిం ఎమ్మెల్యేగా ఘని ఉన్నప్పటికీ ఆ సీటును బావమరిది బాలకృష్ణకు ఇచ్చారన్నారు. వీటిని పరిశీలిస్తే ముస్లింలకు అండగా ఎవరున్నారనేది తెలిసిపోతుందన్నారు. ముస్లిం మహిళల అభివృద్ధికి సీఎం జగన్ ఎనలేని కృషి చేస్తూ రాజకీయంగా కూడా ప్రోత్సహిస్తున్నారని శాసనమండలి వైస్ చైర్మన్ జకియా ఖానమ్ తెలిపారు. సదస్సులో శాసనమండలి సభ్యుడు రుహుల్లా, ముస్లిం ఎఫైర్స్, సంక్షేమం సలహాదారులు ఎస్ఎం జియాఉద్దీన్, హబీబుల్లాతోపాటు మైనారిటీ ప్రజాప్రతినిధులు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

‘జయహో బీసీ’ తరహాలో మిగతా విభాగాల సదస్సులు

రీజనల్ కోఆర్డినేటర్ల సమావేశంలో సీఎం వైఎస్ జగన్ దిశా నిర్దేశం

- త్వరితగతిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల నియామకాలు
- మరింత సీరియస్‌గా ‘గడప గడపకు మన ప్రభుత్వం’
- పార్టీ అంతర్గత లోపాల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

సాక్షి, అమరావతి: విజయవంతమైన ‘జయహో బీసీ’ తరహాలోనే మిగతా విభాగాల సదస్సులను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు విషయాల్లో వారికి దిశా నిర్దేశం చేశారు. జయహో బీసీ తరహాలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సదస్సుల నిర్వహణపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. గతంలో నిర్దేశించుకున్న మేరకు సాధ్యమైనంత త్వరగా గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల నియామకాలు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ ప్రక్రియలో వెనకబడిన నియోజకవర్గాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి, స్థానిక నేతలతో సమావేశాలు ఏర్పాటు చేసి.. నియామకాలు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గాల్లో పార్టీ పరంగా నెలకొన్న చిన్నచిన్న అంతర్గత లోపాలను పరిష్కరించడంపై దృష్టి సారించాలని చెప్పారు. అప్పటికీ సమస్యలు అపరిష్కృతంగా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు మరింత సీరియస్‌గా తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ విధానాలను ప్రజలకు చేరువ చేసేందుకు ప్రచార కార్యక్రమాలపై కూడా దృష్టి పెట్టాలని, ఈ విషయంలో పార్టీ నాయకులు, యంత్రాంగం చురుగ్గా పని చేసేలా చూడాలని సూచించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.